# శ్రీకాంత్



శ్రీకాంత్

Srikanth
Selected texts Vol.-1 (2012-2017)

@Writer

Published by the writer in November 2019

Cover Image:
From Tarkovsky's Nostalgia

Book Design:
Brahma Bhavana Grafix,
Hyderabad, 9848254745

Printed at:
Karshak Art Printers,
Hyderabad

Copies available at:
Navodaya Book House,
Kachiguda, Hyderabad

Srikanth:
email: elsewhereperhaps@gmail.com
9848666846

Price: Rs. 200/-

to

Gayathri
Saavanth
Samanth

without whom this book would not have been possible

| | |
|---|---|
| ఎందుకో ప్రేమిస్తారు స్త్రీలు | 11 |
| ఏమని పిలువను నిన్ను? | 13 |
| వెన్నతో చేసిన రొట్టెలు | 15 |
| ఎలా నిదురోగలం? | 16 |
| Don't you know that | 17 |
| రాలేను నీ వద్దకి | 19 |
| ఇలాగ | 22 |
| బహుశా | 23 |
| అనేకసార్లు పడుకుని | 24 |
| I like this night and | 26 |
| మన అమ్మలు | 27 |
| జణ గణ మన అంబానీ | 28 |
| ఆమె | 29 |
| క్షుద్ర పదాలు | 30 |
| పాపం | 31 |
| చరిత్ర | 33 |
| తేనీరు | 34 |
| మహామంత్రగత్తె | 35 |
| నువ్వు లేక | 36 |
| ఎలా? | 37 |
| వంట చేసిన ఆ అరచేతులు | 39 |
| ఆరిపోనివ్వకు | 40 |
| అయోమయం | 41 |
| చివరికి | 42 |
| ఒక రాత్రి | 43 |
| కొత్తిమిరకపాయ్ | 45 |
| దినచర్య | 46 |
| ఊహించు | 47 |
| ఋణం | 48 |
| యిలా | 49 |
| లష్మికె | 51 |
| పిల్లులు లేని రాత్రి | 52 |
| తెలియనితనం | 53 |
| స్వస్థత | 54 |
| పవిత్రత | 55 |
| హృదయ నిశ్శబ్దం | 56 |
| ఒక అమ్మ | 57 |
| కథలు చెప్పే మనిషి | 59 |

నాకు తెలియదు 61
ఒక వాస్తవం 62
ఒక క్షణం 64
please 66
నీకెందుకు? 67
అమ్మ 68
ఒక సాధారణ వాచకం 69
పిల్లల నిద్ర 71
కృతజ్ఞతలు 72
ఎవరైనా అడిగితే 73
ఏమని అందాం దీనిని? 74
నువ్వు ఎదురొస్తావనే 75
కవిత గురించి ఒక అ/కవిత 76
డైరీ 77
ఒట్టిగా ఒక రాత 78
ఇరువురు 79
ప్రేమ లేదా తప్పిపోయినవాళ్ళు 80
వి/స్మృతి 83
bricolage 85
మాట 89
హే రాజన్ 92
మన/తల్లులు 95
ఇవ్వాల్సినది 97
నీ నిదుర నయనాలలోకి 98
"... నాన్నా" 100
కాలం కంపనలో 101
కాలంలో ఒక క్షణం, నీతో 103
దయ 104
మూర్ఖుడు 105
మృత్యువు నుంచి 106
ఒక మామూలు కవిత 107
బాల్కాయ్ 109
Noem అను ఒక కథ 110
గుర్తు 113
think of it 114
ఒక జీవితం 117
ఒక 118
మృత వ్యాకరణం 119
ఒక జీవితం 121
వై డోన్ట్ యు 122
అనిశ్చితి 123
ఏమీ లేదు 124
నీవిచ్చిన నిదుర 125
a bad bad ad day 126
A Day with Juveria 128
సామాన్యుడి ప్రేమగీతం 129
నీ చేతులు 130
అమ్మ చెప్పిన కథ 132
గూళ్ళు కట్టుకున్నదెవరు 133
అన్నా, నమస్తే అను 135
ప్రేమ ఉందనీ, లేదనీ 136
అమ్మ కళ్ళు 137
జీవితం 138
మరే 139
ఇప్పుడే, ఇక్కడే 141
తన చేతివేళ్ళు 143
ఆనాడు 144
తను 146

| | |
|---|---|
| బియ్యపు గింజల కథ | 149 |
| మెరుగు | 151 |
| అనుకున్నాను | 153 |
| దూరం నుంచి వచ్చేవాళ్ళు | 154 |
| రెండు | 155 |
| అందుకే | 156 |
| అతిథి | 158 |
| నేనే | 160 |
| తాకాలని | 162 |
| నీ గది | 164 |
| ఇల్లాగే వెళ్ళిపోతాం | 166 |
| ఇక ఇప్పటికి | 168 |
| నోట్ | 170 |
| నివేదన | 171 |
| నీలాంటి చీకటి | 172 |
| గంధా హై పర్ దందా | 173 |
| dielogue | 174 |
| ఒక రోజు | 176 |
| లిప్తకాలం | 178 |
| నీ చేయి | 179 |
| అస్పృస్యత | 180 |
| కాటు | 182 |
| సామాజిక వృక్షం | 183 |
| నిశ్శబ్దం నీవైనప్పుడు | 184 |
| తలుపులు | 186 |
| ఒక సత్యం | 187 |
| ముగింపు | 188 |
| నీడల సవ్వడి | 189 |
| Hedgehog | 191 |
| మై, my, మై - political | 192 |
| ఒంటి కన్ను రాక్షసుడు | 194 |
| How we die | 195 |
| ఎందుకు (అకవిత) | 196 |
| నాకు ఎందుకు | 197 |
| అమ్మ | 198 |
| అసంపూర్ణం | 199 |
| రాత్రైతే | 200 |
| అగర్భం | 201 |
| అనాత్మ పదాలు | 202 |
| నేనెవరిని ఇంతకు | 204 |
| ఏమైనా | 205 |
| ఆశ | 206 |
| ఒక మామూలు సాయంత్రం | 207 |
| నీటి కింది దూరాలు | 208 |
| ప్రేమ | 210 |
| నా | 211 |
| Rowson's Reserve | 212 |
| ఆదిమ ప్రశ్న | 213 |
| లిమరిక్ లాంటి | 215 |
| లాస్ మెస్ ద్రియోస్ | 216 |
| గాలి కన్యలు | 218 |
| పూలరాత్రి | 219 |
| అడగాలి కదా ఎవరో ఒకరు | 220 |
| నీ వాళ్ళు | 221 |
| కొన్నిసార్లు కష్టం | 223 |
| ముద్ద మందార పూవులు | 225 |
| గర్భస్మృతి | 226 |
| పిల్లలు నిన్ను పట్టుకుని | 228 |

| | |
|---|---|
| అది | 229 |
| అంతే | 231 |
| అతి మామూలు దినం | 232 |
| గూడు | 233 |
| స్తబ్ధత | 234 |
| a bit of chilled beer | 235 |
| అమ్మలే | 236 |
| కల | 237 |
| ఎందుకు కాకూడదు? | 238 |
| ఈ పూట | 239 |
| ముందు | 240 |
| చేసిన పాపం | 241 |
| అస్వస్థత | 242 |
| అసహనం | 243 |
| అంతే | 244 |
| అమ్మీ | 245 |
| అస్పష్టత | 246 |
| ఎలా? | 247 |
| మరి వస్తావా నువ్వు | 249 |
| ఏమీ చేయలేక | 251 |
| వాలు కుర్చీ | 252 |
| ఒక సరళమైన ప్రశ్న | 253 |
| ఇక ఇదే ఉదయం | 254 |
| ఒక మధ్యాహ్నం | 256 |
| మా చిన్ని అమ్మ | 257 |
| నువ్వు | 258 |
| నీడలు | 259 |
| వాళ్ళిద్దరూ | 260 |
| చినుకులు లేని రాత్రిలో | 261 |
| ఏమో | 264 |
| ఒక పెర్సనాలిటీ | 265 |
| రాత్రి నీ కోసమే ఫోన్ | 266 |
| లాంతరు | 267 |
| ఈ వేళ ఎందుకో | 268 |
| చక్కని మాటలు | 269 |
| చివరకు | 270 |
| పెద్దపులి ఆ అమ్మాయి | 271 |
| గుర్తుపెట్టుకో | 272 |
| వాదన | 273 |
| క్షణికం | 274 |
| నివేదిక | 275 |
| నాకు తెలుస్తుంది | 276 |
| Déjà vu | 278 |
| స్మృతి | 279 |
| అసంపూర్ణం | 281 |
| నీ హృదయం | 282 |
| క్రియ | 283 |
| విభక్తి | 284 |
| సూత్రం | 286 |
| creche | 287 |
| ఈ రాత్రి | 289 |
| a very sentimental | 290 |
| ఎక్కడో, ఎప్పుడో | 292 |
| పిట్ట కథలు | 293 |
| మరో ముఖం | 294 |
| పిడికెడు | 295 |
| 'రాత' నాకు ఒక గూడు | 296 |

*A nothing we were, are, shall remain,*
*flowering:the nothing--, the no one's rose*
Paul Celan

*They've healed me to pieces.*
Paul Celan

# ఎందుకో ప్రేమిస్తారు స్త్రీలు

ఎందుకో కానీ ప్రేమిస్తారు స్త్రీలు
ప్రేమ అనుకుని, ప్రేమను అందుకుందామని

ఎందుకో కానీ ప్రేమిస్తారు స్త్రీలు

పిల్లలు తిరిగే లోకాలలో, శిశువులు నవ్వే కాలాలలో
పూలు తిరిగే, తిరిగి పూసే రంగుల క్షణాలలో

ఎందుకో కానీ ప్రేమిస్తారు స్త్రీలు

అద్దాలలోంచి మన ముఖాల్ని లాగడానికీ
ముఖాల్లోంచి అద్దాలని తీసివేయడానికీ, మన హృదయాలని భక్షించి
తమ హృదయాలని శిక్షించుకుని, చిందరవందర అయ్యేందుకూ
ఉక్కిరిబిక్కిరి చేసేందుకూ

ఎందుకో కానీ ప్రేమిస్తారు స్త్రీలు

అరచేతులలో వీడ్కోలు అయ్యి, కళ్ళల్లో ఎదురు చూపులయ్యీ
దినానంతాన గుమ్మానికి అనుకుని నిన్ను స్మరించుకుంటూ
నిన్ను శపించుకుంటూ ఎందుకో కానీ

ఎందుకో ప్రేమిస్తారు స్త్రీలు

వానలు కురిసే వేళల్లో, ఎండలు చిట్లే కాలాల్లో
ఒంటరిగా ఒక్కళ్ళే అనేకం అవుతూ, అనేకం అయ్యి ఒక్కళ్ళుగా మిగులుతూ
దీపం వెలిగించిన చీకట్లో తమని తాము రాసుకుంటూ నిన్ను నీకు చెరిపివేస్తూ

ఎందుకో కానీ ప్రేమిస్తారు స్త్రీలు
ఎందుకో కానీ మోహిస్తారు స్త్రీలు

ఎందుకో కానీ నీకు మృత్యువుని పరిచయం చేసి మృత్యుంజయులుగా
మిగిలిపోతారు స్త్రీలు, ఏమీ మిగుల్చుకోని స్త్రీలు
ఏమీ లేని ఏమీ కాని స్త్రీలు

ఎందుకో కానీ నిన్ను ప్రేమించే స్త్రీలు

# ఏమని పిలువను నిన్ను?

చంద్రోదయ కాంతికి వికసించే పుష్పానివి నీవు
రాత్రిలో జ్వలించే మంచు మంటవి నీవు

వెన్నెల పద్మం అని పిలువనా నిన్ను?

అరచేతిలోని వెన్నపూసవి నీవు
అరమోడ్పు కనులలో మెరిసే కాంతి వర్షం నీవు
వసంతాన విరిసే తొలి ఆకుపచ్చని పిలుపు నీవు
వెనుకగా వచ్చి అరచేతులతో కనులను మూసి
సన్నటి నవ్వుతో మెరిసే ప్రశ్నవి నీవు

నన్ను తడిపివేసే మెత్తటి జల్లువి నీవు
అలా అని పిలువనా నిన్ను?

నా జీవితానికి స్వర్గలోకం ఇచ్చిన అనుమతి నీవు
నాకున్న అమూల్యమైన బహుమతివి నీవు
నా బాహువులలో చిక్కుకున్న పూలపొదవి నీవు
నా చుట్టూ తిరుగాడే, రంగురంగుల
లేత ఎరుపు గులాబీ సీతాకోకచిలుకవి నీవు
అనుకోకుండా నా దారిలో ఎదురుపడ్డ
ఒక స్వప్నచిహ్నం నీవు

నాకు ఉన్న ఒకే ఒక సత్యం
అని పిలువనా నిన్ను?

నా దాహం నువ్వు, నా గాయం నువ్వు
నా పురాకృత క్షణాల పురివిప్పి ఆటలాడే నెమలివి నీవు
నా ప్రారంభం నీవు, నా అంతం నీవు
నా అస్థవ్యస్థ గమనాల మధ్య కదులాడే శ్వాసవి నీవు

అలసిన వదనంపై వీచే
సాయంకాలపు చల్లటి గాలివి కూడా నీవు

నాకు మిగిలిన ఒకే ఒక మృత్యువు
అని పిలువనా నిన్ను?

నన్ను చుట్టుకుని ఓదార్చే బాహువులు నువ్వు
నన్ను క్షమించి శపించే చూపువి నువ్వు
రహస్య రూపివై నను వెంటాడే
ఒక పరిమళపు ఛాయవి నీవు
నలుదిశలా నను విస్మయపరిచే గాధవి నీవు
నా ప్రథమ అక్షరానివి నీవు
శిశువు నోటిలో తొలి పాల సంతకం నీవు

నన్ను నిర్వచించే, నన్ను రచించే
నాకు మిగిలిన ఒకే ఒక జననం
అని పిలువనా నిన్ను?

ఏమని పిలువను నిన్ను?
ఏమని కాంచను నిన్ను?

# వెన్నతో చేసిన రొట్టెలు

మేం చేసిన అల్లరికి చికాకొచ్చి మా అరుపులకి విసుగొచ్చి, కోపంగా అరచి

ఇక అప్పుడు కలుపుతావు కదా గోధుమ పిండిని చక్కగా నీ అరచేతులతో తలుపులోంచి చీకటి చల్లగా ఇంటిలోకి అలలు అలలుగా తరలి వచ్చే సమయానా మరి అప్పుడు కూర్చుంటాం నేనూ పిల్లలూ ఒద్దికగా బుద్ధిగా నీ ఎదురుగా బాసింపట్ట వేసుకుని, బళ్ళో బెత్తంతో ఉన్న టీచర్ ముందున్న పిల్లలకు మల్లే చేతులు కట్టుకుని నువ్వు చూడనప్పుడల్లా ముసిముసిగా నవ్వుకుంటూ -

పంట కాలవలేమో నీ అరచేతులు, మెత్తగా పిండిని వొత్తి, నీళ్ళు పోసి తిరిగి మళ్ళా కలిపి, ఎంతో ఇష్టంగా ఎంతో ఓపికగా, పూర్తిగా కలిసే దాకా అటు తిప్పి ఇటు తిప్పి, ముద్దను చేసి మళ్ళా విడదీసి, తిరిగి మళ్ళా కలుపుతూ నుదిటిన వాలిన జుత్తును ముంజేతితో వెనక్కి తోసుకుంటావు కదా, అప్పుడు నీ కళ్ళల్లో ఒక ఇంద్రధనుస్సు. నీ చుట్టూతా పచ్చిక మైదానాలపై ఎగిరే తూనీగలు. నీ శరీరంపై మెరిసే పసుపు పచ్చని పూవులు. ఇంతకాలం నమ్మలేదు కానీ

ఇప్పుడు నీ చేతుల్లో అలవోకగా కదిలే వెన్న కలిపిన ఆ పిండిని అలా గమనిస్తూ వుంటే పార్వతి చేతుల్లో పిండి ముద్దతో రూపు దిద్దుకున్న ఓ పిల్లవాడి కథ నిజమే అనిపిస్తుంది: అందుకే మరి నీ చేతుల్లోని పిండి కూడా జీవం పోసుకుని, ఇక రొట్టెలయ్యీ చీకటి వేళ వెలుగయ్యీ శ్వాసయ్యీ మేం నీకు చెప్పడం మరచిన కృతజ్ఞతలయ్యీ ఇలా ప్రతి రాత్రీ మాకు ఇంత ప్రాణాన్నీ జీవధాతువునీ ప్రసాదిస్తాయి.

అందుకే, తినబోయే ముందు ఇక తొలిసారిగా ప్రార్థిస్తాం నేనూ పిల్లలూ: నిన్ను. నీకు కృతజ్ఞతలు చెప్పుకుంటూ, ఇంతసేపూ మేము అబ్బురంగా చూసిన నీకు చివరికి మా దిష్టి కూడా తగలవద్దనీ, పిల్లలకే కాక నాకూ అమ్మవైన నిన్ను ఇక ఎన్నడూ విసిగించమనీ, నీకు ఎన్నడూ కోపం తెప్పించమనీ

# ఎలా నిదురోగలం?

అర్ధరాత్రి నిదురలోంచి లేచొచ్చి, ఒక మూడడుగుల మల్లెపూవు
నా పక్కగా వచ్చి, 'నాన్నా' అంటో
నన్ను హత్తుకుని పడుకుంది. ఇక

ఆ చీకట్లో ఒక నెగడు రగిలి, పేరులేని సుగంధమేదో
గాలిలో వీయగా, ఎక్కడో కొమ్మల్లో గూళ్ళల్లో
పక్షులు రెక్కలు సర్దుకుంటున్న సవ్వడి:
ఒక నెత్తురుగీతం. ఒక శాంతి కపోతం. చలి చిక్కగా

ధూపమై వీచే ఆ వేళల్లో ఆ గదిలో ఎక్కడ
వేలితో తాకినా వెలిగే ఒక కాంతి సంకేతం
కొంత అలజడీ, కొంత అబ్బురమూ కొంత
జీవితం పట్ల కృతజ్ఞతా, కొంత
కరుణా బోల్డంత ఇష్టమూనూ -

నిదురలో ఏదో కలవరించి, మెల్లిగా కదిలిన ఆ మల్లెపూల కలనీ
తెల్లగులాబీ మొగ్గలవంటి ఆ కళ్ళనీ
ఇలా చూసుకుంటూ, ఇక ఈ రాత్రి

నువ్వైనా నేనైనా ఎలా నిదురోగలం?

# Don't you know that I aint a metaphor?

వొద్దు. వెన్నెల వొద్దు.  పూవులు వొద్దు. లతలు వొద్దు. జాబిలిలు వొద్దు. ఆకాశం వొద్దు. నక్షత్రాలు వొద్దు. పుప్పొడి వొద్దు. లేత గాలులు వొద్దు. తడచిన రాత్రుళ్ళు వొద్దు. గులాబీల దినాలు వొద్దు. హంసలు వొద్దు. హంస నడకలూ వొద్దు. నీలి కనులు వొద్దు. నీలి సముద్రాలు వొద్దు. నిమోన్నతాలు వొద్దు. మేఘాలు వొద్దు. అటువంటి ఒడీ వొద్దు. ఓరిమి వొద్దు. మాతృత్వం ఒక వరం వొద్దు. సహనవతి వొద్దు. సతీ వొద్దు. సావిత్రీ వొద్దు. సీత వొద్దు. ఊర్మిళా వొద్దు

'స్త్రీ అంటే' అని మొదలయ్యే వాచకాలూ వొద్దు. పురాణాలూ వొద్దు. పవిత్రత వొద్దు. పాపం వొద్దు. పుణ్యాం వొద్దు. ద్రౌపదీ వొద్దు. శబరీ వొద్దు. వొద్దు. థెరీసా వొద్దు. మాగ్ధలీనా వొద్దు. లైలా వొద్దు. మల మూత్రాదులు లేని అతి సౌందర్యమైన దేవతా స్త్రీలూ వొద్దు. కాళికలు వొద్దు. సరస్వతీ దేవీలూ వొద్దు. వొద్దు. అసలే వొద్దు. నిర్వచనాలు వొద్దు. నీ వచనాలు వొద్దు. సోత్రాలూ వొద్దు. ఆరాధనలూ వొద్దు. అర్పణలూ వొద్దు. ప్రేమా వొద్దు. త్యాగమూ వొద్దు. ఆబలా వొద్దు. సబలా వొద్దు. అమ్మా వొద్దు. చెల్లీ వొద్దు. భార్యా వొద్దు. భక్తీ వొద్దు. బంధమూ వొద్దు. నిర్మాణ వాచకమూ, వాక్యమూ వొద్దు. ఇక

ఈ ఒక్క పూటకి ఇలా నేను: ఇలా నన్నుగానే ఉంచు. ఇలా నన్నుగానే మాట్లాడు. చితికిన యోనిగానూ, నరికిన వక్షోజాలగానూ, నమిలిన ఊసేసిన పెదాలగానూ, తెగిన పేగులగానూ, వేల మర్మావయవాలు నిరంతరం కుళ్ళ బొడిచే ఒక యుద్ధభూమిగానూ, పురుషాంగమే ఒక దేశమైన, దేశమంటేనే పురుషావయవమైన ఒక కాలంగా స్త్రీ లేని ఒక లోకంగానూ మాత్రమే

చూడు ఈ ఒక్క పూటకి. పిల్లలు లేని తల్లిగానూ, ఏమీ లేక ఖాళీ అయిన ఊరులానూ, నెత్తురు కమలం విచ్చుకున్న ఒక గుజరాత్ గానూ, హస్తం లేని వస్త్రరహిత రాజకీయంగానూ, నీలం బొమ్మలుగానూ, నీతి లేని రాజకీయ నాయకులగానూ, తల్లి స్తన్యం తాకని వారి మాటలుగానూ

చూడు ఈ ఒక్క పూటకి నన్ను. అన్నం తిన్న శరీరంగానే, అంగట్లో పెట్టబడిన అధికారపు శాంతియుతమైన భాషణగానే, నవ రంధ్రాల మల మూత్రాల తోలు తిత్తిగానే చూడు నన్ను ఈ పూటకి. ఏమీ కాదు. కొంత వణుకు పుట్టి, కొంత భీతి కలిగి, హృదయం కొంత కదిలి శరీరం కొంత జలదరించి, కళ్ళు కొంత కన్నీళ్ళయ్యి, జన్మస్థానం మరణ ప్రస్థానం కొంత అర్థమయ్యి, తాకుతావు నువ్వు నన్ను తొలిసారిగా, ఒక మాట లేని మాటతో:

Don't you know that I aint a metaphor" అని అంది నిన్న తను పాలరాతి పలకలవలె మారిన శరీరంతో!

# రాలేను నీ వద్దకి

1
రాలేను నీ వద్దకి

2
నీళ్ళని చీల్చే పాదాలూ, ఎదురీదీ నిర్మలంగా వెళ్ళే కళ్ళూ నీవి
అలా ఎదురు చూడకు
దీపం అంటిన చీకటి

మెరుస్తోంది ఇక్కడ. నీ వద్దకు రాలేని ఈ గోడలపై, నిలువెత్తు
నీడలై. నేనై -

3
నా
ముఖాన్ని దాచలేను నీ వద్ద - గ్రహించు - రాలేను - నీ వద్దకి

4
కానీ చర్మాన్ని వొలిచి, వెలుపలికి మలచి
బల్లపై ఒక కూజావలె, ఒక పూలపాత్ర వలె ఉంచి వినమ్రతగా
తప్పుకోగలను: ఊయలలూపే నీ చేతులు

క్షణకాలం ఆగిన చోట నుంచి -
క్షణకాలం ఊపిరీ తనని తాను
మరచిన ఆ చోట నుంచి. ఒక

గాలి కిటికీలోంచి పాకి, లతల వలే నీ నుదిటిపై శిరోజాలను
చెరిపే ఇంద్రజాలం నుంచీ. మరి
అక్కడే నా

5

ఆత్మనీ దాచలేను. కుటీరం ఆ గది. నీ శరీరపు సువాసనా
నా ఆత్మ పయనాన్ని గుర్తు చేసిన నీ మదీ

ఒక నీరెండా ఒక పూల తోటా ఒక చల్లని గాలీ
ఇక్కడిది కాని జీవితాన్ని, మృత్యుస్మరణ వలే
దిగంతాల పరిమళంవలే

అదృశ్యాకార ధూపం వలే
శరీరంలోంచి శరీరంలోకి
చొచ్చుకుపోయిన రాత్రి, ఆ ధరిత్రీ ఆ వెన్నెల గానాల సౌమిత్రీ
అందుకే, ఇప్పటికీ

6

నా అరచేతుల్లో పాల బరువుతో ఒదిగిన నీ పాలిండ్ల వొత్తిడి -
తల్లిదనం నిండైన ముఖమై
శరీరం నిండిన బరువై, ఒక

దివ్యమైన గుబురు పూలపొద యేదో రెండు చేతుల మధ్య
ఒదిగిపోయినట్లూ, పురివిప్పిన ఓ నెమలి తిరిగి నెమ్మదిగా
ముడుచుకుంటున్నట్లూ, నా

శరీరమంతా ఒక తంద్రితనం.
ఎవరివో లేత పసివేళ్ళు బుగ్గలపై పొరడిన ఒక గగుర్పాటు
ఏదో ఒక కేంద్రం లోపల చిట్లి
శరీరమంతా కాంతి ద్రవమై నిండిపోతున్న తడబాటు. చీకట్లో

నాది కాని లోకంలో ఎవరో
ఒక దీపాన్ని వెలిగిస్తే కానీ

7

నీ వద్దకి రాలేని నగుబాటు: ఇక అందుకే, నీ రెండు వేళ్ళ మధ్యా

**8**

నులిమి, అంటించు ఈ ప్రాణపు వొత్తిని ఒక జ్వలనంతో విశ్వపు
శక్తితో: ఇక అప్పుడే, నక్షత్రాలు పూసే వేళ్ళల్లో
ఉదయాలు రంగులు వెదజల్లే క్షణాలలో, వేణువొకటి

తిరిగి ప్రాణ వాయువుని ఊదే కాలాలలో, తిరిగి ఏడు లోకాలూ
ఏడూ కాలాలూ నిర్మితమయ్యే పునర్యానంలో
వస్తానేమో, ఏమీ లేని ఏమీ కాని కాంతి కణాన్నై

**9**

మరి తొమ్మిది నెలలు మోసిన నీ వద్దకు
మరి తొమ్మిది జీవితాలు పంచుకున్న నీ వద్దకూ

తలను వంచిన కృతజ్ఞతా పర్వంతో, తొలి మలి శాంతితో. మరి
అంతిమంగా నీతో. అస్థిత్వపు అంజలితో -

# ఇలాగ

నిన్ను చదువుదామని అనుకుంటాను. ఎలాగో ఒకలాగా. మరి ఇక్కడా ఏమీ లేదు: మరి కాంతికి ఊరకనే కదులుతాయి నువ్వు వేలాడదీసిన గాజు పక్షులు పరావర్తనమై గోడలపై నీడలై

'నీడలే మిగిలేవి చివరికి' అని నేను అంటాను. అరచేతుల్లో ఏమీ మిగుల్చుకోని మనిషి అనే మాటలనే కాగితాలని తూనిగల వలె చుట్టి, మరి ఇక నీ కనుల మైదానాలపై ఎగురవేస్తో, అరచేతుల్లో ఏమీ మిగుల్చుకోలేని ఓ మనిషి అనే చిన్ని చిన్ని మాటలనే, నేను గూళ్ళలోంచి తవ్వి పోస్తాను

తెలుసు. నేనొక నిస్సహాయుడనని. పదాలనే హత్తుకుని ఆఖరి నెత్తురు చుక్క వరకూ నీ వద్దకు పారాడే ఒక శరణార్థిననీ, మరి ఒక అర్ధ/నారీశ్వరుడననీ నేలనెలవంకను పిచ్చిగా ఇష్టపడే ఒక మామూలు వాన చుక్కననీ అవి ఏ కనులలో నుంచైనా కురిస్తే తట్టుకోలేని బాలకుడనని, సదా సంచారిననీ ద్రిమ్మరిననీ

అందుకే
నిన్ను చదువుదామని అనుకుని, రాత్రిని ఒక మంట చేసి వెలిగిస్తే, శరీరం అంటుకుని కాలుతుంది తెల్లటి పరదాలలో నిన్నిక చదవద్దో చదవద్దో అంటో, నీడల్ని ఆర్పే వేకువ కాంతై వేకువ కాంతిని ఆర్పే పొగమంచై, తెల్లగా, ఇక నుదిటిపై అరచేయంత చల్లగా, తల్లి దీవెనలాగా, ఇలాగ. నీలాగ.

# బహుశా

ఇలా అంతమౌతుందీ రాత్రి

చీకటి - ఆకుల వలే - గదిలో రెపరెపలాడితే
ఆకులపై రాలే నీటి శబ్దాన్ని వింటావు మరి
నువ్వు: శరీరంపై తేలే వెచ్చని కంపనతో -

బహుశా, ఒక వెన్నెల వీచిందేమో బయట
బహుశా, ఒక సీతాకోకచిలుక వాలిందేమో
చల్లటి వెన్నెలపైనా. బహుశా

తేమ అంటిన రెక్కలపై, తిరిగి రాత్రే పరిమళపు
పుప్పొడై వెదజల్లబడిందేమో ఇక్కడ

ఇవేమీ కాక, ఒక పూలవనమే నిశ్శబ్దంగా
తగలబడిందేమో ఇక్కడ. ఇక్కడే
అంతమయ్యీ కాని ఒక రాత్రి ఒక 'బహుశా'గా
మిగిలిన చోట! రా రా

నువ్వొకసారి ఈ శరీరాన్ని ముట్టుకుంటే
ఇక నిశ్చింతగా తగలబడిపోతాను!

# “అనేకసార్లు పడుకుని ఉంటాను, అతనితో...”

“అనేకసార్లు పడుకుని ఉంటాను: అతనితో-
    ఎందుకని అడగకు. కొన్నిసార్లు ఇలా
    ఉండదు జీవితం - పూవులూ ఆకాశం వానా వెన్నెలా అనంతమైన ప్రేమా

అంతా ఒక అబద్ధం. వాడుకోబడి
అర్ధరాత్రిలో నడిరోడ్డుపై వొంటరిగా నువ్వు వదిలివేయబడి
ఆకలయ్యీ దాహమయ్యీ

ఒంటరివై, ఒక అంధ బిక్షువై, ఒక
అనాథ ఆశ్రమంకై శరణార్థివై వెదుక్కోవడమే నిజం. శరీరం నుంచి శరీరానికి
దారీ తెన్నూ లేక తరిమి తరిమి
వేయబడటమే అంతిమ సత్యం:

Do not talk all that ages of
romantic bull shit with me -
And do not frame me either, fucker''
అని ఇక తను నగ్నమయినప్పుడు
తన పాలిండ్లపై, తన నాభిపై తొడలపై
మృగాలు, తమ ఖడ్గ దంతాలతో
తమ నల్లటి పొడుగాటి గోళ్ళతో తనని నింపాదిగా చీరిన నెత్తుటి మరకలు
ఎన్నడో ఆవిరయ్యిన కన్నీళ్లు -

ఇక నేను, తనకి ఏమీ చెప్పలేకా
ఇక నేను, తనకి ఏమీ అవ్వలేకా
తనని గాట్టిగా కావలించుకుని తొలిసారిగా వెక్కి వెక్కి ఏడ్చాను

"I like this night and
I like this Bacardi rum
Do you?"

అని తను నవ్వుతో, కొంచెం మత్తుగా కొంచెం దిగులుగా కొంచెం బాధగా
అడిగిన రాత్రి, నా తల్లులూ
చెల్లెళ్ళూ అక్కలూ అనాది
ఆదిమ స్త్రీలూ ఒక్కసారిగా

ఎందుకో గత జన్మలయ్యీ, పునర్ జన్మలయ్యీ అనంతంగా గుర్తుకువచ్చి - ఎందుకో.

# I like this night and I like this Bacardi Rum: Do you?

నువ్వా రాత్రి నన్ను ముద్దు పెట్టుకున్నప్పుడు
నీ నోరంతా చిక్కగా కాగిన బెల్లం వాసనా, మరి కొంత అగ్నీనూ.
ఊపిరాడక గించుకుని, నీ చేతుల్లోంచి  తప్పించుకుని వెనుకకి
వాలి శ్వాస తీసుకుంటుంటే పడీ పడీ నవ్వుతావు కదా నువ్వు

అప్పుడు ఆ నా చిన్ని గదిలో, మబ్బులూ పిచ్చిగా ఊగే చెట్లూ
దుమ్మూ దుమారమూ, మరి సన్నగా మొదలయ్యే తుంపరానూ.
“భయపడ్డావా” అంటూ తెగిన పెదాలపైనుంచి నెత్తురిని మెత్తగా నీ
తెల్లటి దుప్పట్టాతో తుడిచినా, నా లోపలి వొణుకు ఆగదు

“మండుతుంది” అని అంటాను, నొప్పిగా ముఖం పెట్టి. మరి మళ్ళా
నవ్వుతో అంటావు కదా నువ్వు: “మరి, వొద్దూ వొద్దు అంటుంటే
నాకు మందు తాగించింది ఎవరు? ఇలా దగ్గరికి రా. కొరకనులే
ఈ సారి. భయపడకు” అంటూ మళ్ళా తనే, నన్ను జాగ్రత్తగా

తన తల్లితనపు పాలిండ్లలో పొదువుకుంటే, ఇక అలా వెచ్చగా ఒదిగి
తన చుట్టూ చేతులు వేసి, తనని గాట్టిగా పట్టుకుని
ఆ చీకట్లలో నా ముఖం దాచుకుని, అలా పడుకుని
బయట కురిసే వాననీ, తన  శరీరంలోని ప్రవాహాన్నీ
వింటుంటే అడుగుతుంది తను, స్ఖలించినంత హాయిగా:

"I like this night and
I like this Bacardi Rum.
Do you?"

# మన అమ్మలు

వాకిట్లో గోడకి జారగిలబడి, ఉదయపు ఎండలో జుత్తు చిక్కు తీసుకుంటూ ఒడిలోని తువ్వాలుపై దువ్వెనలో పేనులను వెదుక్కునే ముసలి అమ్మలను చూసి ఉండవు నువ్వు ఎప్పుడూ -

అప్పుడు, వాళ్ళ ముఖాలపై నీడలు ముడతలుపడి దీర్ఘంగా సాగుతాయి. నొసలు చిట్లి సాలోచనగా తమని తాము ఎక్కడో కోల్పోయి ఉంటారు వాళ్ళు. శీతాకాలపు గాలికి వొణుకుతాయి అలా మొక్కలు. వీధిలో నిర్విరామంగా ఆరుస్తో గెంతుతుంటారు పిల్లలు. ఒక పక్కగా వంట గదిలోని గిన్నెలని పోగేసుకుని, మట్టి కాళ్ళతో చేతులతో మాటలు లేకుండా బొమ్మలకి దుస్తులు వేస్తూ, జుత్తుని సరిదిద్దుతూ, వాళ్ళే ఐదారేళ్ళ పాపలు, మెరిసే కళ్ళతో. అవతలి ఇంటిలో ఎక్కడో వెనుకగా బట్టలు ఉతుకుతూ మధ్యలో పిల్లలని కేకలేస్తూ, తిరిగి అన్యమనస్కంగా దుస్తుల్ని పిండుతోన్న తల్లులు.

గాలికి జలజలా రాలతాయి అప్పుడు, పాలిపోయిన వేపాకులు: సగం తిన్న ఆకుపై నుంచి, విచ్చుకున్న పూవుపైకి నెమ్మదిగా కదులుతుంది ఒక గొంగళి పురుగు. కొమ్మల్లో ఎక్కడో, నువ్వు చూడలేని ఒక పక్షి కూత - తనని తాను కోల్పోయిన, ఇక ఎగరలేని రెక్కల తపన. చెట్టు బెరడు పైనుంచి ఒక ఉడుత తటాలున చెమ్మగిల్లిన నల్లటి మట్టిపైకి దుమికి, తన వైపు క్షణకాలం చూసి తన కనులలో కనులు కలిపి కదులుతుంది కదా, సరిగ్గా అప్పుడే వీధిలోని పిల్లలు తాము ఆడుకునే బంతి తన వాకిట్లో పడగా, వచ్చి అడుగుతారు

'ఓమ్మా, బాల్ పడింది. ఇవ్వవా' అంటూ. తనలోంచి తాను బయటకి వచ్చి ఒక నిట్టూర్పుతో, మోకాళ్లపై చేయి ఉంచి అతి కష్టంపై పైకి లేచి, నిన్నే, ఈ అక్షరాలని చదువుతున్న నిన్నే అందుకుని, వాళ్ళ చేతులకు అందించి ఇక వొణుకుతూ కరుగుతూ పగులుతూ, ఒంటరి చీకట్లలో తెల్లటి నీడలతో పగిలిన ఒక అద్దమై ఇంటిలోకి నెమ్మదిగా కదులుతో, కనుమరుగవ్వుతో, మొదటిగా చివరిగా ఎప్పటికీ తనే-

# జణ గణ మన అంబానీ అను
# రిలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్

శ్వేత సౌధం మీద కూర్చుని తప్పక అమ్ముకుంటావు చివరికి నా ప్రాణవాయువునీ విపణిలో లబ్ధికై తప్పక ప్రచారం చేస్తావు శీతలమైన అరలలో, గాలి అసలే ఆడని పొట్లాలలోని, తాజా తల్లి పాల గుణాలనీ. మరి రైతులనీ, పంటలనీ సర్దే పెడతావు వరసగా అంగట్లో, తెల్లని వరసలలో పల్చని పొరలని మా ముఖాలపై మృత్యువస్త్రం వలే కప్పి. ఇక క్షురశాలలే పెడతావు దేశమంతటా వీధి చివరి క్షురకుల నోళ్లల్లో మన్నే కొట్టి. ఇక తాజాగా తాపీగా కట్టేసుకుంటావు ఒక పాలరాతి ఆకాశ హర్మ్యాన్ని పౌరులను పునాదులుగా పెట్టి

ఇక ఈ దేశపు చెవులలో, కనులలో అలాగే పెడతావు ఒక పెద్ద తంత్రీ తంత్ర ప్రసార మహా మాయా విషపుష్పాన్ని నీ నిత్య వ్యాపార దండకాన్ని పఠించి. హస్తాల కమలాల ముద్రికల తోడుగా సాక్షిగా, నీ కంపనీ దుస్తులనే తొడుగుతావు మాకు, ముందుగా మమ్మల్ని పూర్తిగా నగ్నం చేసి. ఆపై ముమ్మందు ఘనీభవించిన బాటిళ్ళలో మా రక్తాన్నే మాకే అమ్ముతావు నిర్భీతిగా మా ఈ శరీరపు బావులను మా ముందే తోడి:

ఇక మిగిలి ఉంటే ఏమన్నా చివరికి స్థనాలను కోల్పోయి తిరిగే స్త్రీలతో నీ స్త్రీ ఆడుకునేందుకు హర్ష నృత్యాలే చేయిస్తావు జూదపు క్రీడల ఐపీయల్ మైదానాలలో జత కూడి

అన్నా, అంబానీ - ఈ దేశపు సర్వాంతర్యామీ నువ్వు కంకాళమయం చేసిన ఈ దేశానికి చితి అంటించి, ఆ చితాభస్మాన్నీ పాకెట్లలో పవిత్ర పుణ్య ప్రసాదంగా అమ్ముకోక మునుపు మిగిలి ఉందా ఇంకేమైనా, నా ఈ శరీరంపైనా నా ఈ శరీరం లోపలా నువ్వు వ్యాపారం చేసి తవ్వుకోనిదీ, తోడుకోనిదీ, వాడుకోనిదీ, వదులుకోనిదీ?

# ఆమె

ఆమె నవ్వడాన్ని తరచూ చూడవు నువ్వు

వంటలో నిమగ్నమై, హటాత్తుగా తల ఎత్తి
మసి అంటిన అరచేతితో
తన ముఖాన్ని తుడుచుకుంటూ

నీ  వైపు చూసి అప్రయత్నంగా నవ్వుతుంది తను

మరి
ఇక ఆ తరువాతా, ఆ రాత్రి అంతా
మండుతూనే ఉండింది
ఆ కట్టెల పొయ్యి అప్రతిహతంగా, ఉజ్వలంగా -

# క్షుద్ర పదాలు

గుళ్ళో దండం పెట్టుకుని, ప్రార్థన చేసి చల్లగా ఇంటికి వచ్చి పుణ్యం చేసామను కున్న వాళ్ళందరితో ఇల్లా అన్నాడు మోమితేష్: అన్నాల్లారా, అమ్మల్లారా, అయ్యల్లారా, అక్కల్లారా, గీతకు ఇవతలా, గీతకు అవతలా సరే కానీ గీత గీసింది ఎవరు గీతను కాపాడుతున్నది ఎవరు? గీతలు లేని లోకానికి గంతలు కట్టి చూపునిచ్చామని చెబుతున్న వాళ్ళు ఎవరు? అమ్మల్లారా, అన్నాల్లారా, అక్కల్లారా సావిత్రి సరే, సీత సరే మేరీ మాతా సరే మరి ద్రౌపదిని ఊర్మిళని పవిత్ర పాత్ర మాగ్దలీనాని నిలువెల్లా ఆత్మతో తాకేది ఎవరు? కబోధిని నేను కానీ వాచక విముక్తం లేక వినిర్మాణం కాలేక శరీరమంత తోలు మందం వాక్యాల పునరుక్తమై - లోపలే ఉన్న దివ్యలోకాల్నీ ఉద్యానవనాల కాలాల్నీ పాప పంకిలం చేస్తున్నది ఎవరు?

నేనొక బహిష్కృతుడినే కానీ గర్భ ద్వేష పుణ్య పురుషుల దేశంలో లోకంలో కాలంలో, అన్నల్లారా తమ్ముళ్ళారా అక్కల్లారా చెల్లెళ్లారా, మర్మావయాలుగా మాత్రమే మిగిలిన పురుషుల్లారా, తల్లి గర్భాన్ని ఆలింగనం చేసుకుంటున్నాను ఇలా హాయిగా నిండుగా నిర్భీతిగా మరి నా ఆత్మతో నా శ్వాసతో నా అంతిమ మృత్యువుతో

అది సరే కానీ మరి నువ్వేమిటి? నీ సంగతేమిటి? అని అన్నాడు అతను స్వదేహ సమాధిలో సంలీనమవుతూ. ఇక

నేను నవ్వి, నేను ఏడ్చి నేను పగిలి పిగిలి 'నేను' లేకుండా పోయి, ఇదిగో వచ్చి ఇల్లా రాస్తున్నాను ఈ అమృత క్షుద్ర పదాలని, ఒక మార్మిక ఆదిమ తపనతో, ఒక తొలి మలి రహస్య దాహంతో

మీకు కాక మరి నాకే దారి దిక్కూ తోడూ నీడా లేకుండా. ఇల్లా. ఇల్లిల్లా! ఇల్లా! ఇల్లా!

# పాపం

1
రాయాలని కూర్చుంటే
నల్లటి నీడలో తడితో వెలిగిన నీ కళ్ళే గుర్తుకు వస్తున్నాయి

2
పూవువి కదా నువ్వు. రెక్కలొచ్చి
ఎండలో వానలో చీకట్లో వెలుతురులో నవ్వులతో ఎగరడం
మాత్రమే తెలుసు కదా నీకు. మరి

3
నేను అతి జాగ్రత్తగానో
చైతన్యా రాహిత్యంగానో
ఒక వలను తయారు చేస్తాను నీ చుట్టూ. నువ్వు నిటారుగా
తల ఎత్తి ఆకాశాన్ని చూపినప్పుడల్లా
నేను నీకు భవిష్యత్తుని సూచించి భయపెడతాను -

'అరవకు' అనో, 'గొడవ చేయకు' అనో
'చెప్పిన మాట వినకపోతే నీకు బొమ్మలు కొనివ్వ' ననో
ఎలాగో ఓలాగా నిన్ను నేలకు దిగేస్తాను
'నాన్నా, ఆడుకుంటాను' అంటే, కటువుగా 'ముందు
హోం వర్క్, ఆ తరువాతే ఏదైనా' అంటాను. మరి

4.
'నాన్నా నేను పూవుని కదా
నేను వెళ్ళకపోతే, తోటలోని సీతాకోకచిలుకలు
నాకోసం ఏడుస్తాయి'✦ అని నువ్వు బేలగా అన్నా సరే

5
మృగాలు సంచరించే చదరపు గదుల హృదయం ఇది

ముఖ పుస్తకాలు, నక్షత్ర ప్రసారాలూ మాత్రమే తెలిసిన
ఇరుకు చూపులు ఇవి: మరి నువ్వు

చూపించే చేతివేళ్లను అనుసరించి, నక్షత్ర సముదాయాలనూ
గ్రహాలనూ ఖగోళ విచిత్రాలనూ ఆనందాలనూ చూసే
సమయం లేని, కాంతి లేని కృష్ణ బిలం ఇది. మరి

6

అందుకే, నా మీద నాపై అసహనంతో కోపంతో కొడతాను కదా నిన్ను
చిన్న చిన్న విషయాలకే, ఎందుకో అర్థం కాక తెల్లటి కళ్ళతో నీళ్ళతో
చూస్తావు కదా నువ్వు, అప్పుడు

నా శరీరమంతా ఒక తారు దారి. నాలిక అంతా
లోహ ఖచిత యంత్ర రహదారి. గూడు అని నువ్వు అనుకున్న
ఈ ఇల్లంతా నల్లని కాలుష్య సమాధి. అంతటా ఒక మృత్యు ఊపిరి -

7

కాసేపట్లోనే అంతా మరచి నీ నాలుగేళ్ల చిన్ని అరచేతులతో
హత్తుకుని నా ముఖాన్ని నిమురుతావు కదా నువ్వు
అది గుర్తుకు వచ్చి

రాయాలని కూర్చుంటే, తెల్లటి తడితో
కళ్ళలోంచి రాలుతున్నాయి నల్లటి పదాలై ఈ పై అక్షరాలు
కొంత ధూళై కొంత దూరమై
కొంత నెత్తురై కొంత శాపమై
నేను ఎప్పటికీ తిరిగి తాకలేని ఒక మహా కాంతి లోకమై -

✦ *ఈ వాక్యం HRK మనవరాలు అతనితో అన్న పదాలు.*

# చరిత్ర

ఆవాహన చేస్తున్నాను. పెదాల చివరి దాకా వచ్చిన మాటని అక్కడే నొక్కిపట్టి, తుంపర కురిసే కాలాలలోకి కనులను వదిలివేసే మహాకళను నిన్ను స్మరించుకుని అభ్యాసం చేస్తున్నాను. ఎవరూ తాకని హృదయంలోకి కురిసిన శరీరం నీవు. నా శరీరంలోంచి వేయి కొమ్మల వృక్షమై గన్నేరు పూలతో వికసించే మహా ఆకాశం నీవు. ఈ అబద్ధం నిజమే. ఒక చినుకంత విత్తుని నాటి చిగురాకుని ఆశించిన ముఖాన్ని తాకిన నిలువెత్తునా రివ్వున రేగిన నల్లని నాగు పడగవి నీవు. ఇంద్రజాలంతో కమ్మేసే సర్పహాస నయనివి నీవు. చూడు. పదాలు లేని మొండి చేతులతో శ్వాసించే శిలయై ఉన్నాడు ఫిరోజ్, ఊర్మిళై ఒక మహావిషపు -విస్మృతి లేని - నిదురై, నువ్వు లేని పాతాళ లోకాలలో కన్నీటి తల్పంపై మరలా మరలా జన్మిస్తూ. జన్నత్ ఎక్కడా అంటే అంటాడు కదా ఫిరోజ్ ఇక మధుపాత్రని నీలి ఆకాశపు అంచుకి తాకిస్తో "సోదరుడా: అడగకు రాముడిని రామబాణపు గురి గురించీ పదును గురించీ, చూడు నెత్తురు ఉబికిన ఈ గుండెనీ, సీత హృదయాన్నీ. అడగకు ఫరీదానీ, శిలా విగ్రహ భక్తులనీ హత్యల గురించీ అదృశ్య హంతకుల గురించీ, చూడు గూళ్ళు లేక తెగిపడిన తలలనీ మధుశాలలలో ఖండితమైన ఫిరోజ్ లనీ." ఇక చూడు, నీ ఇంటి ముందు నుంచి నడిచే పోయారు ఆ ఇద్దరూ రాత్రుళ్ళతో స్మిత వదనాలతో, హృదయాలలో నిండుగా దిగిన చరిత్రలతో బాకులతో. ఆ ఇద్దరిలో ఎవరు ఎవరుగా మిగిలారో ఇక ఎవ్వరూ ఎవ్వరినీ అడగలేదు!

# తేనీరు

అరచేతుల మధ్య ఒక కప్పును పుచ్చుకుని పొద్దున్నే తేనీరుగా మారుతావు కదా నువ్వు అప్పుడు అల్లం వాసన వేస్తాయి నీ చేతులు. మరి నీ పెదాల మధ్య నుంచి కొంత ఏలకుల సుగంధం కూడా

చల్లని వెలుతురు ముసురు కమ్మిన ఆకాశం అప్పుడు నీ కళ్ళల్లో. అల్లుకున్న తీగపైనా లేత ఆకులపైనా కొంత మంచు తడి. దానిపై ఒకసారి నీ చేతివేలు వాలి ఇంద్రధనుస్సులను కదుపుతుంది. ఇక ఆ ఏడు రంగుల తాకిడిలో, ఆ ఆకుపచ్చని గూటిలో కీచుమంటాయి మొన్న పుట్టిన చిన్ని పిట్టలు. ఇక రెక్కలొస్తాయి అప్పుడు నీకూ నీ హృదయానికీనూ

ఆ మెత్తని నిశ్శబ్దంలో, దుప్పటిలో ముడుచుకుని అస్సలే కదలరు మన పిల్లలు. ఇల్లంతా ఒక శాంతీ, కాంతీ, గోరువెచ్చని నీడలూ, అలంకారిక పింగాణీ వస్తువులపై ఆగే లోకమూ అతి సూక్ష్మంగా వాటిపై పేరుకునే కాలపు ధూళీనూ! సరిగ్గా అప్పుడే నీ వెనుకగా చేరి నా చేతుల మధ్యకు తీసుకుంటాను నిన్ను. చూడు:

ఇక ఈ ఉదయాన మరో కప్పు తేనీరు త్రాగవచ్చు మనం నింపాదిగా, శాంతిగా, తొలిసారిగా -

# మహామంత్రగత్తె

కొంచెం ముఖం బావుందనుకో, హృదయాలని చిత్తడి చిత్తడిగా తవ్వి నిలబడి చోద్యం చూసే కళ తెలుస్తుంది నీకు. అరె ఇక కొంచెం దేహం బావుందే అనుకో, మగవాళ్ళని నీడలుగా మార్చి నీ పాదాల వెంబడేసుకుని తిరిగే అతి క్రూర వినోదా చాతుర్యం అర్థం అవుతుంది నీకు ఆపై కొంచెం తెలివీ ఇంకొంచెం పద చాతుర్యం ఉన్నవే అనుకో చూడు చూడిక, ఈ ముఖగ్రంథాన్ని ఒక శ్వేత మార్జాలంగా మార్చి నీ చుట్టూ తిప్పుకునే ఒక మహాతాంత్రిక వశీకరణ విద్యా అబ్బుతుంది నీకు. ఇక జగన్మోహినీ నీకొక చక్కటి మొండితనమూ పురుష వ్యాకరణం లేని జాణతనమూ ఉన్నదే అనుకో

నీ జ్వలిత జననాంగాల దేహ వాక్య విన్యాసాల చుట్టూ ఈ పరమ పురుష సూక్తావళి గిరికీలు కొట్టీ కొట్టీ కొట్టీ నీ మహా జ్వాలను తాకి గిరగిరా తిరిగీ తిరిగీ తిరిగీ నిను స్తుతిస్తో, నీ జంతర్ మంతర్ మహావాచకంలో నీ అత్యాధునిక రామాయణంలో దగ్ధమవ్వడమూ నీకు నువ్వే ఒక తిరుగులేని మహాకథనంగా మారడమూ అవగతమవుతుంది

ఓ పిల్లా, ఇంతకూ తెలుసా నీకు, నువ్వొక మాయామహిమాన్విత మహామంత్రగత్తెవని?

# నువ్వు లేక

నీ పాదాలు నడయాడిన చోట తిరుగుతాను -

నీ శరీరపు సువాసన ఏదైనా దొరుకుతుందేమోనని నువ్వు సర్దిన గదులన్నీ వెదుకుతాను. నీ స్పర్శ ఏమైనా నా వేళ్ళ అంచులకు తాకుతుందేమోనని నీ చేతులు తాకిన వస్తువులను మెత్తగా ముట్టుకుంటాను. వికసించిన పూలలో నీ మోము ఏమైనా కనపడుతుందేమోనని నువ్వు నీళ్ళు చిలుకరించిన కుండీల వద్ద కూర్చుంటాను. మెతుకులు అంటిన నా పెదాలకు నీ పెదాలు ఏమైనా అంటుకుంటాయేమోనని నువ్వు వండి పెట్టిన అన్నం పాత్ర వద్ద తచ్చాట్లాడతాను

నువ్వు వేసిన పక్క వద్దా, దిండు వద్దా కూర్చుంటాను నీ శిరోజాలు ఏమైనా గాలిలా వీస్తాయేమోనని. కిటికీ తలుపులు కొంత తెరిచే ఉంచుతాను, నువ్వు చూసే నక్షత్రాలు చినుకులై ఇక్కడ రాలతాయేమోనని. కాంతి గాలై వీచే రాత్రి గూటిలోకి చూస్తాను నీ కళ్ళవంటి పావురాళ్ళు తిరిగి వచ్చాయో లేదో అని

కొంత నవ్వుకుంటాను, కొంత నొచ్చుకుంటాను. పూలవంటి రాళ్ళవంటి నీ మాటలు గుర్తుకువచ్చి కొంత దిగులు పడతాను కొంత కంగారుపడతాను. నువ్వు లేక రేపు ఎలా బ్రతకాలో తెలియక బెంగే పడతాను అస్థిమితం అవుతాను అస్తవ్యస్థం అవుతాను.

చూడు నువ్వు లేక ఒక ప్రాణి ఇక్కడ ఎలా విలవిలలాడుతుందో!

# ఎలా?

1
నిన్ను ఒకసారి చూడాలని ఉంది
    వొదులుకున్న వాళ్ళని, తిరిగి
    ఓసారి చూడటం ఎలా?

2
స్వప్నానంతాన దిగ్గున లేచి
    గుండె ఉగ్గ పట్టుకుని, వొళ్ళంతా
    వణికితే, కళ్ళలోకి కటిక చీకటి -

3
దాహం వేసిన పెదాలకి ఇంత తడీ
    రాత్రిలో వెదుక్కునే చేతులకీ
    ఒక నీటిపాత్రా దొరకదు. ఎందుకంటే

4
కత్తి అంచుతో చీరిన నాలికపై నీ రుచి -
    రెండు వేళ్ళ మధ్య శ్వాసను చిదిమి
    ఆరిన దీపపు ధూపం చూసే
    మహా వేడుక ఇది. చెప్పనా నీకు

5
అరచేతులలో అల్లుకున్న గూడు
    ఆఖరి గడ్డి పరక దొరకక అసంపూర్ణంగా
    మిగిలేపోతుందనీ
    అది నువ్వేననీ? ఇక

6.
నువ్వు ఎక్కడో, నీ నిద్రలో నీ మెలుకువలో

తప్పక కదులుతావు
నీ కలలో రాలిపడిన
ఒక అశ్రువు తడికి. ఆది నా
వాసన వేస్తుంది! చూడు

7

నన్ను ఒకే ఒక్కసారి
చూసుకోవాలని ఉంది
వదిలేసుకున్నవాళ్ళని
తిరిగి ఒకసారి
చూడటం ఎలా?

# వంట చేసిన ఆ అరచేతులు

ఏ రహదారుల్లోనో తప్పిపోయి గుండెను చించుకుని, మధుశాలల్లోంచి ఇంటికి వస్తావు కదా నువ్వు, చీకటి గుమ్మానికి అనుకుని ఎదురుచూస్తూ కూర్చుని ఉంటుంది నీ తల్లి

ఖాళీ కళ్ళతో నక్షత్రాలని లెక్కిస్తూ: సంజాయిషీ చెప్పుకోవాలనుకుంటావు నువ్వు నీ ఖాళీ చేతులని చూపిస్తో: నిను వారిస్తో గడప వద్దనుంచి గుమ్మాన్ని పుచ్చుకుని అతి కష్టంగా లేచి, వొణుకుతున్న చేతులతో కదులుతూ తను అంటుంది కదా నీతో: "పొద్దుపోయింది వెళ్లు. వెళ్లి ఇంత అన్నం తిను. ఖాళీ కడుపుతో పడుకోకు" అని

ఇక మొదలవుతుంది అప్పుడు అప్పటిదాకా ఆగిన గాలి రాత్రితో రాళ్ళతో నీ కళ్ళల్లో: దూరాన నుంచి ఇక వినపడుతుంది నీకు ఎక్కడో వేల ఆకులు రాలే చప్పుడు. నీళ్ళు పారే ఒరవడి. లోపల కొంత చిత్తడి. ఇక ఆ రాత్రి తొలిసారిగా వెక్కి వెక్కి ఏడుస్తావు నువ్వు అన్నం వండిన తన వొంటరి అరచేతులు నీ నిదురలో వొణుకుతూ, తెల్లబడిపోతూ కనుమరుగవ్వుతుండగా, కన్నీళ్లయ్యి నీ అరచేతులూ చల్లబడి కంపిస్తుండగా ఆకస్మికంగా ఇక తెలుస్తుంది నీకు

వంట చేసీ చేసీ వడలిపోయిన పగిలిపోయిన తన వృద్ధాప్యపు అరచేతులని ఇంతకు మునుపు నువ్వెన్నడూ చూడలేదనీ, కనీసం ఓరిమిగానైనా తాకలేదనీ -

మరి చూసారా మీరైనా ఎన్నడైనా ఎప్పుడైనా కమిలిన తన అరచేతులనీ, ఎవరూ లేని అన్నం మెతుకులనీ?

# ఆరిపోనివ్వకు

1.
ఈ రాత్రి ఒక పూవూ కాదు
అలా అని ఒక ఇల్లూ కాదు. పొదలలోంచీ నీడలలోంచీ
సరసరా నీ వైపుకు పాకే సర్పంతో పోల్చనా దీనిని?
2.
ఉద్యానవనంలో రాలిన చందమామకి
చీకటి ఆనవాలు తెలియలేదు. వెన్నెల వాగులో
పాదం ఆడిస్తూ కూర్చున్న నీకు, పరిసరాల్లో దాగిన
పదాల జాడలూ, నీడలూ తెలియలేదు

తొలి అడుగులు వేసే పసిపాప ఈ గాలి
కొద్దిగా జాగ్రత్తగా పుచ్చుకో తన వేలిని -
నిన్ను వొదిలి ఏ వానో లాక్కు వెళ్లిపోగలదు తనని
3.
సరే. తెలిసింది కదా నీకు

ఈ రాత్రి ఒక పూవూ కాదు, పసి నవ్వూ కాదు
గాఢాంధకారం నింపుకున్న మబ్బులు, తీవ్రతతో
భూమిపైకి ఒంగి నిన్ను పరిహసించే కాళ రాత్రి

బాటసారీ, దేహధారీ
4.
వెలిగించుకున్నావా ఒక దీపం?
అట్టే పెట్టుకో మరి నిన్ను నువ్వు
ఆ రెండు అరచేతుల మధ్య -
5.
ఇక
ఆరిపోనివ్వకు
నీ హృదయాన్ని

# అయోమయం

రంగులు మారే చక్రాల్లాగా ఉంటాయి తన కళ్ళు. గుండ్రంగా తిప్పిందా వాటిని, ఇక మరి తిరిగి గిరగిరా నీ తల నిలువలేవు ఒక చోట. ఇక తన తనువంటావా, మరి చిలికి తీసుకోనేవచ్చు తన వొంటిలోంచి వెన్నముద్దలనీ తెల్లని మబ్బులనీ

అయితే ఉంచలేవు తన శరీరంపై కుదుటుగా నీ వేలిని ఒక చోట. సర్రున జారే పోతుంది. అది సరే కానీ, తన జుత్తులోంచి కుంకుడు వాసన. అది కాకపోతే చల్లటి నీళ్ళు ప్రవహిస్తున్న పొలాల పక్కన వీచే కొబ్బరి తోటల పరిమళం తన తలలో నుంచి (కేరళా కుట్టి కదా మరి తను)

మరే, ఉన్నపళంగా స్పృహ తప్పడమంటే ఏమిటో తెలుస్తుంది తను నిన్ను ఆమాంతం కావలించుకుని ముద్దుపెట్టుకున్నప్పుడు. తెగిన నీ పెదాలకి తెలుస్తుంది, ఒక వసంతం తన దంత క్షతాలతో నీకు ఒక మండు వేసవి గాలిని ఎలా పరిచయం చేయవచ్చో

ఇక తను మోహంతో నిను గాట్టిగా చుట్టుకుని వదలకుండా నిను పెనవేసుకున్న సంగతి అంటావా కొండచిలువల కౌగిలి నెమలీకలతో సమానం: మురుగా ఇక ఆ తరువాత ఏమిటీ అంటే చెప్పటం ఎవరికీ సాధ్యం కాదు. ఎందుకంటే నీకు బ్రతికుండగానే నిను వీడి నీ ప్రాణం తనతో దైవం వద్దకు మిరుమిట్లు గొలిపే కాంతితో గన్నేరుపూల మత్తుతో వెళ్లిపోవడం తెలుస్తుంది. ఇంతా చేసి ఆనక తీరికగా అంటుంది కదా తను:

'మీ మగవాళ్ళకెందుకు ఎప్పుడూ అదే యావ కాసింత సేపు మాట్లాడలేరా ప్రేమగా' అని. మూర్ఖుడిని అందుకే మరి, ఇంతకాలం అందుకే నాస్తికుడని మరి. ఇక అందుకే మరి ఇదిగో రాస్తున్నానీ నాలుగు పదాలు ఈ ఉదయం ఈ కాలపు ఆలయపు మండపంలో ఇలా జ్ఞానోదయమై చిరునవ్వుతో కూర్చుని, మరి అంతలోనే ఏమీ తెలియని అయోమయంతో!

# చివరికి

ఒక పొగమంచుని శ్వాసించాను
గుండెలోకి గుప్పెడు గులాబీలను హత్తుకున్నాను
చీకటి తొలిగి వెలుగు నిన్ను తాకే వేళకి

ఏదీ ఏదీ కాదని తెలుసుకున్నాను
నీ చేతివేళ్ళ మధ్య నా జీవితాన్ని ఉంచుకున్నాను
చిరునవ్వుతో లోకంతో దాగుడుమూతలు

ఆడటం ఎలాగో నేర్చుకున్నాను
ఒక తేలికైన శ్వాసను లయగా పీల్చడం తెలుసుకున్నాను
ఇక్కడే ఎక్కడో ఒకచోట, ఉన్నచోటే ఉండటం అభ్యసించాను

ఒక పొగమంచునీ, నీ శరీరాన్నీ శ్వాసించాను
జల్లు వలె నువ్వు జ్ఞప్తికి వచ్చి కనులు తడిచే వేళల్లో
రెక్కలు మొలుచుకువచ్చి

ఈ లోకపు పంజరంలోంచి తప్పించుకుని
నువ్వు కడిగిన నేలపైకే
నీ హృదయం వైపుకే ఎగిరి వచ్చాను.
చివరికి!

# ఒక రాత్రి

(not for decent people)*

నిజం చెబ్తివా తమ్మీ/ తరిమి తరిమి కొడతరు/ కొంత ఒంట బట్టించుకో/ ఒంటిని/ మరీ చూడకు/ దానిని అలా/ దేవుని మీద నమ్మకం లేదనుకో/ అటువైపు తిరగకు/ ప్రవచనాలు వినకు/ ఊరికే ఉడుక్కోకు/ పీకల దాకా తాగినా/ చివర కంటా లాక్కున్నా/ శరీరంలోంచి పోరు/ ఈ మనుషులు/ గుళ్ళూ గోపురాలూ/ మహాత్ములూ/ స్వామీజీలూ/ పిత్రులూ పుత్రులూ

ఒక్కోనికి ఒక్కో లెక్క/ ఒక్కోనికి ఒక్కో తిక్క/ నిజం చెబ్తివా తమ్మీ/ నీ గుద్ద పగలగొట్టి/ ఎళ్ళ దెంగుతరు/ మనుషులు వొద్దంటే/ మరిక నీ ఇష్టం కానీ/ నీ నోట్లోని మాట/ నాలిక దాటొద్దు/ నాలికపై మాట/ పెదాల్ని నమ్మొద్దు/ అన్నా, నిజం చెబ్తున్నా

అసలే నమ్మొద్దు/ కవిత్వం రాసే వాళ్ళని/ కుదిరితే ఉంచుకో/ రెండు రాళ్ళు/ ఎప్పుడూ నీ దగ్గర/ పదాలని పగల/ కొట్టడానికైనా/ నీ నోరు పగల/ గొట్టుకోడానికైనా

చూస్తివా అన్నా/ మనల్ని/ నిన్నసలే నమ్మ/ తాగి మాట్లాడని వాడు/ ఆడదానితో తొంగొని దాచేవాడు/ పక్కా దొంగానాకొడుకు/ నువ్వూ నేనూ/ ఇద్దరమూ అంతే/ ఇంతకూ/ నవ్వినావా అన్నా/ ఏడ్చినావా అన్నా/ ఎన్నడైనా?/ నిజ్జంగా? / కళ్ళల్లో నెత్తురు కారేటట్లు?

చూడన్నా ఇక్కడ/ ఈ లోకపు మాధర్చోతుగాళ్ళు/ తుంపిన పూలను/ మా యమ్మ పూలను/ నా చెల్లి పూలను/ నా నేల పూలను/ నా నీటి పూలను / థూ ... ఇస్కీ/ మర్యాదస్తులందరూ/మొడ్డగుడిచిపోయేటోళ్ళే/ ఇంతకీ అన్నా/ నా బుగ్గపై/ జారిన నీళ్ళు/ బూతెట్లయితది/ నీకు?/

తెచ్చుకున్నావా నువ్వు/ ఉంచుకున్నావా నువ్వు/ రెండు రాళ్ళు/ రెండు రాళ్ళు/ రెండు రాళ్ళు/ ఈ లోకాన్ని నిలువునా/ పగలగొట్టేందుకు?/

అన్నా/ ఇక చూడన్నా/ ఈ చీకటిని ఎట్లా/ ఆ రెండు చుక్కలు/ నా గొంతుని ఎట్లా/ ఈ రెండు మందు చినుకులు/ వెలిగిస్తున్నాయో/ మండిస్తున్నాయో ...

అన్నా/ వెలుగుతున్నావా/ నువ్వు?/ అన్నా/ ఎక్కడైనా మండుతున్నావా నువ్వు?

# కొత్తిమిరకపాయ్

రైతులు లేని రైతుబజారు నుండి ప్లాస్టిక్ సంచిలో తెచ్చుకుంటాము బహుభద్రంగా, నేనూ నా కొడుకూ కూరగాయలు. టమాటాలు, బెండకాయలూ, దోసకాయలూ, ఆలుగడ్డలూ, చిలుకడ దుంపలూ, ఇంత పాలకూరా, పచ్చి మిరపకాయలూ కొంత కొత్తిమీరా. నేనైతే చూసాను

ఒకప్పుడు, నా కొడుకంత వయసులో ఇంటి పెరడులో నాన్న చేసిన పాదులో ఏడు రంగుల్లా వికసించి నింగికి సాగిన  బీరకాయ, పొట్లకాయ లతలనూ వాటికి తళుక్కుమని మెరిసే కాయలనూ, నేలలో మట్టిని కావలించుకుని నిదురించే పల్లీలనూ దుంపలనూ - అక్కడే పక్కగా ఎంచక్కగా ఎదిగి వొంగిన జామచెట్టునూ దాని కింద నీడలలో కదిలే చిన్ని పిట్టలనూ

నగ్నమైన వీపుతో నాన్న అక్కడ మట్టిలో ఉంటే వెనుకగా నేను నాన్న తెంచి ఇచ్చిన కనకాంబరపు పూలనూ దవనాన్నీ అమ్మకి ఇచ్చి చూసేవాడిని ఇంద్రజాలంలాంటి ఆ కాంతిలో అమ్మ వేళ్ళ అల్లికలో పూలు హారమై అమ్మ శిరస్సులో నాటుకుని మళ్ళీ ఎలా పచ్చగా వికసించేవో - రాత్రికి

పెరడులో తెంపుకున్న నాలుగు టమాటాలు పెరుగుతో కూరగా నాలుగు మాటలుగా ఆనక నాన్న చెప్పే వ్యవసాయపు కథలుగా చల్లటి అమ్మ చుట్టూ వెచ్చని నిదురుగా ఎలా మారేవో! మరి ఇప్పుడు అంటాడు

నా నాలుగేళ్ల పిల్లవాడు, కూరగాయ మొక్కలని ఎన్నడూ చూడని వాడు, నలు చదరపు గదులలో పెరడు లేని వాడు: "నాన్నా కొత్తిమిరకపాయలు తీసుకున్నావా?" అని. ఏమో తీసుకున్నానేమో మరి, కానీ

కురియలేదు అప్పుడు కురిసిన వర్షం, ఇక ఏ మాత్రం ఇక్కడ:ఎప్పటికీ. నాకూ, నా పిల్లవాడికీ.

# దినచర్య

ఉదయాన్నే లేచి, నిదురలో హాయిగా తేలుతున్న పిల్లల ముఖాలని చూసుకుంటాను. ఒక పురాతన పుష్పపు పరిమళమేదో చుట్టుకుంటుంది. నెమ్మదిగా కదిలి బాల్కనిలో పక్షులు అల్లుకున్న గూడుని చూసుకుంటాను

చెమ్మగిల్లిన కాంతి, చల్లని నీడా కలగలసి తిరుగుతాయి గోడపై. ఎదురుగా గాలికి ఊగే పచ్చని చెట్లపై వేకువఝామున రాలిన మంచు శబ్దాన్ని వినేందుకు ప్రయత్నిస్తాను, అరచేతిలో వెచ్చగా ఒదిగిన కప్పు తేనీరుతో-

లోపల గదిలో, కాగితాల అలికిడి వంటి నా తల్లి మాటలు. నలిగిన పుస్తకంలో దాగి ఉంటాయి తన వృద్ధాప్యపు లేఖలు. ఆ ముసలి అరచేతుల మధ్య ఒకప్పుడు ఎన్ని ముఖాలు ఒదిగాయో ప్రేమగా, ఇప్పుడు పసిడి మడతలు పడిన తనలో ఒక మహా శూన్యం

వంట గదిలో నీళ్ళ సవ్వడి. పాత్రల అలజడి. నిప్పు వెలిగి శుభ్రమయ్యే నిత్య దైనందిన జీవన శ్రుతి. కూరగాయలు తరుక్కుని, కడుక్కుని ఈ భూమి దయతో అందించిన బియ్యపు గింజలు వండుకుని, డబ్బాలో కట్టుకుని స్నానం చేసి అలా దినవారీ పనులు చేసుకునేందుకు లోకంలోకి కదిలే ఒక పవిత్రమైన పని. ఏమీ లేదు: ఉదయాన్నే లేచి, ఇదిగో ఇలాంటి

నాలుగు వాక్యాలని రాసుకునేందుకే బ్రతికి ఉంటాను. యిక తలుపు తీసి బయట అడుగిడితే ఎదురుగా అలసటగా నా పిల్లల్ని చూసేందుకు వచ్చే నా ముదుసలి తండ్రి. ఎక్కడో నల్లటి మట్టి చిట్లి, నల్లటి మేఘం పిగిలి ఓ వర్షం మొదలవుతుంది. కాలం వలయమై, చిన్నగా చల్లగా కురిసే ఆ వర్షంలో

ఇద్దరం ఎదురెదురు పడి, ఇద్దరి కళ్ళు మిళితమై, "జాగ్రత్త" అంటో నీళ్ళ బాటిల్ అందించే నా భార్య అరచేయై సాగుతాం ఇద్దరం అందరితో. యిక, ఈ రోజుకి ఇలా ఉండటం మంచిదే. ఈ నాలుగు వాక్యాలు రాసుకోవడం మంచిదే. ఇంతా చదివి, ఇదేమిటని మీరు అడిగితే, యిక నేను ఏమీ చెప్పలేను. నిండుగా సజలమైన ఈ నా మీ హృదయంలో మీ చేయి జార్చి ఒక అద్దాన్ని వెలికి తీసి మిమ్మల్ని మీరు చూసుకోమని చెప్పడం తప్పు!

# ఊహించు

ఊహించు, నిప్పు అంటుకుని గాలికి రేగే ఒక వెన్నెలని
నిలువ నీడ లేక ఒరిగిన ఒక మనిషిని - ఎవరో
తీసుకువచ్చి ఈ అపరచిత లోకంలో కాలంలో వదిలివేసి
వెళ్ళిపోయిన ఒక పురాతనమైన ఉనికిని

ఊహించు, దోసిళ్ళలోంచి జారిపోయిన ఒక ముఖాన్ని
ఊహించు, ఒక ప్రియమైన వ్యక్తిని తాకబోతూ
అర్థాంతరంగా తెగి ఆగిపోయిన ఒక అరచేయిని

ఊహించు, చీకటిలోకి కనుమరుగయ్యే ఒక కాంతిని
ఊహించు, నీటిలో నిమగ్నమయిన ఒక నయనాన్ని
ఊహించు, చివరకి: నన్ను

# ఋణం

మొద్దుబారిన నాలికతో అద్ది
చెబుతున్నాను యుగాల బానిస పదాలని పరభాషలో

ఎండలతో, వెన్నెలతో
గాలులతో, వానలతో
రేపటి వాచకపు కళ్ళతో వింటున్నారు పిల్లలే నిన్నటిని
తిరిగి తిరిగే రేపటికి -

నలుపు పలకపై పలుకలేని వాక్యాలు నావి
ఎదురుగా చెక్క కుర్చీపై
తెగనరికిన చెట్టు నీడనై కూర్చుని

చెబుతున్నాను అవే - కర్మ కర్త క్రియ - మళ్ళా
మళ్ళా అవే పన్నెండు పునరుక్త కాలాలలో -
నాలికకీ చెవులకీ సంబంధం లేని లోకాలలో

కన్నీళ్లు అంటని వాక్య నిర్మాణాలలో
నెత్తురు తాకని పద బంధాలలో
ఇరుకిరుకు వ్యాకరణ చట్రాలలో

యంత్ర పునరుక్తిగా రూపుదిద్దుకునే
పరమ రూపంలోకి, మాతృ పదాన్నీ
వాక్య ఋణం లేని నన్నూ వాళ్ళనీ

పంపించుకుంటూ
అనుకుంటాను కదా
ఇక ఇలాగ:

దేవుడు మరణించెను. కానీ
ఇంకనూ వ్యాకరణము బ్రతికి
యుండెను. ఆమెన్.

# యిలా

ఆకాశం నుంచి నేల దాకా
ఒక లేత వాన పరదా జారితే యిక ఎందుకో నాకు ఎప్పుడో
నా తల్లి కట్టుకున్న చుక్కల చీరా నేను తల దాచుకున్న తన మల్లెపూల
నీటి యెదా గుర్తుకు వచ్చింది

పమిట చాటున దాగి తాగిన పాలు
తన బొజ్జని హత్తుకుని పడుకున్న ఆ ఇంద్రజాలపు దినాలు
రాత్రి కాంతితో మెరిసే దవనం వాసన వేసే
చెమ్మగిల్లిన సూర్య నయనాల కాంతి కాలాలూ

గుర్తుకువచ్చాయి ఎందుకో, ఇప్పటికీ చీకట్లో
అమ్మా అంటూ తడుముకునే, ఎప్పటికీ
ఎదగలేని ఈ నా నలభై ఏళ్ల గరకు చేతులకు -

ఉండే ఉంటుంది తను ఇప్పటికీ - ఎక్కడో -
నన్ను తలుచుకుంటో
ఏ చింతచెట్ల నీడల కిందో
ఓ ఒంటరి గుమ్మం ముందో

కాన్సరొచ్చి కోసేసిన వక్షోజపు గాటుపై
ఓ చేయించుకుని నిమురుకుంటూ
తనలోనే తాను ఏదో గొణుక్కుంటూ

ఇన్ని మెతుకులు కాలేని ఆకాశాన్నీ
కాస్త దగ్గరగా రాలేని దూరాన్నీ ఎలా
అ/గర్భంలోకి అదిమి పట్టుకోవాలని ఒక్కతే కన్నీళ్ళతో అనేకమై యోచిస్తో
వాన కానీ భూమీ కానీ మొక్క కానీ పూవు కానీ గూడు కానీ దీపం కానీ

అన్నీ అయ్యి ఏమీ కాక, ఒట్టి ప్రతీకలలోనే
మిగిలిపోయి రాలిపోయే లేగ దూడలాంటి
మన అమ్మ

యిలా ఉందని
ఎలా చెప్పడం?

# లమ్డీకె

ఓరన్నా నువ్వు ఎంతన్నా ఈ లోకం ఒక బందీ ఖానా. తిన్నదీ లేదు తిరిగిందీ లేదు, నిండుగా ప్రేమించిందీ లేదు మనస్సు నిండుగా రమించిందీ లేదు తిరిగింది తిరగక తిరగనిది వెదకక వెదికినది దొరకక పోతూనే ఉన్నాం కాలకృత్యాలై కర్మలై పాపాలై శాపాలై శోకాలై పెళ్లిళ్లై సంసారాలై శవాలై ఆస్థి దస్తావేజులై భూదాహాలై భవంతుల మోహాలై వస్తు విహారాలై వికృతాలై దినదిన ప్రవర్ధమానమయ్యే పూల సంహారులమై దేహ ద్రోహులమై దేశాలు పట్టి వేలాడే చివికిన దుస్తులమై, అన్నా ఓరన్నా నువ్వు ఎంతన్నా నీకు నువ్వే ఒక బంధీ ఖానా నీకు నువ్వే ఒక పాయిఖానా - అని - అన్నాడతడు ఒక నిర్ముఖ సాయంత్రాన యింత అన్నం అడిగినందుకు తనకింత అన్నం ఎందుకు పెట్టరని పంతం పట్టినందుకు లమ్డీకె అని తన మూతి పగలకొట్టిన ఈ లోక కాలపు దయగల సర్వసుందరమైన జనాలతో -

# పిల్లులు లేని రాత్రి

శవంలాగా నువ్వు కూర్చుంటే రాత్రంతా అరిచే పిల్లులు, తగువులాడుకుంటూ మైధునంలో రక్కుకుంటూ కొరుక్కుంటూ కొంత నీకు తోడుగా ఉంటాయి -

చక్కటి బలిష్టమైన పిల్లులు. నిండు చందమామల్లానో వానల్లానో నల్లటి పూల గుచ్ఛాలలానో ఈ ఇంటి ప్రాంగణంలో చీకట్లో వేపచెట్టు కొమ్మల్లో గాండ్రుమంటూ, అంతలోనే మెత్తటి పాదాలతో గుర్‌గుర్ మంటూ నిన్ను రాసుకుంటూ కదిలే ఆ చక్కటి బలిష్టమైన పిల్లులు ... నీలాగే నీ శరీర వాంఛలలాగానే స్పర్శ లేకుండా ఉండలేవవి!

ఎన్నడైనా ఓర్వలేనంత విసుగొచ్చి అలా విసిరి కొడతావా వాటిని కాలితో తంతావా వాటిని చటాలున కనులు ముడుచుకుని నీ నుంచి దూరంగా పారిపోతాయవి. నీలాగే వెనువెంటనే అన్నీ మరచి తిరిగి వస్తాయవి, ఒకప్పుడు పుష్టిగా ఉండి ఇకిప్పుడు ఇళ్ళు కనుమరుగై చదరపు భవంతులలో అప్పుడప్పుడు తచ్చట్లాడుతూ నీకు కనపడే బక్కచిక్కిన పిల్లులు - అవే ఇళ్ళు లేని పిల్లలు. యిక, రాత్రి యింత దీర్ఘంగా సాగినప్పుడు, నువ్వు ఒంటరిగా కూర్చున్నప్పుడు, ఒక మరణ నిశ్శబ్దమే నీ అంతటా. పిల్లుల అరుపులు లేని ఒక చీకటి సమాధే నీ అంతటా ...

అవును ఇటు చూడు యిది నిజమే. నీ హృదయమెప్పుడో బావురుమన్న ఆ తెలుపూ నలుపూ పిల్లులుగా మారిపోయి నువ్వు ఇల్లు ఖాళీ చేసిన నాడే ఎక్కడో పూర్తిగా తప్పిపోయింది!

# తెలియనితనం

నువ్వు తిరిగి వచ్చే లోపల, లోపల ఎవరుంటారో తెలియదు -

ఖాళీ ఉద్యానవనంలో ఒక నిశ్శబ్దం
అలలపై తేలే పల్చటి గాలిలా కదులాడుతుండవచ్చు

అపరిచితులెవరో కత్తులతో నీకై మాటు వేసి ఉండవచ్చు

పసి చేతులు పూలహారాలై
ఆకుపచ్చటి అల్లరితో, ఇల్లంతా బిరబిరా తిరుగాడుతుండవచ్చు

నీ లోపలి అస్థవ్యస్థతని
అతి తేలికగా సర్దుతూ
ఒక స్త్రీ మౌనంగా నిను మననం చేసుకుంటూ ఉండవచ్చు: లేదా

నీ తల్లి ఒక ఒంటరి దీపం ముందు
ఒక ఒంటరి ద్వీపమై కూర్చుని
తనని కరుణించమని నిను మోకరిల్లి ప్రార్థిస్తూ ఉండవచ్చు. లేదా

నువ్వే నీకై ఎదురుచూస్తూ ఉండి ఉండవచ్చు. నీ నుంచి నువ్వే
పారిపోయీ ఉండవచ్చు. నిజంగా

నువ్వు తిరిగి వచ్చేసరికి
లోపలా బయటా ఎవరుంటారో, చివరికి ఎవరు ఎవరుగా మిగిలి ఉంటారో
నిజంగా ఎవరికీ తెలియదు

# స్వస్థత

ఈ రాత్రిలో పచ్చగా మెరుస్తాయి
పసుపు రాసుకున్న నీ చేతులు

ఒక లేత సాయంత్రపు ఎండ, సరస్సుల మీంచీ చెట్లలోంచీ
తప్పించుకుని వచ్చి
చల్లగా నీ చేతులను చుట్టుకున్నట్లు యిక గదంతా నీ గాజుల జల్లు

ఆనక
మనల్ని కలిపే రాత్రిలోనే
ఆ వానలోనే, నీ శరీరపు
కమ్మటి పసుపు వాసన నా మాలిన్యాలను శుభ్రం చేస్తుంది

చూస్తూ ఉండు ఇక,
రేపటి ఉదయానికల్లా
అతను ఒక పొద్దుతిరుగుడు పూవై నీలా ఎంత పచ్చగా వికసిస్తాడో!

# పవిత్రత

తొడిమను వీడి ఆకు జారిన ఒక తేలికైన శబ్దం
నీ సమక్షంలో
నింగిని వొదిలి నేలపై వాలిన ఓ చినుకు వాసన
నీ నిశ్శబ్దంలో
యిక నువ్వు ఉన్న పరిధి మేరా, రాత్రి వృత్తాల
లేత వెన్నెల వాన

ఆహ్! ఎవరో తలుపులు తట్టినట్లు ఉన్నారు
యిక నీ తనువు
తెరవడమే తరువాయి!

# హృదయ నిశ్శబ్దం

నాన్నా, నవ్వుతూ వెళ్ళమని నువ్వూ నవ్వుతూ రమ్మని టీచరూ అంటుంది కానీ, నవ్వడం ఎలాగా నాన్నా? అని నీటి బుడగలు పగిలే ఈ ఉదయపు వేళల్లో కళ్ళల్లో తుంపర కురిసే ఆ సమయాల్లో, గుండె ఉగ్గబట్టుకుని, చేతులతో నన్ను గట్టిగా బిగించి పట్టుకుని అడిగాడు ఆరేళ్ళ పిల్లవాడు: జ్ఞానం ఉబ్బిన బాగ్ బరువుతో వొంగి, వడలి, ఆటలు లేని విష కాలంగా, రెప్పపాటులో అయిపోతున్న దినంగా మారి, ఏడుస్తోన్న పెదిమల పైకి పగులుతోన్న నవ్వును బలవంతంగా లాగుతూ - అడిగాడు ఆ పిల్లవాడు "ఇలాగేనా నాన్నా?" అని

చెట్లు వీచి ధూళి రేగి శరీరం నిశ్శబ్దం నిస్సహాయతా అయ్యే కాలాలలో: ఇంతకూ నవ్వడం అంటే ఇలాగనేనా?

# ఒక అమ్మ

చినుకులు ముసిరిన చీకట్లలో
ఒక్కత్తే కూర్చుంటుంది ఒంటరిగా ఒక అమ్మ కొంత చీకటితో కొంత చిత్తడితో

ఇంకా ఇప్పుడే ఉన్నట్లు, ఇంకా ఇప్పుడే జరిగినట్లు
నువ్వు గుప్పిళ్ళతో చీకటిని వెన్నెలతో దూసి
తన ముఖాన్ని లేత రావి ఆకుల అరచేతులతో తడిమిన జ్ఞాపకం

నువ్వు పాకుతూ, పడుతూ లేస్తూ

నీటి నవ్వులతో పరిగెడుతూ
అటు తననీ ఇటు నిన్నూ
నింగికీ భూమికీ ముడివేసి
తన బొజ్జలో ముడుచుకుని ఒదిగి ఒదిగి పడుకున్న ఒక కలవరం

హోరున వీచే అవిసె చెట్లు
తిరిగి వచ్చే పక్షుల కలకలంతో జలదరించే ఉద్యానవనాలు
తల వంచుకున్న వీధి దీపాలపై
రాలే తొలి చినుకులూ, మూసుకుంటున్న ఏకాకి తలుపులూ

ఇవన్నీ తనై, ఇవన్నీ తన తనువై

చీకట్లు ముసిరిన చినుకులలో
ఒంటరిగా కూర్చుంటుంది ఒక్కత్తే ఒక అమ్మ కొంత దిగులుతో కొంత దహనంతో

కన్నీళ్ళతో బరువైన కళ్ళే తనవి
ఎదురుచూపులతో చిట్లి
కనుల కింద సాగిన నల్లని చారికల దారులే తనవి

నిన్ను అడగలేక, నిన్ను విడవలేక
ఎవరికీ చెప్పుకోలేక

నిన్ను హత్తుకుని నెత్తురోడిన చల్లటి చేతులే తనవి, పగిలిన అరిపాదాలే తనవి

గుమ్మానికి అనుకుని
తిరిగి ఇంటిలోకీ తిరిగి చీకటిలోకీ కదులుతూ, వీచే గాలిని మునివేళ్ళతో తాకిన
విలవిలలాడే పసి హృదయమే తనది

రాత్రిలోకి ఒక శిలయై, నీకై ఎదురు చూస్తూ కాలాన్ని చెక్కక మునుపు
తనకే తెలియదు, ఆ అమ్మకే తెలియదు

బాల్యంలో నిన్ను తను కొట్టినప్పుడు
ఇపుడు నువ్వు తనని చరచినప్పుడు

అపుడూ, ఇపుడూ
తనే ఎందుకు గుండె ఉగ్గపట్టుకుని ఏడ్చిందో

# కథలు చెప్పే మనిషి

అతన కథలు చెప్పే మనిషి

మార్చి నెల: పాల మారిన ఆ కాలంలో ఆ సాయంత్రం ఆ రాత్రంతా వర్షం పడింది. తను సాయంత్రం కాక మునుపు వచ్చింది మబ్బులు కమ్ముకున్న ఆకాశాన్ని చుట్టుకుని నిమ్మకాయ రంగుల వాసనలతో: నేను కాదనలేక పోయాను. ఒక నిలువెత్తు పసిడి గులాబీని నా వెంట ఆ దినం ఈ నగర లోహ రహదారులని చూపించేందుకు తీసుకు వెళ్లాను. తెల్లని పావురాళ్ళు ముడుచుకున్న కళ్ళతో తను నా కళ్ళలోంచి నా అరచేతులలోంచి లోకంలోకి ఎగిరింది. తారు వాసనలనీ, ఎత్తైన నలు చదరపు శరీరాల్నీ, నాచు పట్టిన గుర్రపు డెక్కల సరస్సులనీ రహదారుల పక్కగా బూజు పట్టిన పసి కళ్ళనీ నిరంతరంగా సాగే జనుల ఆదుర్దానీ చూసి స్థాణువై నా హృదయంలో గూడు కట్టుకునేందుకు మసకబారిన మనస్సుతో వాటిని తిరిగి కథలుగా తీసుకు వచ్చింది

అతను అన్నాడు: ఇది జీవితం. ఊరుకో. హత్యలకు గురికాకుండా కలలతో మిగిలిన మనిషి ఎవరూ లేరిక్కడ

యిక ఆ సాయంత్రం ఆ రాత్రంతా వర్షం పడింది. పూర్తిగా తడిచి వణుకుతూ, తనలోకి తాను ముడుచుకుపోతూ తను బేలగా అర్థించింది: “ఉండనివ్వు నన్ను ఈ పూటకి నీ గదిలో, వెళ్ళలేను ఇప్పుడు బయటకి, చీకటి జిగటగా అల్లుకున్న రాత్రిలోకి. ఉంటాను ఈ పూట నీ గదిలో నాకు నేనే తోడుగా, పడుకుంటాను నీతో నీకూ నాకూ తోడుగా. ఉండనివ్వు నన్ను: అలసిపోయాను ఇప్పటికే రక్తపిపాసులు తిరిగే ఆ రహదారుల్లో”, అని అంది తను ముకుళించిన అరచేతులతో, తొలగిన పమిటలోంచి గతపు గాయాల నెత్తురు ఓడుతున్న వక్షోజాలతో

అతను నవ్వాడు. అతను తడబడ్డాడు. అతను అన్నాడు: “ఊరుకో. యిదే జీవితం. యిదే పవిత్ర పాపుల కాలం.” అని అతను తనని భక్షించి ఆనక రాత్రి వ్యాఘ్రం తిరుగాడే నీటి చినుకుల శిధిలాలలోకీ కాల బిలాలలోకి తనని తోసివేసాడు. తను వెళ్లిపోయింది అక్కడ నుంచి, ఎదపై నిదురించిన ఇద్దరు పసి పిల్లలని లేపుకుని ఆ చీకటి రాత్రిలోకి, ఆ కాటుక వానలోకీ వొణికే కడుపుతో తడిచీ పూర్తిగా ఎండిపోయిన హృదయంతో -

ఇక తిరిగి రాని తను కనిపించిందా మీకు ఎక్కడైనా అని రాస్తోన్నాడు అతను ఇదంతా పుక్కిలి పట్టిన దిగులుతో ఏడుపుతో అతనని నిరంతరం వేటాడే ఆ మృణ్మయ పాత్రల కనులతో ఆ రాత్రంతా ఆ సాయంత్రమంతా కురిసిన ఎవరూ లేని, ఇళ్ళు లేని ఆ వర్షం గురించి ...

ఏమీ లేదు. అతను కథలు చెప్పే మనిషి.

# నాకు తెలియదు

రాత్రిలో
నీ ముఖాన్ని వెలిగించుకుని, ఆ కాంతిలో విస్తుపోయాను

కన్నా, యిక ఎప్పటికీ నాకు తెలియదు
గుంపుగా ఊగే యూకలిప్టస్ చెట్లతో
పూల బరువుతో నీటి సువాసనతో సీతాకోకచిలుకల రెక్కలతో

నా గదిలోకి, నా మంచంపైకి
వెన్నెలతో ఒక నిండు జాబిలి
ఎలా వచ్చి చేరిందో, అలా ఎలా

అంత హాయిగా నిదురోయిందో!

# ఒక వాస్తవం

ఉండుండీ ఒక వేసవి గాలి
మధ్యాహ్నం నుంచి తన వెంటే వెనుదిరగకుండా తిరుగుతోంది

తనేమో ఇంటి నుంచి రక్షక భట నిలయానికీ
అక్కడ నుంచి ఎక్కడికీ వెళ్ళలేని చోటుకీ కదులాడుతోంది

సలుపుతోంది లోపల ఒక రాచపుండు, ప్రేమ రాచ పుండు
హృదయమొక రాచపుండు

ఉండుండీ
ఉండకుండా, పూర్తిగా వొదలకుండా

ఎటువంటి దారి ఇది?

పాద రక్షలు లేక పగిలి పిగిలి నెత్తురు కారిన
ఒకనాటి పసిడి వెన్నెల అరిపాదాల కన్నా
తడి చేతులు తాకక పచ్చిక లేక దహించుకపోయి
కన్నీరు ఒలికిన ఒకనాటి పూల శరీరం కన్నా

పిల్లల్ని కని, ఎంతో పాపం చేసుకున్న
ఎటువంటి దిగులు దారి ఇది?
పిల్లల్ని పెంచుకుని ఎంతో భారమైన
ఎటువంటి గర్భశోకం ఇది?
ఎటువంటి జీవన విలాపం ఇది? అందుకే

తిరుగుతోంది తను, ఇంటి నుంచి
రక్షకభట నిలయానికీ
అక్కడ నుంచి ఇక ఎక్కడికీ ఎప్పటికీ వెళ్ళలేని ఒక చోటికీ ఒక అమ్మ

ఎరుపెక్కిన కనులతో
వేలిముద్రలు పడిన కాలిన బుగ్గలతో, నలిగిన చీరతో శరీరంతో
అరవై ఏళ్ల పసిపాపగా మిగిలి
లోక రీతిలో, క్రూరమైన ఆటలో
రూకలు కాలేక ఆభరణాలు కాలేక అమాయకత్వం ఒదులుకోలేక
ఇక్కడే మిగిలిపోయిన ఒక అమ్మ
మనిషోక మంచినీళ్ళ కుండ అనుకుని ఎడారిగా మారిన ఒక అమ్మ ...

వేసవి గాలి తనని వొదిలి వెళ్ళింది
మధ్యాహ్నం రాత్రయింది. తిరిగి ఆ రాత్రి దయ లేక
ఒక జాబిలిగా మారి ఆకాశాన్ని దహించి వేస్తోంది
అరచేతుల మధ్య తన ముఖం సమాధి అయ్యింది

ఇక తనని కొట్టేందుకు
తిరిగి ఇంటికి ఆ తనయుడు ఎప్పుడు వస్తాడు?

# ఒక క్షణం

రాత్రయితే
ఇంటికొచ్చే దాకా ఎదురుచూపులు

పిల్లలతో ఆడుకుంటూ తను
బయటపడదు కానీ మనస్సంతా తలుపుల వద్దే

పిల్లల ఆటలకీ
పెద్దల ఆటలకీ ఎన్నడో కానీ పొంతన కుదరదు

అయిపోయాం పెద్దరికంతో పేదవాళ్ళం ఎపుడో
ఇక చిన్నారుల తోటలోకి అడుగుపెట్టడం ఎలా?

గిన్నెలతో గంటెలతో
కాగితాలతో కలాలతో రంగులతో గోడలతో

ఇల్లంతా ఖణేల్ ఖణేల్ మని తిరుగుతో
వాళ్ళ నాయనమ్మని తమతో తిప్పుకుంటో ఆ ఇద్దరే

వాళ్ళతో పరిగెత్తలేక, వెంటపడి అన్నం పెట్టలేక
హడావిడి పడుతోంది వాళ్ళ అమ్మ

జారుకుంటున్నాయి ఆకాశాన మబ్బులు
ఆగింది దాగుడు మూతల నుంచి బయటపడిన జాబిలి
విరామంగా ఒక చోట

ఎక్కడిదో చల్లని గాలి
పెంచుకున్న మల్లెమొక్క నుంచి తెంపుకున్న మొగ్గలై
మట్టి వాసనతో నీటి తాకిడితో తాకుతోంది గదులని -

గెంతుతూ ఎగురుతూ
తళతళమని ఇకిలింతలతో మోగుతో, ఆడుకుంటూనే
అడుగుతారు పిల్లలు
“అమ్మా నువ్వు తినమ్మా. తిన్నావా లేదా?”

చూడు! సరిగ్గా ఆ మాటే, సరిగ్గా ఆ చిన్న మాటే
సరిగ్గా సరైన సమయంలోనే
ఎన్నడైనా అడిగానా నేను నా తల్లిని ప్రేమగా?

# please ...

ఆదిమ తల్లీ, ఒక ప్రియురాలూ
నిర్భీతి హృదయపు రంగులు కలిసిన కారుణ్యపు గీతం తను

పాపం అడిగాడు ఆ పసివాడు
ఎదిగాననుకున్న పెద్దవాడు, ఏం కావాలో తెలియక అన్నాడా పురుషుడు
'నిన్ను ప్రేమిస్తున్నాను' అని

తనతో, ఉద్యోగం నుంచి తిరిగి వస్తున్న తన తనంతో
నల్లని పొగ ఇనుప యంత్రాలై దుమికే క్రూర మృగాల రహదారులలో -

ఆకాశమంత ఆవలింతతో
ఈ ధరిత్రి మోస్తున్నంత అలసటతో, రావి ఆకులు రెపరెపలాడే నవ్వుతో
తను అంది తన తనువు అంతటితోనూ -

"Please, fuck off and
Leave me alone"

# నీకెందుకు?

దారి తప్పి ఉండి ఉండవచ్చు ప్రమిదెను వెదుకుతూ చీకట్లో కనుమరుగై ఉండి ఉండవచ్చు భూమిని కౌగలించుకుని ఉండి ఉండవచ్చు నింగిని తాకి తిరిగి రాలేక నేను అనే కృష్ణబిలంలో చిక్కుకుపోయి ఉండి ఉండవచ్చు తాగి ఉండి ఉండవచ్చు అరిగి ఉండి ఉండవచ్చు. లోకంతో విసిగి, కాలాన్ని ఆపలేక నగర దారులలో విలవిలలాడుతూ ఉండి ఉండవచ్చు. స్నేహితులతో ఉండి ఉండవచ్చు స్నేహితులు లేరని తెలిసీ, స్నేహితులనే బాకులను మదిలో దింపుకుంటుండవచ్చు ప్రేమిస్తూ ఉండి ఉండవచ్చు, ద్వేషిస్తూ ఉండి ఉండవచ్చు వెలుతురు అంచున ఉండే, కనుల అంచులను తెంపే స్త్రీలను గుర్తు చేసుకుంటూ ఉండి ఉండవచ్చు

పిల్లలతో ఉండి ఉండవచ్చు పెద్దలతో తగువులాడుతూ ఉండి ఉండవచ్చు. ఎవరివో కన్నీళ్లను పొదివి పుచ్చుకుని ఉండి ఉండవచ్చు తిరుగుతూ ఉండి ఉండవచ్చు, ఇతరులలో దాగి ఉండి ఉండవచ్చు తెగిన నీడలను గమనిస్తూ, సంధ్యాకాంతిలో కరిగిపోతూ ఉండి ఉండవచ్చు

నవ్వుతూ ఉండి ఉండవచ్చు ఏడుస్తూ ఉండి ఉండవచ్చు ఒక్కడినే వేల మందినై, శిథిలాలలో దారి తెలిసీ శిల్పంగా మారి ఉండి ఉండవచ్చు. లోహ బాహువులలో విగతజీవుడని అయ్యి ఉండవచ్చు

తల్లై ఉండి ఉండవచ్చు. తండ్రై ఉండి ఉండవచ్చు తనువు లేక తనువుకై, అరూపాల తనకై కబోధి వలె వీధులలో సంచరిస్తూ ఉండి ఉండవచ్చు పూలల్లో రాయై ఉండి ఉండవచ్చు రాళ్ళలో పన్నీరై ఉండి ఉండవచ్చు వానై రాలుతూ ఉండి ఉండవచ్చు ఏరై పారుతూ ఉండి ఉండవచ్చు. ఎడారై ఎదురు చూస్తూ ఉండి ఉండవచ్చు గాలై వీస్తూ ఉండి ఉండవచ్చు. నేలలోంచి మొలకెత్తుతూ ఉండి ఉండవచ్చు రావి ఆకుల గలగలల్లో కాంతి బిందువులై మెరుస్తూ ఉండి ఉండవచ్చు పావురమై మేఘమాలికల లేఖలని దాహార్తులకి అందిస్తూ ఉండి ఉండవచ్చు. తిరిగి తిరిగి తిరిగే దారి తప్పి చనిపోతూ ఉండి ఉండవచ్చు

ఏమైనా అవుతుండవచ్చు ఏమీ కాక పోతుండవచ్చు: అయినా ఇదంతా నీకెందుకు?

# అమ్మ

ఇదే రాత్రి
అలసిన అమ్మ అటువైపుకి తిరిగి నిదురోయింది

తెరిచిన కిటికీలోంచి
తన చుట్టూతానే గిరికీలు కొడుతుంది పురా సరస్సుల పల్చటి నీటి గాలి

నెలవంక చెప్పిన కథలేవో కలలుగా తనలోకి పంపుతూ
చీకటి మెత్తటి చిగురాకై

కొంత కాంతితో కొంత శాంతితో
తన ముడుతల పసుపుపచ్చని ముఖంపై శ్వాసల ఊయల ఊగుతోంది

గదిలోనూ
నా మదిలోనూ కాలపు స్పృహతో కూడిన ఒక గగుర్పాటు, కొంత దిగులు -

అలసిన అమ్మ
అలసిపోయి, శ్రమతో అరిగిపోయిన ముసలి అమ్మ, తనకు తాను మిగలని
చిన్నారి అమ్మ -

ఆ నిదురలో, ఆ కలలో
తను తన పూర్వజన్మలో చూసిన చిత్రాలేవో, హస్తాలేవో కదపగా
చీకటి నింగికి కట్టిన తెల్లని మేఘపు పరదావోలె చిన్నగా కదిలే

తనువంతా చిట్లిన అమ్మ
తనువే లేకుండా మిగిలిపోయిన చిట్టి అమ్మ - అటువంటి అమ్మని

రాత్రి తనువుని పెనవేసుకుని
అటువైపుకు తిరిగి నిదురోయే అమ్మని ఎందుకైనా, ఎవరైనా ఎలా కదపటం?

# ఒక సాధారణ వాచకం

నువ్వు చేసిన నాలుగు అసాధారణ పనులకై
నాలుగే నాలుగు సాధారణ వాక్యాలు రాస్తాను నీకై ఈ పూట

1.
వేసవి పగటిలో అన్నం వండి పిల్లలని స్కూలుకి పంపి
ఒక చల్లటి కుండై కూర్చున్నావు అక్కడ కిటికీ పక్కగా

చుబుకం కింద అరచేయితో, పసికళ్ళతో
నీ చూపులను నీ తల్లి వద్దకూ, తన స్మృతి వద్దకూ పంపి -

2
కమిలిపోయిన మధ్యాన్నం ఒక్కదానివే కవ్వంతో మజ్జిగ చిలుకుతూ
ఒక్కసారి మననం చేసుకున్నావు మంత్రంలా
'ఇళ్ళకు మగవాళ్ళు సమయానికెందుకు రారో'నని - ఆనక తినీ తినక

కడుపులోకి ముడుచుకుని పడుకున్నావు

కిటికీ పక్కన రిఫ్ రిఫ్‌మని వింజామరలు వీచే
పావురాళ్ళ రెక్కలను వింటూ, ఒక అలసటని తనువులోకి లాక్కుంటూ
అంతం కాని ఒక అలసటని కలగంటూ -

యిక నువ్వు నిద్రించావో, మరణించావో ఎవరికీ తెలియదు -

3
సాయంత్రం ఇల్లంతా ఊడ్చి, గదంతా ఎగిరే పిల్లలను
నింపాదిగా కూర్చోబెట్టావు, హోంవర్క్ చేయించావు:

ఆనక చీకటయ్యి ఆకాశం బోసిపోయింది కనుక
బాల్కనీలో నక్షత్రాల పరదాని పరిచావు

చల్లటి గాలి వీచగా, నన్ను క్షణకాలం మరచి బ్రతికావు

తరువాత పిల్లలని దగ్గరగా లాక్కుని, ముద్దు పెట్టుకుని
ఒక్కసారిగా కన్నీళ్ళతో గాట్టిగా కౌగలించుకున్నావు

ఎందుకనో నీకే తెలియలేదు

**4**

రాత్రి నిలువునా చీలిపోయింది. గదిలోని దీపం
సగంగా చిట్లిపోయింది. పగిలి పగిలి
నీ ముంగిట్లోకి తూలుతూ వచ్చింది నేనే

విరిగి విరిగి నిదుర లేక తిరిగి లేచి, నన్నే
ఈ స్మశానాన్నే శుభ్రం చేసి
నా తల వద్ద ఒక ప్రమిదె వెలిగించినదీ నీవే -

ఎన్నడైనా ఉన్నానా నేను నీకు
ఎన్నడైనా ఉన్నావా నువ్వు నాకు అని
నువ్వూ అడగలేదు, నేనూ చెప్పలేదు -

**5**

యిక మిగిలిన అయిదో వాక్యం, వాక్యాంతం నీదే: మొదలుపెట్టు!

# పిల్లల నిద్ర

గాలి వీచి, ఆకులు రాలి వానచినుకులు కురిసే వేళల్లో ఒక లతని పెనవేసుకుని నిదురపోతోంది మరొక లత: గదంతా తేలే చిట్టి నీటిబుడగలు. చుట్టూతా ఎగురుతూ మరోలోకపు మిణుగురులు. ఊగుతున్న ఊపిరి ఊయలలో పూసే కమ్మటి పూల కలలు. దిగంతాలలోంచి జారి శరీరంలోకి దూసుకుపోతోంది ఒక మహిమాన్విత ధూపం. అది మెత్తటి నిశ్శబ్దం. అది మెత్తటి లోకం. అక్కడ నుంచే ఎవరో రహస్యంగా నిన్ను గడ్డిపరకలతో మీటుతున్న ఆనందం

ఎవరైనా దేవతలు తిరుగాడుతున్నారేమో ఇక్కడ  ఎవరైనా గంధర్వులు తమ గానంతో సమస్తాన్నీ మంత్రిస్తున్నారేమో ఇక్కడ. ఎవరైనా శిశువులు ఆప్తంగా తల్లి చూచుకం నుంచి పాలు తాగుతున్నారేమో యిక్కడ పూర్వజన్మలో నిన్ను కన్నవారెవరో, పెంచినవారెవరో చిరుశబ్దాలతో తిరుగాడుతున్నారేమో యిక్కడ. ఈ జన్మలో నువ్వు వొదిలివేసినవారెవరో, నిన్ను విసిరివేసినవారెవరో నీ ముఖాన్ని అరచేతులలో అతి ప్రియంగా పుచ్చుకుని ముద్దాడేందుకు రహస్యంగా దాగి ఉన్నారేమో యిక్కడ!

ఏం జరుగుతోంది యిక్కడ? మాటలు లేని ఒక మహాశూన్యం నిన్ను నివ్వెరపోయేటట్లు చేసిన యిప్పటి వేళ? నిండుగా పారే ఆ పిల్లల నిదురలోకి నువ్వు నీ ఆత్మనీ, శరీరాన్నీ కోల్పోయిన వేళ? ఏమైనా జరగనీ ఏమైనా కానీ, కానీ ఒకరినొకరు గాట్టిగా పెనవేసుకుని నిదురించే పిల్లలనీ, వాళ్ళ కాలాన్నీ కలలోనైనా కదలించకు! ఊహామాత్రంగానైనా పిలవకు:  ఎందుకంటే

నీ పునర్జన్మ నీ ముందే రూపుదిద్దుకునే సరైన ఇంద్రజాల సమయం జననిస్తోంది: ఇప్పుడే, ఇక్కడే, అందుకే!

# కృతజ్ఞతలు

నుదిటిపై ఒక ముద్ర
అది నీ పెదవిదా లేక యుగాల జ్వలనానిదా తెలియదు

ఛాతిపై ఒక చేయి
అది హిమవనాల సుమానిదా లేక పూర్వజన్మ సుకృతో తెలియదు

చెవిలో సన్నగా ఒక మాట
మెడలో వెచ్చగా ఒక ఊపిరి
అవి శైశవ స్వప్నమో లేక మరుజన్మల అమృత హారమో తెలియదు

కనురెప్పలపై నెమ్మదిగా వాలే పావురాళ్ళు, తేలే మెత్తటి ఆకులు
అవి నే తపించిన ఆదిమ నిద్రనా లేక నా మరణమో తెలియదు

వెళ్ళిపోతోంది శరీరంలోంచి ఒక శరీరం
వలయాలు వలయాలుగా ఆకాశంలోకి
సుగంధ ధూపమై, పొగమంచై -

కొంచెం కరుణ ఇంకొంచెం ప్రేమ
పొదుపుకునే నీ బాహువులు, తల్లి కళ్ళ వంటి నీ వక్షోజాలు
మంచినీటి వంటి నాలుగు మాటలు

చాలివి నాకు: బ్రతికి ఉంటాను నీకై నాకై
మరొక రేపటివరకు

# ఎవరైనా అడిగితే

ఎవరు అని ఎవరైనా అడిగితే ముమ్మాటికీ ఇద్దరమనే చెప్పు

నిప్పు పూలతో జలదరించే శరీరాలమనే చెప్పు ప్రేమతో నిండిన మహా పాపాత్ములమనే చెప్పు కరుణ నిండిన మహా కటినాత్ములమనే చెప్పు ఎరుకతో తూలుతున్న మహామధుపాన మృత్యు ప్రియులమనే చెప్పు - ఈ విగ్రహ లోకాలనూ నిగ్రహ జనాలనూ వెక్కిరించే పిచ్చివాళ్ళమనే చెప్పు. నేరం చేయని నేరస్థులమనీ అకారణంగా నవ్వే పిల్లలమనీ నీ స్మృతలమనీ దేహాల ద్రిమ్మరులమనీ, దేశం లేని వాళ్ళమనీ దేహాలు లేని వాళ్ళమనీ సౌందర్య భిక్షుకులమనీ బాహువులు చాచి తిరిగే బాటసారులమనీ ఆదిమ జంతువులమనీ యిద్దరుగా కనిపించే ఆ ఒక్కరమనే చెప్పు: మరేం లేదు ఇంతకంటే

వీచే నీడలో వాలే ఆ గడ్డిరెమ్మ కంటే పూచే పూవు కంటే రాలే వాన కంటే నిండైన రాత్రి కంటే ఆ కళ్ళలో నిలిచిన మెత్తటి నీళ్ళ కంటే కొమ్మల్లోని గూళ్ళ కంటే ప్రమిదె వెలుతురు చుట్టూ తిరిగే క్షణకాలంలో ధగ్ధమయ్యే ఆ పురుగు కంటే ఈ నీ నా జీవితం గొప్పదేమీ కాదు. సరే సరే నువ్వంటే నాకిష్టం అని చెప్పడానికి ఇంతకంటే మరేం కావాలి? నాకూ నీకూ?

# ఏమని అందాం దీనిని?

ఒక పదాన్ని మరొక పదంతో అంటు కట్టాను అది ఎలా ఎదుగుతుందో చూద్దామని. యిక నీవైపు చూస్తూ కూర్చున్నాను రంగురంగుల గులక రాళ్లయిన నీ కనుల వైపూ పూల పరిమళం తెచ్చే నీ పెదాల వైపూ

ఎవరో ఒకరు మాట్లాడాలి ఎవరో ఒకరు ఒక పదాన్ని మరొక పదంతో మార్చాలి ఎవరో ఒకరు ఒక పదంగా, మరొక పదంగా ఇద్దరు కలసి నడిచే ఒకే పాదంలా అందంగా రంగు మారాలి మన ముఖాల్ని తమ వైపు సుతారంగా తిప్పుకోవాలి. తొలి ఎండ తొలి సాయంత్రం తొలి తొలి పరిచయం. తొణికే నీళ్ళే ఇద్దరిలో, అటూ ఇటూ ఇటూ అటూ. అటునించి ఇటూ ఇటునుంచి అటూ ఊగే ఒక నిశ్శబ్దం ఊయాలే నిన్ను నన్నూ కాపాడే ఒక మహా కరుణ. ఒక మహా జీవనజ్వాల. ఈ విశ్వం ఇద్దరికీ ఇచ్చిన ఒక మహా తపన

అటునించి ఇటూ ఇటునించి అటూ ఇటూ అటూ అటూ ఇటూ అందుకే ఊగుతుంది ఆ పాప అలా, గాలిలా హాయిగా నిన్నూ నన్ను కన్న జోలపాటలా ఒక తల్లి ఒడిలా -

ఇక ఈ జన్మకు నువ్వు బాలికవు కాలేవు ఒక బాలుడనై యిక నేనూ తిరిగి రాలేను. అందుకే చూడు: అక్కడే వృద్ధులై ఓరిమిగా నీ తల్లీ తండ్రీ. అందుకే చూడు: ఇక్కడే వృద్ధులై ఓరిమిగా నా తల్లీ తండ్రీ. కాలపు సమాధుల వద్ద నలుపు గులాబీలతో తెలుపు ప్రేమలతో తెంపుకోలేని మమకారాలతో వాళ్ళే ఒక పదాన్ని అంటు కట్టారు నీకోసం నాకోసం. నీ తరువాత వచ్చే పిల్లలకోసం, పిట్టలకోసం ఆకాశం కోసం ఈ మట్టి కోసం: చూడు అది ఎన్ని రంగురంగుల పదాలని కాంతులతో నునువెచ్చని నీ బాహువుల మృత్యువుతో నా వద్దకి తీసుకు వచ్చిందో!

ఇంతకూ ఏమని అందాం దీనిని? ఏమని పిలుద్దాం దీనిని?

# నువ్వు ఎదురొస్తావనే

నువ్వు ఎదురొస్తావనే ఇంటికి రావడం తళతళలాడే ముఖంతో మిలమిల మెరిసే కనులతో చేతులు చాచి హత్తుకుంటావనే తిరిగి రావడం: ధూళి నిండిన దారులను వొదిలి, మాలిన్యం అంటిన మనుషులను వొదిలి అదిగో యంత్రపు నోటితో లోహనాలికతో పలికే పదాలనూ అర్థాలనూ వొదిలి వదన వాచకాలని వొదిలి, కవిత్వ వ్యసనాలని వొదిలి ఆకాశమంత పెరిగిన అహాన్ని వొదిలి ఇనుప చేతులతో పెదాలతో అల్లుకునే స్త్రీలను వొదిలి రూపాన్ని వొదిలి, రూపాయిని వొదిలి జనంలేని అంతర్జాలాన్ని వొదిలి, మింగివేసే అనుసంధాల్ని వొదిలి అంతిమంగా నువ్వు ఉన్నావనే, నువ్వలా ఎదురు చూస్తూ ఉంటావనే నువ్వు ఉంటావనే, నువ్వు సెలయేళ్ళలాంటి పాదాలతో తిరుగుతుంటావనే ఈ ఇంటికి రావడం, ఈ చదరపు గదుల దరి చేరడం, నువ్వున్నావనే, నువ్వు ఉంటావనే ఇంకా ఇలా బ్రతికి ఉండటం: దా

ఎప్పటిలా ఒక్కసారి దగ్గరికి తీసుకుని, గాట్టిగా కౌగలించుకుని ఒక ముద్దు పెట్టుకోవా, శరీరం బద్దలయ్యేటట్లు?

# కవిత గురించి ఒక అ/కవిత

కవిత ఎలా రాయాలో చెప్పు అని అడిగాడు ఓ నూనుగు మీసాల కుర్రవాడు రాత్రంతా రాత్రిని. నీటిలోని ముఖాన్ని అరచేతుల్లోకి తోడుకుని, అద్దంలోకి విసిరివేసావా ఎన్నడైనా ముఖంలోని అద్దాన్ని అదిరే పెదవులతో అందుకుని పరికించావా ఎన్నడైనా? నేను అన్నాను

ప్రతీకలు ఎలా, పదాలు ఎలా పోలికలని పోలికలతో పోల్చడం ఎలా? అని నెత్తురు నిప్పు ఎగిసే శరీరంతో అమాయకంగా మళ్ళా ఆ కుర్రవాడే అడిగాడు, తన ఎదురుగా కూర్చున్న ప్రేయసిని మాటలతో మాత్రమే తాకే ఆ కుర్రవాడు

మధుపాత్ర ముందు మాటలు వొద్దు తలలో తురిమే పూలను, పొట్లాలలోనే దాచేయువద్దు: చెప్పాలనుకున్నదేదో చెప్పు అడగాలనుకున్నదేదో అడుగు: కోరుకోవటం పాపమేదీ కాదు ఇక్కడ. పరమ పవిత్రమైన పుణ్యమేదీ లేదిక్కడ. చూసావా నువ్వు? విన్నావా నువ్వు? తను వొదిలిన నిట్టూర్పు నీ చుట్టూతా ఎగిరే చప్పుడు? అడిగాను నేను, అడగక - కవిత ఎలా రాయాలో చెప్పు, కవిత ఎలా రాయకూడదో చెప్పు అని పాపం పిల్లవాడు, అరచేతుల్లో ముఖాన్ని దాచుకునే ఆ నూనుగు మీసాల కుర్రవాడు రాత్రంతా ఆ రాత్రినే అడిగాడు, తన ముందు తన ముందే కూర్చున్న ఆ నీలి కళ్ళ యువతిని వొదిలి:

ఏడవటం వచ్చా నీకు? కన్నీళ్ళని వడగట్టడం వచ్చా నీకు? నీలోని ఇంకొకరిని కలుసుకోవడం వచ్చా నీకు? ఆ ఇంకొకరిలోని నిన్ను పసిగట్టడం వచ్చా నీకు? నీకు నువ్వు చనిపోవడం తెలుసా నీకు? తిరిగి ఇద్దరై ముగ్గురై నలుగురిలోకి జన్మించి అందరినుంచీ బహిష్కరింపబడటం తెలుసా నీకు?

ఇవేమీ అడగలేదు నేను అతడిని, అతడి రాత్రిని, రాత్రిగా మారిన తననీ, అతని తన తనువునీ. అడగలేక చెప్పలేక ఇక నేను కాంతిని వీడి, రాత్రిని తాగి నా దుస్తులని నేను మూట కట్టుకుని అక్కడే ఆ శిధిలాలలోకే మళ్ళా వెళ్ళిపోయాను ఎప్పటిలానే ఇలా గొణుక్కుంటూ: ఎవరు చెప్తారు నీకు, నువ్వే ఒక కవితవనీ, తనే ఒక కవిత అనీ ఇంతకు మించి ఇక్కడ మరేమీ లేదని, మరేమీ దొరకదనీ?

# డైరీ

ఆకులని విడిచి ఇంకా రాత్రి వెళ్ళిపోలేదు రివ్వున తిరిగే గాలిని వెన్నెల ఇంకా వొదలలేదు: అరచేతుల్లో తన ముఖం ఇంకా ఆరనేలేదు. ఒక చలి మంటను వేసుకున్నాను ఇక్కడే రాత్రంతా నా వాళ్ళ శరీరాలతో, వాళ్ళ పదాలతో వాళ్ళే అయిన మాటలతో -

మాట్లాడుకున్నవి పెద్దగా ఏమీ లేవు. అన్నీ అసంగతులే: తెచ్చుకోవాల్సిన సరుకులు, నెలకయ్యే ఖర్చులూ భరించిన అవమానాలూ, భరించాల్సిన చికాకులూ ఎంతకూ తీరని అప్పులూ కొన్ని భయాలూ కొన్ని బాధలూ కొన్ని ప్రేమలూ కొన్ని ద్వేషాలూ, అన్నీ ఇటువంటి మామూలు మాటలే ఇటువంటి మామూలు మనిషిగానే సదా వెన్నంటి ఉండే తనతోనే తన శరీరంతోనే చెప్పుకున్నాను మౌనంగా చెమ్మగిల్లి వొణుకుతున్న నయనాల్లాగా, నన్ను చుట్టుకున్న చేతులలాగా -

తటాలున ఎందుకో నిదురలో ఉలిక్కిపడతారు పిల్లలు. ఎక్కడో చీకట్లో విలవిలా రెక్కలు కొట్టుకుంటాయి పావురాళ్ళు. చరుస్తోంది కిటికీ అద్దాలని ఒక సన్నటి జల్లు: ఉండీ ఉండీ తెగుతాయి కలలో కీచురాళ్ళు. ఇక ఇదే సమయం. వెలుతురికి మంచుదీపం వొలికే వేళల్లో నెమ్మదిగా చందమామ మాయం అయ్యి, ఇరువురిలో ఇరువురు మాయం అయ్యి ఒక్కరిగా మిగిలే తొలి కాంతి వీచే లోకం: అంతా ఒక రహస్య కాలం -

సరే సరే. ఇవన్నీ నీకు చెప్పుకునేంత పెద్ద విషయాలేమీ కావు. కాకపోతే యుగాల తరువాత నేను నిదుర నీడలో సొమ్మసిల్లాను: మరి నువ్వో?

# ఒట్టిగా ఒక రాత

నువ్వేమైనా రాసి ఉంటావేమోనని వస్తాను ఇక్కడికి: నీ వద్దకి. ఆకులని తాకి వీడిన గాలి తిరిగి, తిరిగి తిరిగి వానతో వచ్చి అదే ఆకుల్లో, అదే కొమ్మల్లో స్థిరపడి స్థిమితపడ్డట్లు. తెలుసు నాకూ, నీకూ: ఇవన్నీ ఒట్టి పదాలనీ, ఒట్టి ప్రతీకలనీ. వలయమైన నీటిలో తేలే ఈనెపుల్ల వంటి కదలికలనీ కథలనీ. ఎక్కడో ఏరుకుంటాను, రంగు రంగుల గులకరాళ్ళని. దాచుకుంటాను వాటిని పొందికగా గూట్లో పుస్తకాల వెనుక. అమర్చుతాను వాటిని నువ్వు చదివే ఈ అక్షరాల చుట్టూతా. రాత్రుళ్ళలో వాటిని తలగడ కిందుగా దాచుకుని నదులని కలగంటాను, నిదురలో నుదిటిపై నీ చల్లని అరచేతిని ఊహిస్తాను కలలో వినిపించిన సన్నటి నవ్వు మెలుకువలోకి తొలుచుకు రాగా దాచుకున్నవన్నీ తప్పక ఎప్పుడో ఎక్కడో పారవేసుకుంటాను

తెలుసు నాకు ఇవన్నీ నిలువవని: అయినా కొన్ని మాటలనే నమ్ముకుంటాను. నీతో ఈ శరీరంతోనే మాట్లాడతాను, నీ శరీరాన్నే మాట్లాడతాను. నీ వద్దకే, నువ్వు రాసి ఉంటావనే నీ పదాల వద్దకే తిరిగి వస్తాను -

వడలిపోనివ్వకు పూలపాత్రలోని నింగిగులాబీని. రాలిపోనివ్వకు గులాబీ రేకులలోని రాత్రుళ్ళని ఆరిపోనివ్వకు పెదాలపై కదులాడే తడినీ

ఇంతకు మించీ, ఇంతకు మినహా నాకు తెలిసి పెద్దగా చేసేదేమీ లేదు ఇక్కడ. పెద్దగా సాధించేదీ ఏమీ లేదు ఇక్కడ: అందుకనే అందించు ఇక నీ చేయిని: దానిని పదిలంగా నా అరచేతుల మధ్య పుచ్చుకుని ఈ వాక్యం చివర, నాకై, నీకై నిలిచిపోతాను నేను

# ఇరువురు

నీకు ఇరువైపులా ఇద్దరు: నీకు నువ్వే - మెడ చుట్టూ చేతులు వేసి ఒకరు, అరచేతిని పుచ్చుకుని లాగుతూ మరొకరు. ఇరువైపులకూ లాగుతూ ఇద్దరు: నీకు నువ్వే - అంతం వైపుకు ఒకరూ, ఆది వైపుకు మరొకరూ, మధ్యలో మరొకరూ: అదీ నువ్వే

నీటి చెలమ చుట్టూ మొలచిన గడ్డిరెమ్మలు రాత్రి కాంతికీ, వెన్నెల తాకిడికీ కదులుతాయి: ఎటువైపో, ఎందుకో నీకు తెలియదు. చీకటిలో చెట్లలో జలదరించిన గాలి, వెనుదిరిగి కన్నుల తడినీ వొలికిపోయిన అరచేతులనీ ఇస్తుంది: ఇరువురిలో ఎవరికో నీకు తెలియదు

రెండుగా అయిన కలనీ, రెండుగా మారిన శరీరాన్నీ ఈ భూమి నిండుగా కౌగలించుకుని ముద్దుపెట్టుకుంటుంది. ముద్దు ఒకటే, పెదాలే రెండు: మూడుగా అయిన కాలాన్నీ, ఏడుగా అయిన విశ్వాన్నీ నీ చేతులే దరి తీసుకుని దారీ తీరం చూపిస్తాయి. ప్రమిదె ఒక్కటే, కాంతి ఒక్కటే మృత్యువు రాకుండా కాపాడే అరచేతులే రెండు

నువ్వు ఎదురుచూసే వర్షం ఒక్కటే, చినుకులే రెండు, మూడు ... నువ్వు నాటే విత్తనం ఒక్కటే, మొలకెత్తే ఆకులే రెండు మూడు ... నువ్వు నవ్వే నవ్వు ఒక్కటే, ప్రతిధ్వనే రెండు మూడు నాలుగు ... నువ్వు కావలించుకునే శరీరం ఒక్కటే, తిరిగ పలికే పలుకులే అయిదు ఆరు ఏడు ... నువ్వు ప్రేమించే ప్రేమ ఒక్కటే, జననించే కారుణ్యం తొమ్మిదీ, ఎనిమిదీ ఏడు ... నువ్వు మరణించే మృత్యువు ఒక్కటే, కన్నీళ్లు కారే కన్నులే ఒకటీ రెండూ మూడు ... నీకు ఇరువైపులా, నీకు నీకులా, నీకే నీకు ఇరువురూ:

గుండెలో దాగుని, ఒడిలో చేరి నీ మైదానాలలో కురిసే వర్షాలలో గెంతే పిల్లలే ఇరువురు, నీ ముంగిట వాలి నీ ముందు పూవుల్లా మారే సీతాకోకచిలుకలే ఆ ఇరువురు. నీకు ఇరువైపులా, నీ ముందూ వెనుకా, నీ చుట్టూతా, నువ్వు ఒదులుకోలేని, నువ్వు కోరుకోలేని ఇరువురు: నువ్వైన, నీ ఇరువురు!

ఇక నీకు బ్రతకడమెలాగో మరొకరు చెప్పాల్సిన పనేముంది?

# ప్రేమ లేదా తప్పిపోయినవాళ్ళు

(draft: love is a draft. love is always a draft)

నువ్వంటే నాకు ఇష్టం
ఎందుకు?
తెలియదు. కానీ నాకు నువ్వు కావాలి.
కావాలా? అంటే ఏమిటి?
నువ్వు నాతో ఉండాలి, ఎప్పుడూ.
ఎప్పుడూ అంటే?
చివరిదాకా
చివరిదాకా అంటే శరీరం చివరిదాకానా లేక
అనుభవం చివరిదాకానా?
అదంతా నాకు తెలియదు. కానీ
నువ్వు నాకు కావాలి.
ఎందుకు?
ప్రేమించేందుకు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను
లేకపోతే, ఉండకపోతే ప్రేమించలేవా?
ఏమో అవేమీ నాకు తెలియదు. కానీ
నువ్వు నాకు కావాలి
నువ్వు నాతో ఉండాలి. ఎప్పటికీ
ఎప్పటికీ అంటే, అంతం దాకానా? అనంతం దాకానా?

అవును. నువ్వు ఏమనుకున్నా సరే
అప్పటిదాకా నువ్వు నాకు కావాలి -
నాకు మరొకరు కావాలనిపిస్తే?
అనిపించదు. నేను ఉన్నాను. నేను నిన్ను
చక్కగా చూసుకుంటాను
నీకు మరొకరు కావాలనిపిస్తే
మరొకరిని ప్రేమించాలని అనిపిస్తే?
నాది చాలా స్వచ్ఛమైన ప్రేమ
అందరూ అలానే అనుకుంటారు అని

నా యుగాల నమ్మిక
అయితేనేం. చెప్పు. నువ్వు ఉంటావా
నాతో నా జీవితంలో?

(ఆ తరువాత ఇద్దరిలో ఎవరో ఒకరు తిరిగి తిరిగి
తిరిగి రానంత దూరం వెనక్కి వెళ్ళిపోయారు)

ఎవరో వాళ్లు, ఆ ప్రేమికులు
తెలుసా మీకు ఎప్పుడైనా?
ఎక్కడైనా ఎందుకైనా చూసారా మీరు ఎన్నడైనా?

నేను నిన్ను ప్రేమిస్తున్నాను
అంటే ఏమిటి? ఎందుకు?
ఎందుకో ఒకందుకు. కానీ
నువ్వు నాకు కావాలి.
ఎప్పుడు?
ఎప్పుడూ
(Ad infinitum)

పోస్ట్ -స్క్రిప్ట్:
(కనబడుటలేదు)

ఈ కింద తెలుపబడిన వ్యక్తి వివరాలు ఆచూకి ఇచ్చిన వారికి తగిన పారితోషకము లభించబడును:

పేరు: తెలియదు
ఊరు: తెలియదు
ఎత్తు : తగినంత
గుర్తులు: అప్పుడప్పుడూ సంతోషంగా అప్పుడప్పుడూ రోదిస్తూ
అప్పుడప్పుడూ తత్వీకరిస్తూ అప్పుడప్పుడూ వాదిస్తూ, తనలో
తాను గొణుక్కుంటూ, చాలాసార్లు యంత్రాలతో తక్కువసార్లు
మనుషులతో కలిసి (వాళ్లెవ్వరో అతడికి/ఆమెకీ తెలియదు)

మట్టిలో చిత్రాలనీ గాలిలో మాటలనీ
వారసత్వపు గుణాంకాలని లెక్కిస్తూ శపిస్తూ ఎవరైనా ఎక్కడైనా
ఎందుకైనా కనిపిస్తే వారు ఈ కింది చిరునామాకి తెలియచేయగలరు:

AFSPB 138664 (PAN)
subcontraries@gmail.com (mail & Facebook account)
lostandneverfound.blogspot.com

# వి/స్మృతి

1
ఏమీ రాయలేక ఇక్కడ కూర్చున్నాను

లోకంపై ఒక నులి వెచ్చని పొర కమ్మినట్లు, చుట్టూతా కాంతి
చలికి వణికిన శరీరాన్ని
ఎవరో పొదుపుకున్నట్లు

2
ఆ పొదుపుకునే చేతులేవో
అక్షరాల్లోనే కానీ, నిజానికి
ఇక్కడంతా ఖాళీ - స్థబ్దత -

ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాక మిగిలే ఒక
నిశ్శబ్దం. గోడలను చుట్టే
గాలీ నేలపై పారాడే ధూళీ

వొదిలి వేసిన పిల్లల బొమ్మలూ, విరిగిన పలకలూ
ఉండ చుట్టిన కాగితాలూ
లీలగా ఇంకా వినిపించే
మాటల ప్రతిధ్వనులేవో...

3
ఏమీ రాయలేక, ఇక్కడ ఇలా -
పదాలు ఉగ్గపట్టినట్లయ్యి
తలుపులు తెరిచి చూస్తే

కిటికీలకు రెపరెపలాడే తెల్లని పరదాలు -
సగం అల్లుకున్న గూళ్ళు
చితికిన పావురపు గుడ్లు

అతి పల్చగా నీ ముఖంపై
వ్యాపించే ఒక సాలెగూడు...

4
ఇక, ఇక్కడ ఎడారిగా మారిన స్నానాల గదిలో
గోడకి మిగిలిన ఒక ఎర్రని
బిందువు. అంతిమంగా
ఒకే ఒక్క ప్రతీక - ఇలా

5
'శిరోజాలు ముడుచుకుని, దుస్తులు విప్పి, నుదుటిపై బొట్టుని
గోడకి అతికించి, నీ వైపు
సాగిన ఆ అరచేయి ఇక

ఇంకా ఇక్కడ వ్యాపిస్తోన్నట్లూ, నీ మెడ వెనుకగా చేరి, తాకి
నిన్ను ఒక జలదరింపుకు
గురి చేస్తున్నట్లూ...' మరి

నిన్నేమీ రాయనివ్వనట్లూ
నిన్నేమీ చేయనివ్వనట్లూ
చలికి వణుకుతూ నీలో ఒదిగిన ఒక శరీరాన్ని, నిర్ధయగా

ఎవరో పెకల్చివేసినట్లూ
విదిల్చి విసిరివేసినట్లూ...

7
కాలంపై ఒక నల్లని బెరడు కమ్మినట్లు, ఇక్కడో ఖాళీ -

ఇక - ఇక్కడ
ఈ శరీర రాహిత్యంలో, ఈ ప్రాచీన వి/స్మృతిలో, మనంని
వ్రాయడం ఎలా?

# bricolage

**1**
చుట్టూతా ఝుంకారం వంటి ఒక చీకటి - తూనీగ పాదాల కింద
వలయాలుగా విస్తరిస్తున్న
నీటి నయన తరంగాల వలే -

ఇక ఎవరు ఏ మాట మాట్లాడినా
కొంత కాటుక వాసన. తడచిన కనురెప్పల వాసన -
వొణికే పెదాల వాసన. అర్థరాత్రిలో

కాగితాలు తగలబడి వెలిగే, నలుపూ
ఎరుపూ కలగలసిన వాసన -
మనం రాసుకున్న మాటలు
చుట్టూతా చిట్లి, మసియై ఆపై

రాత్రి చెమ్మతో నలిగిన, నల్లని
వాసన. సవ్వడీ: అంతిమంగా
చెంపలపై కన్నీరు ఆవిరయ్యిన

ఒక ఖాళీతనం, ఒక నిశ్శబ్దం, ఒక శాంతీ -

**2**
మోకాళ్ళ చుట్టూ చేతులు కట్టుకుని
ముఖాన్ని దించుకుని
రాత్రంతా వెలిగిన, ఒక

తెల్లని దీపం, ఆనక ఎప్పటికో ఆరింది -

ఎర్రని పూవుల వలే విచ్చుకున్న
ఆ రెండు కళ్ళూ తిరిగి

రెండు నిండు మొగ్గలై
క్షణకాలం, మంచం అంచున అతని చేతి వద్ద ముడుచుకు పోయాయి -

అప్పుడు అక్కడ, వానలో
నానిన ఒక తోట వాసన -
తోటని కమ్మిన పొగమంచులో తిరిగే ఒక మనిషి వాసనా -

అతనిలోని పొగమంచులోకి
తప్పిపోయిన, రెండు కనుల
రెండు కలల పూల వాసనా -

3
ఇద్దరినీ కమ్మిన చీకటి చుట్టూ, మాటలానంతర నిశ్శబ్దం లాంతరు చుట్టూ
ఝుంకారం వంటి
ఒక కాంతి తరంగం -

4
అప్పుడు, అక్కడ, చితి వలే మండుతున్న అతని నుదిటిపై
సీతాకోకచిలుక వలే
వాలిన ఓ అరచేయి -

ఆ అరచేయి కిందుగా నిండుగా ప్రవహించే నదులు
నిదురోతున్న పిల్లలు -
వీచే ప్రాణవాయువులు

మిణుకు మిణుకుమనే నక్షత్రాలు, కదలిపోతున్న మేఘాలూ
ఋతువులూ, జనన మరణ
రహస్య ఉద్యాన వనాల
కాలాలూ, తల్లి పాలిండ్లని

లేత పిడికిట బిగించి, పాలు త్రాగే
పసి పెదాల లోకాలూ, వాటిపై

నర్తించే ఆదిమ శబ్దాలూ -

5
మరిక నువ్వది చూసి ఉండవు

పాలు తాగిన మాటని! నిదురోతున్న ఒక మాటని. తన కురులను
తనే వృత్తాలుగా చుట్టుకుంటూ
ఒత్తిగిల్లిన మాటనీ, ఆ గాలినీ
నీ గడప ముందు ఆగి, తన రెక్కల్ని

విదుల్చుతూ, నిన్ను చూసే
ఒక చిన్ని పక్షినీ, దాని
గొంతుకనీ, ఆ కళ్ళనీ -

అందుకే

6
ఇక ఇప్పుడు, నీ చుట్టూతా
శిశువు గొంతుకలో ఊరుతున్న తొలి మాట వంటి ఒక కాంతి -
వేణువులోకి
సంశయంగా

అడుగిడిన ఒక ఊపిరి, ఊదేవానికి ప్రాణం పోసినట్లు, ఇక ఇక్కడ

నిదురించే ఒక మనిషీ (అతనే), వానలో వెలిగిన ఒక దీపమూ
దీపంలో ఒదిగిన గాలీ
మబ్బులూ నక్షత్రాలూ
ఇక ఒక మాటానూ -

7
మరి, ఇంతకూ తెలుసా నీకు?

ఉవ్వెత్తున ఎగిసే వరి పైరులపై, చుట్టూతా ఝుంకారం వంటి ఒక చీకటిలో

అలలు అలలుగా తేలిపోయే
తూనీగ పాదాల తాకిడికి
వలయాలుగా విస్తరిస్తున్న

ఆ లేత పసిడి వెన్నెల - ఆ మన, ఆ అనామక, ఆ మన, మనం అనే -
ఆ మాటా, ఆ ప్రదేశం?

# మాట

1
ఎంతో నిశ్శబ్దం తరువాత, నలిగిన ఆ చీకటిలోంచి
ఒక మాట మాట్లాడతావు నువ్వు
గాలిలోంచి తేలుతూ వచ్చి రాలే

ఒక తెల్లని పక్షి ఈకలా: తల ఎత్తి చూస్తాను నేను - కానీ
రెక్క తెగిన ఆ పక్షి ఎక్కడో కనిపించదు
చిట్లించిన కనురెప్పలపై మాత్రం, రాలే

నీ శరీరం అంతటి ఒక నెత్తుటి చుక్క -

2
ఆ నిశ్శబ్దంలో, నేను పుచ్చుకున్న నీ రెండు చేతులూ

ఎంతోసేపటి నుంచి నువ్వు
మథనపడీ, మథనపడీ మననం చేసుకున్న పదాలు
తల ఎత్తి చూస్తే రెపరెపలాడే
నీ కళ్ళు, నేను ఎప్పటికీ చేరుకోలేని అర్థాలు -

ఇక ఈ పదాలకీ అర్థాలకీ వెనుక, అశ్రువులతో చీరుకుపోయిన
నీ కనుల అంచులను తుడిచిన
నా చేతివేళ్ళ చివర్లు: అవే. అవే
కాలతాయీ రాత్రికి నిరంతరంగా

అనాథ శవాలు ఏవో చిట్లుతూ తగలబడుతున్నట్లు -

3
నాకు తెలుసు, నాకు తెలుసు -

గోడలపై వ్యాపించే నీడల చుట్టూ అల్లుకుపోయే నిశ్శబ్దం లతలు -
గూడు రాలిపోయిన తరువాత
పిల్లలు కనిపించక ఇక అక్కడే

రెక్కలల్లర్చుతూ ఎగిరే పక్షుల
దిగులూ, వాటి అరుపులూ ...

మరి తెలుసు నీకు కూడా - మరి అర్థం అవుతుంది నీకు కూడా

తప్పకుండా - కట్టిన దారానికి తెగిన తూనీగ రోదనా
వెక్కిళ్ళు పెట్టి రాలిపోయే
సాంధ్యపూల భాషా
తలుపు చాటున ఇరికి

నుజ్జు నుజ్జయ్యిన వేలి వెంటే, నీ వెంటే వచ్చే ఆ బేల కనుల ఘోషా -

4
ఎంతో నిశ్శబ్దం తరువాత, నలిగిన ఆ చీకటిలోంచి, ఇటు వచ్చిన
నువ్వు మాట్లాడిన ఒక తేలికైన
మాట: ధాన్యం వాసన వేసే
వాన వాసన వేసే ఒక మాట

పొలమారిన తలపై తట్టి, నోటికి
మంచి నీళ్ళ గ్లాసు అందించిన
తల్లి చేయి వంటి ఒక మాట
పీడకలలో భీతిల్లి, ఒత్తిగిల్లి

నువ్వు గట్టిగా కరచుకుపోయి
పడుకునే ఒడివంటి ఒక మాట
వెలుగుతోంది ఇక్కడ, ఒక మట్టి ప్రమిదెయై, వలయమై -

5
వస్తారు పిల్లలు, వెళ్ళిపోతారు పిల్లలు
నీ నుంచి నాకూ నా నుంచి నీకూ
ఒక మాటని మంత్రించి, పెనవేసి -

చీకటి గాలి వీస్తుంది అప్పుడు - ఆరుబయట ఆరవేసిన
తెల్లని వస్త్రాలు ఊయలల వలే
ఊగుతాయి అప్పుడు. ఆకులు

కదిలి, నేలపై కాగితాలు దొరలి

నా నుదిటిని తాకిన గాలే, నీ ముంగురలనీ తాకి

నీ శ్వాసలో చేరి, కరిగి ఒక మాటై
పోతుంది అప్పుడు. ఇక నిదురలో
అస్పష్టంగానే అంటారు ఏదో పిల్లలు
అప్పుడు. అది కూడా... ఒక మాటే

పెదాలపై ఇంకా తడి ఆరని తల్లి పాలవంటి ఒక మాటే -

**6**
అక్కడ, నువ్వు లేచి, ఎంతో నలిగిన చీకటిని సాఫీగా చేస్తూ
మాటలోంచి మాయమయిన దానినేదో తిరిగి నింపి
వాటిని ఇటువైపు రంగుల
నీటి బుడగల మల్లే చేసి
వొదులుతూ ఉన్న చోట

**7**
చిన్నగా నవ్వుతూ, మాట నుంచి మాటకి సాగుతూ, దాదాపుగా చేరుకుంటూ
చిన్నగా కాలం గడుపుతూ
వీటన్నిటి తరువాత కూడా
బ్రతుకుతాం మనం: ఇలా -

ఎంతో నిశ్శబ్దం తరువాత, ఎంతో చీకటి తరువాత, ఎంతో మౌనం తరువాత
ఎంతో నువ్వు తరువాత
ఎంతో నేను తరువాత...

ఒక చిన్న మాటలో ఒదిగిన
మనంతో, మనతో,
మన తనంతో!

# హే రాజన్

అరే
హేమిరా రాజన్
తాగితిని పో
అందులో బీర్లు త్రాగనేల?
బార్లో బీర్లే పో
అందులో అట్లా పడి మునుగనేల?
మునిగితి పో
పురాజన్మల పాపములు, కర్మములు తీరునట్లు
నన్ను నేను మరచుటేల?
మరచితిని పో
నన్ను మరచి నిన్ను తలచుటేల?
తలచితినిపో, ఇంకన్నూ
ఈ జన్మ దుఃఖ దాహము తీరనట్లు
తిరిగి, చంద్రుని  ముక్కలున్ జేసి
ఓ గాజుపాత్రలో వేసి
నింగినెక్కి, నక్షత్రాలతో విస్కీ త్రాగనేల?
అలా ఇకిలించనేల?
ఇకలించితినిపో, వేకువఝాము  వెన్నెలలో చలిలో
నీ  మోముని కాంచి
ఆనందముతో సకిలించనేల?
సకిలించితిని పో
చంకల కింద చేతులు జొనిపి
ఆ మంచులో పవళించనేల?
పవళించితిని పో
ఊగే ఆకులతో, రేగే గాలితో, పెదాలపై ధూమముతో
అలా పరవశించనేల?
అనంతమును చూడనేల?
అంతా చేసీ చూసీ
ఇప్పుడిలా

ఒరే
రాజన్
హే హే రాజన్
ముక్కులు నదులయ్యా
గుండెలు అగ్నయ్యా
తుమ్ముకుంటో
దగ్గుకుంటో
చీటికిమాటికీ
చీటికీ మాటకీ
మాటి మాటికీ
కడవల నిండగా చీదుకుంటో
చీమిడి వంటి
ఈ పదములను
వ్రాయనేల?
ఆపై తిరిగి వెర్రివాడివలే
నవ్వనేల?
రాజన్
హే హే రాజన్
ఇప్పటికి ఇంకన్నూ ఇక్కడ
ఎరిత్రోమైసిన్
టోటల్ కాని డీ కోల్డ్
రెండు సిట్రజిన్, నాలుగు డోలో - 650లతో
శోక నివారణం లేని
ఒకే ఒక్క క్రోసిన్ నొప్పి నివారణతో
కోతి మదితో
శునకం తోకతో
తల కిందులుగా
తపస్సు చేయనేల? మరి
ఇక
వేద్దునా
ఒక పెగ్గు బ్రాందీ
సర్వం దిగేటట్లూ, నీ ఈ

వాచకం తాట తీసేటట్లూ
కొద్దిగా సిగ్గుగా
కొద్దిగా నిర్లజ్జగా
కొద్దికొద్దిగా
ఇంకొద్దిగా, జుత్తును గోక్కునే నా వానర తత్వంతో
హే రాజన్
మరిక
ఇప్పటికి ఆమెతో
కారుతున్న
ముక్కులతో?

# మన/తల్లులు

ఎలా రాయటం ఈ నొప్పిని? మహా తీవ్రత ఏమీ కాదు కానీ, గుండెలో ఒక కందిలి పగిలింది -

ఏరుకో  ఇక ఆ పెంకుల్ని కళ్ళలోంచి, కాంతి కణాలని తీసేవేసి. పూడ్చుకో ఇక నీ ముఖాన్ని అరచేతుల్లోకి, ఉరితాళ్ళ వలే ఊరిన, తల ఎత్తలేని ఒంటరి కాలాలలోకి. రాత్రయితే త్రవ్వుకో ఒక సమాధిని - కడుపు చీలిపోయినట్లు, పేగులు రాలిపోయినట్లూ, వాటిని చేతిలో పట్టుకుని. తెగిపోయి, నీకు నువ్వే చెప్పుకోలేక, విరిగిపో. ఊగే నీడల, అంతు లేని వలయాల అంగాంగ లోకాలలోకి -

ఎన్నడూ అడగకు ఒక చేతినీ, మాటనీ, సహపద్మపు సువాసననీ

తినగా తినగా తినగా వాళ్ళు, ఇంకా ఏమన్నా మిగిలి ఉంటే  నీకో శరీరం, దాచుకో భద్రంగా నీ బాహువుల మధ్య, మిగిలిన "నువ్వు" అనే సుమాలయాన్ని. చూపించు ఒక్కసారి, చెక్కివేయబడ్డ వక్షోజాలని. వినిపించు మళ్ళా మళ్ళా పురుషాంగం అయిన దేశాన్నీ, దేశం దేవుడూ అయిన రాజ్యంగాన్నీ, రాజ్యం పీలికలు చేసిన నీ యోనినీ. నవ్వు ఒక్కసారి గట్టిగా, పురాణాలూ పుణ్యాత్ములూ ఉక్కిరి బిక్కిరి అయ్యేటట్లూ, నివ్వెరపోయేటట్లూ. చూడనిది ఏదో ఇవ్వు. నీకు ఇవ్వనిది ఏదో పొందు. అల్లు, నరాలని పెనవేసి, నిన్ను నువ్వు రాసుకోగలిగే ఒక నెత్తురు గీతాన్ని లిఖించు. స్ఖలించు ఒక్కసారిగా, ఈ విశ్వం మొత్తమూ తిరిగి ప్రారంభం అయ్యేటట్లు. ఉన్నది ఏదో విసురు. నీకు దాచినది ఏదో పెగుల్చుకు పో -

అమ్మా, నా తలుపులమ్మ తల్లీ, నా గ్రామ దేవతా, దీపం కాదు, దేహాన్ని వెలిగించు. చీకటిని కాదు దేవతా దివ్య పవిత్ర వాచకాలని తగలబెట్టు. ముట్లు లేని, విసర్జించలేని, స్త్రీత్వం లేని ఆ మహా కథనాలనేవో ముక్కలు ముక్కలు చేసి పెట్టు.నీ గర్భ సారంగ సంగీత మహా లయ విన్యాసాలనేవో నువ్వే చూపెట్టు

అమ్మా, తల్లీ - ఒళ్లంతా పొక్కిలయ్యి, కళ్ళంతా నెత్తురు చినుకులయ్యా కూర్చున్న ఆదిమ ఆదివాసీ, నా తండ్లాటల తల్లీ, కొడుకులను కోల్పోయిన యాదమ్మా, తాయమ్మా, నలిగిన పాదాల, అడుగంటి పోయిన కడుపుల అమీనమ్మా, ఖండిత అంగాల, తగలబడ్డ నా తెలంగాణా తల్లీ

నీ చేతుల్లో కందిలి ఏదో కత్తై, కొడవలై, పువ్వై, సూర్యుడై పూర్ణ చంద్రబింబమై వికసించింది - ఎలుగెత్తి ఏడ్చింది. ఎలుగెత్తి నవ్వింది. బిడ్డా అని నువ్వు హత్తుకున్న నీ గరకు అరచేతుల మధ్యకు ఈ ముఖం ఈ వేళ నిశ్శబ్దంగా నాటుకుపోయింది, నీ హృదయ ధ్వనితో కప్పబడింది

ఇక రేపు నీ అరచేతులలోంచి మొలకెత్తే, ఒక మాట, ఒక్క మాట,ఒకే ఒక్క మాట ఎవరిది?

# ఇవ్వాల్సినది

"How was the day?" అని అడుగుదామని అనుకుంటాడు అతను
తనని -

వాన వచ్చే ముందు వీచిన ఈదురు గాలికి
ఎక్కడో తెగిపోయి,
ఇక్కడికి కొట్టుకు వచ్చి వాలిపోయిన

ఒక మృదువైన, నిదురలోకి ముడుచుకుపోయిన
పసి పిడికిలి వంటి
ఒక ఆకునీ, ఇంకా తననీ కూడా -

నిస్సత్తువుగా కుర్చీలో జారగిలబడి, భుజాన బ్యాగుని పక్కకు వదిలి
కళ్ళలోని వాననీ
శరీరంలో వడలిన

పూలనీ, రేగే ధూళినీ తుడుచుకుంటూ, సొమ్మసిల్లుతోన్న నవ్వుతో
అతి కష్టం మీద
ఇలా అంటుంది
తను అప్పుడు
అతనితో:

“కొద్దిగా, ఓ గ్లాసు మంచినీళ్ళు అందిస్తావా?”

# నీ నిదుర నయనాలలోకి

పదాలు లేని ఇష్టం ఇక్కడ
అప్పుడు
నువ్వు నెమ్మదిగా కళ్ళు మూసుకుని నిదురలోకి జారుకుంటున్నప్పుడు

మలుపులు లేని శ్వాస ఇక్కడ
అప్పుడు
నువ్వు నెమ్మదిగా కలలు లేని నదిలో నావై మృదువుగా సాగిపోతున్నప్పుడు

రెప్పలు లేని కాలం ఇక్కడ
అప్పుడు
నువ్వు ఒక తీరం చేరి, పూలల్లో చేరి, రాత్రిలో, నక్షత్రాల సువాసనలలో

నీ లోపల నువ్వు ఇక ఒక
ఉద్యానవనంలో
తెల్లని సీతాకోకచిలుకవై ఎగురుతూ ఉన్నప్పుడు - వాలుతూ ఉన్నప్పుడు

తల తిప్పి ఒత్తిగిల్లి, నా చేతిని లాక్కుని నీ మెడలో దాచుకుని
నీ నిదురలోనే ఎందుకో
చిన్నగా నవ్వినప్పుడు -

అప్పుడు

నీ శిరోజాలు వీచిన గాలికి, ఇక్కడంతా పురాజన్మల పరిమళం
ఒక మార్మిక ధూపం
ఎవరూ విప్పి చెప్పలేని, ఒక జీవన మృత్యు రహస్యం - ఇక

అప్పుడు

నీ చుట్టూ ఒక దుప్పటి కప్పి
నా రెండు చేతుల మధ్యా
నిన్ను భద్రంగా అపురూపంగా లోపలికి దాచుకుంటుంటానా

స్వప్న ఛాయలతో
బరువెక్కిన నీ కనురెప్పలని ఎత్తి నా వైపు అలా చూస్తావా, ఇక మరి
అంతిమంగా నేనేమో

ఒక కృతజ్ఞతతో
ఏమీ చెప్పలేని
చేయలేని, ఒక
నిస్సహాయతతో

నీ అరచేతులని అందుకుని, నా గుండెలకు అదుముకుని
ముద్దు పెట్టుకుంటాను -

ఎలా? ఇలా!

# "... నాన్నా"

- ఊయలలానో నావలానో: ఇట్లా ఊగే చీకటి -

నీకు చెరోవైపున ఇద్దరు పిల్లలు నీ ఛాతీపై తలలు వాల్చితే
ఒక అంచు నుంచి మరో అంచుకి
ఊగుతుంది లోకం - ఒక తల్లి
తన శిశువుకి స్థన్యం అందించి

అలా జోలపాటతో ఊపుతున్నట్లు - ఉదయం నుండి మండిన
నీ కళ్ళు, ఒక లేత గాలిలోకీ
ఓ కలలోకీ తేలిపోతున్నట్లు -

దీవించే అరచేతులు నీ తలను తాకేందుకు వొంగినట్లున్న ఆకాశం
దయగల చూపుల వంటి కొన్ని
నక్షత్రాలూ. ఎక్కడినుంచో మరి
అన్నం ఉడుకుతున్న సువాసనా

మరి ఆగీ ఆగీ, చెట్లలోంచి నీ పైకి రాలిపడే రాత్రి చెమ్మా, ఇంకా
ఒక అనామక నిశ్శబ్దమూనూ -
ఇక అప్పుడు, నువ్వు నెమ్మదిగా

నీ పిల్లల్ని నీ ఛాతిపై నుంచి తొలగించి, అత్యంత జాగ్రత్తగా వాళ్ళని
పక్కన పరుండబెట్టి, నీ హృదయ
స్థానంలో ఏర్పడ్డ, ఆ పురాగానాల
స్మృతి ముద్రికలను రుద్దుకుంటూ

అతి రహస్యంగా అతి నిశ్శబ్దంగా లేచి వెడదామని అనుకుంటావా
సరిగ్గా అప్పుడే, చీకటి ఒడిలోంచి
ఒక చిన్న గొంతుక, పాలధారవలే
గుసగుస వలే ఇలా పిలుస్తోంది -
"............... నాన్నా"

# కాలం కంపనలో ఒక క్షణం, నీతో -

- వినలేదా నువ్వు, కొమ్మలు వొంగుతాయి ఫలాల భారంతో -

అలా వొంగిన కొమ్మల కింద నువ్వు నిల్చున్నప్పుడు, ఎన్నో ఏళ్లుగా చెట్లు దాచుకున్న చెమ్మ నీపై బొట్లు బొట్లుగా రాలితే, నీ చెంపల్ని అరచేతితో తుడుచుకుంటావు: మరి చల్లగానో వేడిగానో

నీ అరచేతి ముద్రికల మధ్యకు చేరే కన్నీరో మరి నీ ఖండిత హృదయం నెత్తురో - అయినా తప్పదు: ఉదయం లేవాలి. నిన్ను నిర్ధ్వందంగా ద్వేషించే మనుష్యుల మధ్యకు వెళ్ళాలి - కొంత నవ్వుతూనో, మరికొంత నమ్మకంతోనో - మళ్ళా వెన్నులోకి వాళ్ళనే దింపుకోవాలి. మరి ఒక నమ్మకంతోనో, ప్రేమతోనో: మొక్కల్ని నాటిన చేతులతోనే, వాళ్ళనే, నిన్ను విరిచివేసే వాళ్ళనే కౌగలించుకోవాలి, శరీరంలో పెంచుకోవాలి -

మృత్యు భారంతో వొంగుతున్న కాలం కింద, అప్పుడప్పుడూ కొంత గాలి. లతలు వొణుకుతాయి. ఇక ఒరిమిలేక, తాళలేక, నీపై పూవులు రాలి పడతాయి. పాదాల కింద మట్టి ఒక ఆకాశం. నువ్వు అడుగు తీసి అడుగు వేసినప్పుడల్లా ఊబిగా మారే ఆకాశం. మబ్బులు కమ్ముకున్న కాలంలో, సంధ్యా సమయంలో, నీడలు సర్పాలై నిన్ను అల్లుకుని కాటు వేసే కాలంలో, ఇక్కడొక శబ్దం - అక్కడొక శబ్దం. శబ్దాల మధ్య నిశ్శబ్దంలో తొణికిసలాడే సరస్సులోంచి నిన్ను పిలిచే చేతులు -

నిన్ను కన్నవారెవరో, నిన్ను పెంచినవారెవరో, నిన్ను వక్షోజాల మధ్య పొదివి పుచ్చుకుని నీ కన్నీళ్ళే తమకు తాము బ్రతుకు లేని వారెవరో నీ చుట్టూతా - నలు దిక్కుల నుంచి లక్షల గుసగుసలై, రహస్యాలై, నువ్వు ప్రేమించి నువ్వు ఉండలేక పోయిన స్త్రీల కనులై, మసక మసకగా, అంతా ఆకస్మికంగా ఒక అంతిమ క్షణానికి చేరువైనట్లు...

ముఖం చూసుకుందామని తల వంచితే, అక్కడ అ గులక రాళ్ళని తాకి వెళ్ళే చిన్ని అలలలో మరెవరిదో ముఖం: నీ శరీరం, నీ ఆత్మా, నీ సమస్థం పూవు నుంచి విడివడిన రేకులై, పసుప పచ్చని ఆకులై, ఆ నీళ్ళల్లో, తీరం తెలియని దూరాలకు కొట్టుకుపోతున్న అనుభవం: ఆఖరిసారిగా నిన్ను చూసుకుని, నీ అరచేతుల్లో పిచ్చుక పిల్లలా ఒదిగిన తన అరచేతిని - ప్రాణం పోతున్నట్లు - అతి కష్టం మీద లాక్కుని, తన కళ్ళలోని

నీరు నీ కంటబడకుండా చివాలున వెనుదిరిగి, తన్నుకు వచ్చే ఏడుపుని మునిపంట నొక్కిపట్టి పరిగెత్తుకు వెళ్ళిపోయిన అనుభూతి కూడానూ: మరి అక్కడ, ఆ సరస్సు అంతాన, మృగాల చర్మాల వంటి రాళ్ళపై నువ్వు కూర్చున్నప్పుడు, ఇక నీ ఎదురుగా నీ పాదాల వద్ద గత జన్మల సాక్షిగా మిగిలిపోయిన, కమిలిపోయిన, ఎండిపోయిన, తన పెదవి తెగి రాలిన నెత్తురు చుక్క, విశ్వమంత అశ్రుభారంతో! మరి నిజం చెప్పు...

- చూడలేదా నువ్వు? ఫలాలని ఇచ్చి, తనకు తాను ఏమీ మిగుల్చుకోలేక, చివరికి చివికి, ఎండిపోయి, ముక్కలు ముక్కలుగా నరకబడి, ఆఖరుగా తగలబడిపోయిన ఒక చెట్టుని ఎన్నడూ?

# కాలంలో ఒక క్షణం, నీతో -

నువ్వు నా పక్కన పడుకుంటే

నా ఎదురుగా నీ ముఖం:వానకి తడవకుండా ఆకుల మధ్య గుంభనంగా దాగిన ఒక ఒత్తైన తెల్లని పుష్పంలాగా -

నిన్ను పూర్తిగా చూద్దామని,శిరోజాలను కప్పుకున్న ఆ ఆకులని తొలగించే నా వేలి చుట్టూ చుట్టుకుంటుంది మట్టి తడచిన అడవి వేర్ల వాసన - చెట్టు మొదట్లో, చినుకులకి ముడుచుకునే గడ్డి పరకల వాసన. మరి గాలి వీచే చల్లని సవ్వడి కూడా

ఇక అప్పుడు, నా మెడ చుట్టూ చేతులు వేసి నువ్వు నన్ను దగ్గరకి లాక్కుంటే, మంచు రాలి కాలం వొణికే వేళల్లో, ఎవరో చివ్వున ఒక నెగడును రగిలించిన కాంతి ఇక ఆ అరుణిమ కాంతిలో ఎగురుతాయి మన చుట్టూ మరి మిణుగురులో లేక లేత ఎరుపు సీతాకోకచిలుకలో నిద్ర నిండిన నయనాలతో -

మరి అప్పుడే ఎక్కడో గూ గూ మని పావురాళ్ళ కువకువలు! మన శరీరాల్లోనే గూడు కట్టుకుంటున్నట్లుగా, రెక్కలు మునగదీసుకుంటున్నట్లుగా, రమిస్తున్నట్లుగా, గుడ్లని పొదుగుతున్నట్లుగా, రెక్కలు రాని వాటి పిల్లలు గూటిలో అలజడిగా కదులుతున్నట్లుగా...

అందుకే అప్పుడు చల్లటి గాలీ, రాత్రీ, చీకటీ: నీలో, నాలో -

అందుకే ఇక అప్పుడు, ఒకరినొకరు గట్టిగా కరచుకుని పడుకుంటామా మనం, ఏ తెల్లవారుఝామో వచ్చి, తలుపు తట్టీ తట్టీ వెళ్ళిపోతుంది మృత్యువు - మన ఆనవాలు ఏమాత్రం లేకుండా, ఏమాత్రం సవ్వడీ చేయకుండా!

మరి బ్రతికే ఉన్నామా మనం, అప్పుడు?

# దయ

కొంచెం దయగా ఉంటే పోయేది ఏముంది అని అనుకుంటాను నేను

వాళ్ళూ మనుషులే కదా, ఎక్కడో ఎందుకో కరకుగా మారాల్సి వచ్చి కరడు కట్టుకుపోయి ఉండవచ్చునని, తోటి వారిని మనుషులుగా గుర్తించడం మరచిపోయి ఉంటారనీ, అది వాళ్ళ సహజ నైజం కాదని, అది వాళ్ళు కారనీ ...

బయటేమో, మొన్న జల్లులా, పూలరేకుల్లా రాలిన వాన, ఇవాళ కుండపోత - పోలిక కావాలంటే, నల్లని నింగిలోంచి తెల్లని కాక్టస్ల గుత్తులుగా రాలుతున్నట్లు - మరిక నువ్వు నిశ్చింతగా ఇంట్లో కూర్చుని టీవీలలో వార్తలు చూసే తీరిక వేళల్లో ముంపుకి గురయ్యి అనేకమంది నిరాశ్రయులుగా మారుతుండవచ్చు. ఆకలికి అలమటించి పోతుండవచ్చు. ఎక్కడో కోల్పోయి, జారిపోయి, మరి ఎక్కడో శవాలుగా తేలుతుండనూ వచ్చు. 'ఇవన్నీ నీకెందుకు' అని నువ్వు అంటే

ఇక నేనేమి చెప్పను? నువ్వు నన్ను చీదరించుకున్నా నువ్వు నీ దినవారీ చర్యలలో భాగంగా, నన్ను నిత్యం గిరాటు వేస్తూ వున్నా, ఓ ఖడ్గాన్ని హృదయంలో దింపి మెలి తిప్పి నన్నొక చోద్యాన్ని చేసి చూసి ఆనందిస్తున్నా

నీకూ, విషపు బెరడు పేరుకుపోయిన నీ రంగురంగుల నాలికకూ, ఇదిగో ఇలాగే, ఇదే చెబుతాను: జీవితం పట్ల కొంచెం దయగా ఉంటే తప్పేమీ లేదనీ, మనుషులని కాస్త కావలించుకుంటే మరక అంటేది ఏమీ లేదనీ! ఇందా: దా

అందుకో మరిక నా తల్లి తన నెత్తురు బుట్టలోంచి వెలికి తీసి నీకు ఇచ్చిన ఈ పద పుష్పాన్ని!

# మూర్ఖుడు

It is a tale
Told by an idiot, full of sound and fury
Signifying nothing. — Macbeth (Act 5, Scene 5) -

**1**

వేకువఝాములలో వచ్చి, దుప్పటి తొలగించి, నెమ్మదిగా తను నీ పక్కన చేరేది. అప్పుడు, నీ కలలో తన శరీర స్పర్శ: లేత ఎండలో పిచ్చుకలు రెక్కలు విదిల్చి తిరిగి గూళ్ళల్లో ముడుచుకున్నట్లు, నీలోకి తను ముడుచుకుపోతే, నీ నిదురలోకి ఒక తల్లి తన స్థన్యం అందించినట్లు, ఆకలికి తల్లడిల్లిన ఓ శిశువు - మూసుకున్న కనులతో - వొణికే వేళ్ళతో చూచుకాన్ని అందుకున్నట్లు, నీకు నీ నిదురలో కొంత శాంతి. జనన మరణాల మధ్య వ్యాపించిన కొంత కాంతి. చిన్నగా చెట్లు కదిలి, రావి ఆకులు గలగలలాడే సవ్వడి. నదీ తీరాన, సంధ్యాకాంతిలో ఓ నావ ఆగి ఊగుతున్నట్లు, కనురెప్పల కిందకి తేలి వచ్చే అలల తడి: నీ చుట్టూతా పురాస్మృతుల అలికిడి. ఇక చేతులు వేసి తనని, నీ నిద్దురలోకి దగ్గరకి లాక్కుంటే

**2**

ఎక్కడిదో మరి ఒక తుంపర: తూనిగలు పచ్చిక మైదానాలలో ఎగురుతున్నట్లూ, పూల పొదలు నీలోకి లేత వేడిమితో అడుగిడి విరగబూసినట్లూ, మంచు తాకిడికి గడ్డి పరకలు కదిలినట్లూ, సీతాకోకచిలుకలు ఏవో చిన్నగా వాలినట్లూ, నీలో నీ నిద్రలో, ఒక కాల స్వప్నం. ఒక స్వప్న లోకం. అనేకానేక లోకాల సంచారం. పలుమార్లు జననం పలుమార్లు మరణం -

**3**

ఇక, తన అరచేతిని నీ చేతిలోకి తీసుకుని, నిద్రలోనే ఎక్కడో మెదిలిన ఒక నెత్తుటి నీడకి, దిగ్గున లేచి కూర్చుని చూస్తావా - మరిక ఇక్కడ నీ పక్కగా ఒక మహాశూన్యం. నలిగిన పక్కలో వ్యాపించే ఒక మహా నిశ్శబ్ద శబ్దం: ఎవరో నీలో చేరి ఒక సమాధిని తవ్వుతున్నట్లూ, మరెవరో నిన్ను అక్కడికి మోసుకు వస్తున్నట్లూ, తమ గుండెలు బాదుకుని భోరున హోరున గొంతు తెగేలా ఏడుస్తున్నట్లూ -

**4**

మరిక ఆ తరువాత నువ్వు నిదురోయింది ఎన్నడు?

# మృత్యువు నుంచి  తప్పించుకుని వచ్చిన అమ్మాయి

మృత్యువు నుంచి తప్పించుకుని వచ్చి, కుర్చీలో కూర్చుంది అమ్మాయి -

కొంచెం బావున్న వాన. ఇంకొంచెం బావున్న గాలీ. గాలిలో మెరిసే పూల తడీ: అన్నం మెతుకులలాంటి వెలుతురూ శిశువుల శరీరాల నుండి వీచే వాసనా. ఎవరో నిన్ను రహస్యంగా తాకి పిలిచే ఒక పలుకూ, నిదురకీ మెలకువకీ మధ్య, పురాతన సీమలో నువ్వు చూసి వచ్చిన ఒక పురాస్మృతుల గడీ తొలిసారిగా వక్షోజాలు బరువయ్యి, తల్లి తనమేదో తెలిసినట్లు, పసివేళ్ళతో నీ ముఖాన్ని ఎవరో నిమిరినట్లూ, నీ ఒడిలో జీవితం పసిపాపై ఒదిగినట్లూ తొలిసారిగా నిండుగా నవ్వినట్లు, శరీరం తేలికయ్యినట్లూ, తేలిపోతున్నట్లూ

మృత్యువుని వెళ్ళమని చెప్పి వచ్చిన అమ్మాయి చుట్టూ, కొంత లేత కాంతి. నిండైన శాంతి. నడకలో నింపాదితనం. పసిడి పరకలు ఏవో వాలుతున్నట్లు తన కనుల సంజ్ఞల చుట్టూ నువ్వు ఇంతకు మునుపు చూడని ఇంద్రజాలం -

అందుకే మరి, మృత్యువు దాగుడు మూతలలోంచి వచ్చి ఇక్కడ దాక్కున్న అమ్మయిన ఆ అమ్మాయి, కుర్చీలో కుదురుగా కూర్చుని, తేలికగా అలా కాళ్ళూపుకుంటో చెబుతోంది ఇలా:

"ఇట్లా కాళ్ళూపుకోవడం, బ్రతికి ఉన్నామని తెలిసి ఉండటం ... it's so beautiful isn't it? ఎందుకు తెలియలేదు మరి ఈ చిన్ని విషయం నాకు ఇన్నాళ్ళూ?"

# ఒక మామూలు కవిత

రాసుకుందామని కూర్చుంటాను, ఇక్కడ, ఒక్కడినే మరి, నీలాగే ఈ రాత్రి కాంతిలో

నీవు ఉండే గదుల వంటివే. అద్దెకు తీసుకుని, మన శరీరాలనీ మాటలనీ అద్ది నాలుగు పూల కుండీలతో, పొద్దుతిరుగుడు పూవులమై మనం మలుచుకునే, ఈ రెండు అద్దె గదుల ఇల్లే మరి -

నీవు వినే శబ్దాల వంటివే ఇక్కడ కూడా. నువ్వు రాసుకుందామని కూర్చున్నప్పుడు నీకు వంటింట్లోనుంచి వినిపించే వంట పాత్రల సవ్వడే: ప్రతీ రాత్రీ, మనల్ని మనం బ్రతికి ఉంచుకునేందుకు

తానో, లేక కొన్నిసార్లు నువ్వో చేసే దైనందిన చర్య. నువ్వు వాటిని జాగ్రత్తగా వినగలిగితే, ఆ శబ్దాలలో సన్నటి గాజుల అలికిడి వంటి, గాలికి కదిలే పూల పరిమళం వంటి, బియ్యం చెరిగే, మరి వాన చినుకులు రాలే ఘడియలూ వినిపిస్తాయి -

ఇక, నీ పిల్లల వంటి వాళ్ళే నాకూనూ: ఇల్లంతా ఎగిరి ఎగిరి, ఈ పట్టాణాలలోంచి తప్పించుకుని పచ్చని పొలాల్లోకి, తూనిగలో మరి మిడతలో రివ్వున ఎగిరే మైదానాలలోకి, వాళ్ళు హర్షంతో కేకలతో పరిగెత్తిపోతున్నట్లూ - మరిక వాళ్ళు ఉండటం వల్లనే, ఈ నాలుగు గోడలూ ఇంత పచ్చని పొలలై , ఉద్యానవనాలు వేలాడే నగరాలై కొంత కనుల కింద శాంతియై. ఇక మరి రాత్రంటావా, నువ్వు నీ సహచరితో మాట్లాడుకునే, పోట్లాడుకునే నిన్ను నువ్వు విడమర్చుకుని తెరపి పడే చీకటి వలే వ్యాపించే ఒక సజీవ గర్భం. చెమ్మా, కొన్ని మాటలూ: పెద్దగా ఏముంటాయి చెప్పు? కట్టవలసిన బిల్లులూ రాని జీతాలూ, ఇవ్వవలసిన ఇంటి అద్దెలూ, జరిగిన అవమానాలూ, రాబోయే రోజులూ, పిల్లలు ఉదయం చేసిన అల్లరి పనులూ, తలుపు సందులో పడి చిట్లిన వేలూ, గుక్క పట్టి ఏడ్చిన ఆ ముఖమూ ఇంకా కొంత శరీర శాంతి. రోజూ రమించాలనేం ఉంది?

అప్పుడప్పుడూ తన అరచేయి నీ నుదిటి మీద ఆగినప్పుడు, అక్కడొక నెమలి వచ్చి పురివిప్పి నృత్యం చేస్తుంది. అపుడు నీ లోపల ఎక్కడో సన్నగా చెట్లు వీచి, ఆకులు రాలి, నీ లోపలి ఆకాశం నెమ్మదిగా మేఘావృతమౌతుంది -

మూసుకున్న కళ్ళ కింద కొంత చిన్న వెలుగు. ఎవరో దీపం వెలిగించి, నీ లోపల ఉంచి, అరచేతులతో కాపాడుకుంటునట్లు కూడానూ. సరే, మరి ఇవే, మరి ఇలాంటివే, రాసుకుందామని నేను కూర్చున్నప్పుడు ... ప్రత్యేకమైన ఇంద్రజాలం ఏదీ లేదు నా వద్ద. నీలాగే, అత్యంత సరళంగానే

చూడు, రాసుకుందామని కూర్చుని, నీ గురించీ నా గురించీ చెప్పుకుంటుండగానే, ఎలా మరి ఈ నాలుగు పదాలు, నిన్ను విడిచి నన్నూ విడిచి రొట్టెలు ఉంచిన ప్లేటు వద్దా, కదులుతున్న మల్లెతీగ చుట్టూ, తడి గుడ్డ చుట్టిన మట్టికుండ వద్దా పసిడి కాలం వంటి నుదిటిపై, నిప్పుల వేడిమికి కమ్ముకున్న చెమటని తన ముంజేతితో తుడుచుకునే నీ స్త్రీ వద్దకూ వెళ్లి ఎలా చుట్టూ తిరుగాడుతున్నాయో! మరేం లేదు

ఇంతకూ ఇప్పుడైనా తెలిసిందా నీకు, మరి ఒక కవితను ఎలా చేయవచ్చునో? ఇక చక్కగా నువ్వు ఒక కవితగా ఎలా మారవచ్చునో?

# బాల్కాయ్

''అక్కడ చేయి పెట్టుకోకూడదు, ఎప్పుడూ అక్కడ చేయి పెట్టుకుని నులుముకుంటావేమిటి? యాక్, చేయి తీయి'' అని వీలైతే ఒక దెబ్బ కూడా వేస్తాం కానీ, వాడే

ఆనక అటు తిరిగీ, ఇటు తిరిగీ, నెమ్మదిగా నా వద్దకు వచ్చి ఇలా అంటాడు ఆ నాలుగేళ్ల నల్లని వాడు: "నాన్నా దురద పుడుతుంది నాన్నా, దురద పుట్టినా బాల్కాయ్ నులుముకోకూడదా?''అని అడిగితే

ఎక్కడో ముఖం దాచుకుని, శతాబ్దాల లైంగిక అణచివేతలు గుర్తుకు వచ్చి, శరీరం ఒక పాపం, మరి లైంగిక అవయవాలు ఒక నేరం, అని పిల్లలకి చెప్పీ చెప్పీ చెప్పీ, శైశవం నుంచి బోధించీ బోధించీ బోధించీ, నీ శరీరాన్ని నువ్వు ఆస్వాదించనిదే, ఇతరుల శరీరాన్ని నువ్వు ఆరోగ్యవంతంగా ఆస్వాదించలేవు అని ఈ పుణ్యభూమిలోని తల్లులకీ తండ్రులకీ ఇక మరి చెప్పలేక ఎలా చెప్పాలో తెలియక, ఇదిగో చేతివేళ్ళల్లో నీళ్ళు కుక్కుకుని ఈ పదాలను రాసుకుంటూ ఉన్నాను, శరీరాన్ని మరియు లైంగిక అవయవాలనీ, రతినీ అంటరాని పదాలని చేసి, పిల్లల నోట్లో గుడ్డలు కుక్కి, వాళ్ళని

ర్యాంకులుగా, పెట్టుబడులుగా సమాజంలో హోదాలుగా తప్పితే, నిలువెల్లా వెన్నెలనీ పూలనీ కాంతినీ వాననీ వసంతాల్నీ ఎడారులనీ దాహాలనీ మోహాలనీ దేహాలనీ మోసుకు తిరిగే ఆత్మలుగా మరి వాళ్ళని చూడలేక, వాళ్ళని పెంచలేకా మరి వాళ్లకి చెప్పాలేకా, వాళ్లకి ఇక శరీరాలు లేకుండా చేసి, నిలువెత్తు సమాధులుగా మారుస్తున్న నిన్నూ నన్నూ ఎందుకో మరి దుఃఖంతో తలచుకుంటూ -

*బాల్కాయ్: = the word for penis that the little one uses*

# Noem అను ఒక కథ

1

వాళ్లకు నేనేమీ తేను: బహుశా వాళ్ళేమీ ఆశించరు కూడా. మహా అయితే  ఆకుల మాటున దాగిన పూలల్లా తటాలున బయటపడి పకాల్మని నవ్వుతారు. ఆపై చుట్టూ చేరి అల్లుకుంటారు. ఈలోగా ఇంటి ముందు చీకటి తెరలు వీస్తాయి. వాళ్ళ కళ్ళల్లో వెన్నెల్లు వెలుగుతాయి. వెన్నెల్లో, వాన జల్లులలో మరి సీతాకోకచిలుకలు ఎగురుతాయి రెక్కలపై నక్షత్రాలతో పూల పుప్పొడితో ఒక  చల్లటి గాలి వీయగా నిదుర అంటిన వాళ్ళ కళ్ళల్లో కథలు మొలుస్తాయి. మరి నేను వాళ్లకు పెద్దగా కథలు ఏమీ చెప్పను, బహుశా వాళ్ళేమీ ఆశించరు కూడా. మహా అయితే ఇదిగో ఇటువంటి ఒక గాధను వింటారు వాళ్ళు, నన్ను అల్లుకుపోయి -

2

కాలం నెమ్మదిగా మీలా రూపు దిద్దుకుంటున్న సమయంలో వేడిమి తెరలు కదిలే వేళల్లో, ఒక మానవుడు నిస్సహాయుడై ఈ లోకంలోకీ ఈ కాలంలోకీ విసిరివేయబడ్డాడు. మరప్పుడు అతనికి వయస్సు లేదు, చూపు లేదు, లోక మర్మం, ద్రోహం బ్రతకనేర్చినతనమూ లేదు మరి ఏమిటంటే ఆ కాలమంతా డబ్బులేని రాక్షసత్వం. తిండి లేక, ఫాక్టరీలో వడ్లకింద కూరుకుపోయి చనిపోయినంత వింత అతని లోకం, అతని శాపం. తల్లిని కనలేకా తండ్రికి చెప్పాలేకా తనకు తాను విడమర్చుకోలేకా, మధుశాలలలోకో స్త్రీలలోకో వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ, శరీరాన్ని కోసుకుంటూ సాగిన ఒక గతం. స్నేహితుల వద్దా, శత్రువుల వద్దా ఇంత ఎంగిలి పడేందుకు, నానా మాటలు విన్న అగత్యం. ఏమీ లేని తనం. ఇన్ని పదాలని పోగేసుకుని, రాత్రికి ఇంత మంటను రాజేసుకుని, నిప్పులో నుదిటినీ అరచేతులనీ వెచ్చబెట్టుకుంటూ రేపటి దాకా ఎలాగోలాగా బ్రతికిన వైనం. మరి ఇంతా చేస్తే, ఇన్ని యుగాల ఘర్షణ తరువాత కూడా ఇంటికి వెళ్ళలేని ఒక దైన్యం. తండ్రి చనిపోతే, తన ఇంటికి తల్లిని తెచ్చుకుంటే తన భార్య నానా ఆగీ చేసి తల్లిని వెళ్లగొట్టే సందర్భం. కన్నకూతురూ, అతని స్నేహితులూ అపరిచితులై ముష్టిఘాతాలై మీద పడి తరిమి తరిమి కొడితే ఇక ఎక్కడి వెళ్ళాలో, బ్రతికి ఉండాలో వద్దో, మరి చచ్చిపోవడమెలాగో తెలియని గడ్డు కాలం. 'అన్నా ఏమిటిది' అని నేను అంటే, 'అన్నా, నేనూ నీ వలెనే' అని చెప్పి, అరచేతుల్లో కనుగుడ్లను చితక గొట్టుకుని విలవిలలాడిన అప్పటి, ఇప్పటి కరకు

కాలమూ, లోకమూ. మరి ఇటువంటి కథను ఇంతకు ముందు చెప్పానా మీకు ఎన్నడైనా?

3

బయట చిక్కగా చీకటి మెల్లగా గాలితో కలిసి రాత్రిని అల్లుతుంటే, మరి పిల్లలు - వాళ్ళే - నేనేదైనా తెస్తానేమోనని ఆశించని పిల్లలు గుండెలపై నిదురోతారు. భుజంపై తల ఆన్చి, మరి నా భార్యేమో ఉగ్గపట్టుకుని కూర్చుంటుంది. గదిలో, ఎక్కడో ఒక సాలెపురుగు గూడు అల్లుతున్న నిశ్శబ్దం. మెత్తగా మంచుపొర ఒకటి అద్దంపై పరచుకుంటున్న లేత సవ్వడీనూ. మరి అద్దం సన్నగా చిట్లి పగలవచ్చు, ఏ ఈగో సాలెగూటిలో ఇరుక్కోనూ వచ్చు. గిలేరీలతో కొంతమంది, మరి నువ్వు ప్రేమించే పావురాళ్ళని రాళ్ళతో కొట్టి రాల్చి చంపి తినేందుకు తీసుకువెళ్లనూ వచ్చు. ఏమీ చేయలేక నువ్వు అలా చూస్తూ ఉండిపోనూ వచ్చు. "నిజమేనా అది, నువ్వు చెప్పిన ఆ కథ? అది, నిజంగా నిజమేనా?" అని నా స్త్రీ అడుగుతుంది. నేను నా చేతిని, నిదురలోకి జారి కలవరిస్తున్న పిల్లలవైపు చూపిస్తాను - ఎలా అంటే, మరి నదిని చూపించమని అడిగిన వాళ్లకి నావని చూపించినట్లు - ఇక ఆ తరువాత నాకు తెలియదు, తనకూ తెలియదు, ఎవరి గుండెపై ఎవరు తల ఆన్చి ఎలా నిదురపోయారో, మరి తొలిసారిగా ఆ రాత్రి నిదురలోకి తలారులు రాకుండా, తోటలూ కాకుండా ఘాడమైన పొగమంచు ఒకటి మమ్మల్ని ఎలా కమ్మివేసిందో, తిరిగి మేము ఎప్పటికైనా నిదుర లేచామో లేదో, ఇది నిదురలో జరిగిందో, లేక మెలకువలోనో, మరిక ఎప్పటికీ ఎవరికీ తెలియలేదు -

4

తెలియదా మీకు, మరి కొన్నిసార్లు మరి చాలా చాలా సార్లు, పిల్లలే మనల్ని ఓదారుస్తారనీ లోపల వెక్కి వెక్కి ఏడ్చి, మరి మనమే వాళ్ళ ఒడిలో దైన్యంగా నిదురోతే, మన తలలపై చేయి ఉంచి అనునయంగా నిమురుతూ ధైర్యం చెబుతారనీ, ఓ చిరునవ్వుతో దీవిస్తారనీ? గాలి తాకి దిశ మారిన ఒక వర్షం, అటుపై గదిలో నిండుగా కురిసింది. వెలసింది - పచ్చి ఆకుల వాసనా, రాలిన పుల్లలు విరుగుతున్న ఒక మెత్తడి సవ్వడీ అక్కడ. మట్టి పొరల్లోంచి, మరి బయటకి వచ్చి తిరిగి లోపలికి వెళ్ళిపోతున్న వానపాములు పిల్లల కనురెప్పలపైన - కొంత మబ్బులు తెరపి ఇచ్చిన కాంతి సంగీతం అతని ముఖంపైన - కురులు అలలు అలలుగా వాళ్ళ ముఖాలపై నుంచి అలా తేలిపోయి, పరదా ఏదో తొలిగి చంద్రబింబాలు బయటపడ్డట్లు ఆ వదనాలని నెమ్మదిగా వేళ్ళ చివర్లతో తాకుతూ అతను అంటాడు: "బ్రతకాలని ఉంది నాకు"

5

"నాలిక గీసుకున్నట్లు, అప్పుడప్పుడూ మనస్సునూ, మనుషులనూ గీక్కోవడం మంచిది. ఈ మనుష్యులు, స్వతహాగా వీళ్ళు వేటగాళ్ళు, హింసక్రీడా వినోదులు. ఏమీ చేయకు, వాళ్ళలో కలవకు. నెత్తురు రుచి మరగకు. ఏమీ లేకపోయినా, నీకు ఏమీ దొరకకపోయినా రా ఈ గోడల మధ్యకు. ఈ గోడలతో ఈ నీడలతో మన బొమికలతో మన నెత్తురుతో మన పిల్లలతో ఒక ఇల్లుని నిర్మించుకుందాం. మరి కొద్దికాలం బ్రతుకుదాం. ప్రేమ కోసం కాదు కానీ, నాకోసం నువ్వూ, నీ కోసం నేనూ. మన కోసం మనం బ్రతికి ఉందాం. ఊరుకో, అన్నం తింటావా?" అని తను అడిగినప్పుడు సరిగ్గా అప్పుడు, బయట ఒరిగి ఉన్న ఆ రాళ్ళల్లో నీరు ఊరింది. పాత్రలలాంటి రాళ్ళలోంచి నీళ్ళు తాగడమెలాగో తెలిసింది. తాకీ తాకక, ముళ్ళ మధ్య చిక్కు ముడులు పడకుండా పూవులా ఉండటమెలాగో అతనికి తెలిసినట్లయ్యింది. ఇల్లు విడిచి వెళ్ళక, ఇతరులని వొదిలివేయక - అన్నిటి - అందరి సమక్షంలోనే ఉంటూ నడిచే మరో మార్గమేదో అతనికి తోచింది. తన చేతిని అందుకుని, తనే తాను అని తెలిసి బ్రతుకులో తెరిపి పడటమెలాగో గోచరించింది. జీవితం, అరచేతిలో అరచేయి అనీ, అశ్రువుని పెనవేసుకునే మరో అశ్రువు అనీ, ఇతరమే తాను అనీ, తానే ఇతరమనీ, ఒకటి లేక మరొకటి మన్నలేదనీ స్పష్టమయ్యింది. ఏదో ఒక శాంతి వంటిది కూడా తాకింది "ఇక నెమ్మదిగా లేచి, కూడపెట్టుకున్న నెత్తురుతో కొన్ని పదాలను వ్రాయి ఏమీ ఆశించని పదాలని వ్రాయి. ఏమీ ఆశించకుండా వ్రాయి. ఆపై, నీలో ఒక దీపం వెలుగుతుంది, మసి అంటినా, దానితోనే మరో దీపం ఎలా వెలిగించవచ్చో నీకు అర్థం అవుతుంది" అని తను అంటే అతను మీకు ఇలా ఈ కథ ఒకటి చెబుతున్నాడు, కళ్ళల్లో మిమ్మల్ని ఒత్తులుగా చేసుకొని, మీలోనే ఎక్కడో ఒక చోట కూర్చుని. ఇక అంతా విని, ఇదంతా చదివి 'అతను ఎవరు', 'ఇది, నిజమా?' అని మాత్రం అడగకండి - మరి ఎందుకంటే మీ వెనుక, మీ వెనుకగా వచ్చి మీ కళ్ళను కప్పి మిమ్ములని అబ్బురానికి గురి చేసే పసి చేతులు వేచి చూస్తున్నాయి, మీలోనే మీ మరోవైపున, మీ కలలకు మరో అంచున...

మరి, ఎందుకు హాయిగా నవ్వకూడదు మీరు కాసేపు?

# గుర్తు

నిన్ను ప్రేమిస్తున్నానీ, అది నీకు చెప్పుకుందామనీ అనుకుంటాను కానీ మరి తెలియదు నాకు ఎలాగో -

నువ్వు లేక ఎలాగో తెలియదు, ఏం చేయాలో తెలియదు. మరి ఇక అందుకే ఉదయాన్నే లేచాను. ఇల్లంతా కడిగి తుడిచాను. ఒక పాత్రలో నీళ్ళు ఉంచాను. గుప్పెడు బియ్యం గింజలు పిచ్చుకలకూ, పావురాళ్ళకూ జల్లాను. కుండీలో మొక్కలకి నీళ్ళు వొంపి దుస్తులనీ, దుప్పట్లనీ ఉతికాను: మరేమీ కావవి, మన పిల్లలూ నువ్వూ నేనూ విడిచిన ఆ దుస్తులే వాటిని అంటి పెట్టుకుని ఉన్న మీ శరీర వాసనల కోసమే ఓ సారి వాటిని తాకి చూసుకున్నాను. ఆపై తీగెలపై ఆరవేసి, ఎండకి వొదిలివేసాను. కొద్దిగా దాహం వేయగా మంచినీళ్ళు త్రాగి, వాలుకుర్చీలో ఒదిగి కూర్చున్నాను. అలసటతో కనులు మూతపడగా మరి ఆకలీ వేయగా, కొంత ఓపిక తెచ్చుకుని బియ్యం వండుకున్నాను. ఏవో ఇన్ని మిగిలిన కూరగాయలతో కూర వంటిది ఏదో చేసుకున్నాను. ఇక సంకటయ్యిన అన్నాన్ని, ప్లేటులో వడ్డించుకోగానే, మొలుచుకు వచ్చాయి ఆ తెల్లటి మెతుకులలోంచి నీ చేతివేళ్లు బయటకి. తాకాయి నింపాదిగా మరి నన్నూ నా ముఖాన్ని. ఇక నీ కనులేమో, త్రాగుదామని ఉంచుకున్న గ్లాసు అంచున చెమ్మగిల్లి ఎప్పటిలా నొప్పితో మెరిసాయి. దిగులుతో నా వైపు చూసాయి. అరచేతిలో అన్నంముద్దలై అలా స్థంబించిపోయాయి, ఏడిచాయి!

అయ్యో, ఎందుకు గ్రహించలేదు మరి ఇన్నాళ్ళూ నేను? నిన్ను ప్రేమిస్తున్నానని నీకు తెలియజేయడం అంటే ఇలాగని, నువ్వు రోజూ చేసే ఈ పనులే, నువ్వు ఉన్నప్పుడూ నేనూ మన కోసం చేయడమనీ, నీతో కలసి కొంత తెరిపి పడటమనీ?

# think of it

We shall start with a metaphor: Ok?

Babe, చీకటి కమలం వికసించి రెమ్మలపై పొగ వీచింది: నువ్వు దానిని ప్రేమ అంటావు. మరేమో నేను దానిని, ఆత్మలోకి ఇంకిపోయే ఒక అనాది పరిమళం అంటాను. ఈ లోపల బయట చెట్లు ఎందుకో వీచాయి. మరి ఎందుకో నాకు, వెన్నెల్లో తడిచి, అలా కొద్దిగా ఊగే గడ్డి రెమ్మలూ మరి దాగిన  కప్పలూ గుర్తుకు వచ్చాయి. By the way do you remember that room? Our room, that tilted towards the sun in the raging moonlight? Ok, Ok ... సరే, ఒక చిన్న నీడా చీకటీ ఇలా వచ్చాయి, వెదుక్కుంటూ వెదుక్కుంటూ మరి ఎక్కడైనా, మరొక చిన్న నీడ దొరుకుతుందేమో అని, అరచేతుల్లో బహిస్టు నెత్తురినీ మరి మతాన్నీ గర్భంలో దాచుకుని: అందుకని నీ కళ్ళు ఊరికే తార్లాటలాడతాయి, ఇల్లా ఈ నేలపై, దొర్లుకు వెళ్ళే గాలిలానూ మరి ఆకులలానూ, మరి ఇవేమీ కాని ఓ రాత్రి నిన్ను వెలిగించిన దీపంగానూ:  సరే సరే enough of fucking metaphors and  enough of drink, with or without beers కానీ, మరి ఇదిగో ఒక చిన్న సంభాషణ

హౌవ్ యు డ్రంక్?/
ఐ డోంట్ నో/
హౌ మచ్?/
ఐ డోంట్  నో/
వాట్ ఆర్ యు డ్రింకింగ్?/
ఇట్ tastes లైక్ వోడ్కా/
ఇస్ దట్ ఇట్?/
ఎస్, ఐ గెస్స్ సో/
నథింగ్ ఎల్స్?/
మే బి బియర్స్/
వై డోంట్  యు కం హియర్?/
For this one I wrote the following little poem, or rather a Noem

దేహం దప్పికగొని, మరి పిడచగట్టుకుపోయి, ఇలా ఎదురు చూస్తున్నాను, ఎవరికోసమో తెలియక, ఎందుకోసమో తెలియక: నువ్వెప్పుడైనా గుండెనూ, శరీరాన్ని తవ్వుకుంటూ కూర్చున్నావా, మరి నీ గది ఒక గర్భస్రావమైనప్పుడు?

You are drunk: She says.
Yes baby I am drunk: I say.
Why don't you stop that fucking drinking? She asks
Babe, have you got some
grass? I would love to come over to you: I say
Pardon, She says, repeat again
Do you want to come?
No babe, it is just that

ఈ పూట ఎందుకో నీడలు మనుషులు అయ్యాయి ఈ పూట ఎందుకో మనుషులు పూవులయ్యారు ఈ పూట ఎందుకో ఒక గూడుని కట్టుకుంటున్నాను  నేను, నువ్వు విదిల్చివేసిన నాతో

Fuck off, she says
I say, its all right, ok
this is the night where you and I are drunk
you unto me
me unto you
So what shall we do?

చిన్నగా ఆకులు కదులాడి కొంత గాలి వీయగా తాకగా పిల్లలు పెట్టిన పిల్లి ఎక్కడో బావురుమంది - రాత్రి అంతా ఒక ప్రతిధ్వని, ఒక నిశ్శబ్దపు ప్రతిధ్వని సన్నటి వెలుతురులో చీకటి చినుకులుగా నీ ప్రాంగణంలో టపా టపా రాలుతోన్న సవ్వడి -

And then she says
I love you -
And then I say

I love you too

అదేమిటో ఇద్దరికీ తెలియనప్పటికీ! ఇక ఆ రాత్రంతా మరి ఆ కాలమంతా ఆ లోకాలలో తను ఏడిస్తే నా గుండెను ఒక సీసం పెంకుతో రుద్దుకుంటూ కూర్చున్నాను నేను ఎందుకో -

By the way
is this a poem?
By the way
is this a poem
that you are looking forward to
in the lonely lonely breeze
of your night and my life?

ఒక చిన్న విరామం కోసమై ఇక్కడ ఆపుతాను నేను, నేనే మరి నీకోసం, నువ్వు వ్రాసే ఇతరుల కోసం!
But what shall we do
after that? What shall
shall what...
do we
do...

# ఒక జీవితం

"నువ్వు ఏమైపోయావో తెలియదు. ఎప్పుడు వస్తావో తెలియదు. ఇలా ఎలా? కనీసం పిల్లలకైనా మిగలవా?'' అంది తను అలసటగానూ మరి కొంత విసుగుతోనూ. కూర్చున్నాడు అతను మాట్లాడకుండా బాల్కనీలో, గోడలపై కదిలే నీడలనీ అల్లుకున్న తీగకి ఆకస్మికంగా వీచిన ఒక చిన్న గాలికి కదులాడే ఆకులనీ చూస్తూ: ఆ తరువాత నెమ్మదిగా అడుగుతాడు అతడు: "దీనిని మనీప్లేంట్ అని ఎందుకు అంటారో తెలుసా నీకు?''

ఇక అప్పుడు ఎవరో ఆ చీకట్లో, బావిలోకి బిందెను ముంచిన చప్పుడు. దూరంగా, అతను తరచూ కలగనే, తనలోనే తనకు మాత్రమే తెలిసిన ఒక రహస్య ప్రదేశంలో అలలు అలలుగా వీచే రావి ఆకుల అలజడి. భూమిపై నుంచి సాయంత్రంలోకి చిన్నగా మట్టి లేచి, అలా కాగితంలా గాలిలోకి తేలి, తిరిగి నెమ్మదిగా నేలపైకి సర్దుకునే ఒక చిన్న సందడి. కొంత నిర్లిప్తతా కొంత శాంతీ ఇంకొంత అలసటానూ -

ఇక నెమ్మదిగా చీకట్లోంచి లేచి, కనురెప్పలకి అంటుకున్న నిన్నటి రాత్రిని ముంజేతులతో తుడుచుకుంటూ ఇలా అడుగుతాడు అతడు చిన్నటి గొంతుకతో: "పడుకున్నారా పిల్లలు? అడిగి ఉండను ఎన్నడూ కానీ, ఇంతకూ అన్నం తిన్నావా నువ్వు?''

# ఒక

ఎక్కడో చీకట్లో ముడుచుకుని ఉంటావు నువ్వు దుప్పట్ల కింద  నుదిటిలో దిగే గాజు ముక్కలతో: బాహువులంత భయం, ఎడారులంత దాహం అప్పుడు నీకు. చిన్న సవ్వడులే మృత్యు శబ్దాలు అయ్యే వేళ అది. గజిబిజిగా రూపాలు కళ్ళ ముందు మెరిసి, నిను తాకి వెళ్ళిపోయే కాలమది. ఇక అప్పుడు అ గదిలోకి, నీ చీకట్లోకి ఎవరో వచ్చి దీపం వెలిగిస్తే, ప్రాణాంజలి వంటి ఆ కాంతిలో నీ నుదిటిపై తను చల్లగా అరచేయి ఉంచితే, తన శ్వాసలోంచి నీ ముఖంపైకి వీస్తుంది వర్షపు ఆగమన గాలి ఒకటి చెట్లు ఊగే ఆకుల కలకలంతో: ఇక నువ్వు, తన చేతిని గట్టిగా పుచ్చుకుని, నువ్వు బ్రతికి ఉన్నావని రూఢీ చేసుకునేందుకు, తూట్లు తూట్లు పడి, రెండు రోజులుగా ముద్దన్నం మింగుడు పడని వొణికే గొంతుతో  కొద్దిగా సం/దేహంగా అడుగుతావు: "నిజంగా, నువ్వేనా?" అని

సరిగ్గా అప్పుడు, సరిగ్గా అప్పుడే రాత్రంతా నువ్వు నెత్తురూ మధువూ కక్కుకుని విలవిలలాడిన, మబ్బులు కమ్ముకున్న ఆ గదిలో, చిన్నగా చినుకులూ, తడచిన పచ్చిగడ్డి వాసనా, మరి  రెక్కలు తెగి తూనీగలు రాలిపోయే మెత్తడి సవ్వడీనూ. చాచిన నీ మునివేళ్ళకి అంటుకునే, చితికిన తన కళ్ళ తడీ. నీ చుట్టూ నిస్సహాయంగా అల్లుకునే తన చేతుల అలజడీ, కొంత కరుణా కొంత నొప్పీనూ. ఇక  ఆ తరువాత, ఆ దినమంతా నీ హృదయంలో వెలుగుతూనే ఉంటాయి - నిన్ను తమలోకి పొదువుకున్న- తల్లి దీపాలైన తన వక్షోజాలు, కొంత శాంతియై కొంత జీవన వాంఛయై చినుకుల చివర్న వేలాడే కాంతి గింజలై, మట్టి పూలై. ఇక, నీ గది గోడలపై, ఆ వెలుతురూ నీడలలో  గోడలని కరచుకున్న అన్నం మెతుకులలోంచి తెల్లటి పురుగులు రెక్కలు విప్పి ఎగిరే నీ కాలాంతపు వేళల్లో, ఒక గగుర్పాటుతో ఒక్కసారిగా నీకు బ్రతకాలనిపించి, మరొక్కసారిగా ఈ లోకాన్ని చూడాలనిపించీ మృత్యువు తాకిన నీ కళ్ళను కొద్దిగా తుడుచుకుంటూ చెబుతావు కదా తనకి అప్పుడు:

"మమ్మా, వొదలకు నన్ను. వొదిలి వెళ్ళకు నన్ను. బ్రతకాలని ఉంది నాకు. ప్లీజ్ -"

# మృత వ్యాకరణం

1 ఈ కిందివి వ్యతిరేక పదములు అవునో కాదో వ్రాయండి:

నలుపు x తెలుపు
అమ్మాయి x అబ్బాయి
రాజు x రాణి
మంచీ x చెడు
చీకటీ x వెలుతురు
పగలూ x రాత్రి -
(అవి ఎట్లా వ్యతిరేక మయ్యేను?)

2 కింది వాక్యములలో విశేషణం మరియూ క్రియలను గుర్తించి వ్రాయుడి:

/రాముడు మంచి బాలుడు/
/రాముడు రావణుడిని చంపెను/
(మంచి ఎట్లయ్యేను, మరి ఎందుకు చంపెను?)

3 ఈ కింది దానిని చదివి, ఆపై ఇవ్వబడిన ప్రశ్నలకు సమాధానములు వ్రాయుము:

దశరథునికి ముగ్గురు భార్యలు. ఆ నలుగురిలో ఒకరైన కైకేయి మాట విని ధసరథుడు రాముని అరణ్య వాసమునకు పంపెను. రాముని పట్ల విధేయుడైన లక్ష్మణుడు, తన అన్న వెంటనే అరణ్య వాసమునకు ఏగెను.

1. ఎవరి వలన రాముడు అరణ్యములకు పంపించబడెను?

2. ఎవరు విధేయుడు? మరియు ఎందువలన?

( పదునాలుగేళ్ళు  విస్మరించబడిన ఊర్మిళ మరి ఏమయ్యేను? ఏ సిలబస్ నందు మరి మనం చదవవచ్చును?)

బాల్కనీ వెలుతురులో, చుట్టూ మూగి
తచ్చాట్లాడే పిచ్చుకల మధ్య
రెక్కలు కుట్టుకుని పరీక్షలకు

చదువుతున్న పిల్లవాడిని
చూస్తూ, నా కళ్ళనీ మరి
నా పెదాలనీ నిస్పృహతతో

ఒక పచ్చి ముల్లుతో, ఈ విద్యావ్యవస్థతో
కుట్టుకుంటూ కూర్చున్నాను
ముంజేతి పై రాలిన కన్నీటి
బొట్లలో అతని భవిష్యత్తుని

చూస్తో, కొద్దిగా కొద్దిగా నేను సిగ్గుతో చస్తో -

# ఒక జీవితం

“పొత్తి కడుపు అంతా నొప్పిగా ఉంది. కొంత బ్లీడింగ్ అవుతుంది. అస్సలు బావోలేదు. త్వరగా రావా” అని తను అడిగితే అతను తల ఊపి, తల వంచుకుని వెళ్ళాడు ఉదయం. తిరిగి తిరిగి, తిరిగి అర్థరాత్రి రెండింటికి రెండు రిక్త హస్తాలతో ముఖం నిండా దుమ్ముతో, కళ్ళ నిండా మధువుతో శరీరం అంతా అల్లుకుపోయిన సాదా సీదా మనుషులతో నలిగిపోయిన పూవులతో, రాలిపోయిన పక్షులతో డోక్కుపోయిన కడుపుతో, చెంపలపై కమిలిపోయి నెత్తురంటిన కన్నీళ్ళతో తిరిగి వచ్చాడు అతను ఇంటికి, చీల్చుకున్న ఛాతిలో - తన కడుపులోంచి గర్భస్రావమయ్యి - చితికిపోయిన బిడ్డను, ఆ పిండపుముద్దను అతి భద్రంగా దాచుకుని -

ఇక కళ్ళు తుడుచుకుంటూ ఆడిగింది తను కనులు కాంచని నల్లటి చీకటిలోకి వంచిన అతని ముఖాన్ని పైకి ఎత్తి ఇలా: “అన్నం పెట్టమంటారా?”

# వై డోన్ట్ యు

/కాఫీ తాగుతావా?/ వై డోన్ట్ యు బై మీ ఎ బియర్?/ పోనీ, టీ?/ ఫొర్గేటిట్. నేను అడిగిన దానికి జవాబు చెప్పు ముందు/ పోనీ కలిసి డిన్నర్ చేద్దాం/ చేద్దాంలే, ఇద్దరం కలసి ఏదో ఒకటి, ఎలాగోలాగా కానీ వై డోన్ట్ యు బై మీ ఎ బియర్? జస్ట్ ఎ బియర్?/ ఇక అందుకని, చెరో క్రేట్ బియర్స్ తెచ్చుకుని కూర్చుంటే, అ గదిలో చీకటి కాగానే మొలిచింది ఒక చందమామ ఎర్రటి కళ్ళతో, నవ్వుతో తన తెలతెల్లటి కాళ్ళతో నెమ్మదిగా విచ్చుకునే ఒక నెత్తురు మొగ్గై నను గాట్టిగా కౌగలించుకుంటో. అది సరే కానీ ఈ రక్త పిపాసుల కథ మీకు ఎందుకు కానీ వై డోన్ట్ యు గెట్ లాస్ట్

ఫ్రం దిస్ white white page filled with beers and later his fears her tears?

# అనిశ్చితి

తనకి తెలుసు, ఈ నగరమొక రహస్య మృత్యు కుహరమని. మానవ రుచి మరిగిన పొంచి ఉన్న ఒక వ్యాఘ్రమని - అందుకనే

ప్రతీ ఉదయం, వెదురు పొదల్లా సూర్యకిరణాలు రెపరెపా వీచే వేళల్లో తన కళ్ళల్లో కొద్దిగా అలజడి: వంట చేస్తున్నంతసేపూ ఆపై, నీకై తను బాక్సు సిద్ధం చేస్తున్నంతసేపూ కొంత దిగులు సవ్వడి. అన్యమనస్కంగా కదులుతూ తనలో తానే ఏదో మాట్లాడుకుంటుంది, తనకు తానే ధైర్యం చెప్పుకుంటున్నట్లూ, తనను తానే ఓదార్చుకుంటున్నట్లూ -

అంతా చేసి ఇక నిబ్బరం పట్టుకుని, నువ్వు వెళ్ళే సమయానికి పమిటెతో ముఖం తుడుచుకుంటూ నీ చేతికి బాక్సు అందించి ఒక బలవంతపు చిరునవ్వుతో "వెళ్లిరా. జాగ్రత్త" అని అంటుంది కానీ లోపలే ఎక్కడో మొక్కలు పూలూ పిట్టలూ గాభరాగా విసవిసామంటూ పిచ్చిగా గాలితో ఈకలు ఎగిరే రెక్కలతో కొట్టుకుంటున్న చప్పుడు-

"తొందరగా వచ్చేస్తాను" అని నువ్వు చెబుతావు కానీ, ఇక దారి పొడుగూతా

పల్చటి నీటిపొర అలుముకున్న తన కనులు వాసనే నీ చుట్టూతా ఆ దినమంతా: ఇక నీ లోకమంతా నీ కాలమంతా రెండు వొణికే చేతులై, బేలగా తాకే తన పెదాలై నీ చిట్టి పిల్లలై, నీ ముసలి తల్లై తండ్రై, చివరికి ఎవర్నీ ఏమీ అనలేని ఇళ్ళు లేని మహాకాలమై-

# ఏమీ లేదు

ఎలా ఉన్నావు నువ్వు? తను అడిగింది, నుదిటిపై చేయి ఉంచి -

ఏమీ లేదు. ఇంటి ముంగిట్లో పూవు ఒకటి రాలిపోయిన సవ్వడి. లోపల ఎక్కడో నీటిపై వాలిన తూనీగ పాదాలు గీసిన వలయాల అలజడి. వీచే గాలులలో తేలిపోయే పసుపచ్చని ఆకుల అంతిమ అలికిడీ: ఇక ఇద్దరు ప్రేమికులు ఏళ్ళ తరువాత ఎదురుపడి స్థాణువయ్యి, అలా నిలబడి నిశ్శబ్దమయినట్లు ఒక తొలి కలయిక వలే ఒక చివరి చూపు వలే చాలా యధాలాపంగా కూర్చుని గోడలపై నీడలను తదేకంగా చూసే ఓ మూడింటి రాత్రివి నువ్వు కాగలిగితే, నిన్ను నువ్వు పక్కన పెట్టుకుని ఎప్పుడైనా నన్ను చూడగలిగితే ...

ఏమీ లేదు. నాతో నేను మాట్లాడుకుంటున్నాను: పగులుతున్న ఈ రాత్రి లాంతరు కటిక చీకట్ల కాంతి కింద -

# నీవిచ్చిన నిదుర

నా కనుగుడ్లపై బరువుగా నెమ్మదిగా నీ పాదాల సవ్వడి. మరి ఇక నీ పాదాల వెంట వచ్చే చల్లటి చీకటి నా కనురెప్పలపై నీ బొటన వేళ్ళ మృదువైన రాపిడినీ, ఈ కనుల అంచులలో నేను ఊహించలేని రాత్రినీ దిద్దుతుంది: మరి ఇక రాత్రి వసంతాల దిగులు మాగ్దలీనా,

సింధువుల వలే నిదుర బిందువులను అద్దటం నీకే తెలుసు. చూడు: ఎవరో ఒక కలలో ఆ వలలో తమ బాహువుల ఊయలలో ఊపుతున్నారు దారీ తెన్నూ లేని ఒక ద్రిమ్మరిని. ఇక అతని చుట్టూ నీ స్మృతి, ధూపమై ఓ పరిమళమై పొగమంచై కమ్ముకుందంటే, నిను తాకి నీ వక్షోజాల నీడలలో అతనికి నిదుర దొరికి తిరిగి ఇంటికి చేరుకున్నాడంటే

మృత్యువు అంటే మరేమీ కాదు అతని శిరస్సు క్షణకాలం వొరిగిన నీ ఒడి మాత్రమే అని అన్నాడంటే ఇక అందులో ఆశ్చర్యం ఏముంది?

# a bad bad ad day, and a bad pome

డ డ్డ, డ డ్డ, డ డ్డ, డడడ డడ డడా
డడా డడా డడా, డడడ డడ డడా
డడ్ డడ్ డడ్ డడా
డడడ డడ డడా డా

డా డా డా డడా, డడా డడా డడా
డడ్ డడ్ డడ్ డడా
డడడ డడడ డ డా

(Right now
You have been eaten
By a TV)

ఇంట్లో నిలువెత్తునా మొలిచిన
హోర్డింగ్లలో
నియాన్ లైట్ల
మెరుపులలో

చెంపకు చారడేసి కన్నులున్న
మంచు వెన్నెల వెలుగు కింద

అతను తాను ఒక శ్మశానమనీ, ఎవరూ లేని సమాధి అనీ
తానూ, తన అని అనుకున్న
వాళ్లకూ మరి ఇక తాను

నెలనెలా వచ్చే జీతమనీ
ఇంటికి తెచ్చే సరుకులనీ

పిల్లలకు పెట్టగలిగే ఖర్చులనీ, ఆమెకి క్రమం తప్పక
కొనివ్వగలిగే బంగారమూ తన సౌందర్య సాధనాలనీ

తాను ఒక అపార్ట్మెంట్గా
నెలవారీ కట్టే చిట్టీలుగా
ప్రాణాన్ని తనఖా పెట్టి కొన్న చదరపు భూమి ముక్కలుగా
మారీ మారీ మారీ చచ్చి

పోలేక శవమై, తనకు తానే భరించలేని ఏడుపుగా మారి ఇలా
పగలు పన్నెండింటికి
ఒక బార్లో, ఒక బార్తో -

డ డ్డ, డ డ్డ, డ డ్డ, డడడ డడ డడా
డడా డడా డడా, డడడ డడ డడా
డడ్ డడ్ డడ్ డడా
డడడ డడ డడా డా
డ్డ డ్డాఆ అనుకుంటో...

(The show will
resume after
a short break

Don't go away!
we will be
right back)

# A Day with Juveria Tabussum

ఒక కవి ఇలా రాసాడు:
నిన్ను ప్రేమించడం అంటే చెట్టు లేని ఆకుల గలగలలని వినడం చినుకుల్లేని వానలో తడవడం, వెన్నెల్లో కూర్చుని కాలడం - అంతం లేని ఈ శీతకాలపు రాత్రుళ్ళలో తుంపర్లయ్యి తిరిగి ఆవిరయ్యిపోవడం -

కవి ఇలా కూడా అన్నాడు:
నిన్ను ప్రేమించడం అంటే, నిప్పులని ముద్దాడటం తెగిన కళ్ళతో నవ్వడం భాషని మరచిపోవడం, ఈ లోకం చేత పరిహసించబడి, అవమానింపబడి ఒక్కడిగా మిగిలిపోవడం

కవి ఇలా కూడా గానం చేసాడు:
నిన్ను ప్రేమించడం అంటే, నన్ను నేను మరచిపోవడం నీ సౌందర్యంలో అంధుడుని కావడం, నిను మోహించి నీ పాదఖడ్గపు కాంతి అంచున నా మెడను వాల్చి నా బ్రతుకుని నాకు ఇమ్మని నిన్ను శరణుజొచ్చడం

అయితే కవి ఇలా అడగలేదు:
నిన్ను ప్రేమించడం అంటే, నీ శరీరాన్నీ ఇష్టపడటం నీ శరీరాన్ని ఇష్టపడటం అంటే నిన్ను అమితంగా మోహించడం నిన్ను అమితంగా మోహించడం అంటే నీతో రమించడం నీతో రమించడం అంటే నన్ను నేను నీలో కోల్పోవడం నీలోంచి కొంత కాంతినేదో కొంత శాంతినేదో తెచ్చుకోవడం, నీతో ఉండటం అంటే మృత్యువుని ఎదుర్కోవడం జీవించడం ఎలాగో తిరిగి నేర్చుకోవడం మరి కొంత కలగనడం మరి కొంత నేనై మిగలడం. ఉండు నాతో చివరి వరకూ!

అలా అడగలేని కవికీ, అలా అన్న కవికీ తను ఇలా చెప్పింది:
come to me when you lose  your skin come to me when you peel off your language, your eyes, your ears and your truth: till then, hey baby, fuck off, and don't you ever come here on to this page again.

# సామాన్యుడి ప్రేమగీతం

నిన్ను ప్రేమిద్దామని అనుకుంటాను కానీ, ఈ పాడు ఈగలే - సరే. నువ్వు చెప్పు: ఎవరైనా ఎలా ప్రేమించగలరు, చుట్టూ రయ్యమని ఎగిరే ఈ ఈగలతో? మరే, ఒకదానికొకటి అతుక్కుని ఎంచక్కగా ప్రేమించుకుంటాయి ఈ ఈగలూ, దోమలూ: ఎందుకంటే మరి వాటికి మన అవసరాలు లేవు కదా! మరి మనం ప్రేమించుకోవాలంటే చాలా కావాలి

సమయానికి నీళ్ళు రావాలి గ్యాస్ రావాలి కరెంట్ కావాలి రాళ్ళు లేని బియ్యం కావాలి సమయానికి జీతం రావాలి పిల్లల ఫీజు కట్టి ఉండాలి కేబుల్వాడి బిల్లూ పాలవాడి బిల్లూ పనిమనిషి జీతం, అన్నీ తీరి ఉండాలి. కూరగాయలూ కందిపప్పూ రిన్నూ లక్సూ సర్ఫూ పొద్దు పోకముందే పిల్లల నిద్రా, టీవీ సీరియళ్ళూ ముఖ పుస్తకపు అలజడీ ... అన్నీ సద్దుమణగాలి. అన్నీ కుదరాలి. పగలంతా పనితో అలసిన నీకూ నాకూ ఓపిక ఉండాలి. రేపంటే భయంలేని తొందరలేని అటువంటి సమయమూ కావాలి మరి, ఇవేమీ లేని ఈ పాడు ఈగలతో దోమలతో ఎట్లా మనం?

సరేలే. వస్తూ తెస్తాను ఇంట్లోకి, నిండుకున్న ఫినాయిలూ, జెట్ మాట్లూ ఎప్పటినుంచో నువ్వు అడుగుతున్న కొత్త చీపిరీనూ. మరిక ప్రేమించుకుందామా మనం? ఈ రాత్రికి?

# నీ చేతులు

సూర్యకిరణాలు ప్రతిఫలించే తామర తూడు వలే మెరుస్తోంది నీ చేయి -
అందుకే,

నీ వేళ్ళ అంచులలో పుష్పించే
మొగ్గలను చూసాను ఈ వేళ -

మొగ్గలు పూవులై, లతలై ఇల్లంతా అల్లుకుపోయి, చల్లటి నీడగా మారి
పచ్చి వాన వాసనతో మమ్మల్ని చుట్టుకుంటే
నీ చుట్టూ పిట్టల్లా మూగి కూర్చున్నాం మేము

నాట్యం చేసే నీ చేతివేళ్ళనీ, అవి సృష్టించే చిరు
మెరుపుల సంగీతం వింటూ: అవే
మరి నీ అరచేతులే - నిదుర లేచి

నీళ్ళని కాగబెట్టే చేతులు. స్నానం చేయించే చేతులు. అన్నం వండే చేతులు
నోటికి, అన్నం ముద్దలు అందించే చేతులు
మండే నుదిటి మీద తడిగుడ్డ వేసే చేతులు

నిన్ను ఎత్తుకునే చేతులు, నన్ను హత్తుకునే చేతులు. సర్వం రాలి నువ్వు
రోదిస్తే, నీ కన్నీళ్లు తుడిచే చేతులు. నిన్ను
కాపాడే చేతులు. నిన్ను ప్రాధేయపడే  చేతులు. నిన్ను కరుణించే చేతులు

చల్లటి చేతులు, వెచ్చటి చేతులు. ఏడుస్తూ వొణికే చేతులు. సరస్సులు
గుమికూడే చేతులు. వొంటరిగా ఉంటే
ఎడారులయ్యే చేతులు. జీవిత భారాన్ని

అరచేతిలో వదనపు బరువయ్యి ఆపే చేతులు. చీకటిని కాటుకగా దిద్దుకుని
నీకు వెలుగునిచ్చే చేతులు. నీ మనో
ఫలకాన్ని తుడిచి, నిన్ను నిర్మలంగా

మార్చే చేతులు. గాజులు పచ్చటి పోలాలై వీచే చేతులు. నదులై పారే చేతులు
గుప్పెడంత దీపాన్ని, నీ హృదయాన్ని
ఆరిపోకుండా కాపాడే చేతులు. అవే ...

అన్ని వేళలా అన్నీ అయ్యి నిన్ను చూసుకునే చేతులు. నిన్ను చేసుకున్న చేతులు
ఇంద్రధనుస్సులు అయిన చేతులు
వెన్నెల అయిన చేతులు. నిన్ను తాకి
అమావాస్యలుగా కూడా మారిన

చేతులు. నవ్వే చేతులు. నవ్వించే చేతులు. నీతో పాటు నీతో నెమ్మదిగా మరణించే
చేతులు. అవే, అవే

ఉదయంపూట సూర్యకాంతి ప్రతిఫలించే
మగ్గిన బంగారంలాంటి తామరతూడులు
అయిన చేతులు. నువ్వు నేనూ జన్మించే

మట్టి ఈ చేతులు. భూమి ఈ చేతులు. విశ్వం ఈ చేతులు. పరమ దైవం
ఈ చేతులు
అందుకే,

మొక్కలమై, వాటి వేర్లమై వేలాడుతున్నాం నీ చేతికి. తిరుగుతున్నాం నీ చుట్టే
రాసుకుని రాసుకుని పిల్లి పిల్లలమై.
చెబుతున్నాం అందుకే: విను నువ్వు

నిన్ను తాకడం, కృతజ్ఞతగా నీ చేతివేళ్ళని పెనవేసుకోవడం, రెండు చేతులని
సాధ్యమైనంతగా చాపి నిన్ను ఎరుకతో
కావలించుకోడం ఎంతో బావుంది. మా

జీవితాలని నీ అరచేతుల్లో పెట్టి నిశ్చింతగా ఉంటాం ఇక అని చెప్పడానికి మాకు
సిగ్గు ఎందుకు, అహం ఎందుకు?

# అమ్మ చెప్పిన కథ

"అమ్మా చలేస్తే, మనం దుప్పట్లు కప్పుకుంటాం. మరి పిట్టలూ?"

కరెంట్ పోయిన చీకట్లో కొవ్వొత్తిని వెలిగిస్తూ ఆ తల్లి ఇలా చెప్పింది "పిచ్చి కన్నా, చలేస్తే పిట్టలు ఆకుల్ని కప్పుకుంటాయి ఆకులు ఆకాశాన్ని కప్పుకుంటాయి, ఆకాశం చుక్కల్నీ చుక్కలు నీ కళ్ళనీ కప్పుకుంటాయి నీ కళ్ళని అమ్మా, అమ్మని నాన్నా, నాన్నని నీ తమ్ముడూ నీ తమ్ముడిని తాతా, తాతని నాయనమ్మా నాయనమ్మని ఈ ఇల్లూ కప్పుకుంటుంది. ఈ ఇంటిని వేపచెట్టూ, వేపచెట్టుని నేలా, నేలను గాలీ మరి గాలిని పచ్చని చేలూ, చేలని నీరూ, నీరుని నిప్పూ కప్పుకుంటాయి. ఇక పూలని పురుగులూ పురుగులని పుట్టలూ, పుట్టల్ని పాములూ పాములని పరమ శివుడూ, ఆ శివుడిని పార్వతీ, పార్వతిని ఈ భూమి, ఈ భూమిని పగలూ రాత్రీ మార్చిమార్చి కప్పుకుంటాయి. ఇక పడుకుందామా?" అని తను తల తిప్పి పక్కకు చూసేటప్పటికి, మంచంపై పిట్టలూ ఆకులూ పూవులూ చుక్కలూ, నింగీ నేలా నీరూ నిప్పూ గూళ్ళూ చెట్లూ పుట్టలూ పురుగులూ, పగలూ రాత్రీ వెన్నెల వాసనా, చల్లటి నిద్రా తెరలుతెరలుగా కదులాడే గంధపు వదనంతో ఒక పిల్లవాడు అలా నోరు తెరుచుకుని నిదురపోయి ఉన్నాడు!

# గూళ్ళు కట్టుకున్నదెవరు

“దేశం, దేహం, ద్రోహం
నీకీ  పదాలు తెలుసు
    నా?'' అని అడిగింది తను (ఎందుకో నాకు తెలియదు)

"this body"
(చూపుడు
    వేలితో  తన శరీరాన్ని
    చూపిస్తూ)

"is a site of exploitation

    ఇదొక మగవాళ్ళ  సాంస్కృతిక యుద్ధ రంగమని
    ఇదొక విపణి వీధి అనీ
    నిర్వచనాల నిశీధి అనీ  తెలీయదా నీకు?

దేశం దిగివచ్చి, దేహంపై రాజ్యమై
ఒక చట్టమై ఒక ముద్రికగా మారు
    తుందని  తెలియదా నీకు? నీ

వాచకాలు  ముద్రించేందుకూ
నీ దేశాన్నీ, నీ మతాన్నీ భద్ర
    పరిచేందుకూ, కొనసాగించేందుకూ, ఈ దేహం

ఒక పరిశోధనాలయం అవుతుందనీ

ఇదంతా దేవుళ్ళ దేవతల పురాణాల
    నిలయమనీ, తెలియదా నీకూ?''

అని మళ్ళా అంది తను

తల వంచుకున్న నా
కళ్ళను పైకి లేపి - "How do you know

that this is ***my*** body?
How do you know
That there is a body beyond your inscription?

First of all
How do you know that there is a body" అని
పిచ్చిగా తుళ్ళి తుళ్ళి నవ్వింది
తను, కనుల వెంట
నీళ్ళు చిప్పిల్లేదాకా

"మూర్ఖుడా. నిన్ను నువ్వు తెలుసుకునే ముందు
ముందుగా, నీ దేహాన్ని తెలుసుకో" అంటో తనే

"Know your body, before you know yourself
Know your body to be nobody"
అని అంటే ఇక నేను కూలబడ్డాను

ఈ తెల్లని తెరల ముందు
ఈ నల్లని పదాలని రాస్తో
అంతిమంగా మీకే కింది వాక్యాన్ని అనుమతిగా ఇస్తో:

don't you know that
words do have sex
and that language is sexed, and that don't you know that

గూళ్ళు కట్టుకుని భద్రంగా ఉన్న
పక్షులేవీ ఇక్కడ మిగిలి లేవనీ?

# అన్నా, నమస్తే అను
# ఒక మిడిల్ ఏజ్ వచ్చిన పద్యం

/అన్నా, నమస్తే/....../ ఏమే, ఈ మధ్యన కనిపిస్తల్లేవ్?/....../ సాయంత్రమేంజేస్తున్నావ్? కలుద్దామా?/ ఈ మధ్యన త్రాగడం లేదు/ హే... ఊరుకో అన్నా. మజాక్ జేస్తున్నావా ఏంది? ఏమైయ్యిందే?/ ఏం లేదు. కొంతకాలం మానేద్దాం అనుకున్నా/ అవునా? మరి మానేసి ఏం చేద్దామనే?/ ఏం లేదు. ఈ మధ్య యోగాలో చేరాను/ అవ్వా? ఇంకేం జేస్తున్నవే? ఎక్కడ కనిపిస్తల్లేవ్? ఏం రాస్తల్లేవ్?/ రాయడం మానేసాను / ఎందుకే? ఏం చదవడం కూడా లేదా?/ చదువుతున్నా. మళ్ళా రజనీష్ని, ఇంకా.../ నువ్వు సైకోగాడని పిల్సుతుండే... గాడ్నా?!/

ఆ... రజనీష్నీ, జిడ్డు కృష్ణమూర్తినీ, రమణ మహర్షినీ, నిసర్గదత్తనీ ఇంకా టిబెటన్ బుక్ ఆఫ్ ది డెడ్ లాంటివి మళ్ళా చదూతున్నా రేపెప్పుడన్నా ఏదన్నా మెడిటేషన్ సెంటర్లో చేరుదామని కూడా అనుకుంటున్నా/ గిదేందే?/ ఏమో?/ ఎన్ని రోజోలసంది తాగడంలే? ఊర్కో అన్నా. దా, కాసేపు గూర్చుందాం/ నిన్నటి నుంచే మానేసాను./ నాన్ వెజ్ కూడా. యోగా చేరి పది రోజులవుతుంది. వాకింగ్కి, జిమ్కి వెళ్తున్నా/ డైట్ మార్చాను. మొలకలు లాంటివీ, ఇంకా బాయిల్డ్ వెజిటబుల్స్ మాత్రమే తీసుకుంటున్నా/ నీకేదో అయ్యిందన్నా. ఇప్పుడేడకి?/ అమ్మను చూసి రెండు వారాలయ్యింది. ఒకసారి చూసొద్దాం అని వెళ్తున్నా/ అవ్వా!/ నా సంగతి సరే కానీ, నువ్వేం చేస్తున్నావ్?/ ఇగో ఏమనుకోకు కానీ నీలాంటోల్లకి దూరంగా ఉండాలని ఇప్పుడే అనుకుంటున్నా/ ......./ సరే అన్నా ఉంటా. మల్ల కలుస్తా.

అన్నా నమస్తే-/

# ప్రేమ ఉందనీ, లేదనీ

ప్రేమ ఉందనీ అనుకుంటావు, లేదనీ అనుకుంటావు - ఎవరివైనా చేతివేళ్లు మెత్తగా పెదాల్ని తాకితే, సర్వం మరచి తిరిగి అన్నిటినీ నమ్ముదామనీ అనుకుంటావు - ఇక అప్పుడు ఆ చేతివేళ్ళని పదాలుగా ఊహిస్తావు. నిన్ను చూడగానే పూవులు పూసే కనులగానూ పచ్చిక బయళ్ళపై  అలవోకగా వీచే చిరుగాలి వంటి ఒక చిర్నవ్వుగానూ స్వప్నిస్తావు. నీలోపలే, రహస్యంగా ఒక దీపం వెలిగించుకుని, ఒక తోటని సృష్టించుకుని

స్వప్న సువాసన చలించే, 'నువ్వు' అనే కొన్ని పదాలని రాసుకుంటావు, "ఇదేమిటి?" అని అడిగిన వాళ్లకి "ఇదంతా ఒట్టిది. ఈ దీపపు కాంతి నిన్నటిది. ఈ కవిత కూడా నిన్నటిదే. ఒక వడలిన పూవుదే. వెలసిన ఒక వానదే. వీడిన వానని వదలలేక ఆకుల చివరన ఊగిసలాడే ఒక చినుకుదే. నువ్వు ఇంకిపోలేని కాంతిలోని ఏడు రంగుల ఇంద్రధనుస్సుదే. మరి ఇది ఇప్పుడు నీ ఎదురుగా గూడు కట్టుకుంటున్న ఒక పిచ్చుకదే: దాని ముక్కులోని ఒక పుల్లదే" అని చెబితే, అంతా విని

"మరి ఇంతకూ ప్రేమ ఉందని అంటావా లేదని అంటావా? సరే ఇది చెప్పు: నిన్ను నమ్మడం ఎలా?" అని తనో లేక వాళ్ళో అడిగితే, అతి మెత్తగా వాళ్ళ పెదాలపై నీ చేతివేళ్ళని ఉంచి ఇలా అంటావు: "ష్. ఇక మాట్లాడకు. అంతా నిశ్శబ్దం - వేళ దాటింది. హృదయం వెలిగింది మౌనం మాట్లాడింది. ఇక ఈ కవితను ఇలా ముగిద్దాం, మనిద్దరమూ"

'ప్రేమ ఉందనీ అనుకోకు, ప్రేమ లేదనీ అనుకోకు. ఎవరి పెదాలపైనో చేతివేళ్ళయ్యో, చిరునవ్వయ్యో, ఒక దీపపు కాంతి అయ్యో వెలిగాక, ఒక లేత పిలుపై తేలిపోయాక, ఇక నీకు పదాలతో కానీ, శబ్దాలతో కాని, ప్రేమతో కానీ ప్రేమారాహిత్యంతో కానీ పని ఏమిటి?"

# అమ్మ కళ్ళు

చీకట్లో వెలిగించిన రెండు దీపాల్లా వెలుగుతాయి, నీ కళ్ళు - స్థాణువైపోతాను ఇక నేను. రావి చెట్లు గలగలా వీచినట్లు, చల్లని గాలి ఏదో నా లోపల. ఇన్నాళ్ళూ నేను చూడటం మరచిన వెన్నెల ఏదో, నేను వినలేని వాన ఏదో నక్షత్రాలు మెరిసే ఆకాశం ఏదో, పూలు వీచే పరిమళం ఏదో పసి పసిడి పవిత్రత ఏదో ఇంత వయస్సులోనూ ఇంత కటువైన నీ చివరి కాలంలోనూ, నీ కనుల సమక్షంలో అత్యంత లాలిత్యంగా, అత్యంత నిర్మలంగా - ఇప్పటికీ ఆ కన్నుల్లో ఎక్కడా నైరాశ్యపు జాడ లేదు. ఓటమి ఛాయ లేదు జీవించడం పట్ల ద్వేషం లేదు. ఇతరుల పట్ల నిందారోపణ అసలే లేదు - ఇక మంచు తెరలు తేలిపోతున్నట్లు ఉండే ఉదయపు లేత కాంతిని ప్రతిఫలించే ఆ తెల్లని కళ్ళను చూస్తూ "అమ్మా ఇది ఎలా సాధ్యం?" అని నేను విస్మయంతో అడుగుతానా, సరిగ్గా అప్పుడే, సరిగ్గా ఆ క్షణానే వేపాకులు రాలే చెట్ల కింద ఆ శీతాకాలపు గాలిలో, ఆ సంధ్యాసమయంలో, కాంతి పుంజాలు నీడలతో కలబడే వేళల్లో, రాత్రిగా మారే ఆ ఇంటి గుమ్మం వద్ద నుంచి చిన్నగా నవ్వి, ముడతలు పడ్డ ముంజేతితో తన కళ్ళని తుడుచుకుని, నా భుజం తట్టి, చిన్నగా లేచి వెళ్ళిపోతుంది తను!

# జీవితం

"జీవితం అంటే ఏమిటి?" అని నువ్వు అడిగిన నాడు - ఆనాడు -నా వద్ద సమాధానం లేదు. అందుకని, తల ఎత్తి ఒకసారి రాత్రి ఆకాశంలోకి చూసాను. చీకట్లోని నక్షత్రాలనీ, నేలపై అంబాడే వెన్నెలనీ ఆ వెన్నెల వెలుగులో గలగలా కదిలే నీడలనీ చెవిలో రహస్యమేదో చెప్పిపోయే గాలినీ విన్నాను. చుట్టూ గూళ్ళయిన చెట్లనీ, చెట్లని పెనవేసుకుని పడుకున్న మనుషులనీ, వాళ్ళు కప్పుకున్న మట్టినీ, ఆ మట్టి చెప్పే కథలన్నిటినీ విన్నాను. ఆనక, ఆ కథలలోని కనులలోకి దుమికి ఆ నీళ్ళల్లో మునిగాను. ఎవరెవరివో వేల చేతులని తాకాను. ముద్దాడాను. మరో దినం లేనట్లూ - ఇక రానట్లూ - గట్టిగా ప్రాణం పోయేలా వాళ్ళని కావలించుకున్నాను. ఎందుకో ఏడ్చాను ఎందుకో నవ్వాను. హృదయాన్ని చీల్చుకుని, దాని అరచేతిలో పెట్టుకుని నెత్తురోడుతూ 'ఇది మీదే, ఇది మీదే' అని ఆ కలల వీధుల్లో అరుచుకుంటూ తిరిగాను. గొంతు అరిగీ అరిగీ ఒక అమ్మలోనో, అమ్మలాంటి ఒక స్త్రీలోనో ఒదిగాను. ఇక తను ఒక జోలపాట పాడి ఈ విశ్వాన్ని ఊపితే వెక్కిళ్ళు పెట్టుకుంటూ, ఒక నిద్రలోకో, నిద్రలాంటి ఒక మృత్యువులోకో, నీ శ్వాసలోకో జారుకున్నాను. నిజం: "జీవితం అంటే ఏమిటి?" అని నువ్వు అడిగిన నాడు - ఆనాడు - "జీవితం అంటూ ఏదీ లేదు. జీవించడమే ఉంటుంది" అనే సమాధానం నా వద్ద లేకా, చెప్పరాకా, తల ఎత్తి ఒకే ఒక్కసారి నీలోకి చూసాను! నన్ను నేను కనుగొన్నాను.

# మరే

103 degreeల జ్వరం
దానికి మూడింతల cold (జలుబంటారులే)
గొంతులో వీచే తుమ్మముళ్ళ చెట్లు
ఆ చెట్లల్లో
గుడ్లగూబల పోరు
దగ్గు
హోరు

ఇక
Augumentin 625mg
Temfix
Crocin Pain Relief Tablet
డ్రిల్లూ
డిసిప్లీనూ లేని
Benedry ల్లూ వేసుకుని

గంటకోసారి
గోరువెచ్చని ఉప్పు నీళ్ళతో gargling చేసుకుంటో
నిమిషానికోసారి ముక్కు చీదుకుంటో

నా మానాన నేను, ఓ మూలగా
జోబుగుడ్డలోకి పసుపుపచ్చగా జారే
మురిగిన ఆత్మతో
కూర్చుంటే
ఇంతలో

నువ్వో
కవితతో తయార్
తుమ్ముకుంటో, ముక్కుకుంటో మూల్గుకుంటో,

బిక్కుబిక్కుమంటో
తిరిగే నా ప్రాణానికి -

ఒరే నాయనా
అరే హేమిరా రాజన్
ఇంతయినూ జాలీ కరుణా దయా లేదా నీకు

Life
is beautiful
అని
ఈ సమయంలో చెప్పటానికి!

# ఇప్పుడే, ఇక్కడే

ఇది గొప్ప కవితేమీ కాదు కానీ
ఈ కవిత, గుంపుగా తోటలో వాలిన సీతాకోకచిలుకల నిశ్శబ్దం నుంచి మొదలయ్యింది

కాదు కాదు!
నిజానికి ఈ కవిత
గుంపుగా సీతాకోకచిలుకలు నీలో వాలక ముందు
ఆకాశం నిండా కమ్ముకుని పూవుల్లా వికసించే మబ్బులతో మొదలయ్యింది -

మరి అది నిజమో, అబద్ధమో
నాకు తెలియదు కానీ, నిజానికి, ఇది గొప్ప కవితేమీ కాదు కానీ, ఈ కవిత
గుంపుగా సీతాకోకచిలుకలు వాలక ముందు, మబ్బులు పూవుల్లా విచ్చుకోకముందు
ఎవరో నవ్వినట్లు, తెరలు తెరలుగా వీచిన ఒక గాలిలో తన ప్రాణం పోసుకుంది -

ఉఫ్ మళ్ళా దారి తప్పాను -
నిజానికీ కవిత, సీతాకోకచిలుకలకి ముందూ, పూలకి ముందూ, తన నవ్వుకి ముందూ
చెట్ల కింద - ఇక ఏమీ చేయలేక - తన అరచేతుల్లోకి ముఖాన్ని కుక్కుకున్న
ఒక మనిషి ఒంటరితనంలో మొదలయ్యింది -

ఇదే ఆఖరు సారి. ఇక అబద్ధం చెప్పను -
అసలు కవితే కాని ఈ కవిత, "నువ్వు ఎవరినైనా ఇష్టపడితే
వాళ్ళకా విషయం ఈ రోజే చెప్పు. ఎవరితోనైనా గడపాలనుకుంటే, తప్పక కాలం
గడుపు. నువ్వు ఇష్టపడ్డవాళ్ళ అరచేతులలోకి

ముందూ వెనుకా చూడక, నిన్ను నువ్వు వొంపుకోవాలంటే
వాయిదా వేయక, ఆ పనిని ఇప్పుడే చేయి. ప్రేమించు. రమించు. తాకు -
అందులో తప్పేం లేదు. ఏం చేసినా, ఇప్పుడే, ఇక్కడే.

ఎందుకంటే, మరో లోకమేమీ లేదు

ఎందుకంటే, ఇంకాసేపట్లో ఈ కాగితంపై వర్షం కురియబోతుంది. ఆ తరువాత
నువ్వూ ఉండవు, తనూ ఉండదు, నువ్వు రాయబోయే కవితా ఉండదు''

అని అతను అనుకున్న క్షణాన, నిజానికి అతని శరీరం అంతం అయ్యి
ఈ కవిత మొదలయ్యింది. నిజం -
ఇదేమీ గొప్ప కవితేమీ కాదు కానీ

ఈ కవిత, నిశ్శబ్దం అతని గుండెలో
సీతాకోకచిలుకల గుంపులా గూడు కట్టుకోక మునుపే
ఒక ముఖంలో, ఒక పూవులో, ఒక మబ్బులో, ఒక వాన చినుకులో
ఒక వాన చినుకుతో మొదలయ్యింది!

# తన చేతివేళ్లు

ఎన్నేళ్ళో అయింది

తన చేతివేళ్ళని కాస్త ఓదార్పుగా పట్టుకుని. బహుశా నాకు నాలుగైదు నెలలు ఉన్నప్పుడో లేక ఇంకా అంతకు మునుపో తన చేతివేళ్ళని అలా ఒక పక్షి గూడులా నా చేతివేళ్ళతో అల్లుకుని ఉంటానేమో కానీ, మళ్ళా ఇంత కాలానికి తన చేతివేళ్ళని పదిలంగా నా అరచేతుల్లోకి తీసుకోవడం: వడలిపోయి రాలిన పూలకాడలను ఏరి, జాగ్రత్తగా ఎత్తి పట్టుకున్నట్లు -

"నొప్పి" అని తను అంటుంది. తను ఎవరు అని మీరడిగితే, ఆ తనువు అమ్మే. అవును మళ్ళా అమ్మే. తన చేతివేళ్లపై, తన పసుపచ్చని చేతివేళ్లపై, తన ముంజేతిపై ఆకుపచ్చని నరాలు తేలి వాచిపోయి, తల్లి లేని పసిపాపల్లా, "నొప్పి" అని ఏడిస్తే ఎవరూ పట్టించుకోని ఆనాధల్లా - బెక్కి బెక్కి ఏడ్చే - తన చేతివేళ్ళే. ఆ చేతివేళ్ల వెనుక దాగున్న, మీకు తెలియని తన జీవితపు నెత్తుటి చారికలే -

మరి, తెలియదేమో మీకు: ఇప్పుడు తనకో అరవై ఐదు. నాకో నలభై రెండు. ఇన్నాళ్ళూ ఎవరు ఎటువైపు చెదిరిపోయామో, మబ్బులమై ఎటు కొట్టుకుపోయామో, వర్షమై ఎక్కడ రాలిపోయామో - మీకు తెలియదు. తనకి తెలుసో లేదో కూడా నాకు తెలియదు, కానీ

తలుపు సందులో పడి ఇరుక్కుపోయి, నలిగిపోయి, వణికిపోతున్నట్లు ఉండే తన చేతివేళ్ళని ఎప్పుడైనా పొరపాటున మీ అరచేతుల్లోకి తీసుకుంటే, పొంగుకు వచ్చే ఒక దుఃఖం. మీ గుండెలోకి ఎవరో చేతులు జొనిపి మీ హృదయాన్ని చీల్చి బయటకి లాగినట్లు ఉండే, కమ్ముకునే ఒక నిస్సహాయత. నొప్పి. నీకు కూడా. ఆ తరువాత ఇక చివరకు మిగిలేదల్లా - ఇంకొంత కాలానికి తన చేతివేళ్ళు ఉండవు అనే స్పృహ. తనూ ఉండదు అనే స్పృహ. తను ఉన్నప్పుడు ఒక్కసారైనా తన చేతిని మీ చేతుల్లోకి తీసుకుని, ఊరకే రికామిగా తనతో ఎందుకు కూర్చోలేదనే దుఃఖం. తను మిమ్మల్ని కని ఏం బావుకుంది అని బావురుమంటో, ఈ లోకంలో ఒంటరిదై రాలిపోయే, మీ శరీరాలంతటి ఒక కన్నీటి చుక్క. అంతే.

# ఆనాడు

"ఇక్కడ - ఎవరికీ ఎవరూ, ఏమీ కారా'' అని ఏడ్చింది తను - ఆనాడు.

నాకు బాగా జ్ఞాపకం - ఆనాడు.
పది కిలోమీటర్లు నడిచి, తన గదికి చేరుకుని ఉంటాను - ఆనాడు.
టికెట్కి డబ్బులు లేక, మిగిలిన రూపాయితో బీడీలు కొనుక్కుని
నన్ను నేను తొక్కుకుంటూ, నీడలతో మాట్లాడుకుంటూ
మరో దారి లేక, మార్గం లేక తన గదికే చేరుకొని ఉన్నాను - ఆనాడు -

అశోకా ఆకులు విలవిలలాడుతూ ఉండినై తన గది ముందు - ఆనాడు.
తన గది తలుపుల పూల కర్టెన్, సన్నగా ఊగుతూ ఉండింది - ఆనాడు.
సన్నటి గాలి ఒకటి గదినంతా కమ్మి కన్నీటి వాసన వేస్తూ ఉండింది -
ఆనాడు - పల్చటి ఎండ ఒకటి

తన గదిలో నేలపై, దొర్లుతూ బెక్కుతూ ఉండింది - ఆనాడు. మరచాను

గోడపై ఒక ఏసు క్రీస్తు చిత్రమూ, టేబుల్పై ఒక పూలపాత్రా, ఇంకా
తను తెచ్చుకుని అమర్చుకున్న వెదురు బొమ్మలేవో కాలిపోయి
రాలిపోయేందుకు మిగిలిపోయినట్లు ఉన్నై - ఆనాడు. అవునా రోజు
ఆ గదిలో - ఆ మంచంపై

తెల్లని దుస్తులతో, మూలకు గిరాటేసిన ఒక మాంసం ముద్ద వలే
కుత్తుక తెగి కొట్టుకులాడుతున్న కోడిపిల్ల వలే గుండెలు పగిలేలా
గుండెలు చరుచుకుంటూ ఏడుస్తున్న ఒక తల్లివలే, పసిపాపవలే
ఆ గదిలో - ఆ మంచంపై, తనే ఆనాడు

"లంజాకొడుకు. మళ్ళా వచ్చాడు. ధెంగి, ఉన్నదంతా దెంకపోయాడు.
ఇంకేం పెట్టను పిల్లలకి''
అంటే, ఒక మూలగా బెదురు

బెదురుగా ఇద్దరు పిల్లలు. నెత్తురు చారికలు. చిరిగిన చీర. తెగిన బ్లౌజు.
విరిగిన గాజులూ. బూటు ముద్ర పడ్డ పొత్తి కడుపు కిందుగా

తుక్కు తుక్కయిన తన యోనిలోంచి
చుక్కచుక్కగా
చుక్కచుక్కగా
చుక్కచుక్కగా
నెత్తురు

"ఇక్కడ - ఎవ్వరికీ ఎవరూ ఏమీ కారు" అని తను
ఒక బండ కేసి బాదుకున్నట్లు
నాకేసి తన తలను కొట్టుకుని
ఏడ్చిననాడు

ఆనాడు!

# తను

అప్పుడు, తన ఇంటికి వెళ్లాను

ఎవరో కొమ్మనుంచి తెంపి పడవేస్తే,  నేలపై రాలి
ఇక పూర్తిగా ఎండి, గాలికీ ధూళికీ కొట్టుకుపోయే ఆకునై తన గుమ్మం ముందు
వణుకుతూ ఆగాను:

అప్పటికి తనకి పెళ్లై పోయింది

చాలా చిక్కిపోయి ఉంది తను
చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న ఒక రోగిలాగా ఉండింది తను -
విదేశాల నుండి తనని చూసేందుకు వచ్చిన
తనని వొదిలి వేసిన కొడుకుని చూసి

అప్పటికీ ఒక నవ్వుతో, అతి కష్టం మీద
మంచంపై నుంచి లేచేందుకు ప్రయత్నించే, ఆస్థిపంజరం వలే మారిన
ఒక తల్లిలానూ ఉండింది తను. నాకు అలానే ఎదురుపడింది తను -

మరి అప్పటికి ఇంకా, నాకు పెళ్లి కాలేదు

అప్పుడు
తనని అడగాలనే అనుకున్నాను
ఎలా ఉన్నావనీ, ఇదంతా ఏమిటనీ, ఎందుకు ఇలా జరిగిందనీ, ఇలా
ఎందుకు మిగిలావనీ, ఇంకా ఏమేమో
చాలానే - ఆడగాలానే అనుకున్నాను

గతించిన వాటిని ఏమీ మార్చలేని
ఇలాంటివే, ఎందుకు పనికిరాని ప్రశ్నలనే ఎన్నో అడగాలనే అనుకున్నాను
మాటల్ని కోల్పోయి ఒక మూగవాడిలా, ఇలాగే ఏవో
ఏవేవో ఎన్నెన్నో సంజ్ఞలు చేయాలనే అనుకున్నాను

అప్పుడు
కళ్ళ వెంబడ నీళ్ళు పెట్టుకుంది తను
ఇంకా అప్పటికీ నేను, ఒక గూడూ గుమ్మం లేకుండా మునుపటిలానే
మనుషుల్నీ మట్టో కొట్టుకుని రోడ్లపై తిరుగుతున్నానీ గ్రహించింది తను
ఏదో చెప్పాలని కూడా అనుకుంది తను
నా చేతిని ఒకసారి

గట్టిగా పట్టుకుందామని
తన చేతిని తపనగా చాచి, మళ్ళా అంతలోనే ఆగిపోయింది తను. కళ్ళు తుడుచుకుంది
తను: ఏవో పేర్లు పిలిచి, గదిలోకి పరిగెత్తుకు వచ్చిన
ఇద్దరు పిల్లలని చూయించింది తను. ఆపై

ఎందుకో తల వంచుకుంది తను. తనలో
తాను ఏదో గొణుక్కుంది తను. ఆకాశం మసకేసి, గాలి రేగి - మబ్బులేవో చుట్టుకుని
నేలపై నల్లని నీడలు వ్యాపించి ఘోష పెడుతూ ఉంటే
లేచి, వణికే చేతులతో ఒక దీపం వెలిగించింది తను -

అప్పుడు, అంతసేపూ, ఆ తరువాతా
చినుకులు ఇనుప తాళ్ళై, ఇంటిని బిగించి తిరిగి వదులు చేసేలోపు, నేను
ఆ ఇద్దరు పిల్లలనీ ఒళ్లో కూర్చో పెట్టుకుని
ఏవో అడుగుతున్నంత సేపూ

అన్నం వండింది తను. హడావిడిగా ఏదో కూర చేసింది తను
ఒక ప్లేట్లో ఇంత వడ్డించుకుని వచ్చి, తినమని, నా ఎదురుగా మసిపట్టి
వెలుగుతున్న కిరసనాయిలు బుడ్డీ వలె కూర్చుంది తను -
నా ముఖంలో ముఖం పెట్టి కూర్చుని
"చెప్పు: ఎన్నాళ్ళిలా" అని అడిగింది, తను.

అప్పుడు
తనని చూద్దామని తనది కాని ఇంటికి వెళ్ళినప్పుడు
తను పెట్టిన అన్నం తింటున్నప్పుడు, నా గొంతుకేదో అడ్డం పడింది -
ఇక ఇప్పుడు

ఈవేళ
అన్నం తింటూ పొలమారితే
తనే నా గొంతుకు అడ్డం పడి, తను లేని ఆ అక్షరాలే ఇలా ఇక్కడ
ఇంకా ఇప్పటికీ గుండెకు అడ్డం పడి
ఇలా వెక్కిళ్ళు పెట్టుకునే
తనో, నేనో లేక ఇంకా మరెవరో...

అంతే. ఇంకేమీ లేదు.

# బియ్యపు గింజల కథ

ఇదంతా పాతదే
బియ్యాన్ని నువ్వు గుప్పిళ్ళతో తీసుకుంటున్నప్పుడు
ఒకప్పుడు నువ్వు బియ్యం డబ్బాలో వేసిన వేపాకులు - ఎండిపోయి ఇప్పుడు -
నలిగి చేసే, పిగిలిపోతున్న శబ్దాలే -

మరి
ఒకతనేమో - బియ్యం ఉండటమే ముఖ్యం అని అంటాడు
మరొకతనేమో - బియ్యాన్ని వెలికి తీసే చేతులే ముఖ్యం అని అంటాడు
ఇంకొకతనేమో - బియ్యాన్ని ఇన్నాళ్ళూ కాపాడిన వేపాకులను చూడమని అంటాడు
చివరతనేమో - బియ్యాన్ని వండే చేతుల గాథ వినమని చెబుతాడు
మొదటతనేమో - ఇంతా చేసి మీరు

బియ్యాన్ని తనలో నింపుకున్న డబ్బాని
మరచిపోయారని గురుతు చేస్తాడు. ఇక
మొదటా చివరా కానీ అతను - అప్పుడు

ధాన్యం వచ్చిన నేల గురించీ పండించిన చేతుల గురించీ చెబితే
ఏడో అతను - ధాన్యాన్నీ, ఆ నేలనూ, పండించిన శరీరాలనీ
త్రవ్వుకుపోయే రాబందులనీ గుర్తించమని వేడుకుంటాడు -

నీ నోట్లోకి వెళ్ళే ప్రతి గింజ పైనా ఒక రక్త లిఖిత చరిత్ర ఉందనీ
ఏదీ శూన్యంలోంచి వచ్చి శూన్యంలోకి పోదనీ చెబుతాడు -
కొంత కార్యచరణుడివై, ఈ లోకకాలంలో సంచరించాల్సి ఉందనీ
అది నీ ప్రాథమిక కర్తవ్యమనీ చెబుతాడు. అరచేతుల్లో ఒక అద్దం ఉంచుతాడు -

సరే. సరే. సరే. మరేం లేదు.
ఇదంతా పాతదే. ఇదంతా బియ్యపు గింజల కథే.
బియ్యాన్ని నువ్వు గుప్పిళ్ళతో తీసుకుంటున్నప్పుడు
బియ్యంతో కలగలసిపోయిన ఎండిన వేపాకులు

నలిగిపోయి చేసే అనాథల ఆక్రందనలే -

అయితే, ఆ శబ్దాలు మరిప్పుడు
ఎటువైపు నిలబడి ఉన్నాయో
ఏ ఏ కథలని వింటున్నాయో
నేను నీకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదనే అనుకుంటున్నాను.

# మెరుగు

ఏవో కొన్ని పదాలని అనుకుంటాను
ఒక దీపం అనీ, ఒక పూవు అనీ, ఒక వాన అనీ, ఒక వెలుతురు అనీ
ఒక 'నువ్వు' అనీ. అన్నీ ఇట్లాంటివే -

అవి కొన్నిటిని సూచిస్తాయని అనుకుంటాను
దీపం దీపాన్నీ, పూవు పూవునీ, వాన - చినుకులనీ
వెలుతురు కాంతినీ, 'నువ్వు' అనే పదం
'నిన్ను'నే సూచిస్తాయని అనుకుంటాను -
అలా కాకపోయినా

దీపం ఒక పూవునీ, పూవు ఒక తుంపరనీ
వాన ఒక కాంతినీ, ఆ ఒక్క కాంతి కరుణనీ
ఆ కరుణ చివరికి 'నిన్ను'ని చూపిస్తాయనే అనుకుంటాను - లేదా
నువ్వే ఆ కాంతివనీ

ఆ కాంతే నీలోంచి తుంపరగా
వానగా, పూలుగా, చీకట్లో వెలిగించిన దీపంగా మారిందనీ
రెండు అరచేతులు లేక గాలికి వణుకుతుందనీ

ఇలా - ఏవేవో ఊహిస్తాను: ఊహించినవే రాస్తాను

రాసిన వాటినే అవి
సూచిస్తాయని కూడా అమాయకంగా అనుకుంటాను -
ప్రతి పదంలో ఒక ముఖం ఉందనీ, ఆ పూర్ణబింబాన్ని
నా అరచేతుల్లో ఒడిసి పట్టుకుని

గుండెలకు హత్తుకుని, ఎంతో ఇష్టంగా
మాట్లాడదామని కూడా అనుకుంటాను

మరి ఎలా తెలుసు నాకు, ముఖం స్థానంలో ఒక సమాధి ఉండవచ్చుననీ
ఒకరిని ఊహించి ఆత్రుతగా తలుపులు తెరిస్తే

అక్కడ మరొకరు లోపల ఊహించలేనన్ని గదులతో
మరిన్ని మూసిన తలుపులతో, గర్భ కుహరాలతో ఎదురొవ్వచ్చుననీ
తాళం చెవులు లేక, మాట్లాడే పెదాలూ లేక
నేను స్థాణువై మిగిలిపోవాల్సి ఉంటుందనీ?!

అవును
నువ్వన్నదే నిజం
మౌనాన్ని మరింత మెరుగు పరచగలిగేటట్లైతే తప్ప, అస్సలు మాట్లాడకు!

# అనుకున్నాను

అవును. అప్పుడు, నిన్ను కలుసుకుందామనే అనుకున్నాను. నువ్వు వెళ్ళిపోయేలోపు ఒకసారి చూద్దామనే అనుకున్నాను. నువ్వు ఎలా ఉన్నావోనని అడుగుదామనే అనుకున్నాను. నీ పక్కన కూర్చుని నీ మాటలు విందామనే అనుకున్నాను. నీ అరచేతులలోకి నా అరచేతులని వొదిలివేసి కాసేపు నిశ్శబ్దం అవుదామనే అనుకున్నాను

నీ శరీర వనంలో వీచే గాలినీ, ఆ సవ్వడినీ కాసేపు శ్వాసించి విందామనే అనుకున్నాను. నీ కనుల సెలయేటి అలజడుల్లో నా ముఖం చూసుకుని, కడుక్కుందామనే అనుకున్నాను. నా నుదిటపై నిన్ను ఒక పవిత్ర చిహ్నంలా దిద్దుకుందామనే అనుకున్నాను. నీ పెదాలపై నా పేరు మరొకసారి వినబడితే చిన్నగా నవ్వుకుందామనే అనుకున్నాను. నీ పూలతోటల్లోకి, నీ వర్షాల్లోకి, నీ ఋతువుల్లోకి నీ లలిత వర్ణ లోకకాలలలోకి అడుగిడి కాసేపు తిరుగాడి నాకు నేను శుభ్రపడదామనే అనుకున్నాను.

అవును. ఇది నిజం -

నిన్ను కలిసి, నాకు నేను తారస పడదామనే అనుకున్నాను. నిన్ను కలిసి, నేను ఇంకా బ్రతికే ఉన్నానని నాకు నేను రూఢీ చేసుకుందామనే అనుకున్నాను. ఒక్కసారి నిన్ను కలిసి, నిన్ను చూసి, నిన్ను తాకి, నిన్ను శ్వాసించి, నెమ్మదిగా, వచ్చిన సవ్వడే లేకుండా, వెళ్లిపోదామనే అనుకున్నాను. ఇవి కాక, వేరే పదాలు వ్రాసుకుందామనే అనుకున్నాను

అవును. ఇది నిజం.
'అప్పుడు, నిన్ను కలుసుకుందామనే అనుకున్నాను' అలా అని నేను ఇప్పుడు చెబుతున్నానంటే, నువ్వు నన్ను - అస్సలే - నమ్మకు మరి!

# దూరం నుంచి వచ్చేవాళ్ళు

అలసిపోయి చాలా నెమ్మదిగా నీ వద్దకి వస్తారు వాళ్ళు -

ఒక వృక్షమేదో నరకబడి బరువుగా నేల కొరిగినట్లు, శరీరమంతా విలవిలలాడే ఆకులై చలించి, నీ పక్కగా పడుకుండి పోతారు వాళ్ళు. మన అమ్మలో, పిల్లలో, మన స్త్రీలో లేదా మన స్నేహితులో ఎవరో ఒకరు - గాలి లేని పగళ్ళలో కాంతి లేని రాత్రుళ్ళలో నీడలు కమ్ముకునే మధ్యాహ్నాలలో నిలువ నీడ లేని సాయంత్రాలలో హటాత్తుగానో, అతి నెమ్మదిగానో, నీ పక్కన చేరి, బేలగా నీ కళ్ళల్లోకి చూసే వాళ్ళు. అడగకనే అన్నీ అడిగేవాళ్ళు

చెప్పకనే అన్నీ చెప్పేవాళ్ళు. నీ అరచేతిలో మరొక అరచేయై, వణికే చేతివేళ్ళయి చెమ్మై, నీ గుండెలోని గుబులు కపోతమై నీలో ఒదిగి, నిరంతరం నీటిబుడగలు పగిలే శబ్దాలను చేసేవాళ్ళు. నిరంతరం, నీటి బుడగల లోకాల్ని నీకు చూయించే వాళ్ళు. వాళ్ళే - నీలో నాటుకుని, నీ తనువంతా పుష్పించే వాళ్ళు. పుష్పించడంతో నిన్ను రుధిరమయం చేసేవాళ్ళు. నీలో, నీకు కొంత కష్టం కొంత ఇష్టం అయ్యేవాళ్ళు. నీకు కొంత బలమూ, మరి కొంత బలహీనతా అయ్యేవాళ్ళు. నీకు కొంత ప్రేమా చాలా చాలా నిస్సహాయతా అయ్యేవాళ్ళు . నిన్ను వొదలని వాళ్ళు. వొదులుకోలేని వాళ్ళు. వాళ్ళు. వాళ్ళే

అమ్మలో, పిల్లలో, స్త్రీలో, భార్యలో, ప్రియురాల్లో లేక స్నేహితులో చాలా అలసిపోయి, చాలా పగిలిపోయి, మరో దారి లేక, మరో దిక్కు కనపడక సమసిపోదామని, పార్లిపోదామని, ఈ లోకపు గట్టు ఏదో దాటి నీలోకి దుమికి కొట్టుకుపోదామనీ, ఆనవాలు లేకుండా వెళ్లిపోదామనీ నీ వద్దకు వస్తే, అటువంటి వాళ్ళని ఎన్నడూ 'ఎందుకు?' అని అడగకు. పొరబాటున కూడా ఎన్నడూ ముఖం దాచకు. చాచిన చేతినీ, తెరచిన ఛాతినీ, నీ ఇంటి తలుపులనూ నీ తోటి దేహసారికి ఎన్నడూ మూయకు. జాగురూకత లోకపు సంకెళ్ళ రీతిని, అస్సలే పాటించకు -ఎందుకంటే మిత్రుడా, ఈ పూటకు ఇక ఇదే, మనకు మిగిలిన ఆఖరి మధువు!

# రెండు

ద్వేషం నిండిన వాళ్ళతో మాట్లాడటం ఎట్లాగా అని, కిటికీలూ తలుపులూ మూసిన ఇంటిలో నేనొక్కడినే, నాలో నేను చాలా తర్కించుకుంటూ కూర్చుంటాను. చాలా మధన పడుతూ కూడా ఉంటాను. చెబుదామని కూడా అనుకుంటాను: చాలా - జీవితం చాలా తాత్కాలికమనీ, నీకూ నాకూ మధ్య విడదీయలేనంతగా బిగిసిపోయిన ఈ చిక్కు ముడులన్నీ ఎక్కువ కాలం ఉండవనీ, మనం నిజం అని అనుకునేవన్నీ మరి కొంత కాలానికి ఎవరికీ గుర్తుండవనీ ఆఖరికి నువ్వూ నేనూ కూడా మిగలమనీ- ఎలా చెప్పాలో తెలియక, నాకు నేను పరిమితమయ్యి, నాతో నేనే ఒక సంభాషణ అయ్యి "ఇవతలి వాళ్ళూ, అవతలివాళ్ళూ అని లోకాన్ని చూడటం, ఒక అసంపూర్ణ వీక్షణ" అని నీతో చెప్పాలనీ చెప్పలేక, ఇక నేనే ఒక 'ఇవతలా - అవతలగా' చీలిపోయి, రెండుగా మారిపోయి నువ్వు ఊహించుకునే ఒక ద్వేషంలోకి, నేనే ఒక చీకటిగా మారిపోయి, ఊపిరందక తలెత్తి చూస్తే ఇల్లంతా నీలాంటి చీకటి. ఇల్లంతా నాలాంటి చీకటి. ఇంటి బయటి కాంతినీ ఊయల ఊగే గాలినీ, అల్లుకునే లతలనీ, అరిచే పిట్టలనీ, రంగుల పూలనీ లోపలి రానివ్వక బంధించిన తలుపులూ, కిటికీల దిగ్బంధనం. బావురుమనే ఊపిరాడనివ్వనితనం - ఇక, ద్వేషం నిండిన వాళ్ళతో మాట్లాడటం ఎట్లాగా అని - నాకు నేనే - నా ఇంటి తలుపులూ కిటికీలూ మూసుకుని, నేనొక్కడినే, నాలో నేను చాలా తర్కించుకుని మధనపడీ, తపన పడీ లేచి అసహనంగా కిటికీలూ తలుపులూ తెరిస్తే, గదిలోకి వరదలా పొర్లుకు వచ్చే వెలుతురు. వాన చినుకుల తడి చినుకుల కాంతిలో పొదగబడే రంగుల పూల పరిమళం - చిట్లుతున్న విత్తనాలూ, తొలి చివుర్ల జీవన ఉత్సాహమూ, ఇంకా నేను. నేను అనే నువ్వు. నువ్వు అనే సమస్థం - ఒక శాంతి లోకం, కాలం.

# అందుకే

నేను
నీ వాడినని ఎన్నడూ చెప్పలేదు
పూలల్లో దారం గుచ్చుకుంటూ, నువ్వూ ఎన్నడూ అడగనూ లేదు -

ఇక
ఈ సాయంత్రాన్ని చీకట్లోకి తురుముకుని
నువ్వు చినుకులని వినే వేళ, రాత్రి దారుల్లో నెత్తిన రుమాలుతో
ఒక్కడే

ఒక బాటసారి.
శరీరం తప్ప ఆత్మ అంటూ ఏమీ లేని దేహధారి.
నీ సువాసనలో కాలి బూడిదై, చుక్కలు ఇంకిన చినుకులతో, గాలితో

రాలే ఆకులతో
గులకరాళ్ళకు పైగా, చిన్ని చిన్ని చివుక్ చివుక్ శబ్దాలు చేసుకుంటూ
తనలో తాను మాట్లాడుకుంటూ

బహుశా
ఇటువంటి ఒక కవితను వ్రాసుకుంటూ
చీకట్లలో, పక్షులు బెంగగా ముడుచుకున్న చెట్ల కింద నుంచి
వణుక్కుంటూ, గొణుక్కుంటూ
తనలో తాను నీరై పారిపోయే మనిషి -

బహుశా అతనికి
నువ్వూ, ఎన్నడూ తన దానివని చెప్పనూ లేదు. బహుశా, అతనూ
ఎన్నడూ నిన్ను, 'ఎందుకు?' అని అడగనూ లేదు

బహుశా, అందుకే
పూలల్లో దారం గుచ్చుకుంటూ, చిన్నగా పాడుకుంటూ

గడప వద్ద దీపపు కాంతిలో వెలిగిపోయే
- నువ్వు -

మరెక్కడో
తెంపబడిన పూల చీకట్లలో నేను!

# అతిథి

తన ఇంటికి వెళ్లాను

అప్పుడు చప్పున తన ముఖం వికసించింది. నన్ను లోపలకి రమ్మని పిలిచి
కూర్చోమన్నది. మంచి నీళ్ళు తాగుతావా?
కాఫీ పెడతాను. టిఫిన్ చేసావా అని పాపం

ఆదరాబాదరాగా తను కిందా మీదా అయ్యింది
కలగాపులగం అయ్యింది. కంగారు పడింది
నేను అప్పుడు అన్నాను

"ఇప్పుడేమీ వద్దు. నేను తినే వచ్చాను.
ఇంతకూ నువ్వు టిఫిన్ చేసావా?" అని
తదేకంగా తన ముఖంలోకి చూసాను

అప్పుడు
ఆ ఇంటి ఆవరణలోని వేపచెట్టు చలించి, పాలిపోయిన ఆకులు
రాలాయి. ఎక్కడిదో గాలి, హృదయాన్ని
చెక్కేలా నింపాదిగా వీచింది. పిల్లి ఒకటి

గోడపై నుంచి కడిగిన గిన్నెల మధ్యకు దూకగా
అవన్నీ చెల్లాచెదురై పెద్ద శబ్దం చేసాయి -
ఇంటి వెనుక ఆరవేసిన దుస్తులు కూడా

ఒకదానికి మరొకటి ఒరుసుకుని ఏవో గొణిగాయి
ఆనక నిశ్చలమయ్యాయి. ఇక వరండాలో
నేలపై, తను అప్పటిదాకా దువ్వుకున్న

దువ్వెనలో ఇరుక్కుని, తొలిగిన జుత్తే ఆ ఎండలో, నేలపై
తెల్లగా, మెల్లిగా, తన చేతివేళ్ళ వలే

వణుకుతూ, వేపాకులతో దొర్లిపోతూ...

ఏమీ లేదు -
ఈ ఉదయం ఇంటికి వెళ్లాను
ఒక అతిథి వలే అమ్మను చూసి వచ్చాను

# నేనే

1
నిరంతరం నిన్ను నీకే విసుగు కలిగించేలా చేసే దైనందిన వ్యాపకం - అందుకే ఎక్కడికైనా తప్పించుకు పోదామని అనుకుంటావు. నిన్ను నువ్వు పూర్తిగా మరచి పోదామని కూడా

2
తోటలో పూలతో గడపటం సాంత్వన అనుకుంటావు. పూలని కిలకిలా నవ్వే శిశువులుగా ఊహిస్తావు. లేదా, కిటికీ పక్కన కూర్చుని మబ్బులు కమ్మిన మధ్యాహ్నం, గాలి మునివేళ్ళని తాకుతూ ఒక వానని స్వప్నిస్తావు. కలలోని చినుకులతో ఆడుకుంటావు లేదా రాత్రుళ్ళని చల్లగా కప్పుకుని నక్షత్రాలని విందామని కూడా - అవి నీకు చెప్పే, నీకు తెచ్చే యుగాల భూమి కథలనీ మట్టి వాసననీ నీ హృదయంలోకి ఇంకించుకుందామనీ, అతీతమైనదేదో అర్థమయితే నీ కనులలోకి ఊటలా నీరు ఊరితే, పూలని స్వప్నించే ఒక పచ్చని చెట్టు ఒడిలో నిదురోదామనీ తిరిగి కనులలో పూలరంగులతో, పూల చినుకులతో నిదుర లేచి తప్పటడుగులతో ఈ లోకంలోకి బ్రతకడానికి బయలుదేరుదామనీ -

3
నిరంతరం నీపై నీకే చికాకు కలిగేలా చేసే రోజూవారీ ప్రదర్శనశాలలో ఎక్కడో తప్పిపోతావు. పూలూ, నక్షత్రాలూ, వాన కురిసే సాయంత్రాలూ అమలినమైన ప్రేమలూ, శరీరాలకు అతీతమైన ఆత్మల కోసం వెదికీ వెదికీ వేసారిపోతావు - అవన్నీ వాచాకాలపై వాచకాలు అనీ, ఒక నాటకం అనీ నీలోకి నెమ్మదిగా చేరే, నిన్ను నీ నుంచి దూరం చేసే ఒక మహామాయాజాలం అనీ భాషలోకి రాని సత్యమేదీ లేదని గ్రహిస్తావు. ఇదే లోకం అనీ పాపం పుణ్యం, శాపం శోకం, వేదం వాదం, కర్మా కర్తా క్రియ అంతా మనిషేననీ ఇంతా చేసి, తప్పించుకుపోదామనుకున్న ఆ మనుషులే మనకు చివరికి మిగిలే పరమ సత్యమనీ, వారితోనే జననమనీ, మరణమనీ వాళ్ళే జనన మరణాలనీ తెలుసుకుంటావు ఒక దినాన, మధుశాలల్లో రద్దీ రహదారుల్లో, వాళ్ళ మోసాలలో వాళ్ళ అమాయకపు ఇష్టాలలో, నీకు ఎదురేగి నిన్ను బలంగా కౌగలించుకునే బాహువుల్లో, వాళ్ళ నవ్వుల్లో, ఆ ఒకే ఒక్క వ్యక్తికై నువ్వు ఎంతో దూరం ప్రయాణించే కన్నీటి దూరాల్లో వేసవి ఎడారుల్లో వర్షాకాలపు నదులలో వాళ్ళ నాట్యాలలో, వాళ్ళ

యుద్ధాలలో, వాళ్ళ దినదిన కార్యాకలాపాలలో, కాలకృత్యాలలో వాళ్ళ సువాసనల్లో, వాళ్ళ మాటల్లో, వాళ్ళ చేతల్లో వాళ్ళే ఋతువులైన ఒక మహా కాలంలో ఇతరమే తానని తానే ఇతరమనీ -

**4**

నిరంతరం నీపై నీకే విసుగు కలిగించేలా, నిరాసక్తత పెంపొందించేలా చేసే ఈ యాంత్రిక దినదిన యధాలాపపు వ్యాపకంలో నిన్ను నువ్వు పూర్తిగా గుర్తుంచుకోవడమే అంతిమ మార్గమని బోధపడి మేలుకొని, లేచి కూర్చుని ఇలా, ఒక పాటని వింటూ...

**5**

నువ్వూ వింటున్నావా, నేనే అయిన ఈ గీతాన్ని?

# తాకాలని

ఈ నగరం తాకని, ఏ వెన్నెల వానో కురిసే, రాత్రిలో తడిచే పూలను
సున్నితంగా పరికించినట్లు, నీ చేతివేళ్ళని
తాకాలని అనుకుంటాను -
అవే

నిద్దురలో ఒక పక్కకి ఒత్తిగిల్లి, నాకు తెలియని భాషలో కలవరించే నీ చేతివేళ్ళు -
అద్దంపై పొగమంచుని తుడిచి ముఖాన్ని చూసుకున్నట్లు
అప్పుడొక

గగుర్పాటు. ఉదయమంతా పొగచూరి, మసిబారి, ఇప్పుడిక ముడతలు పడి
వెక్కి వెక్కి ఏడ్చి నిదురలోకి జారిన, పసిపాపల వంటి నీ
చేతివేళ్ళు -

చీపుర్లు అయిన చేతివేళ్లు. వంట గిన్నెలయ్యిన చేతివేళ్ళు. దుస్తులయ్యిన చేతివేళ్లు
సబ్బూ, రుబ్బురోలు పత్రమూ, గదులూ మలమూ మూత్రమూ ఏర్పరిచిన
పసుపుపచ్చ
మరకలనూ
శుభ్రం చేసే

శ్రమా అయిన చేతివేళ్ళు. నువ్వు కక్కుకున్నప్పుడు మట్టికుండై నిన్ను నింపుకున్న
చేతివేళ్లు. అన్నం పెట్టే చేతివేళ్లు. నీకు నీళ్ళు తాపించే చేతివేళ్లు
అప్పుడప్పుడూ
తలుపు చాటున

కండ్లల్లో నీళ్ళు కుక్కుకునే చేతివేళ్లు. అప్పుడప్పుడూ మూగవోయె చేతివేళ్లు. నుదురుని
అరచేతిలోకి వొంపుకుని రాత్రంతా కూర్చునే చేతివేళ్లు
నిన్ను శపించలేని చేతివేళ్లు
నిన్ను దీవించే చేతివేళ్లు

నిన్ను ప్రేమించీ, ప్రేమించీ గరకుగా మారి, ఇప్పుడిక ఒక కలత నిద్రలో
పెరడులో ఆరవేసిన దుస్తులు రెపరెపా కొట్టుకుని, ఒక ముళ్ళతీగకు చుట్టుకుని
ఆగిపోయినట్లున్న, నీ చేతివేళ్లు -
తిరిగి గాలికి కదిలి

తను కొద్దికొద్దిగా చిరుగుతూ, ముల్లుతో ఉండా లేకా, పూర్తిగా వొదిలి వెళ్లిపోలేకా
మరింతగా చీలిపోయే నీ చేతివేళ్లు
చీకట్లో దీపాన్ని వెలిగించే చేతివేళ్లు

అదే దీపాన్ని ఆర్పుతూ మరెవరివో చేతివేళ్లు. ఇక మరి ఎక్కడిదో ఒక గాలి ఇక్కడ
వీచీ వీచీ, ఇక వీయలేక వెళ్ళిపోతే
కాలం స్థంబించిన ఆ క్షణాన

ఈ నగరం తాకిన, ఏ వానా కురియని రాత్రిలో సొమ్మసిల్లిన నీవంటి, అమ్మవంటి
నీ చేతివేళ్ళని తాకాలని అనుకుంటాను. తాకుతాను
ఇంత ఎరుకతో
నిన్ను తాకాక

తాకడమంటే, తాను ఇతరమవ్వడం అని తెలిసాక, తాకడమే శోక నివారణ అని
తెలిసాక, ఇక మునుపటిలా, నేను నేనులా
ఎలా ఉండగలను?

# నీ గది

తళతళలాడింది నీ గది: ఆనాడు. అప్పుడు, ఇంకా మబ్బు పట్టక మునుపు -

నీకు నచ్చిన
అగరొత్తులను వెలిగించి నువ్వు కూర్చుని ఉంటే, నీ చుట్టూతా
నిన్ను చుట్టుకునే

సన్నటి, పొగల లతలు:
అవి, నా చేతివేళ్ళు  అయితే బావుండునని ఊహించాను నేను, ఆనాడు:
అప్పుడు

చిరుగాలికి, చిన్నగా కదిలాయి
కర్టెన్లూ, నేలపై నువ్వు చదివి ఉంచిన దినపత్రికలూ, నువ్వు రాసుకున్న
కాగితాలూ

పచ్చిక వలే
నీ ముఖం చుట్టూ ఒదిగిన నీ శిరోజాలూ, చివరిగా నేనూనూ. "కొమ్మల్లోంచి
ఒక గూడు రాలిపోయింది
సరిగ్గా

ఇటువంటి
వానాకాలపు మసక దినాన్నే. చితికిపోయాయి గుడ్లు - వాటి చుట్టూ
గిరికీలు కొట్టీ కొట్టీ
అలసిపోయాయి

రెక్కలు. తెలుసా నీకు?
అమ్మ ఏడ్చింది ఆ రోజే, అని చెప్పాను నేను. "నాకు తెలుసు" అని అన్నావు
తిరిగి పొందికగా నీ గదిని

సర్దుకుంటూ  నువ్వు:

నేలపై పరచిన తివాచీ, తిరిగిన ప్రదేశాల జ్ఞాపకార్థం కొనుక్కు వచ్చిన బొమ్మలూ
పింగాణీ పాత్రలూ

ఓ వెదురు వేణువూ
ఇంకా సముద్రపు తీరం నుంచి నువ్వు ఏరుకొచ్చుకుని దాచుకున్న శంఖమూనూ.
ఇక నేనూ పొందికగా

ఆ వస్తువుల మధ్య
సర్ధబడీ, అమర్చబడీ, బొమ్మగా మార్చబడీ నువ్వు ముచ్చటగా చూసుకుంటున్నప్పుడు
ఎక్కడో అలలు

తెగిపడే వాసన -
తీరాలలో అవిసె చెట్ల హొరూరు. ఒడ్డున కట్టివేయబడిన పడవలు అలజడిగా కొట్టుకులాడే
తీరు. కళ్ళల్లో కొంత
ఇసుకా, ఉప్పునీరూ -

మరి, తళతళలాడి
ఆనక మబ్బుపట్టి, ఈదురు గాలికి ఆకులూ, పూవులూ, ధూళీ రాలడం మొదలయ్యిన
ఆనాటి నీ గదిలో

ఇక ఇప్పటికీ ఒక వాన కురుస్తూనే ఉందా?

# ఇల్లాగే వెళ్ళిపోతాం

ఇల్లాగే వెళ్ళిపోతాం నువ్వూ నేనూ -
ఇల్లాంటి పల్చటి గాలిలాగే, ఇల్లాంటి వానా కాలపు మబ్బుల్లాగే, తేలికగా, బరువుగా నింపాదిగా ఇల్లాగే -

అప్పుడు గుర్తుండవు ఇవేమీ. ఈ క్షణాలు -
నువ్వూ నేనూ తిట్టుకున్నవీ, కొట్టుకున్నవీ, మన మౌనాలతో క్షతగాత్రులమైనవీ, దిగులుతో ఒంటరిగా పడుకున్నవీ

ఒంటరిగా వణికిపోయినవీ, కూర్చున్నవీ
ఉగ్గపట్టుకున్నవీ, తమలో తాము చుట్టుకుపోయి కుదించుకుపోయి, ఏడ్చీ ఏడ్చీ లోపలెక్కడో ఆఖరకు నిలిచిపోయినవీ

ఇవ్వేమీ గుర్తుండవు మనకి అప్పుడు.
ఆనాడు, మనం కలుసుకున్నప్పుడు, నీలో నాలో రేగిన ప్రకంపనాలు తప్ప, ఇప్పటికీ కొట్టుకు వచ్చే ఆ తరంగాలు తప్ప
ఆనాడు మనం కలుసుకున్నప్పుడు

ఏర్పడిన ఒక అమాయకపు ఇష్టం తప్ప కలిసి బ్రతుకుదామనే ఒక నులి వెచ్చని స్వప్న సువాసన తప్ప, మట్టి దారుల్లో మనం నడుస్తున్నప్పుడు నేను నీకు ఇచ్చిన

ఒక అనామక పసుపు పూవు తప్ప
ఆనాటి నీ చిరునవ్వు తప్ప, నువ్వు నా అరచేతి పుచ్చుకుని గట్టిగా ఒత్తిన స్పర్శ తప్ప
చెవిలో చెప్పిన గుసగుసలు తప్ప

ఆ పెదాల తడి తప్ప, ఆ రాత్రి తప్ప
హత్తుకున్న మన చేతులు తప్ప, మన శరీరాల తప్ప, లోతైన మన అవయవాల భాష తప్ప, అంతిమంగా, ఆనాడు

మనం కలుసుకున్నప్పుడు

మొదలయ్యిన ఒక జీవితకాలపు పవిత్ర నేరం, శిక్షా, సజీవ ఖైదూ తప్ప, 'నీతోనే జననం నీతోనే మరణం' అనే కాలం తప్ప

నాకు నువ్వూ, నీకు నేనూ తప్ప
అప్పుడు మరేమీ గుర్తుండవనీ, ఇల్లాంటి పల్చటి గాలిలాగే, ఇల్లాంటి రాత్రి మబ్బులలాగే బరువుగా, తేలికగా ఇల్లాగే

మనం వెళ్లిపోతామంటే, అలా అని ఇప్పుడు
నేను చెబుతున్నానంటే
నువ్వు నన్ను నమ్ము మరి!

# ఇక ఇప్పటికి

1
నిశ్చలమైన సరస్సులో నువ్వు నీ ముఖాన్ని చూసుకుంటున్నప్పుడు ఎవరో తటాలున అరచేతితో నీళ్ళని కదపగా, నీ ముఖం ఆవలి ఒడ్డు వరకూ తేలిపోయినట్లు ఒక అలజడి: నీ లోపల. ఒక రహస్య ప్రదేశంలో -

2
గోడలపై ఊగే లతలు. నీ చుట్టూతా వీచే గాలి నీ లోపల పేరుకుని, క్రమక్రమంగా పెరిగే మంచు కంటే, నీ కళ్ళల్లో వీచే పొగమంచు కంటే చల్లనైనదేమీ కాదు - ఒక చేయి వడలిన పూవై నీ మెడ చుట్టూ రాలిపడుతుంది అప్పుడు: అది నువ్వు తనే అన్నా తన అలసట అని అన్నా నాకేమీ అభ్యంతరం లేదు -

3
"కొద్దిగా  తోడు ఉండు నాకు. అప్పుడప్పుడూ చాలా బెంగగా ఉంటుంది - ఒంట్లో బావోలేదు. నాప్కిన్స్  తెచ్చుకోడానికి ఓపిక లేదు. బ్లీడింగ్ ఎక్కువుగా ఉంది" అని తను ముడుచుకుపోతే, అప్పుడు నువ్వొక నిస్సహాయుడివి. నేలపై వ్యాపించే రాత్రివి అంత నొప్పిలోనూ ఉదయం తను కడిగిన ఇంట్లో, తన శరీరం వాసన. ఎలెక్ట్రిక్ కుకర్లో ఉడుకుతున్న అన్నం వాసన. తెరచిన బాల్కనీ తలుపులోంచి చీకటి వాసన - "ఎక్కడికీ వెళ్ళకు. ఇంటి పట్టునే ఉండు" అని తను అంటే, పిల్లలు అయోమయంతో చూస్తారు, వేసుకుంటున్న బొమ్మల్ని ఆపి - "నాన్నా, బయటకి వెళ్తున్నావా?" అని అడుగుతో -

4
ఒక ముఖం వలయాలుగా విస్తరించి, ఒడ్డును తాకి తిరిగి లుప్తం అయ్యింది. జీవితం ఒక  అద్దం - జీవితం ఒక ద్రవ్య దర్పణం. కేంద్రకం తనైన దర్పణాన్ని ప్రతిబింబించే దర్పణం. చూస్తే

5
ఏముంది ఇక్కడ? ఒక చిన్న అద్దె ఇల్లు రెండు మంచాలూ, కొన్ని పుస్తకాలూ పిల్లలు ఆడుకునే వస్తువులూ, మాటలూ - వంట వండుకునే ఇన్ని పాత్రలూ, ఒక మట్టి కుండా, నాలుగైదు కుండీలూ ...

6

కడుపు నొప్పికి మాత్రలూ, వాలుతున్న తన కనురెప్పల కింద చలించే అరణ్యాలూ నుదిటిపై తెరలుగా వీచే పురాస్మృతులూ ... ఇక అరచేతిలో తను నీ అరచేతిని గట్టిగా పట్టుకుని పడుకుంటే, ఒదిగిపోతే, పసిపాపెవరో గుప్పిట్లో నీ చేతివేలిని గట్టిగా బిగించి పట్టుకున్నట్లూ, ఒక మహాజ్వరంలో బాల్యాన్ని నీ తల్లి కలవరిస్తున్నట్లూ నువ్వు ఆ కళ్ళ కింది సరస్సులలో నీ ముఖాన్నీ, నీ సమస్త జీవితాన్నీ చూసుకుంటున్నప్పుడు

7

చదువరీ, ఇక ఇప్పటికి ఇదే జీవితం, ఇదే కవిత్వం: నువ్వే చెప్పు ఇక, ఇంతకు మించి, వీటన్నిటినీ దాటి మిగిలేది ఏమిటి? నీకూ నాకూ - మనకూ?

# నోట్

ఎక్కడో చూసాను నిన్ను. అది ఏ దారి? యిక ఇప్పుడు నిన్ను గుర్తుపట్టలేను. ఉదయాన్ని పొద్దుతిరుగుడు పూవు సవరించే వేళల్లో కలిసి ఉంటాను నిన్ను. అందుకే ఇప్పటికీ, నువ్వు నన్ను దాటుకుని వెళ్ళినప్పుడల్లా నా చుట్టూతా ఒక సరస్సు విరిసిన వాసన. అందుకే ఇప్పటికీ, రహదారుల్లో నిన్ను పోలిన వేనవేల మనుషులు తాకుతుంటారు నన్ను. ఒక్కోసారి నవ్వుతుంటారు

ఎర్రటి మట్టిలో పాదు చేసి, మొక్కని నాటి నీళ్ళు పోసి ముంజేతితో నుదిటిని తుడుచుకుంటూ, చేతివేళ్ళు మెత్తగా దిగిన నేలను తృప్తిగా చూసుకున్నట్లు అటువంటి రకరాకాల మనుషులలో తారసపడతావు నువ్వు. ముచ్చటగా చూసుకుంటాను నేను-

పని కట్టుకుని ద్వేషించే వాళ్ళెవరూ లేరిక్కడ. బ్రతకాలి, కిందా మీదా పడి మీదా కిందా పడి, లోహపు కాలంలో లోతు తెలియకుండా బ్రతకాలి. కాస్త ఓపిక చేసుకుని చూడు వాళ్ళ కళ్ళని ఒక్కసారి! గాజుపాత్రలవి: నువ్వు ఆర్ద్రంగా వొంపితే అనంతంగా రాలే కన్నీళ్ళూ, కథలూ అవి. అందుకే తాకి చూడు ఒక్కసారి వాళ్ళని -

ఎక్కడో చూసాను, ఎప్పుడో చూసాను! నన్ను నీలో, నిన్ను నాలో -

వెళ్ళిపోకు, ఎరుకతో బ్రతికి ఉందామనే ఈ ప్రయత్నమంతా!

# నివేదన

అవాంతరాలూ  అడ్డంకులూ ఏమీ లేకుండా  అహ్మద్ ఆ రోజు త్వరగా ఇంటికి చేరుకున్నాడు.

అతను కనపడగానే, ఆ రోజు -  దారుల్లో  వీధుల్లో  ఎవరూ  మైకుల వాల్యూమ్ పెంచలేదు. అతను  వీధి మలుపు తిరగగానే  చేతులకీ, శిరస్సులకీ కాషాయపు రంగు నెత్తురు గుడ్డలతో అతనిని చూసి ఎవరూ వంకరగా నవ్వలేదు.  నడుస్తూ నడుస్తూ తల ఎత్తితే, ఆ రోజు ఎవరూ గార పట్టిన గుట్కా పళ్ళతో, మందు వాసనతో చీత్కారంగా కాండ్రించి  ఊస్తూ, మూడు గుండీలు విప్పిన  అంగీని వెనక్కి తోసుకుంటూ కనుబొమ్మలను కవ్వింపుగా ఎగుర వేయలేదు. ప్రతి సందూ కబ్జా అయ్యి ఒక రామ మందిర నిర్మాణమయ్యీ, అతను వాళ్ళని దాటుకుని ఒదిగొదిగి వెడుతున్నప్పుడల్లా ఎప్పటిలా లీలగా 'ఇస్కీ బెహెన్కి చోత్', 'మాధర్చోత్'  అనే పదాలు అతని వెన్నుని తాకలేదు. ఒక మస్జిద్ అతని హృదయంలో కూలగొట్టబడలేదు. దాటుకుంటూ వచ్చిన ప్రతి వీధిలోనూ  అతన్ని చూసీ చూడగానే ఎవరూ జై శ్రీరాం అని నినదించలేదు. ఉన్మాద నృత్యాలతో  గణగణగణమనే గంటలతో, నుదిటిన త్రిశూలాల వంటి బొట్లతో ఎవరూ అతన్ని భయభ్రాంతుడని  చేయలేదు. అతని ఒళ్లంతా ఆ రోజు కుంకుమతో అస్తమయం కాలేదు.

సరే. నిమజ్జనం ముగిసింది. ఏదో సద్దుమణిగింది. అతని నగరం కొంత తెరపి పడింది. ఇక

ఆవాంతరాలూ అడ్డంకులూ ఏమీ లేకుండా ఆ రోజు అహ్మద్ త్వరగా ఇంటికి చేరుకుని, భార్య ఇచ్చిన మంచినీళ్ళు త్రాగి, తెచ్చిన అరటి పళ్ల సంచిని ఆరేళ్ళ పిల్లల చేతికిస్తుండగా గోడకి చతికిలబడిన అతని ముసలి తల్లి అంటుంది కదా -

"వచ్చావా నాయనా, త్వరగా స్నానం చేసి భోజనం చేయి. ఇక ఈ పూటైనా పిల్లలు నిశ్చింతగా కంటి నిండుగా నిదురోతారు"

# నీలాంటి చీకటి

ఒక సమాధిని తవ్వుతున్నట్లు ఉంది
పగటి నిప్పు కణికెలు పడ్డ కళ్లల్లో రాత్రి చినుకులు ఏవైనా రాలి చల్లబడతాయేమోనని
ఒక్కడినే ఇక్కడ ఈ బాల్కనీలో కూర్చుంటే -

ఈ సమాధి ఎవరికి అని అడగకు -
చీకట్లో కూర్చుని చేతివేళ్ళు విరుచుకునే ధ్వనుల్లోంచి వెళ్ళిపోయింది ఎవరు
అని అడగకు. వొంగిపోయిన శిరస్సు కింది వొణికే నీడలు
వెతుకులాడేది ఎవరినీ అని అడగకు. గాలి - ఉండీ లేని

ఈ గాలి - ఆగీ ఆగని ఈ గాలి - ఉగ్గబట్టి అక్కడక్కడే తిరుగాడేది
ఎవరి కోసమో అని అడగకు. ఎక్కడిదో ఒక నీటి స్మృతీ, మట్టి వాసనా. చుక్కల
కింద స్థబ్దుగా నిలబడిన చెట్లూ, చెట్ల కొమ్మల్లోని నిశ్శబ్దం, మరి

నిశ్శబ్దాన్ని చెల్లాచెదురు చేసి
కొమ్మల్లోంచి ఆకస్మికంగా ఎగిరిపోయే ఒక పక్షీ గుర్తుకు తెచ్చేది
ఎవరినీ అని కూడా అడగకు. సృజనా ఊరకే చదువు -

నిశ్చలమైన సరస్సులో బిందువొకటి రాలి
వలయాలు వలయాలుగా విస్తరించుకున్న ప్రకంపనల్లో, ఎవరో తమ ప్రతిబింబాన్ని
క్షణకాలం చూసుకుని, చిన్నగా వేలితో తాకి వెళ్ళిపోయిన సవ్వడి -
కనుల కింది ఏర్పడ్డ రాత్రి వలయాల్లో ఎవరో కదిలిన సవ్వడి

ఇష్టమైన ముఖాన్ని ఆఖరిసారిగా చూసుకుని
అరచేతులతో సమాధిలోకి మట్టి వొంపిన సవ్వడి. రెక్కలు విరిగిన సవ్వడి
సన్నగా కోసుకుపోతున్న సవ్వడి. లీలగా, ఎవరో ఏడుస్తున్న సవ్వడి. లోపలంతా
ఇక - మిగలబోయే - బావురుమనే ఒక ఖాళీ సవ్వడి
**నువ్వు** అనే సవ్వడి

సృజనా - అవును -
నిజంగా ఇక్కడ ఏమీ లేదు. బ్రతికి ఉండగానే మనుషులని నింపాదిగా కొరుక్కుతినే
నీలాంటి చీకటి తప్ప-

# గంధా హై పర్ దందా హై యే

తెరవని తలుపులు నీవి.
అందుకనే ఎవ్వరూ రారు నీ వద్దకు. “అవసరం కోసం కాకుండా ఇద్దరు కలవచ్చు. కొంతసేపు మాట్లాడుకోవచ్చు. ఊరకే, రికామీగా, అట్లాగా... “ అని నువ్వు నమ్మావు కానీ, లోకం అట్లా లేదనీ, నువ్వు అనుకున్న వాళ్ళెవ్వరూ అలా లేరనీ తెలిసి వస్తుంది. వాళ్ళ అవసరాలకే నువ్వు అనీ, నీ కోసం ఎవ్వరూ ఎదురు చూడరనీ, నువ్వు ఎప్పట్లాగే నీ గోడలతో, నీడలతో, నీడల్లో కనిపించే కథలతో బ్రతకాల్సి వస్తుందనీ అర్థం అవుతుంది. ఏం లేదు. కాలిక్యులేటేడ్ ప్రపంచం. హెచ్చువేతలూ, కూడికలూ. నువ్వు నీ కవితల్లో వాంతి చేసుకున్నట్లు, మరికొందరు తమ భయాలనీ, బలహీనతలనీ, లెక్కలనీ, తమ మతాన్నీ, తమ సింద్రోమ్లనీ వాంతి చేసుకునే డస్టిబిన్ నువ్వు. తాగిన తరువాత కక్కుకున్న దానికన్నా దుర్గంధం. తట్టుకోలేవు. అలా అని పట్టుకోలేవు వాళ్ళని. విప్పి చెప్పాలేవు. ప్రతి ఒక్కడూ ఒక రియల్ ఎస్టేటై, ఏజెంటై, చిట్‌ఫండ్ ఖాతా లెక్కలై, పెళ్ళాం పిల్లలూ బాంక్ బాలెన్సు లెక్కలై తిరుగు కాలం. ఇతరులతోనూ, ఆఖరికి తమతో తాము రాజకీయాలు చేయు కాలమ్. మనుషుల్లో మనుషుల్లేక, మనుషులు అపార్ట్మెంట్లై, ఒట్టి జీతాలై టీయే డీయేలై, ఆధ్యాత్మిక సేల్స్మెన్లై దినదిన ప్రవర్ధమానమయ్యే కాలం. సాయంత్రం బార్లల్లో దూరి, ఎవరి భుజములు వారే చరుచుకుని, గృహములకు పోవు కాలం. పోయే కాలం. బంగారమూ, నగలూ, టీవీలో సీరియల్సూ, పట్టు చీరలూ అయ్యి, స్త్రీలు చచ్చిపోయే కాలం. పురుషులేమో పచ్చనోట్లై, పిల్లలేమో పెట్టుబడులై, స్టేటస్ సింబల్సై, ప్రదర్శనశాలలై రాంకులుగా మారి అలరారు కాలం. అమ్ముకునే కాలం. అమ్మబడు కాలం. అమ్మలు లేని కాలం. నాన్నలు లేని కాలం. ఎవరూ ఒక అరచేయిగా మారని కాలం. ఎవరూ - నిన్ను చూచే ఒక నయనంగా మారని కాలం . కళ్ళు లేని కాలం. కన్నీళ్ళు లేని కాలం. పంచుకోడానికి మరొకరు దొరకని కాలం. అంతా వినిమయ ఇంద్రజాలం. వెరసి ఇది ఒక యమపాశం. అంతా కలిసి, వెరసి ఇది గంధా హై, పర్ దందా హై యే కాలం. వ్యాపారమే పాపం, పుణ్యం, స్వర్గం నరకం, మోక్షం అయిన కాలం. క్యా కరేంగే?

తెరవని తలుపులా? తెరవని తలుపులు కాదురా నాయనా, చూద్దామంటే సమాధులు తప్ప, అసలు ఇళ్ళే లేవు ఇక్కడ!

# dielogue

In the beginning was the Word
And the Word was with God, and the Word was God.

“ఎక్కడున్నావు నువ్వు? నిన్నొకసారి చూడాలి.”/“అది తెలుసుకునేందుకే తిరుగుతున్నాను. ఎక్కడున్నానో నాకే తెలియదు”/ “ఆ పొయిటిక్ చెత్తంతా నాకు చెప్పకు. ప్లీజ్. ఎక్కడున్నావు? ఏం చేస్తున్నావు? ఎలా ఉన్నావు? మాట్లాడు”/ "You know... words don't convey anything. అయినా, ఎందుకు?”/ “కన్నా, ఎందుకంటే: It's quite cold in here. It's quite lonely here. It's quite dark in here. బెంగగా ఉంది”/ “అమ్మ గుర్తుకు వచ్చిందా?”/ “ఊ. ఒక్కసారి రావా. ఒక్క పది నిమిషాలే. I won't make you stay longer. కొద్దిగా భయంగా కూడా ఉంది”/ “అవునా... నీకు తెలుసు ఇక్కడ కూడా, quite cold in here. Quite lonely here. Quite dark in here.." "Please. ఒక్కసారి వచ్చిపో. ఎక్కడున్నావో చెప్పు పోనీ. నేనే వస్తాను. అదీకాక పాప చాలా గుర్తుకువస్తుంది ఇవాళ”/

“తెలుసు నీకు. నేనో జంతువునని. కాదు, కాదు. అంతకంటే ఘోరమని. Is there any word that conveys more than the word beast?" / “కన్నా నాకు ఇప్పుడు వాగ్వివాదం చేసే ఓపిక లేదు. అలసిపోయి ఉన్నాను. ఉదయం నుంచి ఏమీ తినలేదు. నా వద్ద పెద్దగా డబ్బులూ లేవు.”/ "Do you want money?"/ “డబ్బులు కాదు చిన్నా. ఒంటరిగా ఉండాలంటే ఎందుకో కొంత భయంగా ఉంది. మాట్లాడటానికి ఎవరూ లేరు. పడుకోడానికే అందరూ...”/ "That's how the world is... beast, beastlier, beastliest... చూడు, ఒక మృగం మరొక మృగం గురించి ఎలా మాట్లాడుతుందో... ”/

“చిన్నా, ప్లీజ్...”/“ఇంకా?”/ “వస్తావా ఇంతకూ?”/ “తెలియదు.”/ “ఒక్కసారి, ఒక్క పది నిమిషాలు. గోడలపై ఈ నీడలు... ఈ నీడల్తో ఎక్కువ కాలం ఉండలేను. ఈ నీడలతో ఎక్కువ కాలం బ్రతకనూ లేను.”/“...”/ “చిన్నా...”/“ఊ...”/ “ఎక్కువగా తాగకు”/ “ఊ...”/“చిన్నా...”/“ఊ...”/“అందరూ ఇంతేనా?”/“అవును. అందరూ ఇంతే. నా మటుకు. నీడలే అంతా. నరమాంస భక్షకులే అంతా... more than me,

you should have known it better by now... నిన్ను నమిలి నమిలి తిన్న మనుషులందరితో ఇంతకాలం బ్రతికిన తరువాత.."/"ఎందుకో, somehow - ఎక్కడో ప్రేమ ఉంటుందని..."/ "ప్రేమా? What's his name? ఏదోలే... తాగొచ్చి వాడు, నీతో పడుకుని, నీ చూచుకాలు కొరికి వేస్తే, వాటిని చూసుకుంటూ, ఏడ్చుకుంటూ పాపకు పాలివ్వలేని రోజులు మరచిపోయావా?"/ "లేదు, కానీ..."/ "ఈ లోకం, నువ్వు మనుషులు అనుకునే వీళ్ళూ అంతా పెద్ద... మరచిపోయావా అందరినీ? Will your vagina ever heal before you die?"/

/"చిన్నా, ప్లీజ్ ఆ టాపిక్ వొదిలెయ్. ఎక్కడున్నావు నువ్వు? నిన్నొకసారి చూడాలి. ఒక్కసారి రా. ఒకే ఒక్కసారి. ఈ నేల ఊబిలా మారకముందే, ఈ గోడలు నన్ను తిని వేయకముందే, ఈ చీకటి నన్ను కప్పివేయకముందే, ఈ రాత్రి నాలోకి దిగబడక ముందే, నా గర్భం మళ్ళా విచ్ఛిన్నమవ్వక ముందే, మళ్ళా నేను చచ్చిపోక ముందే. కన్నా ఎక్కడున్నావు నువ్వు?"/

/"నేనా, ఎక్కడనా? ఎక్కడో, నేనెక్కడో ఒకచోట బార్లో, ఒక quite cold in here బార్లో ఒక quite dark in here బార్లో. ఒక quite cold in here, dark in here బార్లో, బార్ కార్నర్లో, కారోబార్లో... కారో బారో, దేవుళ్ళో, దెయ్యాలో, దేవతలో, పితృసంహారులో, శత్రురక్షకులో, భూమున్నవాళ్ళో, లేని వాళ్ళో, తప్పుకుపోయిన వాళ్ళో, తండ్రులో, తల్లులో, స్నేహితులో, తాగుబోతులో, భిక్షగాళ్ళో, రేపిస్టో రేసిస్టో కాస్టిస్టో, పిల్లలో పూవులో చుక్కలో, వానో వరదో వాంతో, స్మృతో, విస్మృతో, చివరికి మిగిలే ఈ జీవన అమృత విషమో... "/

In the beginning was the Word
And the Word was with God, and the Word was God
How do we know?

# ఒక రోజు

ఎండలో పడి ఇంటికి హడావిడిగా వచ్చి, కుండలో నీళ్ళు ముంచుకుని గట గటా తాగి, పమిటతో ముఖాన్ని తుడుచుకుంటూ, నేలపై బొంతపై కూర్చున్నావు నువ్వు. ఒక ఇసుక కాగితంతో గరుకైన నిప్పుతో ముఖాన్ని ఎవరో రుద్దినట్లు కమిలి పోయింది నీ ముఖం. తలలోంచి, వడలిపోయిన ఆ చిన్న మల్లెపూల దండని తీసి ఓ మూలకు విసిరి కొడితే, ఆ మాల లోంచి రెక్కలు తెగిన సీతాకోకచిలుకలు మొలుచుకు వచ్చాయి గది నిండా అప్పుడు. చేతులను వెనక్కి విసిరి, ఇక అలసటగా నువ్వు వాలిపోతే, లోపలంతా ఒక చీకటి. పేగులు తెగి కాలుతున్న వాసనా. కొద్దిగా తొలిగిన జాకెట్ లోంచి, చెక్కుకుపోయిన వక్షోజాలు: నీ ప్రేమికులందరూ నులిమీ నులిమీ, కొరికీ కొరికీ వొదిలి వేయగా ఇక ఎండిపోయి నీడకై వెదుక్కునే పసిపిల్లలు

అప్పుడు, ఆనాడు నీ కళ్ళు లేవు అక్కడ. ముళ్ళ పొదలతో నిండిన ఎడారులు మాత్రమే ఉన్నాయి. "ఏడ్చినా కన్నీళ్లు రావడం లేదు" అని అన్నావు నువ్వా రోజు విరగబడి నవ్వుతో. నీ పొట్టపై వాళ్ళు తన్నిన బూట్ల ముద్రలు ఎర్రగా, కొద్దిగా రంగు మారుతో ఉంటే, అంటాను నేను: "Is it OK with just rice and pickles? That is all we have got for today." అప్పుడు బయట కాంతి రంగు మారింది. మబ్బులు కమ్ముకుని ఈదురు గాలి వీస్తే, ఆ గాలిలో కొమ్మలని వీడలేక వీడుతూ కొట్టుకు వెళ్ళే ఆకులు: అశోకా ఆకులు. పసుపు పచ్చని ఆకులు. పండిన ఆకులు. ఎండిపోయిన ఆకులు. అవే నీ చేతులు. అవే, ఇక నెమ్మదిగా లేచి భీతిగా చుట్టుకుంటాయి మూలగా కూర్చున్న నన్ను. గది ముందు వాలుకుర్చీలో, కుక్కలు కొరికిన మన తెల్లని పిల్లి నొప్పితో కదిలి మళ్ళా ముడుచుకుని పడుకుంటుంది. నొప్పితో అప్పుడప్పుడూ అది చేసే గుర్ మనే సవ్వడి ఒక్కటే ఆకాశమంతా. ఆనక కొంత వర్షం పడొచ్చు. ఆకులు తడవొచ్చు. నీటికి నానిన భూమి మళ్ళా పచ్చిక వాసన వేయవచ్చు. బహుశా, పక్షులు పెట్టుకున్న గూళ్ళూ రాలిపోవచ్చు. నేలరాలిన, ఎగరలేని ఆ పిచ్చుక పిల్లలని పిల్లులు తినవచ్చు. సాయంత్రం తిరిగి వచ్చి, ఆ పిచ్చుకలు కీచుమనే శబ్దాలతో రాలిన గూళ్ల వద్దే అల్లల్లాడుతుండవచ్చు. తిరిగి నువ్వు ఈ రాత్రికి ఇంటికి పోకపోనూ వచ్చు. అందుకని, అప్పుడు, వెచ్చటి నెత్తురు నా ఛాతి నుంచి నీ హృదయంలోకి కారితే తల వంచి ఆ ఏడు కత్తి గాట్లలో ఉబికే ఎర్రటి చెమ్మని తాగుతో అంటావు నువ్వు: "పిచ్చి ముండాకొడుకువి నువ్వు. ఎవరైనా కోసుకుంటారా ఇలా? What the fuck is your problem? Whose sins are you suffering for, fucker?

Do you think you are responsible for everything in this shitty world?. నీకేం తెలుసు బాధ గురించి? identity గురించీ?. ఇటు చూడు. ఏం తీసుకు వెళ్ళాలి ఇంటికీ పూట? ఒక్కడినని మాట్లాడుకుని, ఆ లంజా కొడుకులు ఆరుగురూ దెంగి, ఒక్క పైసా ఇవ్వకుండా తన్నినారు. చూడు ఇక్కడ రక్తం'' అని తను, నా అరచేతిని తన మలద్వారం వద్ద ఉంచితే, అదంతా ఒక నెత్తురు వస్త్రం. నెత్తురు కమలం. "ఏం, లంజ అయితే మాత్రం దెంగడం, చెరచడం మీ జన్మహక్కా? లంజా కొడుకులు. నొప్పిరా. నన్ను బ్రతికించురా'' అని తను అంటే, ఆ రోజున అక్కడ, లోపలా బయటా

ఒక మహా ప్రకంపన. బయట చినుకుల చప్పుడు. గడ్డిపరకలు గాలిని కోసే చప్పుడు. కడుపులో దాచుకున్న శిశువుని ఎవరో లాగి నరుకుతున్న చప్పుడు. కషాయ గంటలు మ్రోగుతున్న చప్పుడు. ఏడ్చీ ఏడ్చీ ఏడ్చీ ఇక ఏడ్వలేక, అన్నీ అంతమయ్యి, యోని పీలికలుగా కోయబడే చప్పుడు. స్పృహ తప్పుతున్న అ చిన్న ముఖాన్ని అరచేతుల్లోకి తీసుకుంటే, గాజుపాత్ర పగులుతున్న చప్పుడు. నా రెండు చేతుల మధ్య ఒక దేశం బీటలు వారిపోతున్న చప్పుడు. రెండు కళ్ళు చితికిపోయి, వక్షోజాలై, పాలింకిపోతున్న చప్పుడు. జెండా అవనతమౌతున్న చప్పుడు. ఎవరో నిరంతరంగా ఒక సమాధిని త్రవ్వుతున్న చప్పుడు -

అటువంటి శబ్దాల మధ్యా, అటువంటి నాహిద్‌ల మధ్యా, పూలను పొగుడుతూ జీవించడం ఎలాగో తెలుసా నీకు?

# లిప్తకాలం

వేసవి అంతాన వలయమవుతున్నాయి నల్లటి మబ్బులు. ఆ సంధ్యారుణిమ కాంతిలో మెరిసే వదనంతో వెన్నెల వంటి ఐదేళ్ళ పిల్లవాడు నా చేతి వేలు పుచ్చుకుని నడుస్తూ అడుగుతాడు: "నాన్నా నేను నీ అంత అయ్యాక, నువ్వు ఎంత అవుతావు?" నేను అంటాను కదా: "అప్పటికి నేను ఉండను కన్నా." "ఎక్కడికి వెళ్లిపోతావు నాన్నా?" నిశ్శబ్దం మరోమారు అనుభవమై అంటాను నింగిని చూయిస్తూ: "రాత్రైతే వస్తాయి కదా నక్షత్రాలు, వాటిలోనో, ఈ నేలలోనో కలిసిపోయి ఉంటానురా". విశ్వమంత విప్పారిన కనులతో తిరిగి అడుగుతాడు వాడు అయోమయమై: "ఎలా నాన్నా?" "చచ్చిపోయి ఉంటానురా నేను అప్పటికి ..." "మరి మనం తిరిగి ఎప్పుడు కలుసుకుంటాం నాన్నా?" ఇక నడక ఆపి, మాటలు ఆపి, గొంతు గాయమై రహదారిపై మోకాళ్ళపై కూర్చుని, వాడి తెల్లని వెన్నెల అలల కళ్ళలోకి చూస్తూ చెబుతాను: "వస్తే, నువ్వు నా వద్దకు వచ్చినట్లు నేను నీ వద్దకు వస్తాను కన్నా." అతడికి అర్థమయ్యీ కాక ప్రప్రధమంగా నిశ్శబ్దం అనుభవమై కాసేపాగి అంటాడు: "నాన్నా ... నీకప్పుడు చక్కగా స్నానం చేయిస్తాను. అన్నం పెడతాను. ఆడుకోడానికి బయటికి తీసుకు వెళ్తాను. నీకు బోలెడు బొమ్మలు కొనిపెడతాను ... నాన్నా, నువ్వు నా దగ్గరికి వస్తావా నాన్నా?" నేను సమాధానం చెప్పను. కొంత అరుణిమ. కొంత వొణుకు. కొంత ప్రీతి. కొంత శాంతి. ఇంకొంత పురాజన్మల, పునర్జన్మల మృత్యు అనుభూతి...

వేసవి అంతాన వలయమై నల్లటి మబ్బులు కురుస్తున్నాయి దిగంతాలలో, దిగులు దినాలలో నా కళ్ళల్లో: దయగా ధారగా వాడి అరచేతులంత మెత్తగా: ఇక రాబోయే కాలమే గడచిన బ్రతుకంత సంక్షిప్తం. సుదీర్ఘం. అనంతం -

# నీ చేయి

నిదురలో పరాకుగా నీ చేయి నను తాకినప్పుడు
గుండెల మీద ఒక చితుకుల మంట మెత్తగా వ్యాపిస్తుంది

నిదురలో నీకు తెలియదు, అరచేయంత స్వప్నం
నా గుండెలమీద వాలిపోయి, ఆపై నా మెడ చుట్టూ అల్లుకుపోయి
ఎన్ని పురాజన్మలని గుర్తుకు తెచ్చిందో

కిటికీలోంచి దూసుకు వచ్చే పొగమంచులో, మసక వెన్నెల్లో
ఇక ఒక్కడినే నేను రాత్రంతా

నిదురలో నను యధాలాపంగా తాకిన చేతిని మృదువుగా స్పర్శిస్తూ
ఆ నును చేతివేళ్ళనీ, వేళ్ళ అంచున
వొళ్ళు విరుచుకుంటున్న నిప్పుపూల వాననీ శ్వాసిస్తూ

# అస్పృస్యత

ఒక చిన్ని సంతోషం. అంతలోనే ఊపిరాడనంత దుఃఖం

గోడల మీద రాసిన నినాదాలు ఎప్పుడో గీసిన చిత్రాలు వెలసిపోయిన వదనాలు ఎవరివి? దారుల వెంటా నీడల వెంటా వెళ్ళే సంచారిని నడిమార్గంలో కనులు మూసి కత్తి దింపినది ఎవరు? పూలు అల్లుకునే కళ్ళలో కన్నీళ్ళయీ దూరాన ఉండే ఇళ్లయీ రాలేదీ, రాలేనిదీ ఎవరు?

ఒక చిన్న ఆనందం. అంతలోనే గొంతు నులిమివేసే విషాదం

వెళ్తున్నాను. వస్తున్నాను. సూర్యుడి వెంటా చంద్రుడి వెంటా ఇరు కాలాలకీ మధ్య దాగిన మృత్యు మోహం వెంటా స్త్రీ వెంటా, చిటికెన వేలు పుచ్చుకునే అరచేయి ఏదీ లేక దిశ చూపించే చూపుడు వేలు ఏదీ లేక, వస్తున్నాను. వెళ్తున్నాను. నువ్వూ వెళ్ళావా ఇలాగే? నువ్వూ వచ్చావా ఇలాగే? రాకుండా మిగిలిపోకుండా?

దుర్గంధపు నదుల పక్కన లోహపు ధ్వనుల మధ్యన తిరిగివెళ్ళే తిరిగిరాని మనుషులను చూస్తూ వెదురు బుట్టలను అల్లుకుంటూ ఇలాగే గడిపావా నీ కాలమంతా నీలోని అత్తరు పరిమళంతో? ఇలాగే స్వప్నించావా నీ భాషనంతా? దివారాత్రులను అల్లికలలో నింపుతూ, నింగినీ నేలనూ మట్టిని తాకిన వాననూ శరీరంలోకీ అసంపూర్ణ పదాలలోకీ జోడిస్తూ ఇలాగే రచించావా నీ రాతనంతా రాతి రాత్రుళ్ళతో రాళ్ళతో?

నువ్వు చెక్కిన శిల్పాలను లిఖించరు ఎవరూ మళ్ళా మళ్ళా. నీ శరీరంతో నీ కన్నీళ్ళతో ముంచిన లోకాలను కొనగోటితో మీటరు ఎవరు మళ్ళా మళ్ళా. తెగుతోంది గొంతు ఎవరిదో అర్ధరాత్రిలో ఎలుగెత్తి పాడుతోన్న శోకంతో. చీలుతుంది కడుపు ఎవరిదో ఆకలితో అరుస్తోన్న మానం చిరిగిన రతిలో. బిడ్డా సౌఖ్యం ఏదీ లేదు ఈ నిర్ధయ క్షణంలో. అన్నా శాంతి ఏదీ లేదు ఈ జుగుప్స లోకంలో. తల్లీ ఎలుగెత్తి ప్రార్థించినా వచ్చే దివ్యవాయువు ఏదీ లేదు ఈ యంత్రఖచిత కర్మాగారంలో. ఉద్యానవనాలు లేవు నాలికలలో. లేతచివుళ్ళు లేవు ఎదురుచూపులలో. లేరు ఇతరులు మనలో, నలుపు వలయం సూర్యబింబమై వ్యాపించిన గ్రహంలో -

ఎవరి లోకం వాళ్ళదిగా ఎవరి శోకం వాళ్ళదిగా ఒంటరైన కాలంలో, ప్రియురాళ్ళకి ప్రియులు లేరిక్కడ. భార్యలకి భర్తలు లేరిక్కడ. తల్లులకి తనయులు తనయులకి తండ్రులూ తండ్రులకి తనువులూ లేవిక్కడ. చూడు: చుట్టుకుంటోంది చుట్టూ అస్పృస్యత ఒక మహా అజగరమై ఇద్దరి మధ్యా అవినాభావ సంబంధమై -

ఒక చిన్న హర్షం. అంతలోనే అనుకోనంత తిరిగి కోలుకోలేనంత విలాపం -

లే. లేచిపో. లేచి వెళ్ళు ఈ ప్రతిబింబంలేని తెరనుండి: శైశవంలో నువ్వు మరిచిన మౌనగానం, బాల్యంలో నువ్వు పారవేసుకున్న పలకా బలపం ఇక్కడే ఎక్కడో ఉండే ఉండాలి

# కాటు

ఇల్లాంటి రోజులలోనే గుర్తుకొస్తావు నువ్వు: కానీ ఎలాంటి రోజో చెప్పను నేను ఎన్నడూ!

కాని ఇట్లాంటి పగటినాడే, కాంతి చుక్కలు నీడలతో పొర్లబడి నవ్వే నువ్వే గుర్తొచ్చే ఇట్లాంటి పగటినాడే పగబడతావు నువ్వు. చూసావా అరవిచ్చిన ఈ అరచేతులను నువ్వు? నీకు వీడ్కోలు చెప్పిన కాలంలో తెగిపడి రక్తం చిందించి విలవిలలాడిన ఈ గుప్పిళ్ళనీ నువ్వు?

ఇక ఆ తరువాత ఎన్నడూ ఇక ఈ అరచేయి మరో అరచేయిని ముద్దాడలేదు. ఇక ఆ తరువాత ఎన్నడూ ఇక ఈ అరచేయి మరో అరచేయికి వీడ్కోలు పలుకలేదు. ఇక ఆ తరువాత ఎన్నడూ ఇక ఈ అరచేతులెన్నడూ మరో ముఖాన్ని పొదివి పుచ్చుకోలేదు. ఇక ఆ తరువాత సగంగా తెగిన ఈ చేతులెన్నడూ మరో శరీరాన్ని కౌగలించుకోలేదు, బ్రతికి రాలేదు -

అందుకే, ఇట్లాంటి ముకుళిత ముఖాల దిగులు రోజులలోనే గుర్తొస్తావు నువ్వు. మరి శరణు శరణు అని ప్రార్ధించిన నా ముకుళిత అరచేతులను తెరవగానే పడగ విప్పిన ఒక శ్వేతస్మృతి త్రాచై దిగ్గున లేచి నా కనులను కాటు వేసినది నీవేనా?

# సామాజిక వృక్షం(అను)సమాజ వాచకం

లోకం ఆగిపోయింది. తెరలతో, ముఖంలేని పుస్తకంతో కాలం తిమ్మిరెక్కింది. చదరపు శీతల గదులు, రహదారులలో శిలలైన మనుషులు. నిన్ను సర్పాలై చుట్టుకునే చేతులూ, కళ్ళూ, ఎవరివో కాళ్ళూ: ఇక నిన్ను కనని ఇనుప గర్భాలు -

మరి ఏదైనా ఉందా నీది ఇక్కడ? ఏదైనా ఉందా నీది అనుకునే నీదైన, నువ్వైన నీది ఇక్కడ?

ఈ నీ ఉదయాలు, నువ్వు నీ ఫ్రిడ్జ్ లో దాచుకునే మొన్నటి పాలు. ఈ నీ రాత్రుళ్ళు నువ్వు నక్షత్ర ప్రసారాలలో మునిగే శృంగార కార్యక్రమాలు. ఈ నీ పిల్లలు, నువ్వు భద్రంగా బీరువాలో దాచుకునే ఖాతా పుస్తకాలు. నువ్వు బ్రతికి ఉన్నావో, మరణించావో అని తలంచే ఆ స్త్రీ ఆ తల్లీ ఆ తండ్రీ నువ్వు విసుగు పుట్టినప్పుడు తిరగవేసే వినోదపు పత్రికలు. ఈ నీ సాయంత్రాలు నువ్వు మ్రోగించే మధుపాత్రాలూ, లోహ శబ్దాలూ -

కాలం ఆగిపోయింది. అద్దంలో లోకం లిఖితమయ్యింది. నిరంతర 'నేను', 'నేనే' అనే తెరలలో, ముఖాలలో శరీరం వ్యసనమైపోయింది. ఉంది ఉంది అనుకున్న చోట, హృదయంలోంచి ఒక నల్లని సర్పమే ఎలుగెత్తి నిను మోహిస్తూ ప్రేమంత విషం కక్కుతుంది ఇక్కడ-

వీటన్నిటిలో ఎక్కడున్నావురా, వీటన్నిటిలో ఎక్కడ మునిగి పోయావురా, వీటన్నిటిలో ఎక్కడ తప్పిపోయావురా హితుడా, సన్నిహితుడా మిత్రుడా నా ప్రియమైన శత్రువా?

# నిశ్శబ్దం నీవైనప్పుడు

1
నిన్న రాత్రి నువ్విచ్చిన పూలగుచ్చం ఇక్కడ
ఒక ప్లాస్టిక్ బాటిల్లో, నీళ్ళల్లో -

అవే, వాడిపోని ఈ పూవులు

కొన్నిసార్లు అవి నీ కళ్ళు. కొన్నిసార్లు అవి నీ మాటలు
కొన్నిసార్లు, అవి నీ చుట్టూ తిరిగే
పిల్లలు. వాళ్ళ ఆటలూ. నిదురలో

తెరుచుకున్న వాళ్ళ పెదవులు. ఇంకా మరి
వాళ్ళ నుంచి వచ్చే వాసనా
అర తెరచిన వాళ్ళ చేతుల్లో
చిక్కుకున్న, నీ చేతివేళ్ళూ -

2
గంజి పెట్టి ఉతికిన దుప్పటిలోంచి ఎప్పటిదో

బాల్యంలో అమ్మ బొజ్జను
చుట్టుకున్న ఒక స్మృతి
నేలపై, చాపపై ఆ ఇంట్లో -

నువ్వు కూడా ఇప్పుడు
దవనం వాసన వేస్తావు
అదే, కనకాంబరం పూలను అల్లుకున్న, మెరిసే దవనం -

ఇక, నవ్వే నీ ముఖంలో, నన్ను
చుట్టుకునే నీ చేతుల్లో
ఒక పసిపిల్లతనం, ఇష్టం -

**3**

బహుశా జన్మదినాలూ, జన్మించడమూ ఇంతేనేమో -

పూల నీడల్లో కాంతి రేఖలు. గూళ్ళల్లో
ముడుచుకున్న పిట్టలూ -
వీచే గాలికి చలించే ఆకులూ
చీకటిలో మెరిసే నక్షత్రాలూ

ఛాతిపై సీతాకోకచిలుకలు ఏవో వాలినట్లు ఉన్న
పిల్లల చేతులని ఆప్తంగా తాకి
ఎప్పటికీ ఇక్కడ ఉండబోమనే
ఒక స్పృహ జ్ఞప్తికి రావడమూ
కావొచ్చును. కొంత దయతో
మేల్కొవడమూ అవ్వొచ్చును -

**4**

వెళ్ళిపోతాం నువ్వూ, నేను - ఎప్పటికైనా - చివరికి -

మరో పక్కకి ఒత్తిగిల్లిన తరువాత
పక్కపై నలిగిన ఖాళీలో మిగిలిన
నీ శరీర స్పర్శ ఏదో నునువెచ్చగా
తగిలినట్టూ, ఒక లాంతరై రాత్రంతా
కలలలోకి దారి చూపినట్టూ

వనాలలో కురిసే తుంపర వంటి నిశ్శబ్దం: ఇప్పుడు, ఇక్కడ -
ఇక, నిశ్శబ్దం నీవైన ఆ క్షణంలో
ఈ కవితను ముగించడం ఎలా?

# తలుపులు

నువ్వోసారి తలుపులు, నీ తలుపులు తెరవగలిగితే పసి వాసనతో ఒక గాలి లోపలికి రావొచ్చు. లతను వొదిలి ఒక పూవు నీ పైకి వొంగి నిన్ను తాకవచ్చు. రాత్రి చెమ్మని నీపై చిమ్మవచ్చు. నువ్వోసారి తలుపులు, ఆ తలుపులు తెరవగలిగితే సన్నటి నవ్వుతో ఎవరో నిన్ను పలుకరించవచ్చు. కన్నీళ్ళతో ఎవరో నిను చుట్టుకోవచ్చు. వండిన - తమకో, నీకో - అన్నాన్ని నీకు ఒక ప్రార్ధన వలే అందివ్వవచ్చు. నువ్వోసారి తలుపులు, నీ తలుపులు తెరవగలిగితే నీకొక ముఖం ఎదురు రావొచ్చు. నీకు చెప్పాలనుకుని అప్పటిదాకా వల్లె వేసుకున్నవన్నీ  లోలోపలే నొక్కిపెట్టి లోపలికి వెళ్ళిపోనూవచ్చు. పడక ఒక ఊబియై, దిండు ఒక అంతిమ కౌగిలై అలా మిగిలిపోనూవచ్చు -

నువ్వోసారి తలుపులు, నీ తలుపులు తెరవగలిగితే

అక్కడొక వీధి కుక్క, గాట్లతో నిలబడి ఉండవచ్చు. ఎండుకుపోయిన దాని డొక్కలో, తల్లులూ తండ్రులూ పిల్లలూ పాపలూ ఏడుస్తుండవచ్చు. నిండు గర్భంతో ఒక మనిషి సర్వం తెగి విలపిస్తూ ఉండి ఉండవచ్చు. నువ్వోసారి తలుపులు, మన తలుపులు తెరవగలిగితే, చాలాసార్లు అక్కడ ఏమీ ఉండకపోవచ్చు. ఎదురుచూసీ చూసీ తల్లిపాలతో నిండిన వక్షోజాలు రెండు, గుమ్మానికి మోకరిల్లి, నెత్తురుతో చిప్పిల్లుతుండవచ్చు. నువ్వే అయ్యి కరుగుతుండావచ్చు. ఆఖరి శ్వాసకై  తపిస్తూ ఉండవచ్చు: రోజూలాగే చనిపోతుండ వచ్చు. శూన్యం అయ్యి ఉండావచ్చు. ఏమైనా కావచ్చు. కాకపోనూ వచ్చు

ఒక్కసారి నువ్వు ఆ తలుపులు కాగలిగితే ఒక్కసారి నువ్వు ఆ తలుపులై తెరవబడగలిగితే!

# ఒక సత్యం

"ధన్యవాదాలు: మీకందరికీ: మీరు ఇచ్చిన గాయాలకీనూ -
గుర్తుకు ఉంచుకుంటాను తప్పక
ఇందుకు ప్రతిగా మిమ్ములను; ఎప్పటికీ"

అంతిమంగా ఈ మాటలు అని అతను వెళ్ళిపోయాడు

తను ఏమీ మాట్లాడలేదు. ఇక ఆ రాత్రి ఎంతో తపనతో
బాల్కనీలో మిగిలిన ఒకే ఒక్క మొక్కకి
వేలాడబడింది: ఎల్లా అంటే, మరి కనులు తెరవని

ఒక శిశువు తన తల్లి వక్షోజాన్ని తడుముకుంటూ
వెదుక్కుని, తన
లేత పిడికిళ్లతో గట్టిగా కరచి పట్టుకున్నట్లుగా!

# ముగింపు

.
.
.

చిన్నగా నిట్టూరుస్తూ/ ఇలా/ ముగించింది తను:

how come people don't realize
that vagina
has a heart
of its own?

.
.
.

యోనికీ ఒక హృదయం ఉంటుందనీ, సంతోషంతో
చలిస్తుందనీ,
ఒక వెచ్చని పుష్పమై వికసిస్తుందనీ, గాయపడుతుందనీ
కన్నీళ్ళతో రాలి పడుతుందనీ
మరి అది ఒక పసిపాప వంటిదనీ
ఎన్నటికి గ్రహిస్తావు నువ్వు?

how come you don't realize
that my vagina
has got

a language
of its own?

# నీడల సవ్వడి

1
అప్పుడప్పుడూ
నీ శరీరంలోంచి ఒక నీడ బయటకు వచ్చి
నీ ఎదురుగా కూర్చుంటుంది -

అప్పుడు, పూరేకుల్లోకి మబ్బు పట్టిన ఆకాశం దిగి ఒదుగుతుంది
నీ చుట్టూ కదిలే దృశ్యాలలో, ఒక
వాన వాసన మెత్తగా వ్యాపిస్తుంది

అప్పుడు, నిన్ను దాటుకుని వెళ్ళిపోయిన వాళ్ళెవరో తిరిగి వచ్చి
నీ భుజం తట్టి, చిరునవ్వుతో
నిన్ను పలుకరించి పోతారు

అప్పుడు నీ అరచేతులు మచ్చలులేని అద్దాలూ, మాయా దర్పణాలూ -
చూసుకుంటే కనిపిస్తాయి నీకు
ఆ సరస్సులలో, నీ ముఖంతో పాటు
నీ త్రికాలాలూ -

2
ఇక నిబ్బరంగా లేచి, కౌగలించుకుందామని చూస్తే, నీ ఎదురుగా
నీ నీడ స్థానంలో నువ్వు. నీడైన నిన్ను
చూసుకుంటూ నీ ఎదురుగా నువ్వే. ఇక
అప్పుడు

3
ఆకులపై రాలిన చినుకుల్లోంచి జారిపోయే వీచే చెట్లూ
రెక్కలు విదుల్చుకుంటున్న పక్షులూ
నీళ్ళల్లో దొర్లలేని రాయిపై ఆగిన గాలీనూ -

అప్పుడే

**4**
సరిగ్గా అప్పుడే
నీ పరిసరాల్లో ఎక్కడో ఒక పూవు నిను చూస్తూ రాలిపోయిన సవ్వడి -
మరి ఇంతకూ

**5**
విన్నావా నువ్వు

అప్పుడప్పుడూ
నీ శరీరంలోకి ఒక రాత్రి వచ్చి, నీలో ఒక సాలెగూడు అల్లుకునే
ఆ నీడల సవ్వడిని?

# hedgehog

**1**

నీదేమీ లేదు ఇక్కడ

కఫాన్ని ఊసివేసినట్లు, కిటికీలోంచి ఉమ్మేసిన నీ కళ్ళు
దొర్లుతాయి, అక్కడే
దారి పక్కన నీళ్ళల్లో -

కొంత బురద. ఏవో ఆకులు -
కనుల స్థానంలో ఏర్పడ్డ ఖాళీ గుంతలలో, రాలే చినుకులు -
చీకటి నీడలేవో సర్పాలై

దూరే నల్లటి బొరియలు

**2**

అరచేతులతో పట్టుకున్న
కత్తి అంచున గొంతును ఆన్చి, నెమ్మదిగా తలని వాల్చుతూ
చేసే ఒక ఆఖరి ప్రార్ధన

ఈ రాత్రీ, ఈ శరీరం. ఇక

**3**

నిన్ను బేరీజు వేయకుండా
చూడగలిగే కన్నులే లేవు - ఇక్కడా, ఎక్కడా - ఎవరి వద్దా. చూడు...
ఏమీ లేదు

**4**

చీకట్లో
చెట్ల కింద ఒంటరిగా
ఒక మేనియాక్!

# మై, my, మై - political ఫ్రెండ్

గురో యే గ్లాస్ భరో and then I'll let you know the story of a cock and a cunt -

గురో మారో యే దునియాకో నేనెటూ ఒక మాదర్చోత్‌నే అనుకో అయినా ఉన్నదా నీకు నీదైన ఒక సంత? సంసారమనుకో సాగరమనుకో పెళ్ళాం అనుకో పిల్లలు అనుకో ఉద్యోగమనుకో బాంక్ బాలన్సు అనుకో నూట్యాభై గజాల ఇన్స్టాల్మెంట్ భూమనుకో వీకెండ్ మందనుకో. గురూ నీకూ లేదు ఆత్మ నాకెటూలేడు పరమాత్మ ఎంగిలైన లోకంలో ఉమ్మూసుకుంటో చినిగిన వాల్పోస్టర్లు చూసుకుంటో ఎక్కడ తీర్చుకోవాలో తెలియక మర్యాదస్తులమై మూత్రాన్ని అదిమిపెట్టుకుని తిరుగుతాం కదా రోడ్లంతా మరి గురూ గుర్తొచ్చేది దేవుడు అప్పుడే నీకూ, నాకూ. మరి గుర్తొచ్చేదీ ప్రభుత్వం అప్పుడే నీకూ, నాకూ అంతా చేసి తిరుపతికి నువ్వెట్లాగూ వెళ్ళవనుకో ఏడ్చుకుంటూ ఆ ఏడూ కొండలూ నువ్వెట్లాగూ ఎక్కలేవనుకో అయినా కానీ నీ భార్య అక్కడ క్షవరం కావించకపోతే షవర్లో నీకొక జుగుప్సా షివర్. సరే సరే మరే మహా కరుణామయుడివి నీవు స్త్రీని యోనిగా చూసే మహాలింగ పుణ్యపురుషుడివి నీవు సరే సరే అది సరే కానీ నువ్వు కొనిచ్చిన ముప్పై తులాల మూడు గదుల అపార్ట్మెంట్ల నీ వన్నె చిన్నెల వెన్నెల చిలుక ఏమన్నదీ? ఉన్నదా జన్నత్ ఇప్పటికీ అక్కడ? నువ్వు తల వంచి నిదురోయిన తన చీకటి లోయల మెరుపు ద్రవాల పరిమళం వద్దా? నువ్వు నెలకొక నెక్లెస్ వారానికొక చీరా లేదా షల్వార్ కమీజ్ అయ్యీ షాపింగ్‌మాల్‌లో ములాఖాత్ అయ్యీన చోటా?

సరే సరే అది సరే నీ కత నాకెందుకులే కానీ సరే సరే నువ్వెటూ బ్రతుకుతావ్ రూకలని బంగారంగా మార్చుకుంటూ నువ్వెటూ నాయకుడివవుతావ్ పుర జనులతో ప్రేమాభిమానాలతో ఆడుకుంటో వాడుకుంటో అవసరమైతే అమ్ముకుంటో చంపుకుంటో

సరే సరే అది సరే కానీ అందుకే మరిక నీ ఐదు వేళ్ళకి ఐదు రింగుల్ మెడలో బారెడు చైనుల్ చెవులో, చేతులో సెల్లుల్ నోట్లో పాన్, నాలికకి పరాగ్ కాళ్ళకి కొల్హాపురి, ఒంటికి ఖద్దర్! బండి బైలెల్లి నాదే అంటే నీ వెంట పాలోమంటూ నీ చేలేగాళ్. అక్కొడొక

డీల్ ఇక్కడొక ఫీల్ ఇక్కడొక మాటా అక్కడొక చేష్టా, తాగీ తాగీ, నీ ముఖం ఉబ్బీ ఉబ్బీ, ఇక నీ హావభావాల్ ముందు నటనా చతురులందరూ పూర్తిగా డల్ అండ్ నిల్ -

ఇక ఇదేమిటంటావా? ఏంటంటే ఎంత ఆపుకున్నా ఆగక, జారి పడుతుంది కదా అప్పుడప్పుడూ పబ్లిక్లో, ఒక మూత్రపు బొట్టు నీ తెల్లని ఫాంటును చల్లగా చేస్తూ. చూస్తావు కదా ఇకప్పుడు అదోలా ముఖం పెట్టి అటూ ఇటూ, మరి, అదే ఇది: నీ మహత్తరమైన లోకం కాలం, ఆదర్శప్రాయమైన నీ కుటుంబమ్ నీ సంసారమ్, నీ ప్రజల సంక్షేమమ్ మరియు నీ స్నేహితుల ఆశీర్వాదమ్ -

వింటున్నావా మరి నువ్వు? లాగులిప్పుకుని కూర్చుని బహిర్భూమిలో ఆవలిస్తోన్న ఈ పదాలని?

# ఒంటి కన్ను రాక్షసుడు అను Red Eye

ప్రపంచమంతా అంత ఎర్రగా ఏమీ కనిపించదు కానీ, చిన్ని చిన్ని ముళ్ళేసి నులుముతున్నట్లు కొంత నొప్పి, కొంత చికాకూ. మరి అప్పుడు నువ్వేం చేస్తావంటే, కాలంపై కన్నెర్ర జేయలేక ఒక్కడివే నీ వాలుకుర్చీలో కూర్చుని, ఒక చల్లని తడి గుడ్డని చేతిలో ఉంచుకుని  పాల చుక్కలు వేసుకున్నా పసికన్ను కాని, కాలేని మరి ఒంటరి కన్నుని అదుముకుంటో కూర్చుంటావు

ఒక్కడివే, నీపై నువ్వే కన్నెర్ర జేసుకుని, ముఖం ఇంతలా మాడ్చుకుని, "ఎందుకంత తాగితి రాత్రి, మరి ఎందుకంత పీల్చితి ధూమమూ, కరడు గట్టిన జీవితపు చితాభస్మమేదో కన్నులలో రాలేటట్లూ పదం పంచుకునే వారు లేక శరీరం మొత్తం శోకించేటట్లూ"

అని నువ్వు ఒక్కడివే అనుకుంటో, అప్పుడప్పుడూ అద్దంలో ముఖం చూసుకుని ఎరుపెక్కిన ఎడం కన్నుని మరోమారు తుడుచుకుని, ఇక ఇలా అనుకుంటావు పదునెక్కిన వ్యంగ్యంతో లోలోపలి వికటాట్టహాసంతో: "హేహే రాజన్! ఉండెను ఇక్కడ ఇంకా, ఒక ఒంటి కన్ను రాక్షసుడు, ఒంటి గంట రాత్రిలో కనులలో మొలుచుకు వస్తున్న కొమ్ములతో, కోరలతో. అయిననూ నేను బ్రతికే ఉంటిని చూడుడి, నన్నున్ జూసి కనులలో నిప్పులు పోసుకునువారు ఇక నిశ్చింతగా మరి తెల్లని కనులతో నిదురించుడి"

అది సరే కానీ మరేమో కానీ ఎవరి సంగతో మనకెందుకు కానీ, by the way, have you ever got a red eye? by the way have you ever got an eye? I mean  I?

# how we die

కుచ్చిళ్ళు పొరాడుకుంటూ తిరిగే చీకటి: చాచిన అరచేతులకి
పలకలు పలకలుగా గాలి.
తెరచి ఉంచు కిటికీ. లోపలికి

వచ్చేది ఏదీ ఉండదు నీతో, వెలుపలకి వెడుతూ అడగరు ఎవరూ
నిన్ను, మరొకరితో వెడుతో. నీ
చుట్టూ, రెక్కల కొట్టుకుంటున్న
పావురాళ్ళ సవ్వడి. అవే...

నిశ్శబ్దంలోంచి లేచే పావురాళ్ళు. అనువాదం కాని కళ్ళు -

ఇక, లాంతరు వెలిగించలేక, బావురుమంటూ రాలిపోయింది
తెల్లటి కుచ్చిళ్ళ నల్లని చీకటి - ఇక
నీలో ఒదిగొదిగి ఏడ్చే వక్షోజాలకి
రాత్రి కుంకుమ అంటిన కన్నీటికీ

ఏమని చెప్పగలవు, ఖాళీ లేని కాగితాలయ్యిన పెదాలతో?

# ఎందుకు (అకవిత)

దారి పక్కగా పూరె గుడిసెలో వొణుకుతుంది ఒక స్త్రీ శరీరం. ఉండుండీ మూల్గుతోంది. 'మ్మా' అంటో బ్రతికుందో లేదో తెలియని చిల్లులు పడిన నవ రంధ్రాల ఆ స్త్రీ ప్రాణం. బయటగా నిటారుగా లేచిన ఇనుప దిమ్మెల లోహ భవంతి. అంతే నిటారుగా అంతే లోహంతో గుడిసె లోపలొక మనిషి: తలుపులోంచి ఎర్రబారిన కళ్ళతో, మత్తుబారిన నాలికతో చీకటిని బండ బూతులు తిడుతో 'నీయమ్మ, లంజె - నోర్మూయ్' అని కసి దీరా ఒకప్పటి మెత్తటి పచ్చిక వంటి తన కడుపుని తంతో తనూ వణుకుతో తూలి చేజారిపోతో నా వైపోసారి అసహ్యంగా చూసి దిగంతాల నిస్పహాయతనంతా నాపై ఉమ్మి వేస్తో -

నక్షత్రాలు లేని గూటిలో మోగుతున్న నక్షత్ర ప్రసారాల ముందు ఆ ఇద్దరు పసి పిల్లలే కడుపుని చేతబుచ్చుకుని కనులని తుడుచుకుని ఎండకి చిట్లిన చేతులపై ఆరని పుండ్లని గిల్లుకుంటూ ఎందుకో నవ్వుతారు పడీ పడీ, ఎందుకో ఏడుస్తారు ఆగీ ఆగీ ఎందుకో స్పృహ తప్పుతారు, తప్పిపోతారు రాత్రుళ్ళ అంచును చీరే చిరు కాగితాలలోకీ కలలలోకీ -

కమిలిన రక్తం కమిలిన దేహం కమిలిన ప్రాణం కమిలిన కాలం కమిలిన లోకం కమిలీ కమిలీ కమిలీ యిక కమల లేక యిక కాలలేక ఆగిన వేసవి గాలి కింద ముడుచుకుంటాయి రెండు నల్లని వీధి కుక్క పిల్లలు కొంతసేపటి తరువాత చెల్లా చెదురుకాబోయే పేగులతో, వేల జన్మల ఆర్తితో యిక రాత్రంతా ఊళ పెడుతూ ఏడ్చే తల్లితనపు ఆక్రందనతో -

అయితే ఇంతకూ ఎవరు చెప్పారు మీకు ఇదొక కవితని? యింకా ఎందుకు ఉన్నారు యిక్కడ మీరు నిసిగ్గుగా తిరుగుతో కనులతో తడుతో  తడుముతో ఈ వాచకపు తనువుని?

# నాకు ఎందుకు

గుంపుగా నిలబడి అలా అప్పుడప్పుడూ కమ్మగా ఊగుతాయి
కలలో వీచే యూకలిప్టస్ చెట్లు

అదే ప్రదేశం, అదే సరస్సు
తెల్లని గులాబీ పూల కాంతితో కళ్ళలో మెత్తగా పరుచుకునే సూర్యరశ్మి

అదే దివ్య లోకం, అదే దివ్య కాలం
పచ్చిక పరిమళంతో చినుకులు ఆకుల అంచున చిందేసే మైకం, మోహం తాపం -

యిక్కడ నుంచి
ఎలా వెళ్లాను అక్కడికి?
అక్కడ నుంచి
ఎలా వచ్చాను ఇక్కడికి?

బహుశా నేనెపుడూ జన్మించలేదు
బహుశా నేనెపుడూ మరణించలేదు

గుంపుగా కమ్మగా హాయిగా ఊగే
యూకలిప్టస్ చెట్ల చిరు కదలికలలో

దిగంతాల నుంచి తెరలుగా కొట్టుకు వచ్చే సాయంత్రపు గాలిలో

ఊరకనే పచార్లు కొడుతున్నాను
మట్టి పెదాల నుంచి నింగి కనుల దాకా
ఒక సీతాకోకచిలుకనై ఒక మిడతనై -

నన్ను నిలిపే, నన్ను ఉంచే, నన్ను నిలిపి వుంచే
ఆ శ్వాస ఎవరిదో

యిక ఎప్పటికైనా
నాకు ఎందుకు?

# అమ్మ

ఇదే రాత్రి
అలసిన అమ్మ అటువైపుకి తిరిగి నిదురోయింది

తెరిచిన కిటికీలోంచి
తన చుట్టూతానే గిరికీలు కొడుతుంది పురా సరస్సుల పచ్చటి నీటి గాలి -

నెలవంక చెప్పిన కథలేవో కలలుగా తనలోకి పంపుతూ
చీకటి మెత్తటి చిగురాకై

కొంత కాంతితో కొంత శాంతితో
తన ముడుతల పసుపుపచ్చని ముఖంపై శ్వాసల ఊయల ఊగుతోంది

గదిలోనూ
నా మదిలోనూ కాలపు స్పృహతో కూడిన ఒక గగుర్పాటు, కొంత దిగులు -

అలసిన అమ్మ
అలసిపోయి, శ్రమతో అరిగిపోయిన ముసలి అమ్మ, తనకు తాను మిగలని
చిన్నారి అమ్మ -

నిదురలో, ఆ కలలో
తను తన పూర్వజన్మలో చూసిన చిత్రాలేవో, హస్తాలేవో కదపగా
నింగికి కట్టిన నీలి మేఘపు పరదావలె చిన్నగా కదిలే

తనువంతా చిట్లిన అమ్మ
తనువే లేకుండా మిగిలిపోయిన చిట్టి అమ్మ - అటువంటి అమ్మని

రాత్రి తనువుని పెనవేసుకుని
అటువైపుకు తిరిగి నిదురోయే అమ్మని, ఎందుకైనా ఎవరైనా ఎలా కదపటం?

# అసంపూర్ణం

బిందువునై కూర్చున్నాను ఒక వృత్తంలో -
ఎవరిదో శ్వాస నా ఆత్మ చుట్టూ. ఇదే దారో
తెలియటం లేదు. నీ శరీరంలో ముఖం
కడుక్కుందామనే ఒక కోరిక. తెలుసు
చివరికి కన్నీళ్ళతో కడుక్కుంటానని -

పూలను తాకిన చేయీ, నిన్ను తాకిన కనులూ
తిరిగి రావు. శిఖరాగ్రహపు అంచున మెరిసే
సీతాకోకచిలుకలూ రాత్రి ఆకాశంలో తడిచిన
నక్షత్రాలూ అద్దంపై వాలిన చినుకులూ

నా చుట్టూనూ -
రెపరెపలాడే శబ్దాన్ని నిశ్శబ్దంగా మార్చి
మడిచి, ఒక దీపం వెలిగించుకుని, దానిని
తలగడలా అమర్చుకుని నిదురించే విద్య
ఏదీ లేదు నా వద్ద -
అందుకే చెబుతున్నాను విను...

చూడు. ఇటువైపు. నీ వృత్తంలోని
ఈ బిందువు వైపు.
రాలిపోయింది గూడు!

# రాత్రైతే

రాత్రైతే
వొద్దు వొద్దు అనుకుంటూనే అడుగు పెడతావు
వెదురు వనాలలోకీ: మసక వెన్నెల పరుచుకున్న
మట్టి దారులలోకీ మంచుదీపం వెలిగే వేళల్లోకీ

రాత్రైతే
వొద్దు వొద్దు అనుకుంటూనే ఆగిపోతావు
నక్షత్రాలు నిండిన పూల ఆకాశంలోకీ, నిదుర వాసనలోకీ
చెమ్మగిల్లిన భూమిలోకీ ఆ శాంతి నిశ్శబ్దంలోకీ

రాత్రైతే
ఒక మెలకువలోకి మేల్కొని, ముఖాన్ని కడుక్కొని
శరీరాన్ని విడిచి ఒక ప్రయాణం మొదలు పెడతావు
ఒక కాంతి లోకంలోకీ, నీడల వెలుగులోకీ
అంతిమంగా నీలోకీ -

రాత్రైతే మరి ఎక్కడ ఉంటాను నేను?

# అగర్భం

సగం విరిగిన బ్లేడు అంచున మెరిసి, అంచుని అంటి పెట్టుకుని కదులుతుంది ఒక వెన్నెల తీగ. నువ్వొక కవిత రాస్తూ ఉన్నట్లయితే, దానిని నువ్వే నెలవంక అని ఉందువు

వెదురు కుర్చీలో తనూ, ఎదురుగా తన పాదాల వద్ద నువ్వు. చీకట్లో అశోకా వృక్షాల వెనుకగా, ఆ వేసవి రాత్రిలో కమ్మగా పనస చెట్టు వాసన. తను కవయిత్రి కాదు: అందుకే జీరపోయిన గొంతుతో చెబుతుంది వాస్తవాన్ని: "Do you smell that? That tree smells of Death. It smells of our love. It smells of ... ఇరువురి పక్కగా ఆ అర్ధరాత్రిలో దాదాపుగా శిథిలమయిన ఒక రమ్ బాటిల్. ఇంతకు మునుపే చెప్పాను మీకు, బకార్డీ రమ్ అని. అటు పక్కగా, నిన్నటి ఉదయం నుంచి తాగీ తాగీ తాగీ తిన్నవేవో కక్కిన ఆత్మల నెత్తురూ, ఈ జీవితపు మధువూ ఆ నల్లటి పచ్చికలో. ఆ హాస్టల్ లాన్‌లో. "మరి నాకు మెన్సెస్ రాలేదు ఈ సారి. మరి ఏం చేద్దాం దానితో?" అని తను యధాలాపంగా అడిగితే, నవ్వుతాడు అతనిక అప్పటికే ఛాతీపై కోసుకుని ఎండుతున్న ఏడు కత్తి గాట్లని ఒత్తి ఇంత నెత్తురు తడిని వేలితో నాలికపై రాసుకుంటో: రాత్రి

అంతే నింపాదిగా, ఆగి ఆగి చెమ్మగిల్లుతున్న గాటులా తన గర్భంలోని పిండంలా నింపాదిగా నిలకడగా మరి ఊపిరి పోసుకుంటుంది. దిగంతాలలో ఎక్కడో కానీ ఒక నిశ్శబ్దపు ఆక్రందన. గోడలపై నిర్విరామంగా పొడుగయ్యే నీడలు. తెరచిన గది తలుపులోంచి, కిటికీ పైన కదిలే తోక తెగిన బల్లి. కుత్తుక తెగినట్లు సుదూరంగా ఒక శునకమేదో ...

తొలి వెలుతురు చినుకులు మట్టిని తాకేసరికి, ఇక ఒకరినొకరు గట్టిగా పట్టుకుని, ఎవరూ లేని వాళ్లై వెక్కి వెక్కి ఏడ్చి, గుండెలు చరుచుకుని నిండుగా రోదిస్తే చివరికి వదలలేక వదులుతో తనే అంది: "నానీ నానీ, నువ్వంటే చాలా ఇష్టం కానీ ..."అని. ఆ తరువాత మరిక అతనికే ఎప్పటికీ తెలియలేదు, ఆనాడు ఎందుకలా వెక్కివెక్కి ఏడ్చారో, మరి ఇప్పటికీ అటువంటి రాత్రుళ్ళలో గర్భస్రావమై చితికిన పిండాలు, ఇప్పటికీ ఈ తెల్లని గోడలపై శిశువుల నీడలై, మృత్యుపుష్పాలై తన శరీరపు సువాసనతో ఇంకా ఇక్కడ ఎందుకు లేతవేళ్ళతో అతని కుత్తుకని నులుమి వేస్తాయో, అంతిమంగా ఎందుకు ఒక ఆదిమ బలిదానాన్ని గుర్తుకు తెస్తాయో!

# అనాత్మ పదాలు

తల వంచుకుని ఇంటికి నడుచుకుని వస్తావు నువ్వు. ఇక నీ కాళ్ళ కింద లేత సూర్య కాంతి  పసుపు నీళ్లై పోర్లిపోవడం చూస్తావు. తల పైన చెట్ల కొమ్మలు గాలికి జలదరిస్తే, నీ పాదాల వద్ద నుంచి గుప్పున లేచి గుంపుగా ఎగిరిపోతాయి ఆకుల నీడలు: ముఖ్యంగా, రావి ఆకులు, ఎవరివో కన్నీళ్ళని దాచుకున్నట్లు ఉండే, మౌనముద్ర లోంచి లేచి, పొర్లి పొర్లి పారే నీళ్ళ సవ్వడితో నిన్ను మరో దిగులు లోకాలకి తీసుకుపోయే రావి ఆకులు. అవే ... నువ్వు నడుస్తూ ఉండగా గుర్తుకు వచ్చే ముకుళితమయిన ముఖాలు. తలుపు చాటు నుంచి చేయి ఊపుతున్నట్లూ, అరచేతిలో ఆఖరిసారిగా క్షణకాలం అరచేయి ఉంచి వెనకకి లాక్కుని, బలవంతపు చిరునవ్వుతో చిట్లిన పెదాలతో వీడ్కోలు అయ్యినట్లూ

నీ రక్తంలో రక్తం అయిన వాళ్ళూ, నీ గుండెలో ఊపిరి అయిన వాళ్ళూ ఎవరిని పిలవాలన్నా వాళ్ళను పిలిచే పలుకు అలవాటయ్యి నీ నోటి నుంచి వారి పేరు తప్ప మరో పేరు రాని వాళ్ళూ, వాళ్ళే ... గోధూళి వేళ రేగిన చీకట్లలో మిణుకు మిణుకు మంటూ కనిపిస్తూ, ఎంతకూ నువ్వు దరి చేరలేని వాళ్ళూ , నువ్వు వొదిలి వేసుకున్న వాళ్ళూ, నువ్వు చివరిదాకా ఉందామనుకున్న వాళ్ళూ నీకు చివర అయిన వాళ్ళూ నిను చిత్తుగా ప్రేమించిన వాళ్ళూ నిన్ను ప్రేమించి చిత్తయిన వాళ్ళూ  నీ శరీరాలంత సలుపుడు పుండ్లై నువ్వు నీ చితి దాకా మోసుకు తిరిగే వాళ్ళూ సర్వమూ అయ్యి ఏమీ కాని వాళ్ళు ఏమీ లేక నీ వద్దకు వచ్చి ఒక గూడుని కట్టుకుని పిల్లలని కనీ పెంచుకుందామనుకున్న వాళ్ళూ పిల్లలూ లేకా నువ్వూ లేకా రాకా రెక్కలు విరిగి శిగమెత్తి రోదించే వాళ్ళూ తెల్లని వాళ్ళూ నల్లని వాళ్ళూ ఛామన ఛాయ వాళ్ళూ ఒళ్ళు వున్న వాళ్ళూ ఒళ్ళు లేని వాళ్ళూ నిన్నొక స్మృతి చిహ్నంగా, వెలిగించిన ప్రమిదెల కింద దాగిన నీడలలో తల దాచుకుని తలుచుకునే వాళ్ళూ, వాళ్ళే

నువ్వు తల వంచుకుని ఇంటికి నడచి వస్తున్నప్పుడు, ఈ గాలిలో ఈ చెట్లల్లో నీ చుట్టూ ఎగిరే పురుగులలో వాలిపోయిన సీతాకోకచిలుకలలో ముసురుకునే చీకట్లలో స్థంబించిన నిప్పులో వీధి దీపాలలో, చేయి చాచి ముందుకు వచ్చి ఎముకల వంటి అరచేతులను వొణుకుతూ నీ ముందు ఉంచే - భిక్షగత్తెలుగా మార్చబడిన - తల్లులతో దారి పక్కగా ఆగి ఉన్న వేశ్యలతో తెగిన నెత్తురు ఎండి పెళుసుగా పగులుతున్న

పెదాలలో పిల్లలు లేని పాలిండ్లలో ఏడ్చే యోనులలో ఇక ఏడ్వలేక ఆగిపోయిన అనాథ పసిపిల్లలలో పగిలిన పాదాలలో పగలే లేని జీవన ఎడారులలో, మరి

ఎక్కడ చూచినా నువ్వే అయితే, కన్నా, ఇక అతడొక్కడే ఒక్కడై దేహాత్మలు లేక దేవులాడుకుంటూ కబోధివలె తడుములాడుకుంటూ, ఈ శ్మశాన మహాసామ్రాజ్యాలలో పగిలీ విరిగీ చిరిగీ తన హృదయాన్ని తన అరచేతిలోకి తనే తీసుకుని తనే తినీ తినీ తినీ నమిలీ నమిలీ నమిలీ ఇక ఊస్తే నెత్తురుతో చెల్లా చెదురైన ఈ పదాలు, ఈ ఆకులు, ఎండిన రావి ఆకులు

మరి
ఇవన్నీ, ఇవి అన్నీ, ఇక నీకే -

# నేనెవరిని ఇంతకు

ఏమీ చేయలేక, కొన్నిసార్లు నుదిటిపై ముంజేతిని వాల్చుకుని కళ్ళు మూసుకుని పడుకుంటావు -

వేన వేల పావురాళ్ళు ఒక్కసారిగా రెక్కలు కొట్టుకుని గాలిలోకి లేచినట్లూ ఏ నదీ తీరానో రావి ఆకులు ఒక్కసారిగా ఉలిక్కిపడి, అలలతో రెపరెపలాడినట్లూ లోపలంతా అలజడి: సజలమైన కాంతి. అరచేతుల్లో పొదివి పుచ్చుకున్నదేదీ క్షణకాలం కంటే ఎక్కువ మన్నలేని, కనుల ముందే కరిగిపోయే ఒక స్థితి -

ఇక ఒక ముఖం ఏదో, నీవై, నీ శరీరం వంటి రూపమై, నా లోపలి లోకాలలో జీవం పోసుకుంటుంది, అదొక పూలపాత్ర అయినట్లూ, అదొక మంచినీళ్ళ మట్టికుండ అయినట్లూ. అందుకే, మరి ఎవరో రావాలి, పాత్రలో పూలు ఉంచేందుకూ మట్టికుండ చుట్టూ ఈ దినం చుట్టూ ఒక తడి గుడ్డను చుట్టేందుకూ, నుదిటిపై సర్పాలవలె అల్లుకుపోయిన ఈ చేతివేళ్ళని తొలగించి ఇంత చూపుని ప్రసాదించేందుకూ ఇంత శ్వాసని లోపల నింపేందుకూ ...

కానీ, నిజానికి ఇవన్నీ అడిగేందుకు నేనెవరిని ఇంతకూ?

# ఏమైనా

చీకట్లో నీ ముఖం తెలియదు
నా వేళ్ళ చివర్లకి తడి మాత్రం తగులుతుంది
నా ఛాతికి నీ హృదయ వేదన తెలియదు. నీ
ఊపిరిని తాకిన నా శ్వాసే కమిలి పోతుంది

ముడుచుకున్న నీ రెండు అరచేతులు - అలానే -
గూడు లేని గుప్పెడు ఆశా లేని నా ఈ రెండు అరచేతులలో:
ఇక ఈ దినమంతా, మన ముఖాలపైకి
ఎవరో నిర్లిప్తంగా లాగిన ఒక శ్వేత వస్త్రం

అక్కడే, మన ముందుగానే
ఆరుబయట నీడలలోనే
రాలిపోయింది ఒంటరిగానే ఒక గడ్డి పూవు యిప్పుడే. చూడు
నిన్ను చూసీ చూసీ చెమ్మగిల్లి

ఎలా ఈ అద్దం పగిలిపోయిందో -

# ఆశ

రాత్రంతా తెరిచే ఉన్న ఒక కిటికీ:
    రాత్రంతా ముడుచుకుని,  చీకటిని చూసే ఒక మనిషి
    రాత్రంతా రాత్రై, కనురెప్పలకి వేలాడే ఖడ్గాలై, నువ్వొక
    దాహంతో అర్చుకుపోయిన శరీరమై

రాత్రంతా తెరిచే ఉన్న ఒక కిటికీయై, కీచురాయై
    గది మూలన అల్లుకున్న బూజై, భుజం లేని
    ఒక శిరస్సై, అంతిమంగా
    నీకు నువ్వే మిగిలి, నీలోంచి నువ్వే పెగిలి పగిలి
    ముఖం దాచుకునే రెండు ఖాళీ అరచేతులై ఇలా -

    ఇక ఇప్పుడు ఆమాంతంగా ఎవరో నిన్ను
    తమ గుప్పిళ్ళతో దూసి, చీకటిని చీల్చి
    ఒక వెలుతురు పూవుగా మార్చి, నిను

    నలుదిశలా వెదజల్లితే, ఎంత బావుండును!

# ఒక మామూలు సాయంత్రం

చుబుకం కింద చేయి ఆన్చి, నుదిటిపై మరో చేయి ఉంచి, పార్క్‌లోని గేటుకీ తనకూ మధ్య ఉన్న దూరాన్ని కొలుస్తూ అతను: ఎర్రటి ఎదురెండ. ఆక్కడే కూర్చోవాలని ఏమీ లేదు. కాకపోతే, తరచూ తన స్పర్శతో సారవంతమై, చెమ్మగిల్లి తన శరీరంలా మారిన ఆ బెంచీని తను లేని రోజున వొదిలి, చెట్టు నీడన ఎదురు చూడాలంటే కొంత కష్టం: అతనికి. అలవాటైన అతని ప్రాణానికీ.ఇంకా వర్తకం కాని ఆ సంబంధానికీ. అందుకే, ఊరకే, అంత తొందరగా తను రాదని తెలిసినా, అరగంట ముందే అతను: అక్కడ. ఇంకా స్కూలు బొమ్మలు కాని పిల్లల ముందర, పిల్లలతో ఒక నీటి బాటిల్తో. మెరిసే వాళ్ళ ముఖాలతో, అమ్మను చూసే ఆత్రుతలో ఇక నీళ్ళు చిలకరింపబడ్డాక ఆ కొద్ది సమయమూ గడిచాక, పార్కులో

అతనికీ, స్కూలు దుస్తులను దుమ్ముతో కడిగిన పిల్లలకీ, ఒక గాలి. మట్టి వాసనా, పూల పొదలు ఊగి, ఆకులు చినుకుల్లా సవ్వడి చేసే తనే ఇక నెమ్మదిగా, అలసిన చిరునవ్వుతో, కొంగుతో ముఖాన చెమటని తుడుచుకుంటో లోపలికి వస్తే, ఉద్యానవనమంతా కిలకిలలతో తన పాదాల చెంత ఆ పిల్లలతో, ఆ దినాన తొలిసారిగా నిండుగా గుండెల నిండా తేలికగా ఊపిరి తీసుకునే అతనితో: మరి దయగా సూర్యుడు దాగుని, మసక చీకటిని లోకాన మెత్తగా వెదజల్లే వేళ, తన బొజ్జని గట్టిగా చుట్టుకుంటూ ఇక అంటారు కదా పిల్లలు "అమ్మా. ఆకలే. ఇక ఇంటికి వెడదాం అమ్మా" అని -

అందుకే మరి ఇక పద పద పద: ఇక అక్కడ మీకైనా నాకైనా ఏం పని?

# నీటి కింది దూరాలు

1
"you can never write a poem" he said. అందుకని

2
రెండు అరచేతుల్లోకి పొగమంచుని అందుకుని ఒక గులాబీని తయారు చేసాను. దానిపై రాత్రి కాంతినీ పగటి చీకటినీ ఉంచాను. దానికి నేను, 'నువ్వు' అనే పేరు పెట్టాను. ఇక అది మట్టిలోమగ్గిన, చల్లటి నీ వేళ్ళవేర్ల వాసన వేసింది -

3
"you can never write the Other" he said అందుకని

4
మబ్బులని కిందకి లాగి, నెమ్మదిగా పాకే గొంగళిపురుగుకి తగిలించాను. పుప్పొడిని దానిపై చిలుకరించాను. ఇక అది ఆకాశంలోకి ఎగిరినప్పుడు, దాని రెక్కలపై నక్షత్రాలు మిలమిలమన్నాయి. దాని పాదాల కింద మట్టి రెప్పల్లల్లే రెపరెపలాడింది. భూమి అంత బరువు వున్న చిన్ని చిన్ని అశ్రువులు, దాని కళ్ళలో మరి బావురుమన్నాయి. ఇక నేను దానిని 'నువ్వు' అని ఎలా పిలవగలను?

5
"I can never write a poem" I said. అందుకని

6
గుండెల నిండుగా మట్టిని రాసుకుని చినుకులతో నిండిన హృదయాన్ని నల్లటి మాగాణి మట్టితో పిసికి పిసికి అతడొక ప్రమిదెనీ, ఒక పక్షిగూటినీ తయారు చేసాడు. అతని నెత్తురూ అత్తరూ అంటిన గూడూ దివ్వె, ఇక తన వాసన వేసాయి. తను వెలిగించిన వొత్తి కాంతీ ఒక ఆదిమ ఆకలినీ, శాంతినీ అశాంతినీ కలిగించాయి

దానికి అతను, 'నువ్వు' అనే పేరు పెట్టేలోగా, ఒక తల్లి వొంటరి స్థన్యం ఒక అద్దమై అతని ముందు నిలిచింది. గూటినీ గువ్వనూ దివ్వెనూ గుండెలకు చరచుకుని అతను

రోదిస్తుండగా, ఇక ఈ తెరపై ఇలాగే రాసాను కొట్టివేతలు లేని పదాలతో -

**7**

"You are a poem. And I, write you like this" ఎలా అంటే

**8**

ఆత్మైన దేహం. దేహమైన దీపం. దీపమైన, ఒక ద్వీపం. ద్వీపమైన ఒక దాహం. దాహమైన ఒక జీవం. జీవమైన ఒక పదం. పదమైన ఒక దైవం. దైవమైన ఒక శబ్దం. శబ్దమైన ఒక నిశ్శబ్దం. ఆమెన్. ఇక రాసుకుంటాం

**9**

**మనం** పిల్లలమై, పాపలమై పూవులమై వెన్నెలమై వానలమై గోరింట అరచేతులమై ఇక్కడే, ఇక ఇక్కడే, కాందిశీకులమై శరణార్థులమై కాంతి అంచున ఊగిసలాడే నీడలై, అంచులు లేని ఒక మహా వలయమై!

# ప్రేమ

చీకట్లో ఒక దీపాన్ని వెలిగించుకుని తనూ, తనలో ఒక మధుపాత్రని వెలిగించుకుని అతనూ: కూర్చున్నారు ఇద్దరూ రాత్రికీ బల్లకీ అటూ ఇటూ. పుప్పొడిలాంటి గాలిలో, గాలిలాంటి చీకటిలో. మరి తన శరీరంపై ఆకాశంలోని చుక్కలూ, మసక వెన్నెలానూ. నువ్వు తరచి చూడగలిగితే గూళ్ళు కట్టుకున్న పక్షులూ కనిపిస్తాయి: అవే, ఇప్పుడు గూళ్ళు లేని ఆ పిచ్చుకలు -

ఇక తనకి ఇప్పుడు పెద్ద ప్రేమా లేదు అలా అని ద్వేషమూ లేదు. ఇంతకు ముందు తను నింపాదిగా వెలిగించిందే ఒక దీపాన్నీ, అంతే నిర్లిప్తంగా చూస్తుందీ లోకాన్ని. ఇక ఒక రహస్య హస్తంచే స్పృశించబడి అడుగుతాడు అతను: “ఎందుకు ప్రేమించవు, నువ్వు నన్ను? ఎందుకు మునుపటిలా ఉండటం లేదు నువ్వు?”

కనిపించీ కనిపించని ఒక సన్నటి నవ్వు తన పెదాలపై. అదే, కిటికీలోంచి వీచే చల్లటి రాత్రికీ గాలికీ కుంచించుకుపోయే సన్నటి నిప్పు నవ్వు. దిగులు కలిగి దిగులైన ఒక దిగులు నవ్వు. అందుకే, ఇక చివాలున లేచిన తన కదలికలకి తడబడి ఆరిపోతుంది దీపం. ఆనక ఇక గదిలో

అతనొక్కడే, దీపాన్ని వొదిలి వెళ్ళిపోయే పొగతో, రాత్రితో ఆ రాతి రాత్రిలో దీపారాహిత్యంతో -

# నా

రాత్రి అన్నం వాసన వేస్తావు నువ్వు

అందుకే, పూలను వెలిగించి
ఒక వెన్నెల ప్రమిదెను
రగిలించి, ఆకాశం కింద విస్తరాకులైన అరచేతులతో కూర్చుంటాను

చీకటినో, చుక్కలనో వొంపు

ఈ మృణ్మయ పాత్రలోకి
నా నవపారిజాతాల దేహంలోకీ
నిదురోతాను ఇక, ఆది అంతాల - అనంతాల - దిగంబరుడైన ప్రభువునై!

# Rowson's Reserve గ్లాసులో AC Premium మందు

నడిచొచ్చీ నడిచొచ్చీ, ఈ చెట్టుకు ఆనుకుని ఎండకి తాళలేక, నీ వైపు తల ఎత్తి కళ్ళు చికిలించి చూస్తాను కదా: మరి ఇన్ని ఆకుల మధ్య తళతళలాడుతూ, ఇన్ని చేతివేళ్ళతో నా ముఖంపై చల్లగా రాపాడేందుకు నువ్వు. కొంత పచ్చదనం కొంత కరకుదనం, మరి కొంత గాలీ కొంత నీడా మరి కొంత బెరడుతనంతో, గూళ్ళతో వొంగి మట్టిలోంచి నింగిలోకి ఎగిరే నువ్వు: వానల్లో వెన్నెల్లో నెత్తురు కురిసిన రాత్రుళ్ళలో చిగురాకులు మొలిచే వేళల్లో మొగ్గలని నులిమే కాలాలలో కళ్ళు కురిసే దినాలలో పెదాలు విరిసే క్షణాలలో కడుపు చించుకుని రహదారులపై పడి ఒంటరిగా గుండెలు చరుచుకుంటూ 'మ్మా, మ్మా' అంటో ఈ లోకంలోకి ఒక మిత్రుడి కోసమో, ఒక శత్రువు కోసమో ఒక తల్లి కోసమో ఒక వేశ్య కోసమో ఒక తండ్రి కోసమో ఒక ప్రియురాలి కోసమో ఎలుగెత్తి ఏడ్చి ఏడ్చి, ఆఖరికి తుపుక్కున ఈ ఎండమావి లోకంపై ఉమ్మినప్పుడో, నడిచొచ్చీ నడిచొచ్చీ - ఇక నీ వీపుకి నా వీపుని ఆనించి కూర్చుంటాను కదా, ఇక అప్పుడు, నువ్వు యధాలాపంగా తల ఎత్తి నా వైపు చూసి "How's the day" అని అడిగితే ఇల్లా అంటాను:

"The day was like AC premium whiskey in a Rowson's Reserve glass. Would you like to have one?"

# ఆదిమ ప్రశ్న

'నీతో నే లేనపుడు ఏం చేస్తావు నువ్వు', అని నువ్వు అడుగుతావు కానీ నిజానికి ఎవరూ ఏమీ చేయరు

తొలిసారిగా, ఎండ ఒక పొద్దుతిరుగుడు పూవులా ఉందని గ్రహిస్తారు వాళ్ళు. గాలి నీళ్ళలా తోస్తేనూ, తోసుకు పోతుంటేనూ ప్రవహిస్తుంటేనూ తొలిసారిగా చేతులు ఊపుకుంటూ, నీళ్ళు చిందించుకుంటూ నడుస్తారు వాళ్ళు. తళతళలాడే కాంతిలో ఎగిరే తూనీగలనీ, వేపచెట్ల బెరడుల మెత్తదనాన్నీ రాళ్ళల్లో ఊగే పూల వాసననీ తొలిసారిగా సంభ్రమంతో ఆఘ్రాణిస్తారు వాళ్ళు. రాత్రి చీకటి ఒక వానలా ఉంటుందనీ, ఒక పొగమంచులా తమని హత్తుకుంటుందనీ ఊరి చివరి పాకలో వెలిగించిన చిరుదీపం ఒక పొదుగులా, తమని ఆదరిస్తుందనీ ఎవరివో రెండు చేతులు -తమ చుట్టూతా కప్పిన ఒక దుప్పటిలా- తొలిసారిగా తమని కావలించుకుంటే జీవితం పట్ల కృతజ్ఞత కలిగి కనులు చెమర్చుతాయని తెలుసుకుంటారు వాళ్ళు. ఆకలికి దొరికిన చద్దన్నం తాగడానికి దొరికిన మట్టికుండలోని నీళ్ళూ పడుకునేందుకు దొరికిన ఆరడుగుల స్థలం

ఇవి అన్నీ, ఇవన్నీ దివ్యమైనవనీ, ఈ లోకపు అద్భుతాలనీ, విత్తు చిట్లి మొలకెత్తే మహా నిశ్శబ్దంలోని విశ్వ రహస్యమనీ తెలుసుకుంటారు వాళ్ళు. చిరునవ్వూ ఆక్రందనా, అలకా ఏడుపూ తడిచిన కనురెప్పల్ని తుడిచే ఏ చేతివేళ్ళైనా పసిచేతులతో సమానమనీ, ఒక అంతిమ శబ్ద రహిత భాష అనీ తెలుసుకుంటారు వాళ్ళు. దారి తప్పి దిగులు వేసి ఒంటరిగా ఆగిపోయి, భయంతో విరిగిపోయి తాకితే ముడుచుకుపోయి, పలుకరిస్తే దూరంగా పారిపోయే శరణార్థుల హృదయాల్లోని ఏకాకి గూళ్ళ అనాథ నిశ్శబ్దపు ప్రతిధ్వనులని వింటారు వాళ్ళు. అవి తమ కన్నా భిన్నమైనవేమీ కావనీ, దగ్గరగా తీసుకుని ఊపిరి ఊదితే వొళ్ళంతా నిలువెత్తు వేణువులై, వెదురువనాలై నాట్యం చేసి శరీర ఖగోళ గీతాలని సాంద్రతతో ఆలపిస్తాయని గ్రహిస్తారు వాళ్ళు: సర్వలోకాలనీ సప్తరంగులతో తనలో ఇముడ్చుకుని ఒక గడ్డి పరక అంచున ఊగిసలాడే ఓ చినుకులో

తమ జననం, మరణం పుణ్యం పాపం వరం శాపం అర్థం పరమార్థం అలా ఆగి ఉన్నాయనీ, సర్వమూ రాలి, అంతం అయ్యి తిరిగి మొదలయ్యే ఒక క్రీడ ఇది కదా

అనీ కూడా అనుకుంటారు వాళ్ళు. "నీతో నే లేనపుడు, ఏం చేస్తావు నువ్వు?" అని నువ్వు అడుగుతావు కానీ, నిజానికీ ఎవరూ ఏమీ చేయరు. ఇన్నాళ్ళూ, అన్నీ నువ్వైనందుకు అన్నీ అయిన నీలో సర్వం మరచినందుకు, మరచినవారికి తిరిగి స్మృతి కలిగించినందుకు స్మృతిలో సర్వాన్నీ, సర్వంలో తిరిగి నిన్నూ, నీలో తిరిగి తమనూ కనుగొన్నందుకు, నీ రాహిత్యానికి కృతజ్ఞతలు చెప్పుకుంటారు. నీ 'రాహిత్యాన్ని' ఓ ముగ్గుగా మార్చి, పుప్పొడితో ఇంద్రధనుస్సులతో ఒక చైతన్యంతో నలుదిశలా వెదజల్లుతారు వాళ్ళు. ఇక్కడ నీచే లిఖించబడ్డ వాళ్ళు, నీ భాషైన వాళ్ళూ ఇక ఆఖరకు, విచ్చుకున్న గులాబీలతో సమాధుల ముందు ప్రణమిల్లి ఇలా అడుగుతారు నిన్నే

లేకపోవడం వల్ల ఉంటూ, ఇరువైపులా 'లేనితనమై' ఉండే, ఉన్న వెళ్లిపోవడమైన నిన్ను ఇలా: "ఛాతిపై ముద్రికయై జ్వలించే నువ్వు, ఆ నువ్వు, మేం నీ వద్ద లేనప్పుడు, మరి మేం లేక, కానరాక, కనలేక  ఏం చేస్తావు నువ్వు?"

# లిమరిక్ లాంటి ఒక రమ్/రిక్

Doc doc doc
I'll put you in a dock

ఇచ్చావు సరే మరి

Norflox
Eldoper
Pantop
Oral re hydration solutionతో

రెండు రోజులు వాటిని మింగి బ్రతకమని
తాగి, తిని
విషతుల్యమయినదేదో

తగ్గుతుందనీ, మరేం కంగారుపడవద్దనీ.
తగినంత విశ్రాంతి తీసుకొమ్మనీ! కానీ మరి

Doc doc doc
I will not put you in a dock కానీ

ఏం చెయ్యమంటావీ శోక నివారణోపాయం
లేని హృదయాన్నీ కాలాన్నీ
తోడెవరూ లేని లోకాన్నీ?

# లాస్ మెస్ ద్రియోస్

'లాస్ మెస్ ద్రియోస్' అంటే కోరిక అని అర్థం,'లాస్ మెస్ ద్రియోస్' అంటే ప్రేమ అని అర్థం. 'లాస్ మెస్ ద్రియోస్' అంటే ప్రేమతో కూడిన కోరిక అని అర్థం అని తను చెప్పింది కానీ అది అంటే ఏమిటో ఇప్పటికీ అర్థం కాలేదు నాకు:

ఆకుపచ్చని నక్షత్రాలు మెరిసే తెల్లటి ఆకాశాల్లా ఉండేవి తన కళ్ళు. మరి చూసావా వాటిలోకి, సరస్సుల్లోకి రాలి దారీ తెన్నూ లేకుండా కొట్టుకుపోతావు. వాన వెలిసాక, ఆకుల చివర్ల నుంచి రాలే నీటి చుక్కలు ఆకస్మికంగా నీ ఒంటిపై పడి, ఒళ్ళు జలదరిస్తుంది చూసావా ఆలా ఉంటుంది తను నిన్ను తాకినప్పుడు. దారి పక్కగా వాన వెలిసిన నీటిలో మొలిచే బుడగలలోకి బుడంగున మునిగి ఆ రంగుల లోకాలలో తిరిగి తిరిగి నిన్ను నువ్వు కోల్పోయినట్లు ఉంటుంది, మరి తను అలా అలా మాట్లాడుతుంటే వింటోన్నప్పుడు

పచ్చని చేలల్లో పంట కాల్వల పక్కగా నిలబడి రివ్వున దూసుకువెళ్ళే గాలీ ఇంకా పిట్టల రెక్కల సవ్వడిని చూసినట్లూ, పున్నమి శీతల రాత్రుళ్ళలో దివి నంచి భువికి అల్లుకున్న మంచుపొరలను ఒక చలిమంటతో రగులుతూ కాచుకుంటున్నట్లూ ఉంటుంది మరి తను నిన్ను గాట్టిగా చుట్టుకున్నప్పుడు. ఇక కల్లు తాగిన కోతి పరిస్థితే నీది, తను నిన్ను ముద్దు పెట్టుకున్నప్పుడు. నిలకడగా నిలువాలేవు నింపాదిగా నడవాలేవు. భూమి తిరుగుతూ విశ్వం తిరుగుతూ తల కూడా తిరుగుతూ ఇక నువ్వు నీ హృదయాన్ని చేతిలో పట్టుకుని వీధులన్నీ తిరుగుతావు "చూడండి. ఎవరికి తెలుసీ కళ?" అంటో, కవితలని రాస్తో. ఇక ఒక రాత్రి తనతో నువ్వు, నీతో తనూ అలా పడుకున్నప్పుడు, నీ గదిలో అరణ్యాల అలజడి. రహస్య లోకాల నీడల సవ్వడి

అనంతమైన దీపాలు వెలిగి, అనంత కాంతి ఖగోళాలు రగిలి, భూమి పిగిలి పర్వతాలు పగిలి, వేన వేల వెదురు వనాలు వానలో ఆకు పచ్చని సంగీతమై తనలోనూ నీలోనూ వ్యాపించి, ఇక ఊగుతోంది

తొలి నిదుర, కమ్మటి పాల వాసనతో, ఛాతి వాసనతో తొడల వాసనతో తొలకరి వాసనతో, కనుల పాదాల వెన్నుముకల వెన్నెలాంటి మెరుపుల పరిమళంతో, ఒక నివేదనతో. 'లాస్ మెస్ ద్రియోస్' అని తను అప్పుడు నీ చెవిలో సన్నగా నవ్వుతూ

నెమ్మదిగా గొణుగుతుంది కానీ వానకి తాళలేక, గూటిలో ఒదగాలేకా నేలపై రాలి చనిపోయిన పిచ్చుక పిల్లలు నానిన నిశ్శబ్దం ఇక నీ చుట్టూతా తను వెళ్ళిపోయాక. ఇక చెట్లల్లో, కొమ్మల్లో హడావిడిగా పిచ్చి పిచ్చిగా అరుస్తాయి పక్షులు. రాలిన పిచ్చుక పిల్లలపై గిరికీలు కొడుతూ - చెట్టు వద్దే దాని బెరడును రాసుకుంటూ అసహనంగా తిరుగుతోంది ఒక పిల్లి అరుచుకుంటో. ఎక్కడో ఎవరో దబ్బున రాలిన శబ్దం. మరణించిన దేహాన్ని పాడెపైకి చేరుస్తున్న నిశ్శబ్దం. శ్మశానంలో సరిగ్గా ఎండని కర్రలని దహించే నిప్పుల కలకలం. అజగరం వలే నీ చుట్టూతా పాకే పొగ, కళ్ళను కాటేసే పొగ, నీ ఛాతిని చీల్చి నీ గుండెకాయని పెగిల్చి నీ అరచేతుల్లోనే ఉంచే పొగ -

ఏడవా లేవు శపించనూ లేవు చెప్పుకోనూ లేవు తప్పించుకోనూ లేవు మరి పారిపోనూ లేవు ఆ 'లాస్ మెస్ ద్రియోస్' గాజుల ఉరితాళ్ళల చప్పుళ్ళ వలయాలలోంచి: ఇక, ఒక దినానంతాన, శ్వేతమయమైన ఆకాశం కింద కూర్చుని, అదొక శరీరం అయినట్లూ అదొక స్త్రీ అయినట్లూ, పదిమందికీ ఖాళీ కుండలా మారిన నీ హృదయం లేని ఛాతిని చూపిస్తూ ఇలా నీలో నువ్వు గొణుక్కుంటావు: 'లాస్ మెస్ ద్రియోస్' అంటే ఒక ఖననం 'లాస్ మెస్ ద్రియోస్' అంటే ఒక జననం. 'లాస్ మెస్ ద్రియోస్' అంటే ఆకుపచ్చని గోళీకాయల కనులున్న సర్పకన్యలు చేసే విన్యాసం. 'లాస్ మెస్ ద్రియోస్' అంటే దేవతలు మానవులతో చేసే పరిహాసం. పరిహారం లేని వేట వినోద చాతుర్యం. మరి విన్నారా మీరు ఇంతకు మునుపు ఇలా 'లాస్ మెస్ ద్రియోస్' 'లాస్ మెస్ ద్రియోస్ లాస్ మెస్ ద్రియోస్'...

# గాలి కన్యలు*

ఒక మాయా వెలుతురులో నువ్వు కూర్చుని ఉంటే దిగి వస్తారు గాలి కన్యలు పుష్పక విమానాలలోంచి. రెపరెపలాడుతుంటాయి అప్పుడు వాళ్ళ ముఖాలు అలసటతతో. నువ్వు ప్రయాణం చేసినంత మేరా, నువ్వు చూసిన వాళ్ళ కళ్ళ మెరుపుల వెనుక అప్పుడు, కొంత ఇంటి బెంగ కనపడుతుంది. మరి నుదుటిని తుడుచుకునే వాళ్ళ అరచేతుల వెనుక అప్పుడు నీకు, ఎదురుచూసే కొన్ని పసికళ్ళూ, చిట్టి చేతులూ, చిన్ని పదాలూ, వాళ్ళ ఇళ్ళల్లో మోగే, వాళ్లకి బాగా సుపరచితమైన శబ్దాలూ వినపడతాయి. నువ్వు చూసిన నవ్వుతున్న ఆ పెదాలలోంచి అప్పుడు నీకొక నిట్టూర్పూ, ఇంకొంత హడావిడీ కనపడుతుంది: వడివడిగా బయటకి సాగే వారి పాదాల వెనుక, అప్పటిదాకా నువ్వు గమనించని, వయస్సుడిగి నిరీక్షించే వాళ్ళ తల్లులూ తండ్రులూ ఒక నిశ్శబ్దంతో నీకు ఎదురు పడతారు. ఇక నువ్వు ఏం చేస్తావంటే ఆ గాలికన్యలు వెడుతూ వెడుతూ, తమ చీర కొంగులతో కొంత శుభ్రపరచిన ఆ ప్రపంచాలలో కాలాలలో కూర్చుని, నిన్ను మరి కొంతగా చైతన్య పరచినందుకు, వాళ్ళు వొదిలి వెళ్ళిన చల్లని కాంతిలోంచి వాళ్ళని కొంత అబ్బురంగా చూస్తూ వాళ్లకి ప్రణామం చేస్తావు. మరి ఇటువంటి పదాలలో, ఇటువంటి పదాలతో -

ఇక ఇదంతా ఏమిటంటే, ఏమీ లేదు. దీపం వెలిగించిన ఆ వేళ్ళనీ చేతులనీ చూసావా నువ్వు అని చాలా మామూలుగా అడుగుతాను నేను, ఈ భూమి దీపశిఖను కాపాడే ఆ రెండు అరచేతుల మధ్య భద్రంగా దాక్కుంటూ, ముడుచుకుని పడుకుంటో -

* my word for Air hostesses

# పూలరాత్రి

అరణ్యాలలోంచి వచ్చిన, నక్షత్రాలు మెరిసే ఒక పద్మానివి నువ్వు. మంచులో నానిన ఉదయంపై ప్రసరించిన లేత ఎండవి నువ్వు. ఇంకా ఆకలిగొన్న కడుపుని ఎత్తుకుని, ఛాతిలో దాచుకుని శిశువుకి పాలిచ్చిన తల్లివి నువ్వు. నీకు ధన్యవాదాలు తెలపడం ఎలా? అని నేను విభ్రాంతితో అడిగితే ఇలా చెప్పింది, మనం ప్రతీకలలలో సమాధి చేసిన ఒక బంగారం ఇల్లాగే చెప్పింది నా పదాలలో:

"ఎందుకో రాస్తావు పూవుల గురించీ? రాళ్ళుగా మారిన కాళ్ళు, కాళ్ళుగా మారి పగిలిన ఈ అరచేతులూ బట్టలు ఉతికీ అంట్లు తోమీ, టాయిలెట్ కడిగీ కడిగీ నీకు వండీ వండీ నీతో పడుకునీ పడుకునీ తడిలేక పగిలిన పెదాలైన నా యోని గురించీ మరి ఎందుకో రాయరు మీ కవులు మరి మహాతాదాత్మ్యంతో, నును లేత పోలికలతో, మబ్బులతో, ఆకాశంతో వసంతాలతో వానలతో ఎప్పుడూనూ?"

ఇక ఆ తరువాత ఆ కొండలలో రాత్రంతా వర్షం కురిసింది. చీకట్లో, ఒక దీపంలా వెలుగుతూ తను నా ఎదురుగా కూర్చుంటే గది అంతటా పచ్చి గడ్డి వాసన. కన్నీళ్ళలో తడచిన వెదురు వనాల వాసన. కొంత పచ్చి ముళ్ళ నెత్తురు వాసన -

తెలుస్తుందా మీకు? ఇక్కడ ఆ రాత్రంతా వీచిన, శరీరాన్ని గడ్డ కట్టించే, తన చేతి వేళ్ళ అంచుల నుంచి వీచే, అనంతాల మంచు ధూపం మరి మరణం లేని కనుల దహనం?

# అడగాలి కదా ఎవరో ఒకరు

పారిశ్రామిక ప్రదర్శనశాల ఇది. మరియూ యంత్ర ఖచిత మనుషులు దేవతా నవ్వులతో అలరాడే మహా మాయా నగరమిదిరా అని నేను మరచినప్పుడల్లా, అలా అని నేను మరచి, ఎవరినో ఒకరిని మోదుకుని కళ్ళను పెరుక్కుని అరచేతులలో ఉంచుకుని, వాటిని చితుకుతూ దుమ్ముతో గాలితో దూరంతో- కబోధి ఒకడు తన కళ్ళను కన్నీళ్ళలో కనుగొన్నట్లు- నేను ఒక్కడినే ఇక్కడికి తిరిగి వస్తే ఎంత రాత్రైనా నువ్వే ఆ చీకట్లో ఒక పసుపు పచ్చని దేదీప్యమానమైన పొద్దు తిరుగుడు పూవువై అక్కడే ఆ గూటిలో, ఒక కంచంతో ఒక గ్లాసుడు మంచినీళ్ళతో ~~ఈ~~ పొద్దు లేక తిరిగే పూవుకై మరి ఇష్టంతోనో, లేక అలవాటుతనంతోనో -

మరి ఒక దీపం వెలిగించి, ~~ఈ~~ లోకం ముఖాన్ని తుడిచి, అడగాలి కదా ఎవరో ఒకరు ఇలాగైనా

“‘రాత్రి, అన్నం తిన్నావా చిన్నా? లేక తాగితాగి అలాగే పడుకున్నావా కన్నా?’’ అని, కొంత ఆదరణతోనో లేక మరి కొంత స్వానుభవంతోనో మరి కొంత ఏమీ చేయలేని నీ నిస్సహాయతతోనో?

# నీ వాళ్ళు

1
ఒక ఏకాంతం కావాలి నీకు, నిన్ను నువ్వు
బ్రతికించుకోవడానికో, నిన్ను నువ్వు సమాధి చేసుకోవడానికో: మరి అందుకే నీకు
ఈ పదాలు

2
ముందుగా దీనిని ఊహించు - ఇలాగే: చీకట్లో
    సన్నటి మసక వెలుతురు చినుకులై రాలే నీ గదిలో
    మూసుకున్న నీ కనురెప్పలపై, ఎవరో
తమ అరచేతులని ప్రమిదల వలే ఉంచి, నీ

అదృశ్య అశ్రువులపై హొదిలి వేస్తే, ఆనక తిరిగి ఓరిమిగా
నీ చేతిని తమ చేతిలోకి తీసుకుని
"నేనున్నాను" అని అదిమితే, మరి

నీలో ఒక అలసట తీరిన నిట్టూర్పు, మరికొంత చిటికెడు శాంతీ. మరి ఇక అందుకే
ఇలా కూడా ఊహించు:

3
శరీరం కొంత

చచ్చిపోయి, కళ్ళు పూర్తిగా పిగిలిపోయి చేతులు ఎక్కడో
దిగంతాలలోకి రాలిపోయి, నువ్వు
మరి నువ్వే, నీ ఇంటికి ఒంటరిగా

తిరిగి వచ్చి అదే చీకట్లో కూర్చుంటే, మూసిన కనుల పైన వాలిన
ముంజేతి కింద కొద్దిగా చెమ్మ. నువ్వు
ఉంచుకుందామనుకున్నా ఉంచుకోలేని

నువ్వు వొదుల్చుకున్న ఆ పిండం, ఏవో
లోకాలలోంచి నిన్ను చల్లటి చిరుగాలై తాకే కుత్తుక తెగే సందర్భం.
"తప్పా చెప్పు: ఇష్టపడటం? శరీరంతో
శరీరాన్ని ప్రేమించడం?'' అని నువ్వు

అని నువ్వే, నీ అద్దంలోకి చిట్లి చిట్లి కనుమరుగై, దూరమై ధూపమై

మరి చిన్నగా గొణుక్కుంటావు కానీ
గోడ అంచున ఊగిసలాడే నీడలు
నీ నీడలు, పువ్వుల్లా వికసించే నీడలు
అవే, మరి అవే ఈ అక్షరాలకి ఆధారం. అందుకే మరి ఇలా కూడా -

4.
ఒక అంతం కావాలి నీకు: నిన్ను నువ్వు
చంపుకోడానికో, ఇతరులని పూడ్చిపెట్టడానికో లేక నీ అరచేతుల్లో
నా తలను బాదుకుని ఏడవటానికో - ఇంతకూ

5
మరి గుర్తుందా నీకు, వెడుతున్నానని మాట వరసకైనా చెప్పకుండా
నిన్ను త్రవ్వి త్రవ్వి కొల్లగొట్టుకు వెళ్ళిన
వాళ్ళు? ఆ నీ వాళ్ళు? నీవనుకున్న నీ వాళ్ళూ?

# కొన్నిసార్లు కష్టం

1
కొత్తగా ఏమీ చెప్పను. సౌందర్యం వదిలి వేసుకుంటున్న
చీకటి నీటిపై తేలే చిన్ని రాతలివి: సరే విను -

2
ముందుగా దీనిని ఊహించు, ఇలా: అలసి ఇక సాగలేక
ఒరిగిపోయిన ఛాతిపై, చీకట్లో ఎవరో ఒక దీపం వెలిగించి
నీ పక్కగా కూర్చుని, సన్నటి చిరునవ్వుతో, ఒక
పదునైన చాకుతో నీ ఛాతిని ఒరిమిగా చీల్చి

ఆపై ఆ రాత్రిలో మెరిసిపోయే ఒక తెల్లని గులాబీని ఉంచుతారు.
గుబురు పొదల్లోకి కుందేళ్ళూ చందమామలూ
వెళ్ళిపోయే సమయాలు: మరే, ఎవరూ అని అడగకు
మరే, మరి ఎవరూ అని చూడకు. హృదయాన్ని

అలా చీల్చినదీ తిరిగి పూవై పొతుకుపోయినదీ, ఒక పదమో
అవునో కాదో నీకు ఎలా తెలుసు? చూడు, వీధి మలుపు చివర
కళ్ళను తుడుచుకుంటూ వెళ్లిపోతున్నారు ఎవరో
అరచేతుల్లో నెత్తురోడుతున్న తననే, నిన్నే
అతి జాగ్రత్తగా పుచ్చుకుని. మరి గుర్తుకు వస్తున్నారా నీకు

నువ్వొకసారి పొదివి పుచ్చుకుని వొదిలివేసిన నీ
సహచరీ, నీ సహచరుడూ, లోకంపై కోపంతో నువ్వు నీ
నిస్సహాయతతో చరచిన నీ పిల్లల బుగ్గల్లో, వాటిపై
వలయమై ముద్రితమైన కమిలిన నిప్పులూ, తలను గోడకేసి
బాదుకున్న ఆ నీ కుత్తుక తెగిన రాత్రుళ్ళూ?

**3**

కొత్తగా ఏమీ చెప్పను. సౌందర్యం వొదిలి వేసుకోలేని
    చీకటి నీటిపై తేలే పాదాలు ఇవి. నీ పదాలు ఇవి - సరే

**4**

ఎల్లా చచ్చిపోదాం మనం, ఈ కాగితపు అంచున ఊగిసలాడే
    రాత్రికీ, రాత్రి అంచున వెలిగే ఎవరూ లేని పిల్లల రెప్పల కాంతికీ?

# ముద్ద మందార పూవులు

నీ ఇంటి ఆవరణలో చక్కగా ఊగేవి ఆ ఎర్రని ముద్ద మందార పూవులు. నేను నీ కిటికీ పక్కన కూర్చుని తల వంచి చూస్తే:ఎదురుగా అవి. ఉదయపు లేత కాంతి వాటి కొమ్మలపై వాలి, గాలితో వాటిని ఊయల ఊపుతున్నట్లూ ఎవరో తల్లి ఒక జోలపాటతో తన ఒడిలోని శిశువులను జోకొడుతూ, ఊపుతూ నిదుర పుచ్చుతున్నట్లూ మెత్తటి బరువుతో, తూనిగలు తిరిగే నిశ్శబ్దాలలో ఊగేవి ఆ ఎర్రఎర్రని ముద్ద మందారాలు -

నీ ఇంటి ముందు బాదం చెట్టు, వేసవికి ఆకుల లేఖలని రాసే వేళల్లో కూర్చున్నాను అప్పుడు, నీ పక్కనే, నిన్ను ఆనుకుని నీ అరచేతిని గట్టిగా పుచ్చుకుని. నా తల ఆన్చిన నీ భుజంపై కొంత చెమ్మ. కొంత నొప్పి. నా తలని లేపి ఇక నీ వక్షోజాల్లో దాచుకుంటే అక్కడ కొంత నెత్తుటి తడి: తెలిసింది నాకు అప్పుడే తొలిసారిగా నీ వక్షోజాలు కళ్ళు అనీ, అవి కన్నీళ్ళు పెట్టుకుంటాయనీ ఆ కన్నీళ్ల రాలి, పూవులు, ఆ ముద్ద మందార పూవులు, వొణికి వొణికి తలలు వంచుకుంటాయనీ -

ఇక చూడు ఇప్పుడు, అదే కిటికీ పక్కన ఊగుతున్నాయి రెండు ముద్దమందార పూవులు, నెత్తురు నిండిన బరువుతో కనులని కోసే మిట్టమధ్యాహ్నపు కర్కశ వేసవి గాలులతో: తడిగుడ్డతో నీ పెదాలు తాకిన నా నుదుటిని, కాస్త అలసటగా తుడుచుకుని, ఇక నా తల తిప్పి తిరిగి చూస్తే, అక్కడ కొంత ధూళీ కొంత ఆవిరీ చెట్ల కొమ్మల్లో కనిపించని పక్షుల అలజడి, నీడలు నీడలతో కలగలసి చీకటయ్యే ఒక ఆకస్మిక విభ్రాంతీ: నాలోపలో సమాధి ఉందో లేక ఒక సమాధిలో నేను ఉన్నానో దహనమౌతోన్న చితిని మోసుకుని తిరిగే ఈ మనుషుల మధ్య మళ్ళా ఓ పరి మరణించానో ఓపరి జనినించానో తెలియని స్థితి: ఇంతకూ

చూస్తున్నావా నువ్వు? ఈ రెండు వాక్యాలనూ, కొన ఊపిరితో నెత్తురోడుతున్న రెండు ఎర్ర ముద్ద మందార పూవులను అరచేతులలో పుచ్చుకుని అందరికీ చూయిస్తూ, తనని తానే అడుక్కుంటున్న ఆ పూవులు లేని ఈ మనిషినీ, ఒక రహస్య ప్రదేశంలో ఒక ద్వేదీపమైన కాంతిలో, గాలిలో వానలో, ఇప్పటికీ అలా నిరంతరం ఊగుతూనే ఉన్న ఆ ఎర్రని, ఎర్ర ఎర్రని ఇంకా మీలో మానని ఆ ముద్ద మందార పూలనీ?

# గర్భస్మృతి

లేచి వెళ్ళిపోతారు పిల్లలు : ఇక
నలిగిన ఆ దుప్పట్ల కింద, పూర్వజన్మల
పురాతనమైన వాసన ఏదో -

ఈ లోకానికి చెందని జనన మరణ రహస్యాల
పుష్పగుచ్ఛాల స్పృహ ఏదో ఇక్కడ
వాళ్ళు అరచేతులు వాలిన దిండ్లపై:

రాత్రిని వొదలని సీతాకోకచిలుకల
రెక్కల కదలికలు ఏవో ఇప్పటికీ
వాళ్ళు కప్పుకుని తొలగించిన ఆ దుప్పట్లలో -

ఒక చిన్న కదలిక ఏదో
నిశ్చలమైన సరస్సును
వలయాలు వలయాలుగా విడమర్చినట్లు

గది అంతా లతల వలె అల్లుకున్న
ఒక కమ్మని నిదుర పాల వాసన.

వాళ్ళ అమ్మలాంటి, తన నవ్వులాంటి
వాళ్ళ కలల పసి ధూళి ఏదో
ఇప్పటికీ ఇక్కడ పసిడి తరంగాలై -

నేను నా తల్లి గర్భంలో
శ్వాసించి మరచిన పరిమళం ఏదో ఇక్కడ
నేను తల్లి గర్భంలో
చూచి మరచిన చిత్రాలు ఏవో ఇక్కడ -

ఆదిమ తల్లి  చూచుకాన్ని తాకిన

ఆ తొలి స్పర్శ ఏదో తిరిగి తెలిసినట్లూ

ఆ తొలి పాల బిందువు ఏదో తిరిగి
పెదాలపై రాలినట్లూ, ఒక మహా రహస్యమేదో
నెమ్మదిగా అవగతమౌతున్నట్లూ

ఒక తమకంతో, స్థాణువై నేను ఇక్కడ

పిల్లల వలే నిదురలోంచి లేవలేకా
పిల్లల వలే నిదుర లేచి వెళ్లిపోలేకా!

# పిల్లలు నిన్ను పట్టుకుని ఏడ్చినపుడు

ఏం చేయాలో తెలియదు నీకు, పిల్లలు నిన్ను పట్టుకుని బావురుమన్నప్పుడు -

ఎంత మిట్ట మధ్యాహ్నం అయినా, నీలోపలి ఆవరణలో కురుస్తుందో నల్లని మంచు. ఆనక, నీ శరీరం లోపలంతా హోరున వీచే చెట్ల గాలుల్లో చెల్లాచెదురుగా ఎండుటాకులు రాలి ఆకాశంలో మబ్బులు కమ్ముకుని, నేలపై నీడలు సాగిపోతే, ఇక ఒక మసక చీకటి నీ కళ్ళలోకి అలుముకోగా నీలో కొంత ఉక్కపోత మరికొంత ఊపిరాడనితనమూ, దిగులూనూ -

ఇక అప్పుడే, గోడలపై గీసిన పిల్లల గీతలలో చేరుకునే చెమ్మ. ఎవరో తమ చూపుడు వేలిని కన్నీటిలో ముంచి ఆ గోరువెచ్చటి తడిని ఆ బొమ్మల్లోకి అదిమినట్లు, వాళ్ళు జాగ్రత్తగా, గూళ్ళను అల్లుకున్నట్లు దాచుకున్న ఆ చిరిగిన కాగితాలలో చేరే ఒక సునిశితమైన నిశ్శబ్దం. మరి అప్పుడు ఇల్లంతా ఆగీ ఆగీ చిట్లే వెక్కిళ్ళ శబ్దం. సరిగ్గా ఆ క్షణాన

నీ ఇంటి బయట పావురాళ్ళు  అలజడిగా కొట్టుకునే రెక్కల సవ్వడి. ఇక రాలిపోతాయి వాటి ఈకలు తెగి, నెమ్మదిగా నీ గుమ్మం ముందు, ఎవరూ తాకని ఒక వొంటరితనంతో. ఇక  వెళ్ళిపోతుంది వీధిలోంచి ఒంటరిగానే ఒక ఒంటె, పిల్లలు హృదయాలు కొట్టుకునే గల్ గల్ శబ్దాలతో. నిరాశగా తోసుకుంటూ వెళ్ళే పోతాడు, వంటరిగానే ఒక ఐస్క్రీమ్ బండి వాడు నీ ఇంటి ముందు ఆగి, మరీ మరీ అరచీ నీ ఖాళీ బాల్కనీలోకి చూచీ చూచీ -

ఇక గేటు వద్ద ఒక్కత్తే ఒక ముదుసలి బిచ్చగత్తె, ఖాళీ సత్తుగిన్నెతో ఈ నగరంవంటి నీ నలుచదరపు అపార్ట్మెంట్ ముందు ఆకలితో, డొక్కుపోయిన కడుపుతో, దాహంతో చిట్లిన పెదాలతో ఒక నిరాకార మృత్యుమయ హృదయంతో ...

చూడండి: నిజంగా తెలియదు నాకు, ఏం చేయాలో, పిల్లలు అలా నన్ను వాటేసుకుని బావురుమని ఏడ్చినప్పుడూ, వెక్కిళ్ళతో అలా తినకుండా నిదురోయినప్పుడూ. మరి అప్పుడు, అక్కడ వాలిన పూలను చూస్తూ ఏం చేయాలో, మీకేమైనా తెలుసా ఇంతకూ?

# అది

1

భూమి మీద మిగిలిన ఆఖరి మానవుడు, తపనగా నలుదిక్కులా చూసుకుంటున్నట్లు దారీ తెన్నూ లేక, తాకగలిగే ఒక అరచేయి లేక తన నీడనే తాను ఓరిమిగా తాకుతూ కన్నీళ్ళ పర్యంతం అయినట్లూ తల ఎత్తి చూస్తే కళ్ళలోకి నిలువెత్తు గునపాల వలే దిగే సూర్యకిరణాలూ, కనుపాపలని కోసే గాలీ. మరి ఇంతకూ, మనుషులు తాకగలిగే మనుషులు ఎక్కడ ఉన్నట్లు?

2

శిధిలాల మధ్య, హృదయాల వంటి బండరాళ్ళ మధ్య, గోడలపై నిలకడగా పాకే లతలు - నువ్వు వాటిని నీడలు అనవచ్చు. నువ్వు వాటిని కరిగిపోని శిలలూ అని అనవచ్చు -

కొమ్మలలోంచి గూళ్ళు రాలిపోయి, నీకు ఇరువైపులా గడ్డిపరకలు పీలికలుగా తేలిపోయే వేళల్లో, చెట్లపై నుంచి కిందకి నింపాదిగా దిగివచ్చే సర్పాలు: మరి మెలికలు మెలికలుగా, వలయాలు వలయాలుగా -

నువ్వు వాటిని, ఆ గూళ్ళని, నువ్వు ఇన్నాళ్ళూ నిర్మించుకున్న బంధాలని అనుకోవచ్చు నువ్వు వాటిని, ఆ గడ్డిపరకలని, చేతికీ చేతికీ మధ్యన ఏర్పడిన ఒక దూరమనే పిలవొచ్చు. ఇరువురూ గడపలేని ఒక విపత్కాలాన్నే, నువ్వు ఆ సర్పాలుగా భావించవచ్చు ఆ కాంతిరహిత వలయాలని నువ్వు కాలంగానే భావించవచ్చు. మరి ఇంతా చేసీ, ఇంత అనుకున్నా, మారేదేమిటి?

3

తల వంచుకుని, అరచేతుల మధ్య ముఖాన్ని కుక్కుకునీ, సమాధి చేసుకునీ, మరిక అరచేతులలో చిట్లిన చెమ్మలో, చెమ్మతో ఈ నాలుగు చిన్న మాటలని, తనకు లేని తన తోటి మనిషికై రాసుకునే మనిషి -

ఏమని పిలుస్తావు నువ్వు అతనిని? సరే ఇలా ఒక కవిత అని కూడా అనుకుందాం మనం ఇప్పటికి: నువ్వు వొదిలి వెళ్ళాక, తిరిగి నువ్వు వస్తావని, చీకటింట ఒక తల్లి

పొయ్యి వెలిగించుకుని కుండలో ఇన్ని నూకలూ నీళ్ళూ పోసి ముడుచుకుని కూర్చుంటే, ఎగిసిన ఆ మంటల్లోంచి గతజన్మలూ గత ప్రేమలూ తన అనేక జననాలూ, అనేక మరణాలూ, ఇంకా మోయవలసిన అనేక జీవితాలూ చిమ్మాయి - అనేక శిశు జననాలూ, అనేక గర్భస్రావాలూ చివికి పిగులుతున్న శరీర  మందిరంలో తనకి అనేక కాంతి నదులూ కనిపించాయి. మరి, అంతా చూసీ ఒక నిర్లిప్తతతో ఎదురు చూసీ చూసీ, తను అక్కడే నిదురోయింది. అన్నం ఉడికింది. కుండ కాలిపోయింది. మరి నిప్పూ నివ్వెరపోయి ఆరిపోయింది. ఇంతా చేసి, వెళ్ళిన వాళ్ళెవ్వరూ తిరిగి రాలేదు. అరచేతుల్లో దిగబడిన ముఖాన్ని ఎవరూ వెలికి తీయలేదు -

4

భూమి మీద మిగిలిన ఆఖరి మానవుడు, ఒక శరీరంకై, ఒక మాటకై, ఒక స్త్రీ స్పర్శకై, నీడలని తవ్వీ తవ్వీ వెదుక్కున్నట్లు, తనకు గర్భం లేదనే ఎరుక తొలిసారిగా కలిగి దుఃఖించినట్లు తాను ఎప్పటికీ గర్భం కాలేనందుకూ ఈ ధరిత్రిని చెరిచి చంపివేసినందుకూ, ఒక్కడుగా మిగిలి, ఒక్కడుగా రోదించీ గుండెలను చరుచుకుని చరుచుకునీ చూస్తే అంతా ఒక చీకటి శూన్యం ఒక కృష్ణ బిలం -

5

మోకాళ్ళ మీద ఒరిగిపోతూ మరి నువ్వు కూడా అనుకో అప్పుడప్పుడూ, ప్రార్థించు నువ్వు కూడా ఇలా అప్పుడప్పుడు: 'నాలుగు మాటలు మాట్లాడే మనిషిని ఆశించే కంటే, వెదికే కంటే, ఎదురుచూసే కంటే, మరి గోడలకి మేకులు కొట్టుకోవడం చాలా సుఖం.' ఇక్కడ నేను ఏం సూచిస్తున్నానో అర్థం అవుతుందా నీకు? చేతులలో మేకులతో ఇనుప దిమ్మెతో అక్కడ వేచి చూస్తున్న నీకు?

6

తిరిగి రా ఇంటికి. అద్దాలు లేని పూలనీ మరి పక్షులనీ, గాలినీ, వాననీ, వెన్నెలనీ, చీకటినీ చీకటి వాసన వేసే ఉదయాలనీ, ఉదయాల వాసన వేసే నీళ్ళనీ, కన్నీళ్ళనీ నీతో కలిపి కడుపుతో  నిండు గర్భంతో ఉన్నాను ఇక్కడ. విన్నావా నువ్వు? విను, ఇక ఒక ఆఖరి పంక్తిని -

7

Amen.

# అంతే

రాత్రంతా, నువ్వు లేని నా ముఖం జ్వలిస్తుంది: ఎవరో దాచుకుని వేసుకున్న చితుకుల మంట వలే

గుసగుసలాడినట్లు ఇక నెమ్మదిగా ఆకులు కదులుతాయి ఈ ఆవరణలో. నేను వాటిని గాలిలో రెక్కలల్లార్చే నీ కనురెప్పలనే పిలుస్తాను. ఇక ఆ తరువాత సుగంధ ద్రవ్యమేదో ఒలికి, ఇల్లంతా తెరలు తెరలుగా వాసన వేసినట్లు గోడలపై నుంచి వెలుపలకి వచ్చి చుట్టూ అల్లుకునే పిల్లల గీసిన గీతలు. నేలపై నుంచి పైకి లేచి, కాంతిలో అంటుకునే, చాచిన అరచేతుల తడి. కొన్ని మాటలూ. మరికొన్ని విప్పి చెప్పలేనివేవో ఈ సమయపు సరస్సుపై నెమ్మదిగా తూనిగల వలే వాలి చలనమేదీ కలిగించక క్షణకాలం అలా ఉండి ఎగిరిపోయినట్లు, చీకటిలో క్షణకాలం మిణుగురు పురుగులేవో అంతవరకూ చూడని లోకాన్ని కాంతివంతం చేసినట్లు నువ్వో నేనో మాట్లాడుకున్న ఆ అర్థం లేని మాటలే, శబ్దాలే, మరి ఇక్కడ కొంతసేపు, ప్రతిబింబాల వలే, అద్దంపై ఒక మంచుపొర ఏదో కమ్మినట్లుగానూ -

ఇక దీని తరువాత ఏం జరుగుతుంది? అని నువ్వు అంటే, ఆహ్ మరేం లేదు. కిటికీలు తెరిచి, తలుపులూ తెరిచి అద్దాన్ని శుభ్రంగా తుడుచుకుని ఆ అద్దంలోని తాకలేని లోకాలలోకి చేయి చాచి ఒక మనిషి నిద్రకు ఉపక్రమిస్తాడు. అంతే!

# అతి మామూలు దినం

కనులపై నుంచి నీటిపొర ఏదో నెమ్మదిగా తొలిగినట్లు అతి నెమ్మదిగా కాంతివంతమౌతుంది లోకం -

చల్లటి వెలుతురు గాలి వలే వీచి, ఇక ఈ ఉదయాన కొద్దిగా కదులుతూ మెరుస్తాయి పచ్చటి ఆకులు. పిల్లలు ఎక్కిన సైకిళ్ళను వెనుక నుంచి తోటి పిల్లలు తోస్తున్నట్లుగా నెమ్మదిగా ముందుకు దొర్లుతాయి నేలపై రాలిన పసుపుచ్చని ఆకులు. కొమ్మల్లో వాళ్ళు నవ్వుతున్న శబ్దాలు, చిన్నగా సన్నటి ఎండు కొమ్మలు చిట్లి, ధూళి ఏదో రాలుతున్నట్లు ...

నువ్వు నిండారా తెరిచి చూసుకుంటున్న నీ అరచేతుల్లో పారదర్శకంగా తొణికిసలాడే నీళ్ళ వంటి నీడలు: ఒకసారి, నీ ముఖాన్ని ఆ నీడలతో కడుక్కుని ఆ ఆవరణలో ఆ కుర్చీలో ఒళ్ళు విరుచుకుని మళ్ళా ఒద్దికగా ముడుచుకుని కూర్చుంటున్నప్పుడు, ఇక నీకు తొలిసారిగా బ్రతికి ఉన్నావన్న స్పృహ. కొంత లోతైన ఆనందం. ఎక్కడున్న వాటిని అక్కడే ఉండనిచ్చి, వేటినీ మార్చాలని చూడక, సర్వాన్నీ అలా చూస్తూ ఉండే ఒక చర్య. ఒక మామూలు దినచర్య. "ఇంతకూ ఇదంతా ఏమిటి?" అని నువ్వు అడిగితే ఇలా చెబుతాను:

ఏమీ లేదు. ఈ ఉదయాన ఇలా లేతగా, లేతెరుపుగా వికసించిన పసికళ్ళ వంటి ఈ పూవులు సాయంత్రానికి రాలిపోతాయి. రాత్రిలోకి కనుమరుగవుతాయి. అందులో తప్పేం ఉంది? వింతేం ఉంది? సహజం కానిది ఏముంది?

# గూడు

ఎక్కడినుంచో వచ్చిన పసుపు పచ్చని పిట్టలు గడ్డిపరకలతో గూడు అల్లుకుంటుంటే చూస్తారు పిల్లలు అబ్బురం నిండిన కళ్ళతో. చెబుతావు నీవు విడమర్చి కొన్ని విషయాలని వాళ్లకి ఆ గూటిని చూయిస్తో, నీకు నువ్వు కూడా చెప్పుకుంటో, "రెండు కావాలి ఒక్కటిని చూసేందుకు. ఒక్కటి అయ్యేందుకు. కట్టుకుంటారు మీరు కూడా ఎప్పుడో ఒకప్పుడు ఒక గూడును. నిర్విరామంగా నిర్మించుకుంటూ తెలుసుకుంటారు మిమ్మల్ని మీరు, గూడు ఇక్కడిది కాదని గూడు ఎప్పటికీ ఉండదనీ అయినా గూటిని కట్టుకోవడం ఎప్పటికీ ఆపకూడదనీ ..."

మరిక నిన్ను తొలిసారిగా విస్మయంగా చూసే కాంతి విరిసే పిల్లల కళ్ళలోకి చూసినప్పుడు అదే కదా తెలిసేది అందరికీ: తిరుగుతోంది ఈ జగం ఒక వేణు గానంతో పసి పాదాల నృత్యంతో తన చుట్టూతా తానై సర్వం చుట్టూతా తిరుగుతూ విశ్వ వృక్షానికి వెలిగే నక్షత్రాల కొమ్మల్లో ఒక గూడై దీపమై వెలుగుతో అల్లుకుంటో: చూడు

ఇక రాత్రంతా ఇద్దరు పిల్లలు చీకటి పాత్రలో ఒక వెన్నెల రొజాని ఉంచి తమ శ్వాసలను జల్లి ఎలా నీ ఛాతిపై చెరోవైపు కలల గూళ్ళు అల్లుకుంటూ నిశ్చింతగా నిదురోతారో! ఇక నిశ్చింతగా నువ్వు తొలిసారిగా ఎలా ఒక మెలకువలోకి మేల్కొంటావో!

# స్తబ్ధత

ఇవాళ నీ ముఖం ఎందుకో స్తబ్ధుగా మారింది

బహుశా ఎవరూ ఎత్తుకోలేదు ఇవాళ నీ ముఖాన్ని తమ అరచేతులతో. అందుకే బహుశా ఈ మధ్యాహ్నం నీ గదిలో ఒక మూలగా కూర్చుని ఉంది నీ నీడ. అప్పుడు ఇక నువ్వు నీ కనురెప్పలని బరువుగా లేపినప్పుడు, కనిపిస్తాయి రెండు ఊదా రంగు పిట్టలు, కిటికీకి చుట్టిన కేబుల్ తీగలపై పుల్లలతో పరకలతో ఒక గూటిని అల్లుకుంటో: అదే గూడు. ఎవరో తమ రెండు అరచేతులని ప్రార్థనకై జోడించి ఆకాశాన్ని వేడుకుంటున్నట్లు ఉన్న గూడు -

ఇక ఒక నిట్టూర్పుతో కదులుతావు నువ్వు. నేను లేని ఇంట్లో నేను రాసిన కాగితాలపై ఉన్న అక్షరాలని నీటి రంగులతో చెరిపివేస్తూ ఆడుకునే నీ పసిబాలుడు ఇక నిన్ను చూస్తూ అంటాడు కదా: "అమ్మా, ఇవాళ నేను నీ కళ్ళల్లో నిదురపోతాను."

ఆనక ఏ రాత్రో వచ్చి రాత్రి గూటిలో ముడుచుకుని ఒక అశ్రువుని కౌగలించుకుని నిదురోతున్న మరొక అశ్రువుని చూసి మరి నా ముఖమే ఎందుకో స్తబ్ధుగా మారింది-

# a bit of chilled beer, a bit of warm smoke

సైనికుల వలె కవాతు చేసాం పగలంతా/ వేసవిలో, గాడ్పులలో/ దిన దిన జీవన సమరంలో/ హృదయాలని చేతబట్టి కళ్ళను అదిమిపట్టి/ సైనికుల వలె/ పగలంతా ధూళితో ఎండిన పెదిమలతో/ టకా టక్ ధనా ధన్/ టకా టక్ ధనా ధన్/ పగిలిన పాదాలతో కమిలిన చేతులతో/ అరచేతులను రుద్దుకుంటో ఎవరినో తలచుకుంటో/ నెత్తిన కట్టిన తెల్ల రుమాలుతో దారిన తాగిన నిమ్మ రసంతో/ టకా టక్ ధనా ధన్/ టకా టక్ ధనా ధన్/ కదిలితిమి ముందుకు/ రేగిన శిరోజాలతో/ కమ్మిన యంత్ర తంత్రములతో/ వాహనాలు కక్కిన పొగలతో/ లోహ దారులు వాంతి చేసుకున్న/ మనవంటి మనుషులతో/ మనం కాని జంతువులతో/ కవాతు చేసాం పగలంతా/ నుజ్జు నుజ్జు అయ్యాం దినమంతా

నీడ లేక నిలువ జాగ లేక/ ఎక్కడా ఆగక, ఆగలేక/ అమ్ముకోనిదే బ్రతుకలేక/ పరిగెత్తీ పరుగెత్తీ/ ఇతరులని వెంటాడీ వేటాడీ/ కెఫేలలో టీ లతో కడుపుల్ని నింపుకుని/ మనల్ని మనం కొంత చంపుకునీ చలించీ/ టకా టక్ ధనా ధన్/ టకా టక్ ధనా ధన్/ కదం తొక్కితిమి పగలంతా/ రణమయ్యితిమి పగలంతా/ రణగొణ ధ్వనులమయితిమి/ రక్త పిపాసులమయితిమి/ జగమంతా

చూడూ/ పగలొక రాత్రయినది/ ఇక యుద్ధం ఆపే వేళయినది/ నాటకపు దుస్తుల్ని విప్పి/ దాచుకున్న హృదయాల్ని తిరిగి గుండెల్లో అమర్చుకుని/ వొలికిపోయిన స్త్రీలను జాబిలిలో దర్శించే/ కాంతి కాలమయినది/ ఒక మెత్తని చేతిని/ శిశువై అల్లుకునే/ పరిమళ సమయమైనది/ కరుణా పదమైనది

ఒరేయ్ నాయనా/ ఇక పద పద పద/ దా/ నిండా ఎండిన కుండలైన/ ఈ విషపూరిత శరీరాల్లోకి/ ఒక అమృత భాండాగారాన్ని/ వొంపుకునే క్షణమయినది/ దా దా దా: మనకే ఇంతకొంత/ a bit of chilled beer/ a bit of warm smoke ...

ఇక ఆ తరువాత/ మనం చచ్చినా/ చచ్చామన్న చింత లేదు/ మనం బ్రతకలేదనే/ బ్రతకరాదనే దిగుల్లేదు

# అమ్మలే

రాత్రినే తీసుకువచ్చాను చీకటిగా మారి ఎదురుచూసే ఇంటిలోకి. ఏమయ్యిందని అడగలేదు కానీ కళ్ళల్లో నీళ్ళతో తనే చుట్టుకుంది నన్ను. ఏమయ్యిందో, ఎందుకో నేనూ చెప్పలేదు. పిల్లలే అడిగారు నిద్ర కళ్ళతో, శరీరం నిండా ఇంత మసి ఎందుకు ఉందని, ఇంత చీకటినీ, ఇంత ధూళినీ ఎలా అంటించుకు వచ్చాననీ - అంటూనే, శుభ్రం చేసారు వాళ్ళే కొంత నన్ను, తమ వెన్నెల వేళ్ళతో చల్లటి చూపులతో, మాటలతో ...

లోపలంతా చెట్లు ఊగుతూ విరిపడుతున్న సవ్వడి. లోపలంతా వాన దిగుతూ ఉరిమే మబ్బుల మెరుపుల అలజడి. రోదిస్తున్నారెవరో దూరంగా. తాకుతోంది ఆ హోరు ఇప్పటికీ ఇక్కడ. అడిగి ఉండరు ఏమయ్యిందని ఎవరూ అతనిని కూడా, ఇచ్చి ఉండరు ఎవరూ త్రాగమని తనకి నీళ్ళు కూడా

ఇక - రాత్రంతా ఆ వృద్ధాప్యపు తల్లే అతనికి పైగా దిగులు రెక్కలతో అల్లాడుతూ, తనలో తాను గొణుక్కుంటూ ఏవో స్మరించుకుంటో: ఎన్ని గాయాలు చేసినా, అమ్మలే ఎప్పుడూ అపరిచితులు కారు. అమ్మలనే, ఎప్పుడూ ఎవ్వరూ ఎలా ఉన్నావని అడగరు. ఎందుకో మీలో ఎవరికైనా తెలుసా?

# కల

రాత్రి ఒక కల మంచై
రహస్యంగా నా చేతుల మధ్యకు నా అనుమతి లేకుండా వచ్చింది

దానికి నేను 'నువ్వు' అని పేరు పెట్టాను. ఆపై కౌగలించుకున్నాను

ఉప్పు కళ్ళతో, వొణికే చేతులతో నా మెడను చుట్టుకుని
కల ఒకటే ఏడ్చింది. ఏమోమో చెప్పింది

తెలుసు నాకు, మాటలు అన్నీ మనం సృష్టించుకున్నవేననీ
మన పిల్లలవంటివనీ అంతకుమించి మరేమీ కావనీ

కాని పిల్లలు - ముఖ్యంగా నీతో ఆడుకొని వెళ్ళిపోయే పిల్లలు
ఎంతమంది అర్థం అవుతారు నీకు? ఎంతమంది ఉంటారు
ఎంతమంది మిగిలి ఉంటారు చివరికి నీకు?

సమయం గడిచింది అలా, వలయాలు వలయాలుగా
పొగమంచై నింగికి సాగుతూ, జలపాతమై నేలకి రాలుతూ
సమయం గడిచింది అలా అలలు అలలుగా

ఆ తరువాత ఇరువురూ ఒకరికొకరు ఎన్నడూ ఎదురుపడలేదు
ఇరువురూ ఎన్నడూ మాట్లాడుకోలేదు

రాత్రి వచ్చి, రహస్యంగా నన్ను కమ్మిన ఒక చిన్న కల
నన్ను కని, నన్ను వినక ఎక్కడికి వెళ్లిపోయింది?

# ఎందుకు కాకూడదు?

కనులలో ఏవో నెగడులు రగిలి, నుదిటిలో ఏవో లోకాలు చిట్లి, అరచేతుల్లో ముఖాన్ని పొతుకుని, ఆ చీకట్లలో కూర్చుని బావురుమంటున్న ఒంటరి నీడల్ని నేనొక్కడినే వింటున్నప్పుడు, మరి నువ్వొస్తావు: నీవే అవి - రెండే రెండు అరచేతులు. రెండే రెండు పాదాలు. రెండే రెండు కనులూ, రెండే రెండు మాటలూ, శబ్దాలూ

అస్వస్థత నిండిన శరీరాన్ని లోపలికి పొదుపుకునే నీ బాహువులూ, రెండే రెండు అశ్రువులు, మరిక రెండే రెండు పెదవులు. చీకటిని చీకటి పెనవేసుకున్నట్లూ ముదురాకులపై ఉదయపు చెమ్మ ఏదో పరచుకున్నట్లూ ఘనీభవించిన సరస్సులపై పొగమంచు ఏదో ఒక సుగంధమై వ్యాపించినట్లూ భీతిల్లి కంపించే అరచేతిలోకి మరో అరచేయి ఏదో ధైర్యమై చుట్టుకున్నట్లూ, కనులు తెరవని కుక్కపిల్ల ఏదో, తన తల్లి పొదుగులోకి ముడుచుకున్నట్లూ, పాలు తాగినట్లూ ఇక నువ్వు యిలా వెలిగించిన ఈ ఒకే ఒక్క రాత్రిలోకి ఇలాగే జారిపోతాను నేను: నీతో, మరి ఒక అంతిమ క్షణంలోకీ, కరుణ నిండిన ఒక ఆఖరి కాంతిలోకీ, తిరిగి మొదలయ్యే ఒక శ్వాసలోకీనూ! 'ఇంతకూ ఇదంతా ఏమిటీ?' అని మీరు అంతా చదివి అడిగితే, ఏమీ లేదు

మరేం పర్వాలేదు: వికసించిన పూవులన్నీ ముకుళితమవ్వాలి. అవన్నీ ఎక్కడో ఒక చోట, ఎప్పుడో ఒకప్పుడు రాలిపోవాలి. మరి అది కనిపించని నిప్పులని దాచుకుని, కని పెంచే చల్లని తల్లి వక్షోజాలై, నన్నూ నా ముఖాన్ని అదుముకుని నాకు పునర్జన్మని ఇచ్చే, నీ అరచేతుల్లోనే, ఆ వనాలలోనే ఎందుకు కాకూడదు?

# ఈ పూట

వెదురు వనాల బుట్ట బొమ్మలా నువ్వు, తిరిగి తిరిగి ఇంటికి వచ్చినప్పుడు మరి మన ఇల్లంతా కరివేపాకు వాసన. కొంత పుదీనా పచ్చదనం. చల్లటి తడీ. మరి నీ కళ్ళలోంచి తొంగి చూస్తూ ఉంటాయి, కొత్తిమీరా ఎర్రని టొమాటోలు, మరికొన్ని చిలకడ దుంపలూ, ఇన్ని ములక్కాయలూ, ఇంకొన్ని పచ్చని ఆకు కూరలూనూ: ఇంత మట్టీ, వానా కలగలసిన సాయంత్రపు వాసనతో, నీ గాజుల చప్పుళ్ళలో ఇరుక్కుని -

ఇక నువ్వు అలసటగా కుర్చీలో కూర్చుని, చున్నీతో నుదిటిన పట్టిన చమటని తుడుచుకుని నావైపు చూస్తే, ఒక మంచినీళ్ళ బాటిల్ని నీకు అందించి "ఈ పూటకి వంట చేస్తాను నేను. ఏం తింటావు? టొమాటో రైస్ చేయనా?" అని నేను అడిగితే ఇక మరి తెరచిన తలుపులోంచి కొంత గాలీ, మరికొంత చీకటీ. ఎక్కడో సుదూరంగా మిణుకు మిణుకుమంటూ ఒంటరి నక్షత్ర మొకటి మనలో. లోపలెక్కడో ఆకులపై చినుకులు రాలి చేసే ఒక మెత్తని సవ్వడీనూ -

ఆహ్ - ఏమీ లేదు. ఒక రోజు ఇలా కూడా ఉండవచ్చుననీ, గడుస్తుండవచ్చుననీ చెబుతున్నాను మీకు నేను, ఈ ఎర్రెర్రని టొమాటోలు కడుక్కుంటో: అది సరే కానీ, నా సంగతేమో కానీ b y the way - you who are reading this - what are you going to eat tonight?

# ముందు

ఒక కవిత ఎలా రాయాలోతరువాత చెబుతాను కానీ, ముందు ఇది ఊహించు:

కిటికీలోంచి చేతిని చాచి, తలను దానిపై వాల్చి కూర్చుంటే, మరి ఎక్కడిదో ఒక తేనె పిట్ట వచ్చి నీ అరచేయిపై వాలుతుంది. అరచేతిని కదపకుండా, అబ్బురంతో కళ్ళింత చేసుకుని నువ్వు దానిని చూస్తున్నప్పుడు పైన ఆకాశం కొంత రంగు మారుతుంది. కొంత గాలి వీస్తుంది. పని చేసుకుంటూ, చెదిరిన శిరోజాలను వెనకకి తోసుకుని, నీ వైపు ఒక పరి చిరునవ్వుతో చూసే నీ స్త్రీ గుర్తుకు వస్తుంది. నిన్ను ఊరకనే తాకి కిలకిలా నవ్వే పిల్లలూ, వాళ్ళ కళ్ళల్లో మెరిసే తోటలూ, నేల తడచిన సుగంధంతో నిన్ను తాకుతాయి. వెన్నెల ఏదో నీ ప్రాంగణంలో రాలి, కొన్ని పూవులేవో వికసించి ఇక నీ చుట్టూతా సన్నటి పురాస్మృతుల జల్లు, నిన్ను అందుకుని నీ అరచేతిలో ఎవరో వేలితో సున్నాలు చుడుతున్నట్లు -

క్షణకాలం నీపై అలా వాలి, నిన్ను తాకి తేనె పిట్టైతే ఎగిరిపోతుంది కానీ నీ శరీరమంతా దాని చిట్టి పాదాల ఒత్తిడి. దాని రెక్కలు అడుగున దాగిన వెచ్చటి దాని పసి శరీరపు అలికిడి. లేత తాకిడి. మరేమో ఇక నీ మనస్సులో సరస్సు వంటి ఒక నిశ్శబ్దం: నావ ఏదో ఆగిపోయినట్లూ, నడి సంద్రమే తీరం అయినట్లూ, ఇక ఈ ప్రయాణపు మర్మమేదో పూర్తిగా తెలిసిపోయినట్లూ మృత్యువు రహస్యమేదో తొలిసారిగా అవగతమయినట్లూ పూల మధ్య దారం అయ్యి, ఆత్మ నుంచి ఆత్మకి అల్లుకుంటునట్లూ, నెత్తురు దివ్వెయై వెలిగినట్లూ -

సరే, సరే, అది సరే కానీ, ఒక కవిత ఎలా రాయవచ్చునో, ఇప్పుడైనా తెలిసిందా నీకు?

# చేసిన పాపం

"చెమ్మగిల్లిన రాత్రిని నువ్వు ఎన్నడూ చూడలేదు" అని అన్నావు నువ్వు ఆనాడు -

చీకట్లో ఈ వేళ, ఇంటికి తిరిగి వస్తూ ఉంటే, దారికి ఇరువైపులా ఊగుతాయి విస్తృతంగా తుమ్మచెట్లు. రాలే ఏ వెన్నెల చినుకులో కూడా మరి ఆ ముళ్ళని తాకి రివ్వున చీరిపోతాయి. రెక్కలు తెగి, సీతాకోకచిలుకలో లేక సీతాకోకచిలుకల వంటి మనుషులో మరి వాళ్ళూ ఇక్కడే, దిగంతాల జీవన భారపు బరువుతో విరిగీ, తరిగీ -

చెప్పడానికి ఏమీ ఉండదు. నువ్వు నీతో ఉంటే బావుంటుంది అని నువ్వు అనుకున్న వాళ్ళూ, ఎవరైతే ఉంటే నువ్వు కళ్ళని తుడుచుకుని, రేపు తిరిగి లేచి, కొంత బ్రతికేందుకు వెళ్ళగలిగిన వాళ్ళూ, వాళ్ళు నిన్ను వొదిలి వెళ్ళిపోయాక, పెద్దగా రాయడానికీ ఏమీ ఉండదు. మహా అంటే మహా అయితే ఒక తుమ్మ చెట్టుగా మారి, ఊగిపోతో తూలిపోతో, నిన్ను నువ్వే ఇక చీరుకుంటూ కూర్చుంటావు. అది సరే చెమ్మగిల్లిన రాత్రిని నేను చూసుండను కానీ, చెమ్మగిల్లి, ఆ తడితో, ఆ మంచుతో

ఒక నిండు శరీరం రాత్రై , చిక్కటి చీకటియై, నింగిలోకి ఒక అరచేయై మరొక అరచేయికై సాగి తపించీ తపించీ తపించీ అతి నెమ్మదిగా గడ్డకట్టుకుపోతున్న ఒక మనిషిని చూసావా నువ్వు ఎన్నడైనా? అని నేను అనను, అడగనూ ఈనాడు. మరేం లేదు, నీళ్ళంటిన కళ్ళతో, ఎండిపోయిన రాత్రిలోకి ఒక మాటను జారవిడిచి నీ వంటి కన్నుని తోడుకుంటూ కూర్చున్నాను ఇక్కడ. ఇలాగ. చివరికి. చావుకి. అంతే: ఇంతకంటే మరేం చెప్పను?

# అస్వస్థత

నీకేం చేయాలో తెలీనప్పుడు, ఊరకే కూర్చుని కిటికీలోంచి బయటకి చూస్తావు -

మరి పెద్దగా ఏమీ ఉండవు అక్కడ. గాలి, రికామిగా తిరిగే ఆ గాలే నీ ముఖాన్ని తాకుతుంది తన పసివేళ్ళతో. ఆరేసిన బట్టలే కదులుతాయి అలజడిగా అటు తిరిగీ, ఇటు తిరిగీ, కుంచించుకుపోయే కాంతిలో: మరి ఎందుకో ఆ కాంతినీ, ఆ కదలికల ఆందోళననీ నువ్వు, ఎదురుచూసే కనులగానూ, కనురెప్పలగానూ ఊహిస్తావు. ఎవరో నిన్ను తాకి ఆనక వెళ్ళిపోతే, తనతో పాటు వెళ్ళలేక, ఇంకా ఇక్కడే ఉండిపోయి ప్రతిధ్వనిస్తున్న నవ్వులానూ ఊహిస్తావు, 'ఊహించడం పెద్ద నేరమేమీ కాదు కదా' అని కూడా అనుకుంటూ -

ఇక నీ నుదిటిపై, లోపలా ఎర్రటి కాంతి. వానలో ఎవరో నిన్ను బొగ్గులపై కాలుస్తున్న స్థితి. మరి ఎండిపోతున్న పెదాలపై నాలికతో రాస్తుంటే, ఒక చేదు సర్పమేదో పాకిన అనుభూతి. లోపలెక్కడో కొద్దిగా వొణుకు, కొద్దిగా దిగులు. 'నుదిటిపై వాలాల్సిన అరచేతులెక్కడా? పొదుపుకోవాల్సిన బాహువులు ఎక్కడా? శరీరం శరీరం మొత్తం ఒక మాటై నిన్ను పలకరించాల్సిన మనుష్యులు ఎక్కడా?' అని కూడా అనుకుంటావు కానీ, ఊహించడమే పెద్ద నేరమైన చోట, మాటని ఆశించడం పాపమే అని గ్రహించి, కూర్చుంటావు అక్కడ -

అక్కడే: ఆ కిటికీ ముందు. కిటికీ ఎవరో నువ్వు ఎవరో, మరి నిజానికి లోపలేదో వెలుపలేదో తెలియక, తెలుసుకోవాలనే పెద్ద కోరికా కలగక. మరే మరి చూస్తూ ఉండు, దిగంతాల నుంచి రాలుతున్న ధూళిలోకి ఇక నీ కనులను వొదిలివేసి ముఖాన్ని నీ అరచేతుల్లో కుక్కుకుని ఊరికే అలా. అయినా

ఇంతకూ, ఎవరికి మిగిలి ఉన్నాయి గూళ్ళు ఇక్కడ? నువ్వు తల దాచుకోడానికైనా, గుండెలు బాదుకుని రోదించడానికైనా, చివరికి ఎవరూ లేక, రాకా, కనీసం నీలో నువ్వు నీతో నువ్వు చనిపోడానికైనా?

# అసహనం

గాలి అంతా ఒక చోట కేంద్రీకృతమై గూడు కట్టుకుంటున్నట్లు, తిరిగి పీలికలై మరోచోట వాలుతున్నట్లూ, అక్కడ ఎండలో అలా పెనవేసుకుని కదులుతాయి రెండు నీడలు: నువ్వు వాటిని కాసేపు చెట్లు అని పిలవవచ్చు. నువ్వు వాటిని కాసేపు రెండు పిట్టలనీ పిలవవచ్చు. నువ్వు వాటిని కాసేపు సూర్యుడిని అలా ఎగురవేసి ఆడుకునే పిల్లలూ అని పిలవవచ్చు, మరి వాళ్ళ నవ్వులుగానూ ఊహించవచ్చు. ఇక, చివరిగా కాకపోయినా, తొలిసారిగా కాకపోయినా, నువ్వు వాటిని, ఆ నీడలనే, నీ కళ్ళుగా చూడవచ్చు. నీ మునివేళ్ళతో తాకవచ్చు - మరి తడిగా కనుక

తగిలితే, రెండు పాత ప్రమిదెలని ముందేసుకుని, ఒక పాతగుడ్డతో ఓరిమిగా తుడుచుకున్నట్లు, ఆ నీడల కన్నీళ్ళని తుడవనూ వచ్చు. అరలలోంచి కాగితాల్ని లాగి, నీలో నువ్వు నిమగ్నమయ్యి ఏవైనా రాసుకోవచ్చు. అభ్యంతరం ఏమీ లేదు. ఛాతిని చించుకుని వాటిపై బొమ్మలనూ వేసుకోవచ్చు. నెత్తురుతో నీ స్త్రీ శరీరాన్నీ అద్దవచ్చు. మరి, ఏమీ లేదంటే ఏమీ రాదంటే ఏదీ కాదంటే ఇలా రహదారులపై, ఆగిన వాహనాల కింద పరుండిన వీధి కుక్కల్లా, అలా ఊరికే విశ్రమించనూ వచ్చు. ఏమీ లేదు ...

ఒక వేసవి మధ్యాహ్నం ఇలా కూడా ఉండవచ్చునని, ఇలా కూడా గడపవచ్చునని చెబుతున్నాను మీకు: గోడలపై నీడనై, గాలికి రేగిన దుమ్ములో తేలిపోయే కాగితపు ముక్కనై, రాలిపోయిన ఓ ఆకునై, చివరికి బొట్టు బొట్టుగా రాలుతూ ఆగిపోయిన ఒక నీటిపంపునై -

అది సరే కానీ, మరి ఇంతకూ నీకిక్కడ ఏం పని? Why don't you go and get lost in some fucking cheap bar? Baby, my baby, instead why are you inscribing on my fuckin' heart?

# అంతే

గాలికి కొట్టుకుంటాయి కిటికీ రెక్కలు, ఒక మధ్యాహ్నం అప్పుడే జన్మించిన పిట్టలని చూసి నీ కనురెప్పలు రెపరెపలాడినట్లు - ఒక చెమ్మ నీ కనుబొమ్మల కిందుగా, మరి నక్షత్రాలేవో చమ్కీలై మెరిసిపోయినట్లు. పని చేసుకుని వచ్చావు కదా అప్పుడే, మరి

శ్రమ కూడా మెరుస్తుందని తెలిసింది నాకు ఆనాడే. కానీ ఇలా చెప్పనా నేను నీకు ఈ రోజు? ఆ రోజేమో నీ చేతులు, నన్ను అల్లుకున్న గూళ్ళు. తోటలోనుంచి నువ్వు కోసుకు వచ్చిన తాజా ఆకు కూరలు. మెరిసాయి ఆనాడు నీ చేతులు ఒక చల్లటి మట్టి సువాసనతో. ఎలా అంటే నీ శరీరమే ఒక పూలపొదై ఇక్కడ నా ఛాతిలో వానలతో విరగ బూసినట్లు. మరి

అవేమి పూవులూ అని, అవేమి ఆకులూ అని నువ్వు అడిగితే నాకూ తెలియదు. పక్షుల రవళుల కింద లతలేవో నెమ్మదిగా అల్లుకున్నట్లు, నా చేతివేళ్ళని ఆనాడు చుట్టుకున్న నీ చేతివేళ్ళ జ్ఞాపకం, ఇప్పుడు కనిపించని ఒక గాయం; ఇక ఏమీ చేయలేక

ఇలా కిటికీ పక్కన కూర్చుని ఉంటే, వేగంగా రుతువులు మారాయి. ఆకులు రాలిపోయాయి. గూళ్ళని వొదిలి పిట్టలూ ఎగిరి పోయాయి. చెట్ల కిందుగా పడి ఉన్న - ఎవరూ తాకని - విరిగిన ఖాళీ మట్టి కుండల వలే నా అరచేతులు మిగిలాయి -

"సరే, సరే, అది సరే కానీ, అంతిమంగా నువ్వు చెప్పొచ్చేది ఏమిటీ ఇంతకు?" అని మీరు నన్ను నిలదీసి అడిగితే, ఏమీ లేదు. ఇక్కడ. మృత్యుశయ్యపై ఉన్న శిశువుని ఆఖరి సారిగా చూసుకుంటూ ముద్దాడే ఒక తల్లి శ్వాస. ఉగ్గ పట్టుకుని తన చుట్టూ తిరిగే గాలి. కొంత నిశ్శబ్దం. కొంత దిగులు. మరి కొంత, ఇలా గడచిపోయే కాలమూ, వాలిపోయే ఆకాశమూనూ -

ఏంటంటే, ఈ రోజు ఇక్కడిలా ఊరికే, వీటన్నిటితోనూ, వీటన్నిటిలోనూ 'ఉన్నాను' అనే స్పృహ బావుంది. అంతే. ఇంకేం చెప్పను?

# అమ్మీ

1
సాయిబు ఎవరో సాంబ్రాణీ ఊది, తన చేతిలోని నెమలీకల గుచ్ఛాన్ని నీ తలపై ఉంచి దీవించినట్లు, నువ్వు మరచిన వారెవరో ఈ నగర రణగొణుధ్వనుల్లో నిను తట్టి పిలిచినట్లు, ఈ చల్లని గాలి: నీ కళ్ళ పైకి చినుకుల్లా జారుతూ, ఈ కాలుష్యంలో నీ కళ్ళను శుభ్రం చేస్తూ అదే: నీ తల్లి నీకు తలంటు పోసాక, తల తుడిచి నీకు ఇంత ఉప్పుని తినిపిస్తే కళ్ళు మంట పుట్టి నీళ్ళు తిరిగి, నీ చూపు శుభ్రంగా మారుతుంది చూడు, అలా -

ఇక నువ్వు నీ తల్లి బొజ్జ చుట్టూ చేతులు వేసి కావలించుకుంటే, పారుతుంది గోరువెచ్చని వెలుతురు హాయిగా, తన శరీరంలోంచి నీ శరీరంలోకి. బయట గూళ్ళల్లో ముడుచుకున్న చిన్ని చిన్ని ఊదా రంగుల పిట్టలు గుర్తుకు వస్తాయి నీకు అప్పుడు: పైనేమో, కొంత లేత కాంతి తాకగా కింద నేలపై మువ్వల్లా అలికిడి చేసే వేపాకుల నీడలు. ఇక అప్పుడు

2
నీ తల్లి ఆ దినాన తన పనికి వెడుతూ వెడుతూ, తను నిన్ను దగ్గరగా తీసుకుని నీ నుదుట ముద్దాడితే, అదే ఇక నీకు నీ రక్షణ కవచం. నిన్ను కాపాడే దైవ సింధూరం. నీ జీవితానికి కట్టిన తాయెత్తూ: మరి అదే నీ లలాట లిఖితమూనూ. ఇక ఇప్పుడు

3
రుతువులు మారి, లోకాలు మారి, కాలాలూ మారి, ఇదిగో ఇక్కడ ఈ లోహ దర్పణాల మధ్య కూరుకుపోయి ఉన్నాను, దారి తప్పిన ఒక సీతాకోక చిలుకని చూస్తూ, యంత్రాల ఊబిలో. మరి అమ్మీ, ఎక్కడ వొదిలి వేసాను? నేను అపురూపంగా కాపాడుకున్న నిన్నూ, చీకటిలో దీపాలు వెలిగించిన నేను కడు జాగ్రత్తగా దాచుకున్న నీ అరచేతులనూ?

# అస్పష్టత

నిలువెత్తుగా పెరిగిన ఈ చెట్ల కిందుగా నడుస్తూ ఉంటే, గుసగుసల వంటి ఆకుల సవ్వడి మధ్య నుంచి ఒక పక్షి అరుపు - పరాకుగా నడిచే నిన్నెవరో చప్పున నీ చేయి పట్టుకుని లాగితే, ఉలిక్కిపడి చూస్తావు కదా, అలా ఉంటుంది అప్పుడు నీకు: నిద్రలోంచి ఇంకా పూర్తిగా మెలకువలోకి రానట్లు, మరొకరి కలలోని రంగు ఏదో కళ్ళను రుద్దుకునే నీ అరచేతుల్లోకి చేరి నిన్ను విభ్రమ పరచినట్లూ, ఏది కలో ఏది వాస్తవమో పూర్తిగా తెలియనట్లు, తెలియ రానట్లూ -

''అప్పుడు, నాలో ఎవరో చేతిని జొనిపి, నా గుండెను తమ పిడికిట్లో బిగించినట్లయ్యింది'', అని నీతో ఎవరో, ఎప్పుడో అన్న మాటో, నువ్వు చదివిన ఒక కవితా వాక్యమో తటాలున స్ఫురిస్తుంది నీకు: ఒక ఎదురు రాయికి మోదుకుని గోరు చీలిపోగా అప్పటి దాకా స్పష్టత లేని లోకం కాంతులీనుతూ కనిపించినట్లు -

మరిక, ఏమీ చేయలేవు నువ్వు, అప్పుడు: ఈ జీవితపు తపనని అంతా ఒక స్వరంలోకి కుదించి, ఒక ప్రార్ధన వలే, నేలకు తమ శిరస్సులు వంచిన ఆకుల మధ్య నుంచి, నిన్ను నీ మోకాళ్ళపై ఒరిగి పోయేలా చేసిన ఒక గొంతు వలయాలుగా నీ వైపు దూసుకుని వచ్చినప్పుడు -

ఇక ఏమీ చేయలేక, నిస్సహాయుడివై తల ఎత్తి ఆకాశంలోకి చూస్తే, కన్నీటి పొర వంటి వెలుతురు. చిన్నగా ఊగే కొమ్మలు. శిశువుల గుప్పిట్లలోని లేతెరుపు రంగు వంటి పూలు. తల్లి చూచుకంపై మిగిలిపోయిన పసి పెదాల తడి వంటి గాలీనూ. ఇక

కనుచూపు మేరా పరచుకున్న ఒక ఎదురుచూపులో, ఆ రాళ్ళ పక్కగా నిలిచిపోయి ఎండిపోతున్న ఓ నీటినవ్వులో, ఒక నీడ ఖాళీ బాహువులంత ఒంటరిగా మారి, ఇక్కడ నిలువెత్తుగా పెరిగిన చెట్ల కిందుగా ఎదురుపడితే, నేనేం చేయను?

# ఎలా?

1
తెరలు తెరలుగా పొడువాటి అదృశ్యపు తెరలను జాలు వార్చినట్లు నింగి నుండి కిందకి దిగి, నిన్ను ఉక్కిరి బిక్కిరి చేసే గాలి. తోటలో పొదులను తవ్వుకుంటున్న నువ్వు, నెమ్మదిగా నీ నుదిటికి పైగా అరచేతిని ఉంచుకుని పైకి చూస్తే వలయాలుగా మంచురేణువుల్లా కురిసే పల్చటి కాంతి: బిందువుల వంటి రెక్కలతో కొన్ని లక్షల చామంతి పూరేకులు రాలిపడుతున్నట్లు,

2
చెట్ల కొమ్మల్లో, ఆకుల మధ్యలో మిణుగురుల్లా మెరిసే - తడిచిన - వెలుతురు. కనిపించనిది ఏదో లేదా ఎవరో నీ చెంత చేరి, నీ పక్కగా కూర్చుని, నీ చెవిలో ఏదో రహస్యం చెబుతున్నట్లు, ఎవరిదో మరి పాదాల సవ్వడి. నీ కళ్ళలోకి నిశ్శబ్దం, మరికొంత కొత్త నీరూ -

3
అప్పుడు నీ చేతిని ఎవరో ఒత్తినట్లయ్యి తల తిప్పి చూస్తావా, ఇక ఒక పూవు చుట్టూ పూసిన సువాసనలో, అటు ఇటూ ఒక లయతో ఎగురుతున్న ఓ లేతెరుపు సీతాకోకచిలుక. నీ చుట్టూ ఒక ఆత్మ వేణువు. మట్టి కుండలో చేరి విలపించే గాలి. ఒడ్డున ఆగి ఆ అలలలో అటూ ఇటూ ఊగే ఒక నావ. తన తల్లి పొదుగుని చేరలేక, కట్టిన గుంజకు గింజుకులాడే ఒక దూడ. ముళ్ళు చివరన చిట్లినట్లై ఆ తల్లి కళ్ళూ

4
ఇక నీకు గుర్తుకు వస్తుంది అప్పుడో ముఖం. ఛాతిలో ఒక నొప్పి: నీ చుట్టూ సమస్థం అద్దాలై ఎటు చూసినా నీ ప్రతిబింబం బదులు మరొకరి ముఖం -

5
నువ్వు ఇది చదివే సమయానికి నేను ఉండకపోవచ్చు. నీ ముందు ఇక ఊగుతూ, నిప్పు వలే గాలికి ఎగిసిపోతూ చలించిపోతూ ఇక చివరిగా ఆరిపోతూ, మట్టిలోంచి ఒక చేతికై మొలుచుకు వచ్చిన మరో చేయి వలే తపిస్తూ రెపరెపలాడే ఒక ఒంటరి గడ్డి పరక. దూరంగా

**6**

చేయి ఆయినా ఊపకుండా, నిను వీడి వెళ్ళిపోతున్న నీకు అత్యంత ప్రియమైన వారెవరో: మసకగా, పూర్తిగా కురవక, కనుమరుగయ్యే వానై ఇక్కడ - ఇక

**7**

ఈ దినం గడవటం ఎలా?

# మరి వస్తావా నువ్వు

1
నువ్వు లేవక ముందే లేచి ఉంటాయి ఈ బచ్చలి ఆకులు -

ఆకాశం వొంగి, వాటిని తన వొడిలోకి తీసుకుని, మంచుతో కడిగి శుభ్రపరచినట్లు ఈ ఆకులు, నవ్వుతూ పలుకరించే ముఖాలలాగా, ఒక పసితనపు లాలిత్యంతో, పచ్చదనంతో నీ పెరట్లో -

అప్పుడు నువ్వొక దానిమ్మ చెట్టువి. నీ పెరట్లో వాలి ఒకదానిపై మరొకటి కలబడుతూ ఆడుకునే పిచ్చుకలలో, నువ్వు ఒకడివి. నీకై ఎదురు చూసే పిల్లలను తాకి, వాళ్ళ జుత్తును చెదిపి, వాళ్ళ పెదాలపై చేరే గాలివీనూ. విను జాగ్రత్తగా

2
ఎవరో ఒక వేణువుని నెమ్మదిగా బయటకి తీసి ఊపిరినంతా ఒక దరికి చేర్చి, తన శరీరాన్నంతా, తన ఆత్మ ఘోషనంతా ఒక నిశ్శబ్దంగా మార్చి ఆ రంధ్రాలలోంచి వెలుపలికి ఊదే కాంతి కదలికల తరంగాలని. ఎవరిదో ఒక పాదపద్మం అతి సున్నితంగా, నీ ప్రాంగణంలోకి అడుగుపెడుతున్న సవ్వడిని. పూల రేకులపై వాలి వాటి అంచుల వద్దకు అతి సునిశితంగా జారే చినుకులని. ఎవరో ఒక రహస్యం చెబుతున్నట్లూ మరెవరో నిన్ను అదృశ్యంగా హత్తుకుని గుండెల్లో దాచుకున్నట్లూ, ఆ బచ్చలి ఆకుల నీడల లోకాలలోకి వెళ్ళిపోయినట్లూ -

3
నువ్వు ఇది చదివే సమయానికి నేను ఉండకపోవచ్చు. ఇక గాలికి అల్లల్లాడిపోతూ ఎగిసిపోతూ తేలిపోతూ, రంగు మారుతూ ఆ బచ్చలి ఆకులే అక్కడ

4
మట్టిపాదులో వేళ్ళతో విశ్రమించి మరి నువ్వూ నేనూ ఇక్కడ. ఇక

5
అంతిమంగా పిట్టలు ఎందుకు పాడతాయో తెలిసి ఒక శాంతిని కనుగొన్నట్లు అనిపించి

నా ఛాయలో నీవూ నీ ఛాయలో నేనూ. దా మరి నువ్వు కూడా: ఈ బచ్చలి ఆకుల పందిరి కిందకు, చనిపోయేముందు

6

మనల్ని మనం ఒక్కసారి, గాట్టిగా కావలించుకునేందుకూ తనువులు చిట్లేలా ముద్దు పెట్టుకునేందుకూ

7

మరి వస్తావా నువ్వు, సీతాకోకచిలుకలు ఆగిన ఈ రెక్కల బచ్చలి పందిరి కిందకి ఒక్కమారు?

# ఏమీ చేయలేక

వాన అనలేను దీనిని. రాత్రిలోంచి కలత నిద్రలోంచి
    ఇలా మరు దినంలోకి కొనసాగుతున్న చినుకులని -
    మందగించిన కాంతితో నేసిన నల్లని వస్త్రాలేవో
చుట్టుకున్నట్లు

ఆకాశంలోంచి కిందకు రాలే ఈ మసక కాలాన్ని
    ఒకనాడు నిన్ను కౌగలించుకుని, అదే ఇక ఆఖరిసారి
    అని తెలిసి వొణికిపోయినట్లు, ఇక ఇక్కడ
జలదరించే చెట్లు -

శరీరం మొత్తం ఒక కడ చూపుగా మారితే, ఆ రోజు
    చితికిన కళ్ళు ఉగ్గపట్టుకుని, అక్కడ
    కూలిపోయింది ఎవరో కానీ, ఇప్పుడు
ఇక్కడ ఒక సమాధి కరిగి

ఒక చేయి సాగుతోంది నీ కోసం. అవే: ఒకప్పుడు
    నీ ముఖాన్ని పొదివి పుచ్చుకుని, ఇక ఇప్పుడు
    మొలుచుకు వచ్చిన నీ వేర్ల వాసనకై
తడుముకులాడే

వాన ముఖం లేని ఈ అరచేతులు -

వాన అనలేను దీనిని. నువ్వు కమ్మిన ముసురూ
    అని అనలేను దీనిని. బ్రతికుండగానే చర్మాన్ని ఇలా
    నింపాదిగా ఒలుచుకుంటూ వెళ్ళిపోయే
స్మృతినీ, నువ్వు లేని ఈ సన్నిధినీ -

ఇక ఎలా గడవటం ఇక ఈ దినం?

# వాలు కుర్చీ

నీకో వాలు కుర్చీ ఇష్టం ఉండి ఉండవచ్చు. ఎన్నో ఏళ్ళుగా కలగని ఎలాగోలాగ ఒకదానిని చివరకు నువ్వు కొనుక్కుని ఉండి ఉండవచ్చు. మరి ఒకనాడు

నువ్వు పని నుంచి తిరిగి వచ్చి, అలసటగా అలా ఆ వాలు కుర్చీలో వాలిన నాడు, ఆకాశం కొంత ముసురు పట్టి ఉంటుంది. జల్లించిన చీకటి ఏదో గాలితో కలసి చల్లగా నీ ముఖాన్ని తాకుతుంది. ఇక, అప్పుడెవరో తడచిన వస్త్రాన్ని విదిల్చినట్లు నీ చుట్టూ శబ్దాలు - నీ సమక్షంలో తెల్లటి పూలు విచ్చుకున్నట్లూ, కళ్ళెత్తి నిన్ను చూస్తున్నట్లూ, తమ అరచేతులలోకి, నీ ముఖాన్ని అందుకుని ముద్దాడుతున్నట్లూ, నీలోకి ఒదిగిపోతున్నట్లూ, శబ్దాలు అంత లేతగా ఉంటాయని, పసివేళ్ళ వలే తాకుతాయనీ తెలియలేదు నీకు ఇంతకాలమూ -

ఇక నువ్వు తల తిప్పి చూస్తే నీ ఇంట్లోనే మిలమిలా మెరిసే నక్షత్రాలు. పిల్లల అరచేతుల్లోంచి ఎగిరి వచ్చి నిన్ను వెన్నెలతో దయగా తాకే సీతాకోకచిలుకలు. ఆ రెక్కల ఝుంకారంలో దాగిన తేలికైన రాత్రుళ్ళు. ఎలా అంటే, కలలో తెలిసిన పరిమళమేదో మెలకువలోకి వచ్చి నిన్ను ఒక మహా విభ్రమానికి గురి చేసినట్లూ, గత జన్మ స్మృతులేవో జ్ఞప్తికి వచ్చినట్లూ, మృత్యు రహస్యమేదో బోధపడి ఇక నువ్వు విరామంగా సాగినట్లూ, నిజంగా నీకో వాలుకుర్చీ ఇష్టం ఉండి ఉండవచ్చు. వాలుకుర్చీనో

ఎప్పుడూ నేలపై పడుకునే నీ తల్లికి, నేల నుంచి ఎగసే చలికి వొణికే నీ తల్లికి, నువ్వు ఇంతకాలమూ కొనిద్దామని కొనివ్వని ఒక పరుపో, ఒక స్వెట్టరో కూడా అయ్యి ఉండి ఉండవచ్చు. చికిలించిన కళ్ళతో నీకై ఎదురుచూసే నీ తండ్రీ కావొచ్చు. నలిగి నలిగి, నీకై కనులను తలుపులపై పరచిన నీ భార్య కావొచ్చు. పిల్లలు కావొచ్చు. నీలో నువ్వే కూరుకుపోయి ఏడ్చే వాళ్ళు కావొచ్చు. ఎవరైనా కావొచ్చు. మరి

నీకు ఇష్టమైన వాటి సంగతి సరే కానీ, నువ్వు ఇంతకాలమూ గమనించని, నిన్ను ఇష్టపడే వాళ్ళకి నువ్వు, ఇక ఈ ఒక్క పూటకి ఒక వాలుకుర్చీయో, చేతి కర్రో, పాదు తీసి తమని తాము నాటుకోగలిగే ఇంత నల్లని మట్టో, ఈ చీకటిలో వెలిగించుకోగలిగే ఒక దీపమో అయితే ఎంత బావుండు!

# ఒక సరళమైన ప్రశ్న

ఏముంది ఇక్కడ? నీకు చెప్పటానికైతే, ఏమీ లేవు -

నిదురించిన పాప కురులని ఆప్తంగా సవరించినట్లు ఈ గాలిని నిమిరితే, నీ అరచేతులకి అంటుకునే ఒక చీకటి: చల్లని చీకటి. పిల్లల పెదాలపై ఒక పాల తడి మిగిలిపోతుందే, అలా రాత్రిలో మెరిసే నక్షత్రాల కాంతి. నిన్ను రెండు చేతులు లాక్కుని, గుండెలోకి పొదుపుకున్నట్లు, మనిషి వాసన వేసే గాలి. నీ శరీరానికీ తనదైన ఒక ఆవరణ ఉంటుంది కదా: దానిలో, చిన్నగా మరి ఎవరివో పాదాల సవ్వడి. గడ్డి పరకలు నీటిలో తేలినట్లు ఎవరివో మరి మాటలు. రాలే ఆకులను తప్పించుకుని వచ్చి, ఇక అతి చిన్నగా నీ గదిలో రెపరెపలాడే పల్చటి కాంతీనూ -

నిజమే. నిజానికి ఏముంది ఇక్కడ, నువ్వు తాకటానికీ, తిరిగి రావడానికీ, తిరిగి వచ్చి చూడటానికీ? తిరిగి విశ్లేషించుకోవడానికి? నిదురించే పిల్లలు. నిదురించని నీడలు. పిల్లల వంటి నీడలలో నీడల పిల్లలమై కూర్చున్న నువ్వూ నేనూ. మరి దీని అంతటి తరువాతా, ఇది 'ప్రేమ' అని మనకి మనం చెప్పుకోవాల్సిన అవసరమూ, అగత్యమూ ఏమిటి మనకు?

# ఇక ఇదే ఉదయం, ఇక ఇదే జీవితం

1
వాన వాసన వేసే పూలరేకుల వలే తాకుతాయి
నీ చేతులు, ఈ చినుకులూ
గోప్యంగా తేలి వచ్చే
చల్లటి గాలీనూ -

ఆ గాలిలో, ఆ లేత పసుపుపచ్చ కాంతిలో, సీతాకోకచిలుకలు -
ఏ లోకాలను విసురుతున్నాయో
ఆ రెక్కలు కానీ

వెన్నెల కళ్ళాపి జల్లినట్లు నీ చుట్టూ పచ్చిక కాంతి -

తలలు వాల్చిన
ఆకుల కింద చేరి, ఊయలలూగే నీడలూ చినుకుల వజ్రాలూ
మెరిసే నీ కళ్ళూ -

2
మరి ఏం ఉంది
అప్పుడు నాకు?

3
సరస్సుల అంచులలో తేలికగా ఊగే అలలపై కదిలే నాచూ
రెక్కలు ఊపక ఆ వెలుతురులో
అలా నిశ్చలంగా తేలే
తూనిగల నిశ్శబ్దమూ

నాలో: ఒక శిశువు
ఊయలూగుతూ నిద్రలోకి జారుకున్నంత మెత్తదనం
పెదవిపై మిగిలిన

పాల తడి వంటి
ఒక ఇష్టమూనూ -

కానీ మరి ఇదంతా
ఏమిటీ అని అంటే

4
ఏమీ లేదు: ఉన్నదంతా, ఇక మనకు మిగిలినదంతా
ఇక ఇదే ఉదయం
ఇక ఇదే జీవితం -

కొంత నాతో, కొంత నీతో, కొంత ఇలా మనకి మనతో -
కానీ కన్నా

5
మరి ఇంతకూ
సంధ్యాసమయంలో కలువ పూల చుట్టూ గుమికూడి
ఒక బిందువులోకి

పునర్యానం
అవుతున్న
వలయాలను చూసావా నువ్వు?

# ఒక మధ్యాహ్నం

ఇలా రాస్తాను ముందుగా: ఈ మధ్యాహ్నం, రెపరెపలాడే ఒక తెలుపు వస్త్రం -

నువ్వు పరాకుగా ఒంటరిగా సంచరిస్తున్నప్పుడు, నీ ఇంటి పెరట్లోనో రద్దీ వీధులలోనో ఒక హస్తం నిన్ను తాకి వెళ్లిపోతుంది. అప్పుడే ఉతికి ఆరవేసిన వస్త్రం గాలికి కదిలి ఇంత తడిని నీ ముఖాన చిమ్మినట్లు -

మరి అప్పుడు ఉలిక్కిపడి చూస్తావు, నీ లోకాల లోంచి బయటకు వచ్చి ఆకుపచ్చని చెట్ల కింది నీడలనీ, ఎక్కడో కూసే పక్షులనీ, ప్రవహించే గాలినీ. ఎవరో అలికినట్లు ఉన్న ప్రపంచాన్నీ, కారణం ఏమీ లేకుండా నవ్వుతున్న పసిపిల్లల వంటి మనుషులనీ, పూలలా విచ్చుకునే వాళ్ళ మాటలనీ. మరి ఇంతకాలమూ ఇంత కాంతీ ఇంత శాంతీ ఎందుకు కనపడలేదా అని నువ్వు అబ్బుర పడుతుంటే, మబ్బులు చుట్టుకుంటున్న ఆకాశం కింద తీగలపైనుంచి దుస్తులను తొలగిస్తూ ఆ అమ్మాయి అంటుంది కదా "గాలికి ఆగడం లేదు ఆ తెల్లటి దుప్పటి - కాస్త తొలగించి లోపలికి తీసుకు వద్దూ" అని. మరే: ఇక నువ్వు చక్కగా మధ్యాహ్నాన్ని మడత పెట్టి, బుద్ధిగా తన వెనుకగా లోపలి వెడతావు ఇలా వ్రాసుకుంటో:

ఈ మధ్యాహ్నం - రెపరెపలాడని ఒక తెలుపు వస్త్రం కింద ఒదిగిన- ఒకమ్మాయీ ఇంకా నిండైన తన శరీర దీపమూనూ. ఇక బయట పడటం ఎలా ఇక్కడ నుంచి? ఈ చినుకుల లోకాలలోంచీ, తన పరిమళ కాలాలలోంచీ? ఈ ఎర్రని మబ్బులలోంచీ?

# మా చిన్ని అమ్మ

- సాదాగా, సీదాగా నీకో నాలుగు వాక్యాలు -

ఎలా ఉన్నావు అని కదా నువ్వు అడిగినది ...

మసిలే నీళ్ళు పడి, ముడతలు పడ్డ అమ్మ పొట్ట కాలిపోయి నల్లటి చారికలుగా చీరిపోయిన దానికంటే కరకు ఏమీ కావు, కరకుగా ఏమీ లేవు ఈ దినాలు -

మాకు వాటర్ హీటర్ కొనిచ్చి, తాను మాత్రం ఒక మసిగుడ్డతో, మోకాళ్ళ నొప్పితో వొంగిన కాళ్ళతో, వొణికే చేతులతో, మరి ఆ గిన్నెను మోయలేకో లేక తటాలున ఏదో స్ఫురణకు వచ్చి, కళ్లపై నీటి పొర కమ్ముకోగా మమ్మల్ని కన్న బొజ్జ బొబ్బలైతే, కూర్చుని చేతివేళ్ళతో మందు రాసుకుంటూ "పోతుంది లేరా, తగ్గి పోతుందిలే" అని తాను అన్నంత, అని తాను చిరునవ్వు నవ్వినంత ధైర్యంగానూ సులభంగానూ లేవు ఈ దినాలు

-అందుకే, సాదా సీదాగా నీకో నాలుగు వాక్యాలు -

ఎలా ఉన్నాను అని కదా నువ్వు అడిగినది...

మరి నీకు తెలుసా తనని మొత్తం కొల్లగొట్టుకున్నవాళ్ళు కొల్లగొట్టుకుని వెళ్ళిపోగా ఖాళీ అయిన కడుపుతో, పైన వేలాడుతున్న ఊగిసలాడే చర్మంతో, ఎవర్ని తలచుకుంటూ ఎక్కడుందో, చాలా సాదా సీదాగా, కళ్ళల్లో నీళ్ళతో కాలే కళ్ళతో ఎవరూ తోడులేని కరకు కాలంలో ఈ కవితలాంటి మా చిన్ని అమ్మ?

# నువ్వు

ఎక్కడో ముడుచుకుని ఉండి ఉంటావు నువ్వు

అంతస్థుల అంచులపై అలసటగా వాలి, విరుగుతున్న రెక్కలని మాన్పుకుంటూ అలా తపనగా, కనిపించని అరణ్యాల వైపు చూసే ఈ అంతస్థులలో ఇమడలేని ఒక తెల్లని పావురం నీవు అని తెలుసు నాకు. దారి తప్పి ఈ లోహ రచిత, నరమాంస భక్షక ప్రదర్శనశాలలో, మానవ విపణి కేంద్రంలో నీ గుండెను ఉగ్గపట్టుకుని తిరిగే బెదురు కనుల బాలికవూ, నెమలీకవూ నీవు అని తెలుసు నాకు -

ప్రతి రాత్రీ నీడలతో పోరాడీ పోరాడీ ఓడిపోయే ఒక దీపకన్యవనీ దిగులు కలువవనీ అశ్రు పవనాలలో చిక్కుకున్న ఓ లేత చిగురాకు నీవనీ తెలుసు నాకు. అరచేతులు లోయలంత చీకట్లయితే, వాటిలోకి నిర్ద్వందంగా రాలిపోయే, చినుకు చిక్కుకున్న ఓ పూవువి నీవు అని తెలుసు నాకు. ఒంటరిగా మళ్ళా, రాలిపోయిన ఆ లోయల్లోంచి కూడా ముఖాన్ని ఎత్తి, చెమ్మను తుడిచి ఇక దీపంలోని చీకటినీ, చీకటిలోని దీపాన్నీ వెలిగిస్తే ఈ అక్షరాలకు ఇంత తల్లితనం, తల్లి వక్షోజాల తొలి పాల వాసనా, తన జోలపాటా, మాటా నిదురా ...

మరి ఇదంతా తెలిసి, "ఎక్కడో ముడుచుకుని, గీరుకుపోయే హృదయంతో ఎక్కడో కంపిస్తూ, పిగిలిపోతూ తిరిగి ఏకం అవుతూ, మళ్ళా అంతలోనే, నలుదిశలా పొగమంచు తెరలై చీలిపోతూ ఎక్కడో ముడుచుకుని కూర్చుని ఉంటావు నువ్వు" అని నేను వ్రాస్తూ కూడా, "ఎలా ఉన్నావు నువ్వు?"

అని ఎలా రాయను నేను? అని ఎలా అడగను నేను? అని ఎలా చూడగలను నిన్ను?

# నీడలు

తల వంచుకుని నువ్వు ఒక్కడివే కూర్చునే ఈ దినాలలో, నీ ఎదురుగా ఈ నీడలు

వేళ్ళతో వాటిని తాకి చూస్తే, కొంత తడి. నువ్వు ఎప్పటికీ చూడలేని, కొలవలేని నీ తల్లి కనుల కింది లోకాలలో స్థిమిత పడుతున్న నీటి చెలమల వలే: 'ఎప్పుడు అర్థం చేసుకుంటావు నన్ను' అని తను అడగలేని ఒక మహా ప్రశ్నవలే, దిగులు వలే -

నిజం: ఒంటరిగా ఉండాలని ఎవరికి ఉంటుంది? ఎవరో ఒకరు ఉండాలి లేదా ఎవరో ఒకరు రావాలి: నీతో కొంతసేపు మాట్లాడాలి. మాటలు కాకపోయినా సరే - ఊరకే నీ పక్కన అలా నుల్చున్నా, కూర్చున్నా చాలు. నీలో కొంత ఉపశమనం. తెరపితో కూడిన ఒక నిట్టూర్పు -

అయినా ప్రతీసారీ పూవులు కావాలనేం ఉంది? ప్రతీసారీ వెన్నెల కురవాలనేం ఉంది? ప్రతీసారీ వానలో తడవాలనేం ఉంది? ఒక పచ్చి ముల్లు. ఒక పగిలిన పాత్ర. రాలిన గూడూ, నేలపై చితికిన గుడ్లూ రెక్కలు కొట్టుకుంటూ చిట్లిన ఆ గుడ్ల చుట్టూ గిరికీలు కొట్టే పక్షులూ లేదా నీ ముందుకు నిస్సహాయంగా సాగిన, ఆకలితో వొణికే ఒక పసి అరచేయైనా కావొచ్చు - ఎవరైనా ఎలాగైనా రావొచ్చు. నీడలై నీ ముందు అల్లాడవచ్చు!

మరి, తల వంచుకుని నువ్వు ఒక్కడివే కూర్చునే ఈ దినాలలో ఈ కాలాలలో, నీ ఎదురుగా రెపరెపలాడే నీడలకీ నీడల తోడు కావాలని తెలియలేదా స్నేహితుడా, నీకు ఇన్నాళ్ళకైనా?

# వాళ్ళిద్దరూ

ఆరిన చితిలోంచి గాలికి ఎగిసిపడే చితాభస్మం వంటి చీకటి -

"ఎలా ఉంటావు నువ్వు ఇలా?" అని తను అడుగుతుంది. "సాయంత్రానికి పూవులూ వడలిపోతాయి. పిల్లలూ వడలిపోతారు. పగిలిన అరిపాదాలను వొడిలో పెట్టుకుని అరచేతులతో నిమురుకుంటూ, స్మృతలలో కోల్పోయే అమ్మలూ అలసటతో సోలిపోతారు. ఏం చెప్పను? ఇది, ప్రతి మనిషీ ఒక ఎండాకాలమై దాహార్తియై మట్టికుండలో చల్లబడిన నీళ్లవంటి, నీటి స్పర్శ వంటి మరో మనిషికై తిరుగాడే లోకం. ఎవరూ దొరకని కాలం. మరి ఏం చేయను నేను?" అని అతను అడుగుతాడు -

అప్పుడు, అక్కడ - ఆ చీకట్లో, నిశ్చలమైన ఆకులపై కొంత కాంతి. ఎక్కడో మెరిసే నక్షత్రాలు.  ఎవరో, ఎండి పగిలిపోయిన మట్టిపై నీళ్ళు చల్లే సవ్వడి. లోపల అన్నం ఉడుకుతున్న వాసనా -

మరొక రోజు. మరొక రాత్రి. అప్పుడు అక్కడ తను అతని భుజంపై తల వాల్చినప్పుడు, ఎక్కడో మల్లెపూలు విచ్చుకుంటున్న నిశ్శబ్దం: తనకి అతను ఎన్నడూ కొనివ్వని మల్లెపూలు విచ్చుకుని, అతి పల్చగా వీచిన గాలికి, తమ తెలుపుదనాన్నీ సువాసననీ వెదజల్లే నిశ్శబ్దం -

ఇక ఆ తర్వాతనా? ఏమీ లేదు. మీకు చెప్పడానికీ కూడా నిజంగా ఏమీ లేదు. ఊరకే అలా మరొక రోజు, బ్రతుకుతాను నేను- బ్రతికే ఉంటాను నేను: వాళ్ళిద్దరిలో -

# చినుకులు లేని రాత్రిలో

1
ఏకాకిగా వెలిగే ఒక దీపం -

గాలికి తల్లడిల్లుతూ కూడా
నింగికి ఎగబాకుదామనుకునే
ఒక నిప్పు సెగ -

నిప్పుకీ, నీరు ఒక ఉపశమనం
అని తెలియక

ఇంకా రాని
మబ్బులు -
2
నీడలు. నీడల్లోంచి నీడల్లోకి
తేలిపోయే కనులు -

అతను తన వైపు చూసినప్పుడు
అక్కడొక
బావురుమనే ఆకాశం -

ఎండకి వడలిపోయి
నిస్త్రాణగా తలలు వాల్చిన
పూవులు

ఆ కనుపాపలు -
3
జల్లిన గింజల చుట్టూ వాలిన
పావురాళ్ళు
దిగ్గున

నింగికి ఎగురుతాయి -

ఏమీ లేక, ఎవరూ దొరకక

చేతులు రెండూ
రెండు రెక్కలైతే
నింగికి  ఎగురుదామనుకునే
ఒక మనిషి -

అతనో, తనో
నువ్వో, మరెవరో -
**4**
కుండలో
కుదుటపడ్డ నీళ్ళల్లో, మళ్ళా
ఒక చిన్న కదలిక -

పెదాలపై
నెలవంక వంటి నీటి ధార
ముఖంపై
లేత వేళ్ళేవో లతల వలే అల్లుకున్నట్లు -
**5**
ఉగ్గబట్టుకున్న
మబ్బులూ, గాలీ, ఆకులూ, పిల్లలూ
అన్నీ, అందరూ

బిగించి  పట్టుకున్న
నీ గుప్పిట్లలోనే -
**6**
గాలికి తల్లడిల్లుతూ కూడా, నింగిలోకి
తపనగా ఎగబాకే
ఒక నిప్పు సెగపై

రాలిన ఒక చినుకు. సోకిన
ఒక అశ్రు శ్వాస
ఒక పదం -

**7**

రా.

ఉండు.
మళ్ళా నిన్ను నేను రాయగలను
~~ఈ~~

చినుకులు లేని రాత్రిలో
రాతి ఛాతిలో
నీలో
నాలో

నిన్నూ
నన్నూ -

Amen.

# ఏమో

"ప్రేమ ఉందా ఇక్కడ?" అని కదా అడుగుతావు నువ్వు. పాలిపోయిన వెన్నెలపై రాలే ఆకులైన నెత్తురు అంటిన నీ కళ్ళు, తమ లోపలికి తాము భయంతో ముడుచుకుపోయే పావురాళ్ళు -

"భయపడకు: పర్వాలేదు. అంతా సర్దుకుంటుంది" అని నేను అంటాను కానీ, నా లోపలా ఎక్కడో సన్నటి వొణుకు. మంచుముక్కలు గొంతులోకి కూరుకుపోయినట్లు ఒక నొప్పి ఏదో -

దీపం ఒలికిన గోడలపై, గాలికి ఊగే నీడలు. కొమ్మలు కదిలి, ఆకులు ఒకదానిని మరొకటి ఒరుసుకునే సవ్వళ్ళు. ఈ రాత్రి, చీకటి చినుకులుగా రాలే చప్పుళ్ళు. పొయ్యిపై ఉడుకుతున్న అన్నం గిన్నె తొలిగి, మెతుకులు మెతుకులుగా నువ్వూ నేనూ రాలి పడే క్షణాలు. ఇక, గూళ్ళల్లో మరింత దగ్గరగా భీతిగా ముడుచుకునే పావురాళ్ళు. గర్భస్రావమయ్యి, ఇంకా పచ్చిగా కుదించుకుపోయే నీ కాళ్ళు. నీ కళ్ళు. జ్వరంతో వెచ్చగా కంపించే నీ ఒళ్ళు. తడారిపోయిన నీ అరచేతులు. నోరంతా ఎండిపోయి, నాలికపై నర్తించే ఒక చేదు ...

"ప్రేమ ఉందా ఇక్కడ?" అని కదా అడుగుతావు నువ్వు -

ఏమో: లుంగలు చుట్టుకుపోయి రోదించే ఈ లోకంలో, ఈ విషయం ఎవరిని, ఎలా అడగను?

# ఒక పెర్సనాలిటీ డెవలప్మెంట్ పోయమ్

మనుషులపై కోపం ఉండటం తప్పేమీ కాదు, అది నిన్ను అంధుడిని చేయనంత వరకూ. లోకంతో కఠినంగా వ్యవహరించడం తప్పేమీ కాదు, అది నిన్ను స్పర్శా రాహిత్యంగా మార్చనంతవరకూ. మరి, అవన్నీ నీ పట్ల కోపంగానూ, కఠినంగానూ ఉన్నాయా అంటే మరి ఇటు చూడు. ఇప్పుడు

నీ చుట్టూ చెట్లు ఉన్నాయి. పూసిన పూవులూ ఉన్నాయి. నీళ్ళు చిలుకరించిన ఆవరణలూ అప్పుడే లేచిన పిల్లలూ ఉన్నారు. చల్లగా వీచే గాలీ, వెడుతూ వెడుతూ ఎవరో నిన్ను చూసి వెలిగిన స్నేహపూర్వకమైన నవ్వూ ఉంది. తినడానికి అన్నమూ, తాగడానికి నీళ్ళూ, తల దాచుకోడానికి ఒక గూడూ, దానిలో పక్షి పిల్లలూ ఉన్నాయి. వాటి రెక్కల్లో కొంత గోరువెచ్చదనం ఉంది. ఇష్టమూ ఉంది. అన్నిటినీ మించి, నువ్వు ఇంకా బ్రతికే ఉన్నావు. నువ్వు ఇంకా బ్రతికి, చూడవలసిన ఉత్సవమేదో, చేయవలసిన పనులేవో, పొదిగిపోవాల్సిన వేదన ఏదో మిగిలే ఉన్నాయి -

నిర్వచనాలదేముంది? ఎన్నైనా చెప్పవచ్చు. సత్యానిదేముంది? ఎంతైనా వ్యాఖ్యానించవచ్చు. ప్రేమంటే ఇష్టం లేకపోతే, ఆ పదం వాడకు. కానీ, లోకంపై కోపంతో మనుషులనూ, మనుషులపై కోపంతో లోకంనూ చిన్నబుచ్చకు. మరీ అంత కఠినంగా ఉండకు. బిడ్డా, కొంత ఓరిమి ... కొంత ఓరిమి పట్టు ...

ఇంకొద్దిసేపట్లో, కనిపించేవన్నీ, నిజమనిపించేవన్నీ, మంచుతెరల వలే ఎలా కరిగిపోతాయో చూడు!

# రాత్రి నీ కోసమే ఫోన్ చేసాను

రాత్రి నీ కోసమే ఫోన్ చేసాను

అప్పుడు నా పైన ఆకాశం కొద్దిగా కుంగి ఉండింది. అప్పుడు నా పాదాల కింది నేల కొద్దిగా పగుళ్లిచ్చి ఉండింది. అప్పుడు నా చుట్టూ గాలి చాలా ఒంటరిగా, తల్లి లేని పిల్లి పిల్లలా బావురుమంటూ తిరుగాడుతూ ఉండింది. అప్పుడు, నువ్వు రోజూ చూసే చీకటే, నెత్తురు వలే నా ముఖంపైకి చిలకరించబడి ఉండింది. అప్పుడు, బాల్కనీలోని ఈ మొక్కలూ, పూలూ, లతలూ అన్నీ విగతజీవులై నన్ను భయభ్రాంతుడిని చేస్తూ ఉండినై -

అవును. రాత్రి నీ కోసమే ఫోన్ చేసాను

అప్పుడు నా కళ్ళు కొంత తడిగా ఉండినాయి. అప్పుడు నా బాహువులు ఖాళీగా ఉండినాయి. అప్పుడు నా శరీరం వానకి నేల రాలిన గూడు అయ్యి, పగిలిన గుడ్లయ్యీ ఉండింది. అప్పుడు నా గొంతు రెక్కలు కొట్టుకుంటూ అరిచే తల్లి పావురమయ్యీ ఉండింది. అప్పుడు నా తలపంతా నువ్వే, 'నువ్వు ఎక్కడా? ఎక్కడా?' అని ప్రతిధ్వనిస్తూ ఉండింది

అవును - రాత్రి నీ కోసమే ఫోన్ చేసాను. అవును - రాత్రి నీ కోసమే, నన్ను కనే వినే ఒక రాత్రి కోసమే ఫోన్ చేసాను. అవును - రాత్రి, నేను ఎక్కడ ఉన్నానో తెలుసుకుందామనే నన్ను నేను కనుక్కుందామనే నేను బ్రతికి ఉన్నానో లేనో తెలుసుకుందామనే

నా కోసమే, నీ కోసమే - నేను నీకు ఫోన్ చేసాను

# లాంతరు

రావి ఆకులు గలగలా కదిలినప్పుడు, అలలు ఒడ్డుకు నింపాదిగా కొట్టుకుని వస్తున్నప్పుడు, సాయంత్రంలో ఆ నారింజరంగు కాంతిలో చల్లటి గాలిలో నువ్వొక్కడివే తల దించుకుని నడుస్తూ వస్తున్నప్పుడు తటాలున నీకొక ముఖం జ్ఞాపకం వస్తుంది

ఎవరితోనైతే ఉందామని అనుకున్నావో, ఎవరితోనైతే కలిసి నవ్వుదామనీ, నడుద్దామనీ, మంచు  కురిసే రాత్రుళ్ళలో గాట్టిగా కావలించుకుని పడుకుందామనీ కరడు కట్టిన కాలంలో కలిసి రోదిద్దామనీ కొంత జీవిద్దామనీ, మరి కొంత మరణిద్దామనీ అనుకున్నావో,

ఆ ముఖం! అవును అదే ముఖం. నువ్వే వదిలి వేసావో తనే నిన్ను మరచిపోయిందో కానీ, ఇప్పుడు, రావి ఆకులు చిక్కటి రాత్రిలోకి మునగదీసుకుంటున్నప్పుడు చీకటి ఒక వ్యాఘ్రమై నువ్వు వచ్చే దారిలో పొంచి చూస్తూ ఉన్నప్పుడు

ఒకప్పుడు నీ చేతిలో ఒక లాంతరూ, ఒక ఖడ్గమూ, శాంతి ముద్రా అయ్యి నిన్ను పూల వాసనతో అతి సునాయాసంగా, తేలికగా, ప్రమాదభరితమైన ఈ దారిని దాటించి మరో దారిలోకీ, మరో లోకంలోకి, రోజా పూలవంటి చినుకులలోకి నీ కాలాన్ని అలలపై కాగితం పడవ చేసి వొదిలివేసిన ఆ ముఖం: అవును: అదే, ఆ ముఖం

ఆ ఒకే ఒక్క ముఖం ...

లాంతరు వంటి ముఖం, కాంతి వలయం వంటి, వెలుగు వాసన వంటి ముఖం తెప్పవంటి  ముఖం, వాన వంటి ముఖం గాలి వంటి ముఖం, ఊపిరి వంటి ముఖం శిశువుకు తల్లి పాల వంటి, ఒడి వంటి జోలపాట వంటి తన ముఖం ... ఇప్పుడు ఎక్కడ?

# ఈ వేళ ఎందుకో

ఈ చీకట్లో ఈ గాలిలో, ఈవేళ ఎందుకో

చెట్ల కింద నాకై ఎదురుచూస్తూ, కురులను వెనక్కి తోసుకునే నువ్వూ నీ ముఖమూ, నీ చేతివేళ్ళ కదలికలూ జ్ఞాపకం వచ్చాయి. ఆపై వెనువెంటనే, వెల్లువలా కమ్మివేసే, నన్ను నిలువెల్లా దహించివేసే, దాహార్తిని చేసే, త్రికాలాలను ఏకం చేసే దవనం వాసన వేసే నీ శరీరమూ, నీ గొంతూ, కనకాంబరం పూలూ జ్ఞాపకం వచ్చాయి - ఆపై, ఒకప్పుడు నన్ను కావలించుకున్న నీ రెండు చేతులూ నన్ను నిర్ధయగా వేటాడాయి. ఇకా తరువాత నీ రెండు కళ్ళూ నా శిరస్సుపై ఉన్న ఒకే ఒక గూటిని కూల్చివేసాయి -

ఈ చీకట్లలో, ఈ గాలిలో, ఈ నక్షత్రాలలో, ఈ రాత్రి శబ్దాలలో, ఊగే నీడల్లో కనుచూపుమేరా అనంతంగా సాగిన డస్సిపోయిన ఈ ఒంటరి రహదారిలో ఈ వేళ ఎందుకో నువ్వే గుర్తుకువచ్చావు. నేనే, ఎక్కడో తప్పిపోయాను -

# చక్కని మాటలు

"చక్కని మాటలు ఏమైనా చెప్పు" అంది తను. నా చుట్టూ ఉన్న రాత్రినీ, చీకటి ఆకాశాన్నీ వాటిలో మెరిసే నక్షత్రాలనీ చూపించాను

"ఆలా కాదు. పూలవంటి మాటలని ఏమైనా మాలగా కట్టు" అంది తను. నేల రాలిన లతలనీ, చనుబాలు లేని వెన్నెల కనులనీ శరీరాలు చెక్కుకుపోయిన ప్రేమలనీ చూయించాను

"పోనీ, ఊరకే కనీసం వానలాంటి కనీసం తుంపరలాంటి పదాలనైనా కురవనివ్వు" అంది తను. లోకం త్రవ్వుకుపోయిన కాలం కాంతినీ రెక్కలు తెగిన ఒక పావురాన్నీ, కడుపు డొక్కుపోయిన ఒక పసిపాపనీ, చీరేయబడ్డ యోనులతో, దిగంతాల ఖాళీ అరచేతులతో ఎదురుచూపులై నిలిచిన అమ్మలనీ చూయించాను

వొణుకుతూ, అప్పుడు "ఇప్పుడు ఇవేమీ వద్దు నాకు. కాసేపు, నువ్వు నిశ్శబ్దంగా ఉండు చాలు" అని అంది తను

సరిగ్గా ఆ క్షణానే బిగించి పెట్టుకున్న తన అరచేతిని నెమ్మదిగా తెరచి ఆ నెత్తుటి నెలవంకల ముద్రికలని ఈ తెల్లని కాగితంపై -మెత్తగా - అద్ది "చక్కటి మాటలు చెప్పడం ఎలాగా?" అని, తిన్నగా తనలోకే చక్కగా వెళ్ళిపోయాను నేను!

# చివరకు

ఒక రాత్రిలో నీ పక్కగా కూర్చుని నెమ్మదిగా నీ అరచేతిని నా అరచేతిలోకి తీసుకుని, అమ్మాయీ, వంచిన నీ తలను పైకెత్తి, అంతే నెమ్మదిగా నీకు ఏమైనా చెబుదామనే అనుకుంటాను. ఏదైనా చూపిద్దామనే అనుకుంటాను -

అమ్మాయేమో చూపు తిప్పదు. కాలమేమో ఇద్దరినీ దాటదు. అప్పుడు అంటుంది అమ్మాయి ఎప్పటికో "ఏం జీవితమిది? నీతో? బ్రతకడానికి నీ వద్ద పూవులు లేవు. వానలూ లేవు. వనాలూ లేవు. దయగా ప్రవహించే నదులూ లేవు. మంచుదీపం వెలిగే వేకువ ఝాములు లేవు మైదానాలలో ఎగిరే సీతాకోకచిలుకలూ లేవు. రాత్రుళ్ళలో మెరిసే వెన్నెల సవ్వళ్ళసలే లేవు. ఈ కాలం గడపటానికి, కనీసం నీ వద్ద గుప్పెడు మిణుగురులైనా లేవు. చెప్పు, ఏం జీవితమిది నీతో? పో పో పో వెళ్ళిపో ఇక్కడ నుంచి" అని పాపం చాలా ఖచ్చితంగానే, చాలా కచ్చగానే అడుగుతోందా అమ్మాయి

సరిగ్గా అప్పుడు - సరిగ్గా అప్పుడే - సరిగ్గా ఆ క్షణానే (ఆపై మీరేమనుకున్నా సరే)

తన అరచేతిని నా ఛాతిలో దాచేసుకుని, తనని గట్టిగా ముద్దు పెట్టేసుకుని, పూవులూ, వానా, నదులూ అయిన సీతాకోకచిలుకలు మిణుగురులతో మిలమిలా మెరుస్తో తిరిగే రాత్రిలోకీ మంచు కురిసే వెకువఝాము చీకట్లలోకీ తటాలున తనతో పాటు దుమికేసాను 'ఇంతకాలం నీకు చూయించనది ఇదొక్కటే' అనుకుంటూ!

# పెద్దపులి ఆ అమ్మాయి

పెద్దపులి ఆ అమ్మాయి
తెల్లని చామంతుల కళ్ళే తనవి. నొప్పించినప్పుడు ఎవరైనా, బేలగా నీపై కురిసే మంచు రేకులే అవి -

పెద్దపులి  ఆ అమ్మాయి

తల్లివైపు పరిగెత్తే పసిపాపలవంటి చేతులే తనవి. ప్రేమ కోసమో, ఒక తోడు కోసమో, లోకంవైపూ ఇతరులవైపూ సాగి, నలిగిపోయి లుప్తమై వెనుదిరిగితే, వడలిపోయిన సాయంత్రాలై నీ ఛాతిపైకి జారే తల్లి లేని పిల్లి కూనలే అవి. వడలిన కాడలై నిర్లిప్తంగా వేలాడే పసి పిల్లలే అవి. తెల్లని చేతులే తనవి -

పెద్దపులి ఆ అమ్మాయి

పూలతోటలాంటి ముఖమే తనది. నువ్వు ఏం చెప్పినా నమ్మే, నువ్వు ఏం చెప్పినా నమ్మి, సముద్రాలనూ ఎడారులనూ దాటి, నీకై ఎదురు చూసిన పసుపు పచ్చటి ముఖమే తనది. ఒకప్పుడు నీకు పాదుగా మారి, నీవు ఏపుగా ఎదిగేందుకు తోడ్పడిన మహాఇష్టమే తనది. నీకై రాత్రుళ్లుగా, వెన్నెలగా, మట్టికుండగా, నక్షత్రాలు మెరిసే ఆకాశంగా, చివరికి నువ్వు భక్షించే ఆహారంగా కూడా మారిన శరీరమే తనది. ఇక ఇప్పుడు, వొణికే హృదయంతో, ఒక నీటి చెలమగా మారిన కాలమే తనది. ఎవరికీ చెందని లోకమే తనది -

పెద్దపులి ఆ అమ్మాయి

అన్నిచోట్లా, ఎల్లప్పుడూ నిన్ను ప్రేమించి, ప్రేమించడంతోనే ఒక శిల్పంగా మారి, ఇక ఇప్పుడు తనలో తాను తనతో తాను ఒంటరిగా సంభాషించే, ఒంటరిగా సంచరించే, తనను తాను కౌగలించుకుని, తనలో తాను దిగులుతో ముడుచుకుపోయే, అంతంలేని శీతాకాలపు రాత్రుళ్ళ, ఎవరూ లేని దారుల, ఆరిన చితుకుల మంట చుట్టూ నెమ్మదిగా ఇంకే వాన చినుకుల సవ్వళ్ళుల  పసి పసిడి పెద్దపులే ఆయిన ఆ అమ్మాయి

ఆ అమ్మాయి ఎందుకైనా ఎన్నడైనా, ఎక్కడైనా - ఒక్కసారైనా గుర్తుకు వచ్చిందా మీకు?

# గుర్తుపెట్టుకో ఆ అరచేతులను

తన రెండు అరచేతులలోకి నీ అరచేతులని వొదిలివేసి అలా కూర్చుంటావు నువ్వు-

శీతాకాలపు సాయంత్రం. శరీరంలో గుబులుగా చెట్లేవో వీచి, కలకలంతో పక్షులు ఒక్కసారిగా గుంపుగా లేచి, తిరిగి సర్దుకునే ఒక జ్ఞాపకం. ఇక నెమ్మదిగా తల ఎత్తి తను నీవైపు చూసిందో లేక ఆ కళ్ళలో కనిపించే నీటి తెరలను నువ్వే సాయంత్రంగా భ్రమించావో, లేక ఆ నీటి తెరలపై, అలసిన నీ అరచేతులను కాగితపు పడవలవలే వొదిలివేసావో, లేక తనకు చెప్పాలనుకుని రాసుకున్న ప్రేమ లేఖలన్నిటినీ ఇవ్వలేక మరి చించి వేసావో, ఒక నిట్టూర్పుతో వొదిలి వేసావో, మూగవాడివి ఎందుకు అయ్యావో, నీకూ తెలియదు. తనకూ తెలియదు!

ఇక, తల ఎత్తి తన ముఖం వైపు చూసేలోపు, చప్పున ముఖం తిప్పుకున్నదీ, గుండెను ఉగ్గపట్టుకున్నదీ ఎవరో కూడా తెలియదు. ఇక చివరకు మిగిలేదల్లా ఒక శీతాకాలపు సాయంత్రం: ఖాళీ గూళ్ళు. నీడలు - సన్నగా వొణికే చలి రాత్రీ, ఒంటరి చీకటీ, అరచేతుల్లోంచి అరచేతులు తొలిగిపోయి నెమ్మదిగా దీపాలను ఆర్పి, తమలోకి తాము ముడుచుకుపోయే మన చేతివేళ్లూ ఈ కాలం, ఈ లోకం, చివరగా చీకటిని చీలుస్తూ గదిలోంచి వెళ్ళిపోయే - నీదో, నాదో - మరి ఒక దేహ దీప ధూపం!

# వాదన

తలుపులు తెరచి చూస్తే, నువ్వు వొదిలి వెళ్ళిన గుర్తులు: బహుశా, నువ్వు నాకు ఇద్దామనుకుని తెచ్చిన రెండు పుస్తకాలూ, ఇంకా ఒక పూలకుండీ. నీకు తెలుసు: పూలను నేను ఎన్నడూ పెద్దగా ప్రేమించలేదని: విరగబూసిన పూలని పూలపాత్రలో నింపుకుని ఊరకే అలా చూస్తూ ఉంటాననీ, గడిచే కాలంతో మారే వాటి రంగులూ వడలే వాటి ఆకులు మాత్రమే నాకు ఆసక్తి కలిగిస్తాయనీ, ఇంకా - గోడలపై  గాలికి రెపరెపలాడే వాటి నీడలే నాకు మిక్కిలి ప్రాణమనీ, నిజానికి కొమ్మకి ఉన్న పూలనెన్నడూ నేను వినలేదనీ!

అయినా, నువ్వు వచ్చిన ప్రతీసారీ నీతోపాటు ఒక పూలమొక్క, తల్లి ఒడిలాంటి మట్టితో, కుండీతో ఇంకా కొంచెం నిన్ను అద్దుకున్న సువాసనతో: వాన తడితో - అందుకే ఇవాళ, పూలను తెంపలేదు. పూలపాత్రలో అలంకరించలేదు. నీడలలో వేళ్ళు ముంచి, నీకై ప్రతిబింబాలని ఏమీ రాయలేదు. రాళ్ళూ పూవులే పూవులూ రాళ్ళే అని ఎవరితోనూ వాదించలేదు -

ఇచ్చిన హోంవర్క్ చేసి బుద్ధిగా కూర్చున్న ఒక బాలుడి మల్లే చేతులు కట్టుకుని, కిటికీ ముందు, రాత్రిలోకీ, ఒక నిశ్చలమైన చీకటిలోకీ - మరి నీ కోసమో, ఇక నా కోసమో ఇక్కడ, నువ్వు వొదిలి వెళ్ళిన ఓ గుర్తునై చిహ్నాన్నై, జాడనై, ఎదురుచూస్తో...

మరి నన్ను తీసుకుని నా వద్దకు ఎన్నడు తిరిగి వస్తున్నావు నువ్వు?

# క్షణికం

"ఎందుకో భయంగా ఉంది. ఎక్కువకాలం ఇక్కడ ఉండనని తెలుసు. అయినా, లోపలంతా గుబులు గుబులుగా..." తన చేతిని గట్టిగా పట్టుకుని అన్నాడు అతను -

చీకట్లో, పల్చటి కాంతి ప్రసరించిన మొక్కల మధ్య ఒంటరిగా కదిలే ఒక పావురం. నిటారుగా నిల్చిన గోడలపై గాలికి చలించే నీడలు. మధ్యలో ముఖంపైనుంచి కదిలే కీటకాల సవ్వడి. తెరమరుగవుతూ ఒక పల్చటి చందమామ. తన అరచేతిలోంచి రాత్రి దాగిన కుండీలోకి నెమ్మదిగా ఇంకే బియ్యం కడిగిన నీళ్ళు. పక్కగానే, అతను చేరుకోలేనంత సమీప దూరంలోనే, అతని అలసటలోనే ఆ భయంలోనే, అతనికి

ఎక్కువగా లేని అతని - తన - కాలంలోనే, లోకంలోనే, ఒక మంచుపొగ: తన శరీరం. కుండీలోంచి విచ్చుకున్న రెండు ఎర్రెర్రని మొగ్గల వంటి తన నయనాలూ తన చేతివేళ్లూ, అతనెన్నటికీ చేరుకోలేని తన జీవితం, స్వప్నమూ జననమూ మరణమూ

ఇంకా - రాత్రంతా, మొక్కల మధ్య చూపు లేక, ఏమీ తినలేక, అలా ముణగదీసుకుని గుబులు గుబులుగా ఏడ్చే అతని హృదయంలాంటి ఒక నల్లటి పావురం

# నివేదిక

ఉదయాన్నే నిద్ర లేచావు. అకారణంగా ఎందుకో సంతోషంగా ఉన్నావు -

దులిపి ఆరవేసిన పల్చని తెలుపు వస్త్రంలాంటి మంచు. మంచువంటి కాంతిలో తడిచే చెట్లూ, ఆకులూ. నిదురించే పిల్లల వద్ద నుంచి వచ్చే సుగంధమేదో గాలిలో. అప్పుడు కొద్దిగా, దీపస్థంబాల కింద నీడల నిశ్శబ్దం. మరికొద్దిగా, రాలే చినుకులు చేసే అలజడి. సరిగ్గా అప్పుడు అంటుంది తను అతనితో -

"ఇంకా కొద్ది దూరమే. ఆగిపోకు అప్పుడే - సంతోషంగా ఉన్నందుకు దిగులు చెందకు. కళ్ళ పక్కగా పెరుగుతున్న కణతులతో ఆ పావురం పిల్లకు కళ్ళు కనపడవు. మరి, తెలుసా నీకా విషయం?"

అతనికి తెలియదు కానీ, ఇక ఇప్పటికీ అతని అరచేతిలో, తన అరచేయి. తన అరచేతిలో ఒక పసివాని చేయీ, ఇంకా ఎదురుగా - కనుమరుగయ్యే మంచులో తడిచి -

నింపాదిగా పుష్పించే, రెండు ఎర్రెర్రని దానిమ్మ పూవులు

# నాకు తెలుస్తుంది

నాకు తెలుస్తుంది

నేను లేనప్పుడు నువ్వు వచ్చి వెళ్ళిపోవడం-
    నువ్వు వొదిల్చినవేమీ ఉండవు కానీ, గది అంతా ఒద్దికగా
    నేల ఏమో పరిశుభ్రంగా, నువ్వు తెరచిన కిటికీలలోంచి పూసిన కాంతితో -

నాకు తెలుస్తుంది

నువ్వు చెప్పకపోయినా -
    నేను కూర్చుని చదూకునే బల్లా, పడుకునే మంచమూ
    మడత పెట్టబడిన దుప్పటీ, కూజాపై బోర్లించబడ్డ గ్లాసూ
    బాల్కనీలో కుండీల వద్ద తచ్చాట్లాడీ తచ్చాట్లాడీ

లోపలికి వచ్చి చూసిపోయే పిచ్చుకలూ, ఉండీ ఉండీ
రాత్రి వీచే గాలీ, కదిలే లతలూ
తీగపై చలించే మన దుస్తులూ

వీటన్నిటికీ నీ సువాసన -
అలలపై వెన్నెల చలించినట్లు, అంత చీకట్లోనూ సెలయేటి ఒడ్డున ఎవరో
సంచిరిస్తున్నట్లూ, మెల్లిగా
అస్పష్టంగా పిలుస్తున్నట్లూ -

నాకు తెలుస్తుంది, మరి నువ్వు రాకపోయినా

నిలువెత్తు అద్దంలో, ఎవరిదో ఒక రూపం
 - చూసేలోపల - చేతికందకుండా పొగమంచై కదిలి పోవడం, రూపు దిద్దుకుంటూ
ఒక కవిత మాయమవ్వడం

అంతిమంగా
అద్దంలో తన స్వీయ ప్రతిబింబం కనిపించక
ఒక మనిషి

ఎదురుచూపులతో అంధుడై
అరచేతుల మధ్య ముఖం లేని మొండెంతో
అలా మిగిలి, పగిలిపోవడం!

# Déjà vu

దినం మొత్తం అతనలా కూర్చుని ఉంటాడు, కిటికీ పక్కన మంచంపై - ఎదురెండ సోకి వాడిన ముఖంతో, గాలికి ఎగిసి వలయాలుగా తిరిగి మళ్ళా అక్కడే ధూళిలో రాలిన ఒక కాగితపు ఉండవలే -

ఉదయమూ వెళ్లిపోతుంది. మధ్యాహ్నమూ కరిగిపోతుంది. గింజలకై పావురాళ్ళు అతని ముందు తిరిగీ తిరిగీ నిరాశతో ఎగిరి వెళ్ళిపోయే సమయమూ ఆసన్నమవుతుంది. "వస్తారా ఎవరైనా తిరిగి?" అని అతను నీడల్ని అడిగే లోపల, ఒక ఊహతో తెరపి పడే లోపల, రెక్కలు కొట్టుకునీ కొట్టుకునీ, తెగిన ఏ రెక్కో తగిలి ఇన్ని నీళ్ళు ఉంచిన ముంత వొలికే పోతుంది. నీళ్ళకు తడిచీ, గాలికి ఎండీ, బాల్కనీలో ఒక పక్షి ఈకా, మంచంపై ఒక ఒంటరి చేయీ చీకట్లో ఒక చెట్టూ, దుమ్ములో ఒక కాగితమూ అలా స్పృహ తప్పి పోతాయి. "జీవితంలో అద్భుతం ఏదీ లేదు. ఇట్లా నీకై వేచి చూసే ఒక జీవిత కాలపు శిక్ష తప్ప" అని అతను తనలో తాను

గొణుక్కుని, మళ్ళా మరొక దినం, మరొక మధ్యాహ్నం, ముఖం కళ్ళూ చిన్నబోయి, వడలిపోయి, దుమ్ములో గింజుకులాడే ఒక పాలిపోయిన ఆకై పోయీ, చివరికి రాత్రిలో చివరి శ్వాసతో మిణుకు మిణుకుమంటున్న ఒక నెత్తురు దివ్వెపోయీ దానిని కాపాడే, తిరిగి నింపాదిగా దానిని ఆర్పే అరచేయీ కూడా అయిపోయి, ఒక్కడై అట్లా అక్కడే మిగిలిపోయి -

# స్మృతి

నీ నుదుటిన
ఒక వాన చినుకు. చిగురాకంత గాలి అప్పుడు నీలో: గూళ్ళల్లో సర్దుకుని
బెదురుగా ఎదురుచూసే పిచ్చుకలు నీ కళ్ళు. కంపించే
ఒక సాయంత్రం, మబ్బులు గుమికూడిన ఆకాశం

మసక చీకటీ, మరి ఎవరిదో ఒక అశ్రువు ఇక చితికిన కాటుకైతే -

ఎవరిదో మరి అప్పుడు
నిను తాకే - పురాజన్మల సువాసన. ఎవరివో మరి అప్పుడు, నిన్ను రహస్యంగా హత్తుకునే బాహువులు. ఎవరివో మరి అప్పుడు, చిన్నటి మాటలు: ఎవరివో మరి అప్పుడు నిన్ను స్మరించే పెదవులు -

మరి ఎవరిదో ఒక ముఖం

అప్పుడే, వెనుక నుంచి నిన్ను అతి మృదువుగా పిలిచినట్లూ
సన్నటి నవ్వుతో అప్పుడే

ఎవరో నీ మెడను దాదాపుగా తాకినట్లూ, ఎవరివో పెదాలు
అప్పుడే, నిన్ను ఆనీ ఆననట్లూ, అప్పుడే ఎవరిదో ఒక శ్వాస నిను తాకీ తాకనట్లూ
నీలో - ఒక గగుర్పాటు. ఒక అలికిడి. తల తిప్పి చూసేలోపల
అక్కడ ఎవరూ లేక

నీలో కలిగే
ఒక గుబులు. ఒక తపన. నీ శరీరమంతా, నీ లోపలా, జీవన్మరణ సీమల్లోని మహాశూన్యం -
నీ నుదిటిన

జ్వలిస్తో దిగబడే

ఒక స్మృతి ముద్రిక. శిలువ వేయబడే ఒక దైనందిన చర్య.  ప్రేమ. ఇక
అక్కడే చివరిగా

వాన వెలసిన నిశ్శబ్దంలో
ఎవరిదో ఒక రాత్రి నిద్రలో, నువ్వు నెమ్మదిగా సద్దుమణిగే వేళల్లో పుష్పించే
నీలో మిగిలే, చినుకంత

శ్వేత స్వప్నఛాయ -

# అసంపూర్ణం

*గూడు*

శరీరంలోంచి శరీరం వెళ్ళిపోయి మిగిలే ఒక కరవు
పారతో ఎవరో కడుపులో త్రవ్వుతున్నట్లూ, ఎవరో ఈ చీకట్లలో ఉగ్గపట్టుకుని
చిన్నగా ఏడుస్తున్నట్లూ, ఇష్టమైన ముఖంపై తెల్లని వస్త్రం కప్పుతున్నట్లూ -

*కాలం*

పగిలిపోయిన గాజుగ్లాసు ముక్కలలో మెరిసే వేసవి రుతువు
ఎవరూ నీళ్ళు పోయక, వడలి మిగిలిపోయే మొక్కలు, నిరాశగా వెనుదిరిగి వెళ్ళిపోయే
పిచ్చుకలు:  ఒక పదం తట్టి అంతలోనే మాయమయినట్లూ, ఒక

*వాగ్దానం*

పెదాల చివర ఆగిపోయినట్లూ, నీలో
ఎవరో ఒంటరిగా మిగిలిపోయినట్లూ -

*అంతం*

ఇక అతనొక్కడే అక్కడ, కవిత్వం వంటిదేదో వ్రాయలేక, ఏడవలేక
నీడలు సర్పాలై ప్రాకే ఆ బాల్కనీలో, త్రాగీ త్రాగీ త్రాగీ, ఇంకా దాహం తీరక, చేయి
జొనిపి హృదయాన్ని పెరికి రాత్రిలోకి విసిరి కొడితే,
తెల్లవారుఝామున

తన ముఖం

అతని కలలోకి చల్లగా, మబ్బులు కమ్మిన మసక జాబిలై, కొంత
బ్రతికించే వెన్నెలై, కన్నుల్లోకి తల్లి పాల చుక్కలై, జ్వరపీడిత నుదిటిపై అరచేయై
వచ్చి అట్లా మిగిలిపోయింది

# నీ హృదయం

ఎక్కడెక్కడో తిరిగావు ఇన్నాళ్ళూ
నీ హృదయం తప్పిపోయిందనీ, దొరికితే ఎవరైనా తెచ్చిస్తారనీ, ఎప్పటికైనా
సాంత్వన లభిస్తుందనీ, విరామంగా కూర్చుందామనీ -

ఈ లోపల
పెద్దవాళ్ళయిపోతారు నీ పిల్లలు. తలుపులు తీసుకుని ఎటో
వెళ్ళిపోతారు: కొన్నిసార్లు నీకు అసలేమీ చెప్పకుండా, కనీసం
నువ్వు ఉన్నావనే స్పృహ కూడా లేకుండా -

ఒక పగలు గడుస్తుంది
ఒక సాయంత్రంమూ దాటిపోతుంది. పల్చటి చీకట్లలో, వేసవి గాలికి
రెపరెపలాడుతుంది ఖాళీ గూడు: ఎప్పుడో - ఆకస్మికంగా ఎవరో మరి
నిన్ను పిలిచినట్లయితే

గుండె కొట్టుకోవడం
ఆగిపోయినట్లయ్యి తల తిప్పి చూస్తావు కానీ, అక్కడంతా నిశ్శబ్దం
గుక్కెడు మంచినీళ్ళు లేని మనుషుల సముద్రం. నల్లటి నీడలే అప్పుడు నీలో:
కదులుతో, మెదులుతో, ఏడుస్తో -

ఎక్కడెక్కడో తిరిగావు కానీ ఇన్నాళ్ళూ
ఇదిగో ఇప్పుడు చెబుతున్నాను నేను
విను:

సృజనా
నీ హృదయమే
నిను వెంటాడే ఒక క్రూరమృగం. అద్దం లేని ఒక అద్దం. భ్రాంతీ
ఎప్పటికీ కనుగొనలేని ఒక ఇల్లూ, ఇంకా

ఇప్పటికీ నిను బ్రతికించి ఉంచే
ఒక అద్భుతమైన అబద్ధం!

# క్రియ

రాత్రి అవుతుంది

ఇంటి తలుపులు తెరచినప్పుడు
ముఖాన్ని చరిచే, వాన హృదయం తెలియని ఒక గాలి ఏదో
గూటిలో పక్షిపిల్ల ఒకటి తల్లికై ఆకలై కీచుగా అరచినట్లు

గొంతు తెగిన శబ్దం లోపలేదో. ఇంకా ధూళి.
ఖాళీ బాహువులంతటి చీకటి. ఇక, గదుల్లో ప్రతి మూలా
ఒక దీపం ఆరిపోయిన వాసన -

అల్మారాల్లోనూ, దుప్పట్లలోనూ
దుస్తులలోనూ, వంటగదిలోని పాత్రల్లోనూ, స్నానాల గదుల్లోనూ
ఒక పూవు రాలిపోయిన శబ్దం
అంతిమంగా, నీ నిశ్శబ్దం -

సరే. ఇప్పుడు చెబుతున్నాను విను

సరిగ్గా
అప్పుడే గుర్తుకు వస్తావు నువ్వు

నిదురలో
ఏడుస్తూ మన పిల్లలు
నీ వైపు తిరిగి, నీ మెడ చుట్టూ చేతులు వేసి, నిన్ను గట్టిగా కావలించుకుని
వెక్కిళ్ళు పెడుతూ పడుకున్నట్లు!

# విభక్తి

ఎన్నో వెళ్ళిపోయాయి
ఏ జాడలూ లేకుండా, కనీసం స్మృతి సమీరాన్నయినా
మిగల్చకుండా

ఎదురుగా
నీరెండలో సగం తడిచి, నెమ్మదిగా ఊగే ఆకులు. కొమ్మలపై
అంతే నెమ్మదిగా ఎగబాకే నీడలు

ఎవరో  ఇష్టంగా
నీకు దగ్గరగా జరిగి నీ చెవిలో గుసగుసలాడినట్లు, వాళ్ళ  ఊపిరి
నిను తాకినట్లూ, వానాకాలపు

వెలుతురు. కొంత చీకటీ -
మరికొంత, పిల్లలు ఆడుకుని వెళ్లిపోయాక మిగిలే నిశ్శబ్దం.
లోపల, చాలా కాలం

తాళం వేసి ఉన్న ఇంటిని
తెరిచినప్పటి వాసన. పల్చటి మట్టిపొర ఏదో పేరుకుపోయినట్లూ
ఎవరూ నిన్ను తమ వేళ్ళతో తాకనట్లూ

రంగులు వెలసిన
కదిలీ కదలని కర్టెన్వో, లేక చేతులిరిగిపోయిన ఒక కుర్చీవో అయి
నువ్వు మిగిలి, పిగిలి పోయినట్లూ

ఎన్నో వెళ్ళిపోయాయి
ఏ జాడలూ లేకుండా. ఎందరో వెళ్ళిపోయారు, ఏ జాడలూ
మిగల్చకుండా -

ఇక, ఈ బాల్కనీలో

ఈ గూటిలో పెరిగే  ఇంకా కళ్ళు తెరవని ఈ పావురాళ్ళలో
ఏవి బ్రతికి ఉంటాయో
ఏవి చనిపోతాయో

తెలియదు నాకు నిజంగా -

ఎన్నటికీ!

# సూత్రం

పెద్దగా ఏమీ ఉండదు: నువ్వు గుర్తుకు వచ్చినప్పుడు -
ఎక్కడో ఏదో విరిగిపడి, లోపల లోతు తెలియని కందకం ఒకటి ఏర్పడి
ఇక, ఒక తపన - లోపల:

తల దాచుకునేందుకు, ఒక గూటి కోసమో
ఒక అరచేయి కోసమో, గూడువంటి, ప్రమిదెవంటి ఒక శరీరం కోసమో, చివరికి
ఒకే ఒక్క పలుకరింపు కోసమో

రాత్రుళ్ళలో, ఈ దిగులు కందకాలలో, గోడలపై
వ్యాపించే నీడల్లో, వీచే గాలుల్లో, నేల రాలి దొర్లిపోయే పూలల్లో, ఆకుల్లో
మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టుకుని

లోపలికి ఒదిగొదిగిపోయి కంపించే క్షణాలల్లో
ఒక తండ్లాట
ఒక యాతన
ఒక శిక్ష -

నిజం. నన్ను నమ్ము

పెద్దగా ఏమీ ఉండదు: నువ్వు గుర్తుకు వచ్చినప్పుడు -
పాలు తాగే, నెలలు నిండని శిశువుని చివ్వున లాక్కుని వెళ్లిపోతారు ఎవరో
ఇక కళ్ళల్లో నీళ్ళతో, గుబులుగా

ఆ తల్లి ఒక్కతే అక్కడ, ముసురు పట్టిన
చెట్ల కింద చీకట్లలో ఒంటరిగా, గుక్కపట్టి ఏడ్చే తన పిల్లవాని జ్ఞాపకంతో -
నాతో!

# creche

వెనుదిరిగినప్పుడు నువ్వు
వెంటాడతాయి కళ్ళు రెండు నిన్ను, crecheలో వొదిలి వెళ్లే తల్లిని
దీనంగా వెంబడించే
పిల్లల హృదయాల్లా -

అప్పటి నొప్పికీ, ఆ మూగ భాషకీ
లిపి లేదు. కళ్ళు ఒలికి, శరీరమే నీరై నేలపాలై నీ పాదాల వెంట
దొర్లిపోయే ఒక నిస్సహాయత తప్ప
చాచిన రెండు చేతుల
ప్రార్ధన తప్ప -

అవును. ప్రార్ధన
తలలు వంచిన
చెట్ల కిందా, తడిచిన పచ్చికపైనా, ఆగీ ఆగీ అంతలోనే ఎగిరిపోయే
పురుగులపైనా, సాలీళ్ళ గూళ్ళపైనా
వొణికిపోయే పల్చటి నీడల
పిల్లల
ప్రార్ధన

ఎవరన్నారు ఇది ప్రేమని?
ఎవరన్నారు ఇది ఒక జీవితమని? ఎవరన్నారు ఇది ఒక సజీవ నగరమనీ?
ఇది నిన్ను తాకి, నీ వేలి చుట్టూ ఇష్టంగా అల్లుకుపోయే
చిన్ని చిన్ని చేతివేళ్ళ
నులివెచ్చని కల అనీ
నవ్వు అనీ
నువ్వు అనీ
నేను అనీ?

వెనుదిరిగినప్పుడు నువ్వు
వెంటాడతాయి కళ్ళు రెండు నిన్ను: కర్కశంగా తల్లినెవరో ఈడ్చుకపోతే
చూచుకం దూరమై ఆకలికి తాళలేక
గుక్కపట్టిన ఒక శిశువు
చీకట్లో చెట్ల కింద
ఒంటరిగా
ఏడ్చినట్లు -

ఇక నువ్వే ఆక్కడ
దూరమైన పిల్లల స్మృతి స్పర్శని బాహువులలోకి లాక్కుని, పమిటె చెంగుతో
కళ్ళు అద్దుకునే తల్లి పక్కనా, వ్యాఘ్ర దంతాల
ఈ రాత్రి నగరం పక్కనా, బావురుమంటో
గుండెలు బాదుకుని
ఒక్కడివే
ఏడుస్తో -

# ఈ రాత్రి

రాత్రి.

నీ హృదయాన్ని చీల్చుకుని నెత్తురోడుతూ వెలికి వచ్చి
అర్థించే పిలుపుకి
ప్రతిధ్వని లేదు -

రాత్రి.

వెన్నలంత చీకటి. కాటుకంత నొప్పి, చెమ్మగిల్లిన గాలీ.
ఇక ఆకాశంలోకి చాచిన
నీ అరచేయి అలాగే

దిగంతాలలోకి
ఒంటరితనపు బరువుతో జారిపోతే, నీ శిరస్సు  ఒక
ఖండిత పూవై మిగిలిపోతే

రాత్రి

క్షమించు.
పూలపరిమళాలతో ఎగిరే సీతాకోకచిలుకల గురించి
ఇప్పుడు వ్రాయలేను
కలగననూ లేను -

ఈ రాత్రికి
జీవితం ఒక హంతకుడి హృదయం. ఒక లీక్డ్ MMS -
ఫ్లైఓవర్లే తల్లి బాహువులైన నగరం
కాల్బుర్గి ఆఖరి శ్వాసలో

ఆగిపోయిన ఒక పదం!

# a very sentimental poem

1
చీకటిలో
నువ్వు దీపం వెలిగించినప్పుడు నేను లేను కానీ
కొద్దిగా రెక్కలు విప్పిన
తెల్లని పావురంలా మారిన మన గూటిని నేను
ఊహించగలను
2
నేను
వచ్చేటప్పటికి నువ్వు ఉండవని నాకు తెలుసు
నీకూ తెలుసు -
అయినా
వెలిగించి వెళ్ళడంలోనే నాపై నీ ఇష్టం దాగి ఉందనీ
అదే జీవన సూత్రమనీ
అదే నీ ఇంద్రజాలమనీ
ఎందరికి
తెలుసు?
3
నేను
వచ్చేటప్పటికి నువ్వు లేవు: నువ్వు వెలిగించి ఉంచిన
కాంతి వలయంలో
నీ
శరీర సుగంధం. సన్నగా చలిస్తూ కదిలే సెగలో నీ
పసుపు పచ్చని ముఖం -
వండి ఉంచిన
పాత్రలో
మెతుకుల్లాంటి నీ మాటలు. బల్లపై ఉంచిన
మంచి నీళ్ళ గాజు పాత్రలో
నీ మౌనం -
తెరచిన

కిటికీలలోంచి చల్లటి రాత్రి గాలి. ఇక ఎప్పటిదో మరి
నీ సన్నటి నవ్వు
ఇప్పుడు
ఇక్కడ
చీకటిలో మిణుగురై మెరుస్తోంది -
**4**
చీకటిలో
నువ్వు దీపం వెలిగించినప్పుడు నేను లేను కానీ
కొద్దిగా
బెంగటిల్లి
రెక్కలు నిక్కబొడుచుకుని ఉర్ర్ ఉర్ర్ మంటూ
గూట్లో
అక్కడక్కడే
మెసిలే ఊదా రంగు పావురంలా నేను: తోడుగా
ఈ అక్షరాలూ -
అది సరే కానీ
**5**
మరి
నువ్వు తిరిగి వచ్చేదాకా, వచ్చి తాకి శ్వాస అందించేదాకా
మేమంతా
ఏం చేయాలో
ఎలా ఎదురు చూడాలో నేర్పడం
ఎలా మరచిపోయావు
నువ్వు?

# ఎక్కడో, ఎప్పుడో

"నొప్పి/ ఏం?/ ఏమో తెలియదు. కానీ, నువ్వు ఉండు/ నేనెట్లా ఉండగలను ఎప్పటికీ?/ ప్లీజ్. చాలా ఒంటరిగా అనిపిస్తుంది/ ఇంకా?/ లోపల తవ్వుకుపోయినట్లు కూడా ఉంది/ "హ్మ్. అవునా?/ రాత్రులు, గొంతుని ఏవరో పిసుకుతున్నట్లూ ఉంది/.../ ఏడుపొస్తుంది/ పక్కన ఎవరూ లేరా? అమ్మని రమ్మనక పోయావా?/ నువ్వు ఉంటావా? భయంగా ఉంది/ ... / తలుపులు వేసినా ఇంట్లోకి ఎవరో వచ్చి తచ్చాట్లాడుతున్నట్లు ఉంటుంది/ ... / యు నో దోజ్ సౌండ్స్. నీళ్ళు ఒలికి పడుతున్నట్లూ, గిన్నెలు కదిలినట్లూ .../ హ్మ్ .../ అద్దంలోంచి ఎవరిదో ముఖం బయటకి చొచ్చుకు వస్తున్నట్లు .../ ఎంతయింది టైం అక్కడ?/ ఇ డోంట్ నో. మే బి ఒకటిన్నర/ తిన్నావా?/ లేదు/ ఏమైనా తిను/ మంచం మీద నుంచి కిందకి దిగలేను. కిచెన్లోకి వెళ్ళాలంటే భయం వేస్తుంది/ మరి ఎట్లా?/ నా సంగతి వదిలేయి. నువ్వు చెప్పు, ఏమైనా -/ ఐ గాట్ట గో//అప్పుడేనా? ఏం?/ నొప్పి/ నీకెందుకు?/ ఏమో తెలియదు, కానీ గాట్ట గో//చెప్పు, ఏమయ్యింది?/ గ్లాసులోకి ఓ పోయెంని ఒంపి ఊపాను. అది కిందకి ఒలికిపోయి గట్టిగా అరిచింది/ అయ్యో.../ కానీ, లకీ. పగల్లేదు అది/ మరి?//నెమ్మదిగా లేచి, పగిలిన గాజుముక్కల్ని ఏరుకుంది .../ వాటిని కానీ తిన్నదా ఏమి? డిడ్ ఇట్ ఈట్ దెమ్?/ ఎస్. దాని గొంతంతా రక్తం. కన్నీళ్ళూ. అండ్ యు నో, ఇట్ స్మెల్డ్ ఆఫ్ యు/ ఓహ్ ఆ తరువాత?/ రెండు పూవులు, రెండే రెండు పూవులు గాలికీ వానకీ ఊగాయి. ఊగీ, ఊగీ రాలిపోయాయి. ఇంకెక్కడో పాలింకి పోయాయని ఓ అమ్మ ఏడ్చింది./ "ప్చ్. మరి తను ఏమంది?// ఒక తెల్లని రాత్రిని తాడులా మెడకు చుట్టుకుంది. అద్దంలోని చేతులను వేడుకుంది./ అవునా? ఇక నేను వెళ్ళనా?/ ఒద్దు. వెళ్ళకు. కాసేపు ఉండు. ప్లీజ్. కొద్దిసేపే/ ఏం? ఎందుకు?/ నొప్పి/ ఎందుకు?/ ఎందుకో తెలియదు. కానీ, ఎవరో లోపల త్రవ్వుతున్నట్లూ, గొంతుని ఎవరో పిసుకుతున్నట్లూ, అద్దంలోంచి ఎవరిదో ముఖం పుర్రై వెలుపలికి వస్తున్నట్లూ, నవ్వుతున్నట్లూ, నువ్వైనట్లూ ...

# పిట్ట కథలు

వెడుతున్నాను/ ఎక్కడికి?/ నిద్ర దగ్గరికి/ అప్పుడే?/ ఊ/ ఎట్లా?/ నవ్వుతో/ అవునా?/ అవును. నిద్ర నవ్వింది/ నిద్రా నువ్వూ ఎప్పుడు ఒకటి అయ్యారు?/ నిద్రలో ఎవరో నవ్వినప్పుడు/ అప్పుడు ఏమయ్యింది?/ ఒక దీపం వెలిగింది, ఆ వెలుతురు పూల వాసన వేసింది /ఆహా, ఇంకా ఏం జరిగింది?/ పూల పరిమళంలోకి ఒక పిట్ట వచ్చి వాలింది/ ఊ, ఆ తరువాత?/ పిట్ట హృదయం మబ్బు వలే మసకేసింది, గాలి వోలె ఊగింది, ఆడింది, పాడింది /ఇంకా?/ ఓ ఊయలలోకి అది చినుకువలే, కునుకు వలే జారింది/ ఊ, ఆ తరువాత? అప్పుడు ఇంకా ఏవైంది?/ చుక్కలతో చినుకులతో, వెన్నెలంత దయతో ఒక సీతాకోకచిలుక నా అరచేతుల్లో నిదుర పోయింది/ మరి నిదురలో ఏం జరిగింది?/ నిదురలో, కలలలో, కలల రంగుల్లో, రంగుల నీడల్లో ఒక జీవితం గడచిపోయింది/ ఆ తరువాత?/ వాన కురిసింది, గూడు తడచింది, అరచేతుల మధ్య చీకటిని ఓపలేక ఒక పూవు ఎగిరిపోయింది/ ఉఫ్ ... మరి పిట్ట ఏమయ్యింది?/ రాత్రిలో, పూలు లేని చీకట్లలో, తన రెక్కలతో ఎవరికీ ఏమీ వ్రాయలేక, గొంతు పెగలక, తనలో తాను కూరుకుపోయింది/ ఇక ఎగరలేక కింద పడి, రాలిన ఆకుల మధ్య చనిపోయింది/అయ్యో! ఆ తరువాత? ఆ తరువాత ఏమయ్యింది?/ వెడుతున్నాను/ ఎక్కడికి?/ నిద్రలోకి/ అప్పుడే?/ ఊ/ ఎట్లా?/ మట్టిలోకి ఇంకిన ముదురు వర్ణపు ఆకుల అలజడితో/ పీలికలైన గూటితో/ చుట్టూ రాలిన ఈకలతో/ మబ్బుల్లోకీ, నేలలోకీ/ నీతో, నాతో, తనతో, తిరిగి రాలేని ఒక చోటులోకి, నిద్రలోంచి నిద్రలోకి/ కలలోంచి కలలోకి/ ఇట్లా/ఇట్లిట్లా/ఎప్పటిలా/

# మరో ముఖం

నీ అరిపాదాలు పగిలిపోయి ఉన్నాయి: ఆ పగుళ్ళల్లో మట్టి, నల్లటి గీతలయ్యీ అరచేతి రేఖలయ్యీ -

✦ ✦ ✦

ఒకప్పుడు, నా శిరస్సును వాటిపై వాల్చితే, అవి తెల్లని మబ్బులు. నడిచే గులాబీ మొగ్గలు. సీతాకోకచిలుకలు ఎగిరే సరస్సులు. ఒకప్పుడు అవి నవ్వే పసిపాపలు. వెన్నెల కురిసే మైదానాలు. తాకితే కందే మెత్తని స్వప్నాలు. వడివడిగా పారే మాటలు నేలపై వలయాలు గీసే మౌనాలు. ఎంతో ప్రేమగా ఎదురొచ్చే సాయంత్రాలు. చీకటిలో వెలిగే దీపాలు. గోరింటాకు పండిన రాత్రుళ్ళూ హత్తుకున్న రొమ్ములూ, అన్నం పెట్టిన చేతులూ నుదిటిన భవిష్యత్తుని లిఖించిన తడి వస్త్రాలూ అవి: ఒకప్పుడు -

✦ ✦ ✦

ఇకిప్పుడు, ఈ నగరంలో, ఈ రహదారిలో, ఆగిన వాహన రద్దీలో, సిగ్నల్ వద్ద, తిండికి ఇన్ని రియల్ ఎస్టేట్ కరపత్రాలు పంచుకుంటూ, పగిలిన పాదాలతో కమిలిన కళ్ళతో, ముఖంతో నువ్వు -

✦ ✦ ✦

పగుళ్ల మధ్య మట్టితో, ఆకాశం మబ్బు పట్టింది: లోపలేదో మసకగా మారింది. హోరున గాలి వీచి చెట్లు ఊగి , ధూళి ఎగిసి, ఏదో కురిసేందుకూ, పూర్తిగా తడిచి, విరిగి వొణికిపోయేందుకూ, ఇంకా కొద్దిసేపే -

✦ ✦ ✦

అందుకే, వర్షం పడక మునుపే, నా వాహనం వైపు నువ్వు రాక మునుపే, నువ్వు చూడక మునుపే చప్పున గేరు మార్చి, కారును తటాలున ముందుకు దూకిచ్చి, చెట్లు విదిల్చిన ఓ నిట్టూర్పుతో పారిపోయి, ఇకా రాత్రికి ఎక్కడో వొణికొణికి కురిస్తే...

✦ ✦ ✦

ఏమీ లేదు: నగరం ఇది. ఏదీ తాకదు. కలవదు. హృదయమొక ఫ్లైఓవర్! అంతే -

# పిడికెడు

నిజంగా నేను కొంచెం అన్నమే వండుకుందామనుకున్నాను, పిడికెడెంత హృదయాన్ని రాజేసుకుని -

✦ ✦ ✦

లాఠీలతో వాళ్ళు, రాజ్యంతో వాళ్ళు, రాముడితో వాళ్ళు. దేవుళ్ళతో వాళ్ళు, దేశంతో వాళ్ళు. కర్కశ దేశభక్తితో వాళ్ళు . గోవులతో వాళ్ళు, గోమాతలతో వాళ్ళు, భారతమాతలతో వాళ్ళు, గుళ్ళతో వాళ్ళు, గోపురాలతో వాళ్ళు, నదీ తీరాల్లో వాళ్ళు - హృదయం లేని జీవన విధానం వాళ్ళు. నెత్తురంటకుండా చంపడం తెలిసిన జీవన కళ వాళ్ళు. ఇంద్రధనుస్సులు తెలియని ఏకరంగోన్మాదులు వాళ్ళు. నా ఇంట పొయ్యి పక్కన వాళ్లు. నా తిండితో వాళ్ళు. నా దుస్తులతో వాళ్ళు. నా పిడికెడు స్థలంలో వామనుడి పాదాలతో వాళ్ళు -

నన్ను రాస్తూ వాళ్ళు. నన్ను రాస్తూ, నాకు చరిత్ర లేకుండా చేస్తూ వాళ్ళు. నన్ను నామరూపరేఖలు లేకుండా చేసే ఒక అఖండ జ్యోతితో వాళ్ళు. రథంతో వాళ్ళు. రథయాత్రలతో వాళ్ళు. కత్తులతో వాళ్ళు బాణాలతో వాళ్ళు. గుక్కెడు నీళ్ళు అడిగిన గుండెలలోకీ, గర్భాలలోకీ త్రిశూలాలై దిగబడే వాళ్ళు. నెత్తురు పిండాల్ని చీల్చి 'జై, జై' అని నినదించే వాళ్ళు. పగలబడి నవ్వే వాళ్ళు. నా తల్లి బట్టలు విప్పి నడిరోడ్డులో ఊరేగించే వాళ్ళు. నా స్త్రీలను మానభంగం చేసే వాళ్ళు. కులం లేదనే వాళ్ళు. దేశాన్ని బిట్లు బిట్లుగా విదేశాలకి అమ్ముకునే వాళ్ళు. అవును వాళ్ళే. నేలలోంచి సారాన్నీ నీళ్ళలోంచి తడినీ ఆకాశంలోంచి నక్షత్రాలనీ, అడవులలోంచి చెట్లనీ, బిడ్డలనీ ధ్వంసం చేసే వాళ్ళు. వాళ్ళే -

సంస్థాగతమైన ద్వేషమై, విద్యలో పాఠ్యాంశాల విషమై, రాజ్యమై మతమై, పిడికెడు అన్నం అందివ్వలేని స్వచ్ఛ భారతమై, రామరాజ్యమై నా లోంచి నన్నూ, నీలోంచీ నిన్నూ, త్రవ్వుకునీ త్రవ్వుకునీ, అమ్ముకునీ, అమ్ముకునీ,  సైనికులు చెరచబడ్డ ఒక అమ్మని చేసి వొదిలివేస్తే

✦ ✦ ✦

ఇక్కడ కూలబడి గుప్పెడెంత అన్నమే వండుకుందామని అనుకున్నాను. మరి ఇంత - పిడికెడెంత హృదయమైనా ఉందా ఇనుపబూట్లనూ, లాఠీలనూ నియంత్రించే, ఆటల వినోదాల మధ్య తీరిగ్గా ఈ చోద్యం చూసే మన రాజ్యాధినేతల వద్ద?

# ‘రాత’ నాకు ఒక గూడు: శ్రీకాంత్

22 -ఫిబ్రవరి -2013

**1. శ్రీకాంత్, మీ కవిత్వం అది కేవలం వొక సాహిత్య ప్రక్రియగా కాకుండా, వొక మానసిక ప్రక్రియగా పనిచేస్తుందని అనిపిస్తుంది? అసలు కవిత్వం ఏమిటి మీకు?**

అన్ని ఇంటర్వ్యూలు పాక్షికంగానైనా ఆటోబయోగ్రాఫికల్ కనుక, అన్ని ఆత్మకథలూ ఒక కథ స్థానంలో మరొకటిని చెబుతాయి కనుక, ప్రతి ఆత్మకథా ముందుగా ఒక రహస్య ఒడంబడికతో ‘నన్ను నమ్ము. నేను సత్యమే చెబుతున్నాను’ అని నివేదిస్తుంది కనుకా, రచయితకీ చదువరికీ ఆ ఒప్పందం లేనిదే ఆత్మకథ మన్నదు కనుకా, అది ఆత్మకథ కాదు కనుకా, ఇవన్నీ genre కు సంబంధించిన ప్రశ్నలూ, రాజకీయాలూ కనుకా, ఇక ఈ మధ్య కొందరి/అందరి మనోభావాలు, ఎప్పుడు ఎలా ఎందుకు ఎక్కడ గాయపడతాయో తెలియదు కనుకా, ముందుగా ఒక disclaimer:

Do not take me seriously. All that which follows could be the truth. A truth in fiction. Or it could be a fictional truth too. Don't you know that all poets tell the truth, in truth, except the truth?

నా జీవితంలో లేదా ఇతరులు జీవితం అని దేనినైతే అంటారో, దానిలో/ దానితో నేను ఎన్నడూ సౌకర్యవంతంగా లేను. జీవితంతో కానీ, నాతో కానీ. కానీ అందులో పెద్ద వైవిధ్యభరితమైన విషయం కానీ, వింతైన విషయం కానీ ఏం ఉంది?. (మనలో

చాలా మంది తమ జీవితాల పట్ల అసంతృప్తితో ఉన్నారు. అశాంతితోనూ ఉన్నారు.

(What's the big issue about it?) Anyway, ఏమిటంటే, ఇతరులు take it for grantedగా తీసుకునే కొన్ని విషయాలు నాకు ఇప్పటికీ అర్థం కావు. అవి పెద్ద తాత్వికమైన విషయాలు కానక్కర లేదు. చాలా మామూలు విషయాలు. ఇతరులని తమ దైనందిన జీవితంలో అస్సలు ఇబ్బందికి గురి చేయని విషయాలు. వాటి అవసరం లేకుండా, వాటి గురించి ఆలోచించకుండా చాలా మంది తమ జీవితాన్ని నిక్షేపంగా గడిపివేసే విషయాలు. ఉదాహరణకు ఎవరైనా నాతో/మీతో 'జీవితంలో సంతోషంగా ఉండటమే అన్నిటి కన్నా ముఖ్యం' అని అన్నారు అనుకోండి, నా సమస్య అంతా ముందుగా ఆ పదాలతో, వాటి నిర్వచానాలతో మొదలవుతుంది. జీవితం అంటే ఏమిటి? జీవితం అని ఒకరు అన్నప్పుడు తద్వారా వాళ్ళు దేనిని సూచిస్తున్నారు? సంతోషం అంటే ఏమిటి? 'ఉండటం' మంటే ఏమిటి? 'అన్నీ' అని మనం అంటున్నప్పుడు, ఆ 'అన్నీ' లో అన్నీ ఉన్నాయా? ఈ పదాలు -జీవితం, ప్రేమ, లేదా సంతోషం లాంటివి can they exist in themselves? Equivocally? Or they exist in relation to something else? ఇది ఎందుకు చెబుతున్నాను అంటే, భావనా సంబంధమైన కొన్ని పదాలు (conceptual terms) కాలక్రమేణా సంస్థలుగా మారతాయి. సంస్థలుగా మారి సంస్థలుగా వ్యవహరిస్తూ కొన్ని (ప్రత్యేక) 'విలువలని' పరిరక్షిస్తూ అటువంటి 'విలువలని' వ్యాపింపజేస్తాయి. ఈ చిన్న ఉపోద్ఘాతం ఎందుకంటే, రాయటం అనేది నాకు మొదటిసారిగా ఇటువంటి ప్రశ్నలతోనూ - యవ్వనపు - అమాయకత్వాన్ని కనుమరుగు చేసిన ఘటనలతోనూ ముడిపడి ఉంది కనుక. ఆ ఘటనలు అన్నీ కూడా, ఒక స్థాయిలో వ్యక్తులకు సంబంధించినవీనూ మరో స్థాయిలో రాజకీయాలకు సంబందించినవీనూ కనుక. ఆ ఘటనలన్నీ కూడా - స్వాభావికంగా, అంతర్గతంగా -ఇతరత్వానికీ జాతికీ ముడిపడి ఉన్న అంశాలు కనుక. Incidents that are connected to the questions of the Nation and the Other కనుక.

నేను 'రాత' వద్దకి ఒక దేహం ద్వారా వచ్చాను. నేను 'రాత' వద్దకు ఒక దేహం ద్వారా, ఒక ముస్లిం దేహం ద్వారా, ఒక ముస్లిం స్త్రీ దేహం ద్వారా దేహమేమిటో, దేశమేమిటో రెండిటికీ ఉన్న సంబంధమేమిటో అర్థం చేసుకుంటూ, అర్థం చేసుకునేందుకూ దేహంతో, దేహం ద్వారా 'రాత' వద్దకు వచ్చాను. అదే సమయంలో, అటువంటి దేహం, అటువంటి స్త్రీ దేహం, అటువంటి స్త్రీత్వపు దేహం -ఉన్మాద హిందుత్వ రాజకీయాలకూ, హింసలకూ, హత్యలకూ అత్యాచారాలకూ చీలికలై విలవిలలాడటం, వెడలిపోవడం నా పద్దెనిమిది ఏళ్ల వయస్సులో నేను చూసాను.

జీవితంలో భాగమైనదీ, భాగమే జీవతమైనదీ ఎలా కనుమరుగు కాగలదో, కనుమరుగయ్యీ ఇంకా ఎలా నిరంతరం మిగిలిపోగలదో అనేదానికి నేను అప్పట్లో ఒక నిస్సహాయ సాక్షిని.

నా శరీరం పట్ల నాకు స్పృహ కలిగిన వయస్సు అది. శరీర రాజకీయాల పట్లా జీవిత రాజకీయాల పట్ల (bio and body politics) కూడా తొలిసారిగా కొంత అవగాహన కలిగిన వయస్సు అది. దేశం అనేది ఒక దేహమనీ, చరిత్రలూ సంస్కృతీ, రాజకీయాలూ శరీరాలపై లిఖించబడతాయనీ, శరీరాల ద్వారా ధ్వంసం చేయబడతాయనీ ప్రత్యక్షంగా, పరోక్షంగా అనుభవంలోకి వచ్చిన కాలమది. దేశంలో 'ఇతరుని' తుడిచివేయడం అనే ఒక process మొదలయ్యి బాబ్రీ మజీద్ విధ్వంసం దాకా వచ్చిన సమయమది. A continual process of erasing all that which belongs to the Other. ఈ క్రమంలో, చాలా వాటికి నేను సాక్షినే కాక, 'ఇతరులు' అయిన కారణానికి నేను చాలా మందిని కోల్పోయిన లోకమది. నన్ను నేను కనుగొంటున్న కాలమూ అదే. I have lost or more precisely I have been robbed of a lot of people for reasons that are political as well as religious. So many of them… ముస్లిం అయినందుకు, అకారణంగా దాదాపు తగలబడిపోయినంత పనైన రవూఫ్ నూ, దగ్ధమైపోయిన అతని న్యూస్ పేపర్ల షాపునూ, ఇర్ఫాన్ నూ, ముస్లిం అయిన కారణాన తనతో ఎవరూ మాట్లాడరని, ఈ ప్రదేశంలో ఒక కాందిశీకుడను అయ్యానని దుగ్ధతో విలపించిన నూరల్ హసన్ నూ, అజ్మత్ నూ, జువేరియా నూ, నాహీద్ నూ... ఇంకా చాలా చాలా మందిని కాలం లేని కాలాలలోకి కోల్పోయాను. వాళ్ళతో పాటూ నన్ను నేను కూడా పోగొట్టుకున్నాను. (Still I do not have a fixed identity, and still I do not know who I am).

ఇట్లా చాలామందిని పోగొట్టుకునే ప్రక్రియలో, మూస నిర్వచనాల నుంచి తప్పించుకునే క్రమంలో, నన్ను నేను కనుక్కునే ప్రయతంలో, 'రాత' writing నాకు ఒక గూడు అయ్యింది. శరనార్థి అయ్యింది. Or rather, I became a refugee in writing. ఇట్లాంటి క్రమంలో నేను రాసుకోవడం మొదలు పెట్టాను కనుక, రెండు ప్రశ్నలు అప్పుడు నాకు చాలా ముఖ్యంగా మారాయి: 'దేహం' మరియు నామీకరణం. The process of naming (read also as framing), and consolidating it through the body, texts and images. ఉనికికి సంబంధించిన ప్రశ్నలతో ఎంగేజ్ అయ్యి ఉన్న వాళ్లెవరికైనా, ఇటువంటి ఎంగేజ్మెంట్ ఖచ్చితమైన సాహిత్య ప్రక్రియగా కాకుండా, మానసికమైన tussle లాగా కూడా ఉంటుంది. అనివార్యంగానే అటువంటి రాత, (లిఖితం) ఒకరు తనతో తాను ఏర్పరుచుకునే సంభాషణ లేదా తన స్వగతం లాగానే, ఒక అంతర్గతమైన బాహిర్ మానసిక

ప్రక్రియలాగానే ఉంటుంది అని నేను అనుకుంటాను. And hence I would like to say that my texts (I would like to call them texts, instead of poems/ poetry) are my engagement with myself on the things that concern me through language and in language. 'ఇక కవిత్వం (నాకు writing/ లిఖితం) అంటే ఏమిటి మీకు' అనే దానిని, కొద్దిగా మార్చి 'ఎలా రాయాలి' అని అనుకుంటో, Writing comes before me అని కూడా చెప్పుకుంటూ, ఇక ఇల్లా ఒక రచయిత్రి (Helene Cixous) భాషలో చెబుతాను:

We should write as we dream; we should even try and write, we should all do it for ourselves, it's very healthy, because it's the only place where we never lie. At night we don't lie. Now if we think that our whole lives are built on lying -they are strange buildings -we should try and write as our dreams teach us; shamelessly, fearlessly, and by facing what is inside very human being -sheer violence, disgust, terror, shit, invention, poetry. In our dreams we are criminals; we kill, and we kill with a lot of enjoyment. But we are also the happiest people on earth; we make love as we never make love in life.

**2. మీరు తొలినాళ్లలో రాసిన కవిత్వం నించి ఇప్పటిదాకా మీకు మీరు ఒక గ్రాఫ్‌లో చూసుకుంటే ఆరోహణలూ, అవరోహణలూ ఎలా అనిపిస్తున్నాయి?**

నేను నా జీవితాన్ని, లేదా నా రాతలని (అవి రెండూ వేరే వేరే అయినట్లయితే) ఎన్నడూ ఆరోహణ, అవరోహణలతో చూసుకోలేదు. చూడను కూడా. For the simple reason that writing is not a career to me. And, I like to live this life - - whatever it is - with intensity. (రెండు రోజుల normal జీవన విధానం చాలు నాకు, నాకు నేనే విసిగెత్తి పోయి నన్ను నేను ముక్కలు చేసుకునేందుకు. Perhaps, a kind of masochism. Perhaps, all writing is a form of masochism.) నా వరకూ నాకు ముఖ్యమైనది ఏమిటంటే, ~~ఈ~~ జీవించడాన్ని ~~ఈ~~ 'జీవించడం' అనేది ఏదైతే ఉందో దానిని పూర్తి సాంద్రతతో అనుభూతి చెందటం, తిరిగి అంతే సాంద్రతతో రాయాలనిపించితే రాసుకోవడం. The only thing is that ~~ఈ~~ 'జీవించడం' అనేది ఏదైతే ఉందో this living itself - takes a form of writing for me. Writing life, being written by life, and living itself is an act of *writing* and being written by *writing* itself అన్నమాట.

నేను రాయడం మొదలు పెట్టిన కొత్తలో (1992), ఉన్మాది లాగా రాసుకునే వాడిని. (Perhaps we all go mad in writing - - at least - at some point of time in our lives). నా మొదటి పుస్తకం 2000లోనూ, రెండొవ పుస్తకం 2002లోనూ వచ్చాయి. ఆ తరువాత దాదాపు ఎనిమిది ఏళ్ళు నేను ఏమీ రాసుకోలేదు. (2002 - 2010). అందుకు ప్రత్యేక కారణం ఏమీ లేదు. కొన్నిసార్లు విసుగు పుడుతుంది we are bored to death and are fed up with ourselves and our writings.

either you write with your blood, bones skin and teeth or do not write at all. I follow this even now.

**3. కవిగా, కవిత్వ పరమయిన ఆలోచనలు చేస్తున్నప్పుడు మీ ఆలోచనల్ని ప్రభావితం చేసే విషయాలు ఏమిటి?**

ముందుగా ఇది: నన్ను నేను కవిగా ఎప్పుడూ చూసుకోలేదు, అనుకోలేదు. చూసుకోను, అనుకోను కూడా: ఇప్పటికీనూ. కవి అంటే ఏమిటో నాకు ఇప్పటికీ తెలియదు. Honestly, I don't know what it means to be a poet: poetry, yes, but not a poet. కవి అని అనే పదమే నాకు చాలా వల్గర్గా అనిపిస్తుంది. I don't subscribe to it. కానీ, నేను ఆలోచిస్తాను. ఆలోచించడం ఇష్టం నాకు. 'నా' అని ఏదైతే ఉందో, ఆ భాగం ఆలోచిస్తుంది కానీ, ఒక 'కవి'లాగా మాత్రం కాదు. I think. I like thinking but when I think, the I of me thinks but not as a poet. మరొక ప్రాధమికమైన విషయం ఏమిటంటే, when one thinks, one is bound by many things: things that make up our thought process. నా ఆలోచనా విధానాన్ని ఒక deep suspicion ఎల్లప్పుడూ guide చేస్తూ ఉంటుంది. A deep suspicion of all that is given and is taken for granted. ఉదాహరణకు 'కవిత్వం' అనే పదమే తీసుకుందాం. ఒక కవిత ఎలా ఒక కవిత లేదా కవిత్వం అవుతుంది? What constitutes a poem? కవిత్వాన్ని ఎవరు నిర్వచిస్తారు/ నిర్వచిస్తున్నారు? అటువంటి నిర్వచనాలాలో, అటువంటి నిర్వచనాలను uphold చేసే సాహితీ విమర్శలలో ఉన్న రాజకీయాలు ఏమిటి? Who defines poetry? What are the standards of poetry? Who defines, guides and guards these standards and for what purpose? Whose interests are being served in safeguarding certain norms and values of genre? లాంటి ప్రశ్నలు.

నా మటుకు, ఇటువంటి ఆలోచనా విధానం నాకు అతి ముఖ్యమైనది. ఎందుకంటే ఇటువంటి line of thinkingలో one clearly sees the connection between genres and literary criticism that upholds these genres (the

purity of genres) for certain values - (Don't we know that genre has gender too?) ఈ లంకెలు అన్నీ ఎందుకంటే, సాహితీ రూపాలు అనేవి నిష్పక్షపాతమైనవి కావనీ, సాహితీ ప్రక్రియల, సాహితీ విమర్శల యొక్క నీతి నియమాల వెనుక రాజకీయాలు ఉన్నాయనీ, అవి finalగా certain caste, class and communityయొక్క interests serve చేస్తాయనీ తెలుస్తుంది కనుకా, సాహితీ ప్రక్రియలకీ, సాహితీ విమర్శకీ, సమాజానికీ, సమాజ సంబంధాలకీ, ఆ సంబంధాలకి ఆపాదించబడి కాపాడబడే విలువలకీ, ఒక విడదీయలేని సంబంధం ఉందనే ప్రాథమిక అవగాహన కలుగుతుంది కనుక.

**4. మీరు ఇంగ్లీషు కవిత్వం బాగా చదువుకున్నారు. కొన్ని సార్లు మీ వాక్యాలు చదువుతున్నప్పుడు మీరు ఇంగ్లీషులో ఆలోచించి తెలుగులో రాస్తారని అనిపిస్తుంది. భాష విషయంలో మీరు ఎలా ఫీల్ అవుతున్నారు?**

Ah, ఇది అనువాదానికి సంబంధించిన ప్రశ్న. కదూ? అనువాదం అనేది విస్తృతార్థంలో వాడుతున్నాను. ఎవరో అన్నట్లు, I am one language. I am more than one language. I doubt if anyone thinks in ONE language as such. ఈ పరమిత spaceలో ఈ ప్రశ్నలను theoreticalగా elaborate చేయడం కష్టం కనుక, సరళంగా ఇలా చెబుతాను. ఇలా కూడా అడుగుతాను.

What do you mean by this word English? ఒకవేళ అది పూర్వార్థంలో, నేరుగా ఆంగ్లంలో రాయబడ్డది, (read as Britain, too) అనే అర్థంలో వాడబడ్డట్టు అయితే, దానికి జవాబు నేను ఆంగ్ల కవిత్వం కానీ, ఆంగ్ల రచనలు కానీ చదవను, ఆంగ్లంలో ఆలోచించను. కానీ English అనేది దాని విస్తృతార్థంలో, అంటే writings that are translated into English అని మీరు అన్నట్టు అయితే, Yes, నేను ఆంగ్ల రచనలు బాగా చదువుతాను. I read a lot of World Poetry -translated into English. కానీ, చాలా మందికి తెలియని విషయం ఏమిటంటే, నేను కవిత్వం చదివేది చాలా చాలా తక్కువ. వచనం ఎక్కువ. నేను కవిత్వాన్ని సీరియస్గా చదవడం చాలా కాలం క్రితం మానివేశాను. I stopped reading poetry seriously a long time back. గత ఎనిమిది ఏళ్లుగా నేను తరచుగా చదివేది, చదువుతున్నదీ కూడా వచనమే: ఆ వచనం ఏ రూపంలో ఉన్నదైనా కానీ. 'ఆంగ్ల' వచనాలు కాదు, అనువాదంలో 'ప్రపంచ' వచనాలు. ఇక ఆంగ్లంలో ఆలోచించి తెలుగులో రాయడం అంటారా- అది శైలికి సంబంధించిన విషయం అని అనుకుంటాను. సోకాల్డ్ కవిత్వం అయితే నేను 'ఆంగ్లం'లో ఆలోచించి తెలుగులో రాయడం ఉండదు. If it is about presenting a critical thought in Telugu, I do that. ఎందుకంటే, తెలుగులో

తాత్వికపరమైన కొన్ని విషయాలు మాట్లాడటానికీ, theoretical విషయాలు చర్చించడానికీ అవసరమయిన భాష నాకు అలవడలేదు కనుకా, ఇంకా అటువంటి భాష తెలుగులో విస్తృతంగా వాడుకలో లేదు కనుకా. ఇక భాషపై నాకు చాలా నచ్చిన వాక్యం ఇది. భాష విషయంలో ఇలా ఫీల్ అవుతాను: ...Language is for the other, coming from the other, the coming of the other అని.

**5. శివారెడ్డిగారిని వొక తండ్రిగా కాకుండా వొక కవిగా మీ వ్యక్తిత్వంలో ఎంత వరకూ చూస్తారు?**

తత్వశాస్త్రం నుంచి సాహిత్యం దాకా, ఇంకా మనకి 'పితరుడే' కదా! It is the father that always dominates us? Isn't it? మన ఆలోచనల్లోనూ, మన వీక్షణాలలోనూ, మన ప్రాతిపదికలలోనూ, మన రాతలలోనూ, మన శైలులలోనూ, మన అర్థాలలోనూ, మన నిర్మాణాలలోనూ, ఇంకా మనకి 'పితరుడే' కదా? What happens to the mother, the Other who is always with us? The M/other? Hmmm… So you want to listen to the story of my Oedipus Complex? సరే. కానీ, -ముందుగా - తండ్రీ కవీ రెండూ అయిన ఒక వ్యక్తిని విడివిడిగాచూడటం ఎలా? What comes before? And what comes after? తండ్రా? కవా? కవా? తండ్రా? తండ్రి అంటే ఏమిటి? కవి అంటే ఏమిటి? అన్నిటికంటే ముందు, వ్యక్తిత్వం అంటే ఏమిటి? 'నా' వ్యక్తిత్వం అంటే ఏమిటి? కొద్దిగా కష్టం. ఇది Bios(జీవితానికి)కీ, biography (life writing or writing life)కీ, biologyకీ (read as bio+logos) సంబంధించిన విషయం కాబట్టి. ఎలా జవాబు చెప్పను? జవాబు చెప్పడానికి ఎలా ప్రయత్నించను? ఎవరైనా ఎలా జవాబు చెబుతారు? ఇటువంటి సంక్లిష్టతలలోకి వెళ్ళకుండా, at the risk of sounding naïve and simplistic, ప్రస్తుతానికి ఇలా చెబుతాను:

నా 'తరం'పై ఉన్నట్టుగానే, అతని రచనల ప్రభావం, అతని ఆలోచనల ప్రభావం నా ప్రాథమిక రచనలపై చాలా ఉండింది. దాని కన్నా కూడా, అతనేమిటో, అతని వ్యక్తిత్వం ఏమిటో ఆ ప్రభావం కూడా నాపై initial layers of self లో చాలా ఉంది. నేను ఇంకా కొద్దిగా మోసుకు తిరిగే మనుషుల పట్ల warmth, సహనం, కొంత ఇతరులని వినే గుణం, ఇవి నాకు అతని నుంచి వస్తే, possessiveగా లేకుండా మనుషుల పట్ల ఉండటం, ఓపికగా ఇతరులని అర్థం చేసుకోవడం, కొంత నింపాదిగా జీవితాన్ని చూడటం అనేవి తల్లి నుంచి అబ్బాయి. It sounds romantic కానీ మీకు ఇది కూడా చెప్పాలి: I have been a difficult son to bear with. Very very difficult. I had been a manic depressive; I had been a drunkard -

- ఉదయం ఇల్లు వదిలి వెడితే, మళ్ళీ ఏ స్థితిలో నన్ను చూస్తారో తెలియని నా తల్లితండ్రులు వాళ్ళు. నేను ఇంటికి తిరిగి రావొచ్చు. రాకపోవచ్చు. ఎక్కడో పడిపోయి ఉంటే ఎవరో ఫోన్ చేయవచ్చు. లేక ఒక పోలీస్ స్టేషన్లో లాండ్ అయ్యి ఉండవచ్చు. లేక ఏ అర్ధరాత్రో ఏ ఆసుపత్రి నుంచో నా గురించి తెలుపుతూ సమాచారం రావొచ్చు. ఇప్పటికీ నాకు ఆశ్చర్యం ఏమిటంటే, ఎలా నన్ను నా తల్లి తండ్రులు భరించారా, భరించగలిగారా అని. వ్యక్తిత్వం లాంటి పదాల పట్ల నాకు నమ్మకం కానీ సదభిప్రాయం కానీ లేవు కానీ, ఆఖరుగా ఇలా చెబుతాను: Whatever I was, whatever I am, and whatever that is left of me - here, in this space and time - inscribed on this body, inscribed in this body, I owe it to him. I owe it to her. Perhaps I owe it to us.

### 6. స్త్రీలు మీ కవిత్వంలో బహు పాత్రల్లో కనిపిస్తారు? ఎందుకని?

ఇలా ప్రశ్నించుకుందాం ముందుగా మనల్ని మనం ఒకసారి, మన పాత్రలతో మన పాత్రలలోంచి బహు విధాలుగా. ఎందుకంటే ఈ ప్రశ్న, స్త్రీల గురించిన ప్రశ్న, స్త్రీల ప్రశ్న (the question of women. Often more than once, Woman is a recurring question to us. For us. Who would deny it?) స్త్రీలు సమాధానం చెప్పాల్సిన, స్త్రీలు ప్రశ్నించాల్సిన ప్రశ్న ఏదైతే ఉందో, అది పలు స్థాయిలకి సంబంధించినది కనుక. పలు ప్ర'క్రియలకీ' సంబంధించిన కనుక. కనుక, ముందుగా ఒక ప్రశ్న: స్త్రీ అంటే ఏమిటి? స్త్రీ అని మనం అన్నప్పుడూ, లిఖించినప్పుడూ, ఉద్దేశించినప్పుడూ, సంభోదించినప్పుడూ, మనకు తెలిసింది లేదా ముందుగా తెలియాల్సినదీ ఏమిటంటే మనం బౌతికపరమైన ఒక ప్రాణి గురించి కాదు మాట్లాడుతున్నదీ అని. (When we say 'woman', we just don't mean a biological being with certain organs as such. We are not just dealing with the sex of a particular species. ఎప్పుడైతే మనం స్త్రీ అనే పదం వాడుతున్నామో, స్త్రీత్వం అనే పదం వాడుతున్నామో, మనం భౌతికమైన రూపాన్నీ, అర్థాన్నీ దాటి వాటి 'నిర్మాణాల' పరిధిలోకి వెడుతున్నాం. అంటే స్త్రీ అనే పదం భౌతికమైన ఒక నిష్పాక్షికమైన 'వాస్తవాన్ని' సూచించే పదం కాదు అనీ, ఇంకా అటువంటి పదం మనం వాడుతున్నప్పుడల్లా ఆ పదానికి చెందిన చరిత్రను గురించి కూడా మాట్లాడుతున్నామనీ ఆకళింపు చేసుకోవడం. అందుకే మనం మళ్ళా, మరొకసారి ఇల్లా ప్రశ్నించుకుందాం:

స్త్రీ అంటే ఏమిటి? స్త్రీ పై వందల ఏళ్ళుగా తత్వశాస్త్రంలోంచీ, చరిత్రలలోంచీ,

పురాణాలలోంచీ సాహిత్యాలలోంచీ ఇంకా అనేక డిస్కోర్సుల వాచక కర్మాగారాలలోంచి ఉత్పత్తి అయిన రూపాలలోంచి, వివిధ ప్రతీకలలలలోంచీ వివిధ చిహ్నాలలోంచీ వివిధ ప్రతిరూపాలలోంచీ, స్త్రీకి ఆపాదించబడిన ప్రత్యేక లక్షణాలలోంచీ స్త్రీని విడదీసి స్త్రీని చూడటం ఎలా? మనకై ఒక స్త్రీని సృష్టించి చలామణి చేస్తున్న వాచక మగ్గాలలోంచి, పునరావృతం చేస్తున్న వివిధ స్వరాలలోంచి, కుటుంబాలలోంచీ, పితృస్వామిక వాంఛా మరియు వీక్షణలోంచి తప్పించి, మనం తప్పించుకుని స్త్రీని చూడటం ఎలా? When we say woman, do we have a possibility to reach women, as such? అలా చూడాలంటే ఎటువంటి పాత్రలు కావాలి మనకి? మనం ఎటువంటి పాత్రాధారులను, దారులనీ వొదిలి వేయాలి? ఎటువంటి రూపాలతో, ఎటువంటి బహుముఖాలతో చూడాలీ, దరి చేరాలి మనం? ఎటువంటి దారిని ఎన్నుకోవాలి మనం? కానీ మళ్ళా మనం మరొకసారి ఇన్సిస్ట్ చేద్దాం: స్త్రీ అంటే ఏమిటి? చరిత్రకీ, తత్వశాస్త్రానికీ, సౌందర్య'శాస్త్రానికీ', సాహిత్యానికీ, నీతికీ, విలువల వలువలకీ, అనువాదానికీ, ముడిపడి ఉన్న, రాయబడి ఉన్న, మళ్ళా మళ్ళా రాయబడుతూ ఉన్న స్త్రీ అంటే ఏమిటి? సాధారణంగా వివిధ డిస్కోర్స్ లలో, ఇలా కనపడుతుంది స్త్రీ మనకి:

విప్లవం: స్త్రీ అంటే పునురుత్పత్తి సాధనం. ఈ స్థాయిని ఎప్పుడైనా (తెలుగు) విప్లవం లేదా విప్లవ కథా సాహిత్యం దాటిందా? స్త్రీ అంటే విప్లవానికి 'కొడుకులని' ఉత్పత్తి చేసే సాధనం అనే స్థాయిని దాటిన ఒక నృత్యకారిణినీ, తనదైన నృత్యం చేసే ఒక స్త్రీనీ, విప్లవం కానీ విప్లవం సాహిత్యం కానీ ఎన్నడైనా ఊహించాయా?

మతం/ఆధ్యాత్మికత: ముందుగా ఒక చిన్న quote. (enlightened అయిన ఒక వాక్యం:) 'రూపమూ, (అస్తిత్వం) ఉండటమూ అనేవి (నాకు) తెలియకుండా జరిగాయి. లేకపోతే నేను తొమ్మిది నెలలకై అ అపరిశుభ్ర ప్రదేశంలోనికి ఎందుకు ప్రవేశిస్తాను?' (Italics mine). ఏం అర్థమౌతుంది మీకు? తొమ్మిది నెలల ఆ అపరిశుభ్ర ప్రదేశం ఏమై ఉండవచ్చు? ఎవరిదై ఉండవచ్చు? గర్భం ఒక అపరిశుభ్ర ప్రదేశం, తొమ్మిది నెలలు నువ్వు గడిపిన ఆ గర్భం అపరిశుభ్ర ప్రదేశం ఎలా అయ్యింది? ఈ చిన్న ఉదాహరణ ఎందుకంటే, 'వారసత్వంగా' ఒక వారసత్వంలోకి మనం జన్మించిన, మనం చదివిన, మనకు చెప్పబడుతున్న మత వాచకాలూ, పురాణేతిహాసాలూ, స్త్రీ పట్ల ఇంతకన్నా బిన్నమైన భావనలని ఏవీ ఇవ్వవు కనుక. వేదాలు కానీ, రామాయణ మహా భారతాలు కానీ ఇతర మత గ్రంధాలలోని స్త్రీ పాత్రల వివరణలు కానీ, ఇంతకంటే బిన్నమైన వ్యాఖ్యానాన్ని సూచించవు కనుక. (ఇంకా ఎవరికైనా అనుమానాలు ఉంటె, ఢిల్లీ అత్యాచార ఘటన తరువాత సోకాల్డ్

ఆధ్యాత్మిక గురువుల ప్రతిస్పందన ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి)

సాహిత్యం: ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. ఒక్కసారి ఇంతవరకూ, సాహిత్యంలో మనం చదువుకున్న 'కవిత్వం' కానీ, కథలు కానీ, ప్రబంధాలు కానీ లేదా విజువల్ మీడియాలో చూసే స్త్రీ పాత్రలను ఒక్కసారి గుర్తుకు తెచ్చుకోండి. 'లలిత కోమలమైన వాళ్ళూ' 'అత్యంత సౌందర్యవతులూ, 'త్యాగానికీ, స్వార్థ రహిత ప్రేమకీ చిహ్నం తను 'అనీ 'అనురాగమయి, సహనవతి, దేవతా, అప్సరస సీతా, సావిత్రీ అనీ ఇంకా blah blah blah… everything in black and white. Nothing else. (ప్రస్థుతానికి నేను స్త్రీ sexuality ని condition చేసే, చేస్తున్న మహా కుట్రల వైపు వెళ్ళడం లేదు). ఇటువంటి నిర్ధారణలు ఎంత ప్రమాదం అంటే, ఏళ్ళ తరబడి అవి పునరావృతమయ్యి, అయ్యీ అయ్యీ ఇక స్త్రీలు తమను తాము ఆ ప్రతిరూపాలలోంచి దాటి చూసుకోవడమే ఒక ఘర్షణగా మారుతుంది. అలా చూసుకోవడమే మహాపాపం అన్నట్టుగా కనిపిస్తుంది సమాజానికి. ఎంత సంఘర్షణ అటువంటి clichéd images నుంచి బయట పడాలి అని అనుకునే స్త్రీలకీ, అటువంటి clichéd images నుంచి బయట పడక, స్త్రీలని మూర్ఖంగా పునరావృతం చేసే పురుష వాచకాలకీ!

ఇదంతా ఎందుకంటే, స్త్రీలను మనం చూసే పద్ధతి, మన వీక్షణా ఇంకా చాలా చాలా conservative అయిన అ/సాహితీ ప్రక్రియల, మతమూ పురాణాల ప్రతీకలని దాటి రాలేదు కనుక. ఇంకా ఇదంతా ఎందుకంటే, ఒక స్త్రీ , ఒక్క స్త్రీ అంటూ ఎవరూ లేరు కనుకా, ఇంకా స్త్రీ అంటే heterogeneous కనుకా, మూసలలో ఇమడని, ఇవ్వబడిన మూసలలో ఇమడలేక తమ శరీరాలకై తాము యుద్ధం చేస్తున్న స్త్రీలను నేను చూసాను కనుకా, అందులో కొంతమంది నాకు దగ్గరిగా తెలుసు కనుకా, వాళ్ళు నా జీవనంలో భాగం కనుకా, ఇంకా నాకు స్త్రీ అంటే రాత/లిఖితం కనుకా, స్త్రీలు బహురూపులు కనుకా, నా వాచకాలు 'వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు' కాదు కనుకా, ఇక నాకు చాలా నచ్చే ఒక వాక్యంతో ఇలా ముగిస్తాను:

that which cannot be taken in by truth, is in truth feminine, అని అనుకుంటో. ఇక ఇంకా ఇంతకు మించి ఏం చెప్పగలను నేను ~~ఈ~~ పరమిత పరిధిలో అని కూడా చెప్పుకుంటో.

**7. ముస్లిం వ్యక్తులు. మీ కవిత్వంలోకి చాలా సౌకర్యంగా దూసుకు వస్తారు. ఎందుకని?**

You want to know the secret? మీకు ఆ రహస్యం తెలుసుకోవాలని ఉందా?

ఇంతకు మునుపే మొదలయ్యిందానిని ఇలా అడుగుతూ మొదలు పెడతాను:

ఎందుకు 'రాకూడదు'? ఇక్కడ కొంత aggressiveగా కూడా ఉంటాను. కొన్ని విషయాల గురించి చెప్పుకోడానికి ఇలా కూడా అడుగుతాను, మరి మీరు "సౌకర్యవంతంగా" ఇంకా "దూసుకురావడం" అనే పదాల ద్వారా దేనిని సూచిస్తున్నారో నాకు తెలియనప్పటికీ:

కొంత సేపు, ~~ఈ~~ శరీరం, ~~ఈ~~ వాచకం, ~~ఈ~~ వాచక శరీరం పేరు శ్రీకాంత్ కాదనుకుందాం. (కానీ నిజానికి, శ్రీకాంత్ అనే పేరుని ~~ఈ~~ వాచకం, ~~ఈ~~ వాచక శరీరం, ~~ఈ~~ శరీర వాచకం carry చేస్తున్నాయా? Does this text, does this body, does this textual body carry the name Srikanth? If so, what are the bearings of this name, this naming?) కొంతసేపు ~~ఈ~~ వాచకపు శరీరం పేరు అఫ్సర్ అని అనుకుందాం. అలాగే, ఇంకా కొంతసేపు, అఫ్సర్ అని మనచే/ఇతరులచే నామ్నీకరణం చేయబడ్డ ఆ శరీరపు నేనూ 'కవిత్వం' రాస్తూ ఉంది అని అనుకుందాం, ఆ 'కవిత్వం' 'చాలా సౌకర్యవంతంగా దూసుకు వచ్చే' ముస్లిం వ్యక్తులతో నిండి ఉంది అని అనుకుందాం. Now, ఆ అతనిని, పైన అడిగిన ప్రశ్న/ప్రశ్నే అడుగుతారా? అడగగలుగుతారా? I doubt it. ఇది ఎందుకూ అంటే, నామం, నామ్నీకరణం ఇతరుని మనం అర్థం చేసుకునే ప్రక్రియని ఎంత వరకూ ప్రభావితం చేస్తాయో, నామం, నామ్నీకరణం అనేవి ఎలా మన presumed notions of understanding the Otherగా మారతాయో చెప్పడానికి మాత్రమే. అయినా, అదే aggressivenessతో మిమ్మల్ని మరొకటి కూడా అడుగుతాను: 'నేను', ముస్లింని కాదని మీకు ఎలా తెలుసు? నేను హిందువునో, క్రిస్టియన్ నో, లేదా ముస్లింనోఅవునో కాదో మీకు ఎలా తెలుసు? నేను ముస్లిం కాదని మీరు ఎలా, ఏ ప్రాతిపదికన నిర్ణయిస్తారు? అన్నిటి కంటే ముందుగా, ఇతరున్ని 'అడగటం', అడగటం అనే ~~ఈ~~ సంజ్ఞ, ~~ఈ~~ అడిగే సంజ్ఞ, ~~ఈ~~ రహస్యం (this asking, the act of this asking, the gesture of this asking, this asking gesture) ఎక్కడి నుంచి వచ్చింది, అది ఏ ఆధారంపై నిలబడి ఉన్నదో ఒకసారి ఆలోచించారా? ఎలా పంచుకుంటాం మనం దీనిని? ~~ఈ~~ సంజ్ఞని? ~~ఈ~~ రహస్యాన్ని? ~~ఈ~~ 'సౌకర్యవంతం'గా రావడాన్ని?

ఇప్పుడు, కొంత సరళంగా ఇలా కూడా అడుగుతాను: నన్ను నిర్వచించేది ఎవరు? నేను ఏ మతానికి చెందినవాడినో (should one always belong to a religion, one religion? Should one always have a religion? What if one does not have one?) ఎలా ఉండాలో, ఉండకూడదో, నేనేం ధరించాలో ధరించకూడదో, నేనేం తినాలో తినకూడదో నిర్ణయించేది ఎవరు? అలా నిర్వచించే

'వాళ్ళు' ఎవరైనా ఉంటే, అలా నిర్వచించే వాచకాలు ఏవైనా ఉంటె, వాళ్ళకీ, వాటికీ, నన్ను నిర్వచించే, నిర్ణయించే అధికారం ఎవరు ఇచ్చారు? ఈ నిర్వచనాలూ, నిర్ణయాలూ వాడుకలోకి ఎలా వచ్చాయి? ఏ స్థానాలలో ఉన్నవారు, ఎటువంటి అధికారంలో ఉన్నవాళ్ళు వాటిని విరివిగా వాడుతున్నారు? వాటిని దేనికై ఉపయోగిస్తున్నారు? మరొకరి ఈ 'నిర్ణయాలు', నిర్వచనాలు, వచనాలు కాకుండా నేను మన్నలేనా? What if I do not participate, in your games of identity?, What if I don't participate in your games of religious identity as such? What if I do not subscribe to religious texts? నా ఉనికి ఏమిటో నిర్ణయించే ఆ వాచక/వచన/వర్తక మత సమూహాల ఆటలలో నేను పాలుపంచుకోలేదనుకోండి, 'పవిత్ర' మత గ్రంథాలను నేను ఇతర వాచకాలగానే చూస్తాననుకోండి, అన్ని వాచకాలలాగానే అవి కూడా మానవ కార్యచరణాలుగానే చూసి, అన్ని మానవ వాచకాల లానే అవి కూడా వ్యాఖ్యానానికి అతీతం కావు అని నేను అన్నాను అనుకోండి (they are acts of human creation and hence are prone to interpretation), ఎలా నిర్వచిస్తారు మీరు నన్ను? ఈ శరీరాన్ని? ఈ వాచాకాన్ని?

ఇప్పుడు కొంత ఇలా కూడా చెబుతాను: ఏదైతే నీలో లేదో, ఏదైతో నీలో నివసించదో, ఏదైతే నీలో పలకదో, అది మాత్రమే 'బయట' నుంచి లోపలికి రాగలదు. 'సౌకర్యవంతం'గా నైనా, అసౌకర్యవంతంగానైనా. ఇక ఏదైతే నీలో ఉందో, ఏదైతే నీలోనే పలుకుతుందో, దానికి ఇక 'బయట' నుంచి వచ్చే ఆస్కారం ఎక్కడ? అంటే, that which is not inside, that which does not reside inside , can come in. But, where is the scope to come in for that which is always inside, for that which always recites inside, that which always resides inside, calling out your name to recognize itself? To recognize the Other that is the self? ఇక రహస్యం గురించి ఇలా కూడా, ఇలా:

How can another see into me, into my most secret self, without my being able to see in there myself? And without my being able to see him in me. And if my secret self, that which can be revealed only to the other, to the wholly other, to God if you wish, is a secret that I will never reflect on, that I will never know or experience or possess as my own, then what sense is there in saying that it is my secret, or in saying more generally that a secret belongs, that it is proper to or belongs to someone, or to some other who remains someone. It's

perhaps there that we find the secret of secrecy. Namely, that it is not a matter of knowing and that it is there for no one. A secret doesn't belong, it can never be said to be at home or in its place. The question of the self: who am I not in the sense of who am I but rather who is this I that can say who? What is the - I and what becomes of responsibility once the identity of the I trembles in secret? -Jacques Derrida (The Gift of Death)

**8. శ్రీకాంత్ కవిత్వంలో ఫలానా అని మీకు మీరుగా ఆలోచించుకుంటున్నప్పుడు ఆ శ్రీకాంత్ ఎవరు? అతన్ని గురించి మీరు ఆబ్జెక్టివ్‌గా ఏం చెప్తారు?**

At the risk of not being understood, at the risk of being misunderstood - as all reading is also a misreading - ముందుగా మీకొక చిన్న కథ చెబుతాను:

ఒక పదేళ్ళ క్రితం, నేను సంగీత థియేటర్ వద్ద, పక్కనే ఉన్న పాన్‌షాప్ వద్ద నిలబడి, గోడకు ఆనుకుని సిగరెట్ త్రాగుతూ, నా తమ్ముడూ అతని స్నేహితురాలి కోసమూ టికెట్లు కొని ఎదురు చూస్తున్నాను. నేను నా లోకంలో మునిగి, ఆ వేసవి మధ్యాహ్నం, మరెవరినీ పట్టించుకోలేదు, ఒక ప్రశ్న నన్ను ముందు నెమ్మదిగా, ఆ తరువాత ఘాడంగా తాకేదాకా. చాలా చిన్న ప్రశ్న. చాలా మామూలు ప్రశ్న: "ఎక్కడుంటావు నువ్వు?" అని. తల తిప్పి చూస్తే నా పక్కగా, ఈ నగర రహదారుల్లో, పలు కూడలిలలో కనిపించే... చిరిగిన కురుచ దుస్తులతో, పెరిగిన గడ్డంతో శిరోజాలతో, ఒక వింత నవ్వుతో... ఒక ద్రిమ్మరీ లేదా 'పిచ్చివాడు'. అతను అడిగిన ప్రశ్నకి నేను 'వనస్థలిపురం' అని ఒక భౌగోళిక స్థానాన్నీ, నామాన్నీ చాలా యధాలాపంగా, అన్యమనస్కంగా ఉచ్చరిస్తే, తను క్షణకాలం నా వంక చూసి తిరిగి అదే మార్మికమైన నవ్వుతో, వేళ్ళ మధ్య వెలుగుతున్న పచ్చి ఆకుల బీడీ వంటి దానితో, ఆ రద్దీ వాహనాల దాటిని ధాటి ఆవలి వైపుకు వెళ్ళిపోయాడు. నేను కొంత విస్తుపోయి, ఆ తరువాత కొంత తేరుకుని నన్ను నేనే తిరిగి ప్రశ్నించుకున్నాను: అవును, ఇంతకు నేను ఎక్కడ ఉంటాను? ఆంగ్లంలో రెండు పదాలు ఉన్నాయి: stay and live అని. మొదటిది బౌతికమైన స్థితిని చెబితే, రెండొవది మానసికమైన స్థితిని చెబుతుంది house and home లాగా. అతను నువ్వు ఎక్కడ నివసిస్తున్నావు అనా నన్ను అడిగినది లేక ఎక్కడ ఉంటాను నేను అనా? Where do you live అని ఎవరైనా అడిగితే సాధారణంగామనం, మనం ఉండే ప్రదేశం చెబుతాం కానీ, నిజానికి అక్కడ ఉ

ంటామా మనం? లేక మనదైన, మనకు మాత్రమే తెలిసిన మనలో ఉన్న కొన్ని రహస్య లోకాలలోనా? ఆ ఉండటం ఎక్కడ? చూడండి, Afsar stays in United States of America, Srikanth stays in India, someone else stays at some other place, but where do we live? What is that place? Where is that place? Do you find it outside? Is it merely a physical location? నేను ఏం మాట్లాడుతున్నానో మీకు అర్థం అవుతుందా? Are you getting me? ఆ సరళమైన ప్రశ్న నన్ను కుదిపి వేసింది అత్యంత త్రీవతతో: నేను ఎక్కడ ఉంటానో తెలుసుకునేందుకు, ఆ కాలమూ లోకమూ ఏమిటో అవి ఎక్కడ ఉన్నాయో, ఆ గూడు ఎక్కడ ఉందో అని ఇప్పటికీ ప్రయతిస్తూనే ఉన్నాను, ఇప్పటికీ అక్కడకి చేరుకునేందుకు ప్రయాణం సాగిస్తూనే ఉన్నాను. Without exception we are all alike in such matters. Isn't it?

మరి పైన చెప్పబడిన ఆ చిన్న ఆత్మకథా భాగం ఎందుకంటే, శ్రీకాంత్ అంటూ ఎవరూ లేరు కనుకా, శ్రీకాంత్ అంటూ ఎవరూ ఉండకూడదు కనుకా అని చెప్పటానికి. శ్రీకాంత్ 'కవిత్వంలో ఫలానా' అని నాకు నేను ఆలోచించుకుని, ఆ శ్రీకాంత్ ని జడ్జ్ చేసే లగ్జరీ (luxury) నాకు లేదు కనుకా. రాతలు/లిఖితాలు మన్నాలి, రచయితలు కాదు అని నేను విశ్వసిస్తాను కనుక. అపరమితమైన వేగంతో సాగే ఈ మీడియా లోకంలో, ఈ techno frenzy, -twittered -facebooked -bloggered కాలంలో, మనకి సరిపోయినంత megalomaniacs and egotists, రకరకాల రూపాలతో సాహిత్యాలలో, సమూహాలలో, సాహిత్య సమూహారాలలో ఉన్నారు కనుకా, మనం మన చూపుని రచయితల వైపు కాక వాచకాల వైపూ, వాటిలోని కోణాల వైపూ మరల్చుకోవాలి అని నేను నమ్ముతాను కనుకా.

Let the gaze of our reading turn towards the dynamics of the text, towards reading, towards the heterogeneous act of reading and not towards the Subject in itself (which we know does not exist.).

**9. మీరు సమూహాల్లో ఎక్కువగా కనిపించరు. మీదయిన వొక ఏకాంతాన్ని రచించుకుని అందులోనే వుంటారు అనిపిస్తుంది కొన్నిసార్లు? అవునా?**

మీరు సమూహాలు అని దేనిని అంటారో లేదా దేనిని సూచిస్తున్నారో నాకు తెలియదు. ఒక వేళ మీరు సాహిత్య సమూహాలు అని సూచించినట్లయితే అది నిజం, ఎందుకంటే నాకున్న 'వ్యక్తిగత' కారణాల వల్ల, 'సాహిత్య సమూహాల' పట్లా, ఆ సాహిత్య సమూహాలలో ప్రబలమయ్యే ధోరణుల పట్లా నాకు విముఖత ఉంది

కనుకా. I somehow do not fit into those literary groups. Anyway leave it. కానీ సమూహాలు అనే పదాన్ని మీరు విస్తృతార్థంలో వాడినట్టయితే, నేను సమూహాలను చాలా ఇష్టపడతాను. Sycophancy లేని, లేదా sycophancy అతి తక్కువుగా కనిపించే, ముసుగులు అంతగా లేని, ముసుగులు తొలిగి ముఖాలు కనిపించే సమూహాలని నేను ఇష్టపడతాను. అక్కడ నేను కనిపిస్తాను. ఈ నగరం తీసుకోండి -ఎన్ని ప్రదేశాలు ఉన్నాయి అటువంటివి ఇక్కడ - లోకల్ బార్ల దగ్గరనుంచి, సుల్తాన్ బజార్ల నుంచి ఓల్డ్ సిటీ వీధుల నుంచీ, తేనీటి ప్రదేశాల నుంచీ, నేను ప్రీతిపాత్రంగా తినే బీఫ్ హెూటళ్ళ నుంచీ, ఎన్ని ప్రదేశాలు, ఎన్నెని ప్రదేశాలు ఉన్నాయి అటువంటివి. అటువంటి ప్రదేశాలలో, అటువంటి సమూహాలు తిరుగాడే పగళ్ళలో, రాత్రుళ్ళలో, సాయంసంధ్యలలో నేను కనిపిస్తాను. నిజానికి నేను అక్కడే కనిపిస్తాను. ఇక 'ఒక ఏకాంతాన్ని (ఏకాంతం, ఏక కాంతం, ఏ కాంతం?, ఏక అంతం, ఇలా పలు విధాలగా కూడా చదుకుంటాను కాసేపు ఆ పదాన్ని) రచించుకుని, అందులోనే ఉండటం' అనేది నాకు తెలియదు. నాకు మటుకు నేను ఏ(ఒక)కాంతనీ, ఏ ఒక ఏకాంతాన్నీ ర/చించుకుని, రచిస్తూ అందులోనే ఉండననే అనుకుంటున్నాను. I am easily available to anyone who wants to meet meఅని కూడా అనుకుంటున్నాను.

**10. దిగులు పలికినంత తేలికగా మీకు సంతోషం పలకదు. అది బలహీనతా? బలమా?**

ఆంద్రేయ్ తర్కోవిస్కీ, నేను అమితంగా ఇష్టపడే - రష్యన్ ఫిల్మ్మేకర్, ఎక్కడో ఇటువంటి ప్రశ్నకే జవాబు ఇస్తూ ఇలా అంటాడు: 'జీవితంలో సంతోషంగా ఉండటం కంటే ముఖ్యమైన విషయాలు చాలా ఉన్నాయి' అని. కాస్త సరదాగా చెప్పాలంటే, నేను సంతోషం పట్ల సంతోషంగా లేను. ఇంకా ఇలా కూడా చెప్పవచ్చు: సంతోషం అని మీరు అడుగుతున్నప్పుడు, what do you mean by that? Do we all share the same happiness? A similar meaning of happiness? సరే, అలా కాకుండా ఇల్లా కూడా చెప్పుకుందాం: ఏదైతే వాచకాలలో, ప్రజలలో, లోకంలో (majority) సంతోషంగా నిర్వచించబడిందో, అది నాకు తెలియదు. అది లేదా అటువంటివి నాకు సంతోషాన్ని ఇవ్వవు. అవి నాకు సంతోషం కాదు. నా మటుకు, అటువంటి సంతోషం ఏదైతే ఉందో, it lacks depth. It lacks intensity. Let us not confuse laughter, that laughter with good conscience -as Nietzsche would say - with happiness. 'భారమైన', 'మోయలేని' సవాలక్ష విలువలని వెక్కిరిస్తూ, స్ఖలించినంత హాయిగా, తేలికగా, స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా ఇవ్వబడిన

వాటిని subvert చేస్తూ నవ్వే నవ్వు ఉంటుంది కదా, అది నాకు ఇష్టం. 'ణేనే ణేనే' అని నన్ను నేను వెక్కిరించుకుంటూ, ఇతరులని వెక్కిరించే నవ్వు: అది ఇష్టం. కానీ దానిని ఎవరు గుర్తిస్తారు? In a world that takes itself too seriously, in fact, unbearably too seriously, who would recognize such a laughter? Yes, sometimes women have such laughter. Mocking laughter. వెక్కిరింతతతో కూడిన నవ్వు. వెక్కిరించే నవ్వు. మన కుహానా ప్రతిరూపాల నిర్మాణాలనీ, మన ఏకస్వర పురుష వాచకాలనీ వెక్కిరించే నవ్వు. అటువంటి నవ్వు, నిర్మాణాల డొల్లతనాన్ని అర్థం చేసుకుని, అటువంటి నిర్మాణాలు దిద్దిన ఈ లోకాన్ని చూసి ఒక మహా దిగులుతో, మన ముఖాల మీద నవ్వే నవ్వు. I prefer that. ఇక బలమా లేక బలహీనతా అనేది యుద్ధభూమిలో ఉన్నవాడికి, వాచక కేంద్రంలో ఉన్నవాళ్ళకీ వేయవలసిన ప్రశ్న. వాచకాల అంచులలో తిరిగే నాలాంటి వాడికి, అంచులు లేనిదే కేంద్రం లేదు అని చెప్పే, నవ్వే నాలాంటి వాడికి, అంచులే కేంద్రాన్ని నిర్దేశిస్తాయి అని కూడా అనే నాలాంటి వాడికి ఆ ప్రశ్నలతో ఏం సంబంధం? అందుకే ఇలా కూడా చెబుతూ ఒక disclaimerతో, మరో రెండు quotesతో ఇట్లా 'ముగిస్తాను':

Please -seriously - do not take me seriously. నన్ను ఉన్నది ఉన్నట్లుగానే, యధాతథంగానే తీసుకోండి. All that which you have read could be the truth. Autobiographical truth. Or the truth in autobiography. Of autobiography. Don't you know that all poets tell the truth, in truth, except the truth?

I don't feel it is necessary to know who I am. The main interest in life and work is to become someone else that you were not in the beginning. If you knew when you began a book what you would say in the end, do you think you would have the courage to write it? What is true for writing and for a love relationship is true also for life. The game is worthwhile insofar as we don't know what will be the end - Michel Foucault.

నేను అడిగాను: కవిత్వం అంటే ఏమిటి?అని. అతను చెప్పాడు: తప్పు ప్రశ్న. నువ్వు అడగాల్సింది ఏమిటంటే, కొన్ని వాచకాలు ఎలా కవిత్వంగా మారతాయీ అని. ఇక నేను అడిగాను: కొన్ని వాచకాలు ఎందుకు కవిత్వం అవుతాయి? అతను అన్నాడు: 'ఎందుకు' అని కాదు, 'ఎలా' కొన్ని వాచకాలు చరిత్రలో కొన్ని సమయాలలో కవిత్వంగా చలామణి అవుతాయనీ, కవిత్వంగా మారతాయనీ. దానికి నేను అన్నానూ:

మరి నేను కవిని కాదు, నువ్వో?

అప్పుడు ఒక నిట్టూర్పుతో తను ఇలా, తను ఇలాగే అడిగింది:

How to write one who has none, how to write none who has everyone? అది ఎవరో మీకేమైనా తెలుసా?

*ప్రశ్నలు అఫ్సర్‌వి. జవాబులు: ?*
*వాకిలి.కామ్‌లో 22.03.2013 & 01.03.2013 సంచికలో ప్రచురితం.*